# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు, నవలలు ఆధునిక చైతన్యం


పరిశోధన
కుమ్మరి రాజు

పర్యవేక్షణ
డా॥ ఎన్. ఎస్. రాజు




హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి
పి.హెచ్‌డి. పట్టం కోసం
సమర్పించిన పరిశోధనా వ్యాసం
1995

DEPARTMENT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDERABAD
HYDERABAD-500 046

Nov. 24, 1995

## CERTIFICATE

This is to certify that I, Kummari Raju, have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D ordinances of the University. My topic of the Ph.D programme is 'SRIPADA SUBRAHMANYA SASTRY KATHALU, NAVALALU - ADHUNIKA CHAITANYAM' ("Short Stories and Novels of Sripada Subrahmanya Sastry: Elements of Modern Awakening").

I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the award of research degree of any University.

( Kummari Raju )
Ph.D., Regn. No.91HTPH10

Head
Department of Telugu

Dr. ... SRIHARI
Professor and Head
Department of Telugu
University of Hyderabad
Central University Post
HYDERABAD-500 134

Signature of the Supervisor

Dean
School of Humanities

DEAN
SCHOOL OF HU...
University of Hyd...
Hyderabad-500 134

# కృతజ్ఞతలు

విద్య లేని కుటుంబమైనా, విద్య పై ఉన్న గౌరవం తో నన్ను ఉన్నత చదువులు చదివిస్తున్న అమ్మానాన్నలకు —

నా పరిశోధనకు పర్యవేక్షకులుగా ఉండి, తన అమూల్యమయిన కాలాన్ని నాకై వెచ్చించి, నన్ను పరిశోధనకు సుముఖునిగా చేసి పరిశోధనను సుగమం చేయాలనే సంకల్పం తో, ఎంతో ఓర్పు తో నాచే పరిశోధనను పూర్తి చేయించి మిత్రునిలా ఆదరించిన గురువులు డా॥ ఎస్.ఎస్.రాజు గారికి —

పరిశోధనాంశాన్ని అంగీకరించి, నా పరిశోధనకు మార్గం సుగమం చేసిన తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య రవ్వా శ్రీహరి గారికి, ఇతర అధ్యాపక వర్గానికి —

పరిశోధనకు తగినన్ని సలహాలిస్తూ ప్రోత్సహించిన హ్యుమానిటీస్ డీన్ ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు గారికి —

పరిశోధనకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ అధికారులకు, ఆర్థికంగా సహాయం చేసి తోడ్పడిన సాంఘిక సంక్షేమ శాఖకు —

నా పరిశోధన ప్రారంభ కారణానికి ముఖ్య కారకులై, కుటుంబ సభ్యుల లో ఒకరి గా చెప్పుకొని సర్వవిధాలా నన్ను ప్రోత్సహిస్తు, పరిశోధనారంగం లో కొత్త ఆలోచనల్ని పెంపొందించి, ఎంతో సహాయం చేసి తండ్రిలా చేరదీసిన గురువులు ఆచార్య వి. రామకృష్ణ గారికి —

మాతృప్రేమ తో నన్ను చేరదీసి, నా పరిశోధన త్వరగా పూర్తవ్వాలనే అభిలాష తో, తమ అమూల్యమైన కాలాన్ని నాకై వెచ్చించి, తల్లిలా నన్ను ఆదరించిన గురువులు డా॥ శ్రీమతి లలిత గారికి, పరిశోధన నిమిత్తం ఇంటికి వెళ్ళినప్పుడు ఆప్యాయత గా పలకరించి గౌరవించే శ్రీమతి రంగారాజు గారికి —

నాపై ఉన్న ప్రేమతో, నా పరిశోధన పూర్తవ్వాలనే కాంక్ష తో, ఆర్థిక సహాయం చేసిన శ్రీ ఎస్.ఆర్. శంకరన్. ఐ.ఏ.ఎస్.(రిటైర్డ్) గారికి, కమిట్ మెంట్ ట్రస్ట్ సభ్యులకు —

పరిశోధన నిమిత్తం వెళ్ళినప్పుడు, కాకినాడ లో శ్రీపాద వారి కథలన్నింటినీ అందించి, ఎన్నో సలహాలిచ్చిన డా॥ [illegible]మూర్తి కనకయ్య గారికి, అలానే రాజమండ్రి లో అద్దేపల్లి వివేకానందదేవి, [illegible] సత్యనారాయణ మూర్తి, సన్నిధానం నరసింహ శర్మ గార్లకు —

పరిశోధనకు సహాయపడిన సరస్వతీ గ్రంథాలయం,

వేటపాలెం వారికి, గౌతమీ గ్రంథాలయం రాజమండ్రి వారికి, ఆంధ్రా యూనివర్సిటీ గ్రంథాలయం విశాఖపట్టణం వారికి, టౌన్‌హాల్ గ్రంథాలయం కాకినాడ వారికి ——

తమ వంతు సహకారాన్ని అందజేసిన తెలుగు శాఖ కార్యాలయ సిబ్బంది పరమేశ్వర్, భవాని, అయూబ్ లకు ——

తమ్ముని లా పలకరిస్తూ, నిత్యం నన్ను ప్రోత్సహిస్తూ నా పరిశోధన పూర్తవ్వాలనే అభిలాష తో సర్వవిధాలా సహాయపడిన శ్రీ ఇన్నారెడ్డి, శ్రీమతి ఇన్నా ప్రకాశ్ లకు ——

నిత్యం నా క్షేమాన్ని, అభివృద్ధిని కోరే డా॥ లక్ష్మీనారాయణ, రాజా, వంశీ, విద్య, శాంతి లకు ——

పరిశోధన లో తగినన్ని సలహాలు యిస్తూ ప్రోత్సహించిన నా తోటి విద్యార్థులు సుందర్, గాంధీ, ఆంథోని, ఆశీర్వాదం, రాములు, ప్రభాకర్, జయాకర్, హరి, రాజశేఖర్, రవికాంత్ లకు ——

నిత్యం నా వెంట ఉండి నన్ను ప్రోత్సహించిన రాంబాబు, పుల్లయ్య (టెంపోస్), వెంకటేశ్వరరావు, దిలీప్, బాబూరావు, శ్రీనివాస్, శంకర్, సుధాకర్, నాగభూషణం, విజయ్, దాసు, మోహన్, శేఖర్ లకు ——

ఎన్ని పనులున్నా అడిగిన వెంటనే అంగీకరించి, పరిశోధనా వ్యాసాన్ని చక్కగా రాసి యిచ్చిన సురేంద్ర, చంద్రయ్య, జయానంద్ లకు, నాతో ఉండి, చివరి వరకు ఎంతో సహాయపడిన నరేశ్ కు ——

ఇతర మిత్రులందరికి!-

హృదయపూర్వక కృతజ్ఞతలు.

# విషయ సూచిక

## మొదటి భాగం


1 భూమిక ..........(1-3)

2 సామాజిక నేపథ్యం ..........(4-42)

2.0 19వ శతాబ్ది సమాజం పరిచయం .....4-6

2.1 రాజకీయం ......6-12

2.1.1 రాజకీయ పరిస్థితులు ....6-9

2.1.2 పరిపాలన ....9-11

2.1.3 రాజకీయ చైతన్యం ......11-12

2.2 ఆర్థిక పరిస్థితులు .....12-16

ఆర్థిక పరిస్థితులు .....12-16

2.3 కుల వ్యవస్థ .....16-18

కులం .....16-18

2.4 మత వ్యవస్థ ......18-21

2.4.1 మతం .....18-20

2.4.2 క్రైస్తవ మిషనరీలు ....20-21

2.5 కుటుంబ వ్యవస్థ ......21-24

2.5.1 కుటుంబం ......21-23

2.5.2 వివాహ వ్యవస్థ ......23-23

2.5.3 కన్యాశుల్కం - వరశుల్కం ......23-24

2.6 స్త్రీ ......24-33

2.6.1 స్త్రీ ......24-26

2.6.2 స్త్రీ విద్య ......26-28

2.6.3 బాల్య వివాహాలు ......28-29

2.6.4 వితంతువులు ......29-32

2.6.5 సతీసహగమనం ......32-33

2.7 ఇతర సామాజికాంశాలు ......33-42

2.7.1 విద్య ......33-35

2.7.2 మూఢ నమ్మకాలు ......35-37

2.7.3 దేవదాసీ వ్యవస్థ ......37-39

2.7.4 భాషా సాహిత్యాలు ......39-42

3 సాంస్కృతిక పునరుజ్జీవ- నోద్యమాలు ......(43-78)

3.1 ఐరోపా దేశాలలో - ......43-47

3.1.1 పునరుజ్జీవనం ......43-44

3.1.2 సాహిత్య కళారంగాలు .....44-45

3.1.3 నూతన భూమార్గాల అన్వేషణ ....45-46

3.1.4 మత సంస్కరణాలు ....46-47

3.1.5 ఫ్రెంచి విప్లవం ....47-49

3.2 భారత దేశంలో – .....49-60

3.2.1 భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం ...49-50

3.2.2 సామాజిక పరిణామాలు ....50-53

3.2.3 రాజారామ్మోహన్‌రాయ్ ....53-54

3.2.4 మహాదేవ గోవింద రనడే .....54-55

3.2.5 స్వామి దయానంద సరస్వతి ....55-55

3.2.6 రామకృష్ణ పరమహంస - వివేకానందుడు ...56-56

3.2.7 అనిబిసెంట్ ...56-57

3.2.8 మహమ్మదీయులు - సంస్కరణ ....57-58

3.2.9 జాతీయోద్యమం .....58-60

3.3 ఆంధ్ర దేశంలో – .....60-78

3.3.1 ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమాలు 60-61

3.3.2 వీరేశలింగం పూర్వరంగం .....61-64

3.3.3 కందుకూరి వీరేశలింగం ---64-65
3.3.4 రఘుపతి వేంకటరత్నం నాయుడు ----66-66
3.3.5 ఇతరులు ---66-66
3.3.6 సంస్కరణోద్యమానికి కృషి చేసిన స్త్రీలు ----66-68
3.3.7 సాహిత్యం - సంస్కరణోద్యమం -----68-69
3.3.8 పత్రికలు - సంస్కరణోద్యమం ----69-69
3.3.9 సంస్కరణోద్యమ కేంద్రాలు ----69-72
3.3.10 భాషా సాహిత్యాలు ----72-78

4 శ్రీపాద వారిపై సంస్కరణోద్యమాల ప్రభావం – ఆధునికత -----(79-111)

4.1 ప్రభావం -----79-100
4.1.0 పరిచయం -----79-80
4.1.1 ఉద్యమాల ప్రభావం -----80-82
4.1.2 వీరేశలింగం ప్రభావం ----82-87
4.1.3 బంకించంద్రుడి ప్రభావం -----88-90
4.1.4 వీరేశలింగం పాత్ర -----90-94
4.1.5 వితంతు పునర్వివాహం -----94-95
4.1.6 స్త్రీ విద్య -----95-96
4.1.7 వేశ్యా సమస్య -----96-96
4.1.8 కులాల నిరసన ------96-97
4.1.9 సంఘం - మతం -----97-98
4.1.10 సంఘ సంస్కరణ - దేశ స్వాతంత్ర్యం ......98-100

4.2 ఆధునికత ......100-111

4.2.0 పరిచయం ......100-102

4.2.1 ఆధునికత-నైఘంటుకార్థం ......102-104

4.2.2 ఆధునికత – నిర్వచనాలు ......104-107

4.2.3 ఆధునికత – సాహిత్యం ......107-109

4.2.4 ఆధునికత – మార్పు ......109-111

5 శ్రీపాదవారి జీవితం – రచనల పరిచయం ........(112-139)

5.1 జీవితం .......112-122

5.1.0 పరిచయం .......112-112

5.1.1 బాల్యం ......112-114

5.1.2 జీవన విధానం ......114-116

5.1.3 సాహిత్య జీవితం ......116-119

5.1.4 సభలూ, సత్కారాలు ......119-120

5.1.5 సాహితీ మిత్రులు ......120-121

5.1.6 వ్యక్తిత్వం ......121-122

5.2 కథలు – నవలలు ......122-131

5.2.1 చిన్న కథల పరిచయం ......122-126

5.2.2 కథల విభజన ......126-130

5.2.3 నవలలు ......130-131

5.3 ఇతర రచనలు ........131-139

5.3.0 ఇతర రచనలు ........131-132

5.3.1 నాటకాలు ........132-132

5.3.2 అనువాద నాటకాలు ........132-133

5.3.3 రూపికలు ........133-133

5.3.4 రేడియో రూపికలు ........133-134

5.3.5 చరిత్రలు ........134-134

5.3.6 ఖండ కావ్యాలు ........134-134

5.3.7 విమర్శన గ్రంథాలు ........134-135

5.3.8 పత్రికా రచన ........135-135

5.3.9 రామాయణ భారతానువాదాలు......136-136

5.3.10 వ్యాసాలు ........136-137

5.3.11 వైద్య గ్రంథాలు ........137-137

5.3.12 వాచక రచన ........137-137

5.3.13 స్వీయ చరిత్ర ........137-139

## రెండవ భాగం

6 సైద్ధాంతిక చైతన్యం .....(140-161)

6.1 మానవతా వాదం ........140-152

6.2 హేతు వాదం ........153-161

7 సామాజిక చైతన్యం .....(162-204)

7.1 కులం .......162-179

7.1.1 కులభేద నిరసన ......162-168

7.1.2 అస్పృశ్యతా నిరసన ......169-179

7.2 విద్య .......180-183

7.2.1 విద్యా విధానం .......180-180

7.2.2 విద్యావకాశాలు ......180-181

7.2.3 ఆంగ్ల విద్యా ప్రభావం .......182-183

7.3 నిరుద్యోగ సమస్య ---184-194

నిరుద్యోగ సమస్య ....184-194

7.4 అధికార యంత్రాంగం ......194-204

7.4.1 లంచగొండితనం ......194-197

7.4.2 పబ్లిక్ సర్వీసు కమీషన్ ----198-199

7.4.3 పోలీసు వ్యవస్థ ----199-204

8 రాజకీయ చైతన్యం ...(205-231)

8.1 రాజకీయ దృక్పథం ----205-209

8.2 జాతీయ దృక్పథం -----210-221

8.3 ప్రతిఘటనా దృక్పథం ------222-225

8.4 ఆర్థిక దృక్పథం ---226-231

9 స్త్రీ చైతన్యం .....(232-282)

9.1 స్త్రీ విద్య ........232-239

9.2 కన్యాశుల్కం - వరకట్నం ......240-246

9.3 వితంతువులు ......246-257

9.4 వేశ్యా సమస్య ......258-268

9.5 స్త్రీ స్వేచ్ఛ .......269-282

10 భాషా చైతన్యం .....(283-294)

10.1 వ్యావహారిక భాషాభిమానం .......283-286

10.2 హిందీ భాషా వ్యతిరేకత ......287-291

10.3 ఆంధ్ర భాషాభిమానం .....292-294

11 సింహావలోకనం .....(295-304)

12 శ్రీపాదవారి కథలు – నవలలు ....(305-310)

13 ఉపయుక్త రచనల సూచి...(311-337)

మొదటి భాగం

1

# భూమిక

# 1

తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడల తర్వాత మానవతావాద దృక్పథంతో సామాజిక ప్రయోజనమే ప్రధాన ధ్యేయంగా సాహిత్యాన్ని సృజించిన ప్రసిద్ధ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. కందుకూరి వారి ఆదర్శంతో సంప్రదాయాన్ని ధిక్కరించి జీవిత మంతా తిరుగుబాటు ధోరణితో గడిపి, సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యాన్ని ప్రబోధించిన రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. తన సాహిత్య దృక్పథంతో పాటు, అటు రచనా శిల్పంలోనూ, ఇటు భాషలోనూ అనేకమైన ప్రత్యేకతలను చేపట్టారు శ్రీపాద వారు. వీరి రచనలలోని కథలపై సమగ్ర సమీక్ష (కనకయ్య.జి. బొమ్మర్తి. 1985-86) ఇప్పటికే వెలువడింది. వీరి రూపికలపైనా, నవలలపైనా విడివిడిగా సిద్ధాంత వ్యాసాలు వెలువడి ఉన్నాయి. మహారచయితల గురించి ఎన్ని విధాల పరిశీలనలు చేసినా ఇంకా పరిశోధించి సమన్వయ పూర్వకంగా ప్రతిపాదించ వలసిన అంశాలు ఉంటూనే ఉంటాయి. ప్రత్యేకంగా శ్రీపాదవారి కథలను, నవలలను పరిశీలిస్తున్నప్పుడు వారు తెలుగు వారికి అందించిన సందేశాన్ని ఆవిష్కరించ వలసిన అవసరం కనిపిస్తుంది. ఆ దృక్పథంతో చేసిన పరిశోధనలో శ్రీపాదవారి ప్రభావం అంతా మనకు ఆధునిక చైతన్యంగా

ప్రతిబింబిస్తుంది. శ్రీపాద వారి ఆధునిక భావాలకి, ఏనాటి భాషా సాహిత్యాల ప్రభావం లేకుండా వారి స్వీయ ప్రతిభామూలక మైనవిగా తేట తెల్లమవుతాయి. ఇటువంటి లక్షణాలతో శ్రీపాద వారి కథలు, నవలలోని ఆధునిక భావ సంపదను అనుశీలించడం కోసం ఈ పరిశోధనను ఎన్నుకోవడం జరిగింది.

శ్రీపాద వారి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాలంటే నాటి ఆంధ్రదేశ సామాజిక స్వరూపాన్ని పరిచయం చేయాలి. ఆధునికమైనవిగా భావిస్తున్న వారి భావాలను నిరూపించడం కోసం పాశ్చాత్య దేశాలలోనూ, భారతదేశంలోనూ వచ్చిన సాంస్కృతిక ఉద్యమాలను స్పృశించాలి. శ్రీపాద వారిని సంస్కర్తగా, రచయితగా, సమాజానికి ముందు చూపును అందించిన అత్యంత ఆధునికునిగా మలచిన శక్తి కందుకూరి వీరేశలింగం గారి ప్రతిభామూర్తి. అందుచేత శ్రీపాద వారి గురించి చేస్తున్న పరిశీలనలో కందుకూరి వారి ప్రభావాన్ని తప్పనిసరిగా పరిశీలించవలసి ఉంటుంది. ప్రస్తుత పరిశోధనలో పై అంశాలు 2. కొత్త అధ్యాయంగా రూపుదిద్దుకొన్నాయి. శ్రీపాద వారి జీవిత సంగ్రహ పరిచయం, ఇతర రచనల పరిచయం, ఆధునికతపై

వచ్చిన నిర్వచనాలను, వివరణలను గ్రహించడం ఈ పరిశోధనలో తప్పని సరిగా జాబితా చేసుకున్నాను. కథల, నవలలలోని రచయిత భావాల, సైద్ధాంతిక చైతన్యం, సామాజిక చైతన్యం, రాజకీయ చైతన్యం, స్త్రీ చైతన్యం, భాషా చైతన్యం అనే అయిదు ప్రధాన శీర్షికల కింద విభజించి గ్రహించడం జరిగింది. ఈ పద్ధతిలో ఒక ప్రణాళికను రూపొందించుకొని శ్రీపాదవారి ఆధునిక భావ చైతన్యాన్ని నిరూపించడానికి ఈ పరిశోధన ఉద్దేశింపబడింది.

౨

# సామాజిక నేపథ్యం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు (1891-1960) రచనలు చేసిన కాలం, జీవించిన ప్రదేశం, ఆంధ్ర దేశంలో ఆధునిక చైతన్యం వెల్లివిరిసిన కాలమూ, దేశమూనూ. ఈయన రచనలు చేపట్టేనాటికి ఆంధ్ర సమాజం కందుకూరి వీరేశలింగం పంతులు గారి నాయకత్వంలో సంఘ సంస్కార భావాలతో నూతన వైపు మార్పు చెందుతూ ఉంది. ఈ ప్రభావంతో శ్రీపాదవారు తమ రచనలలో తిరుగులేని ఆధునిక దృష్టిని అనుసరించారు. వీరి ఆధునిక భావాలను ప్రస్తుత పరిశోధనలో విశ్లేషించి సమన్వయ పరచి చూపడం ప్రధానంగా ఉద్దేశింపబడింది. దీనిలో భాగంగా మొట్ట మొదట శ్రీపాద వారికి పూర్వం ఉన్న ఆంధ్ర దేశ సామాజిక స్వరూపాన్ని పరిశీలించాల్సి ఉంది. ఈయన రచనలలోని ఆధునిక స్వభావాన్ని ఆవిష్కరించడానికి ఇది నేపథ్యం అవుతుంది.

## 2.0. 19వ శతాబ్ది సమాజం – పరిచయం :

భారత దేశ చరిత్రలో పందొమ్మిదవ శతాబ్దానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. మధ్యయుగాల నుంచి భారతీయ సమాజం ఆధునిక యుగంలోకి మారుతున్న దశ అది. చరిత్ర

వారుల సామాజిక శాస్త్రవేత్తలు ఈ దశను ఒక సంధి యుగంగా వర్ణించారు. పాత కొత్తల సంఘర్షణ అంటే ఒక యుగం అంతరించి మరో యుగం అవతరిస్తున్నప్పుడు సమాజంలో ఉత్పన్నమయ్యే భావ వైరుధ్యం మనకు ఈ శతాబ్దంలో స్పష్టంగా కనిపిస్తుంది. మధ్యయుగాల భావజాలంలో భాగమైన మూఢ విశ్వాసాలు, వ్యక్తిపరమైన అణచివేత, రాజకీయ నిరంకుశత్వం, అజ్ఞానం, అవిద్య ఈ శతాబ్దంలోనే సడలనారంభించాయి. రాజకీయ, ఆర్థిక సామాజిక రంగాల్లో వేళ్ళూనుకొన్న భూస్వామ్య భావజాలం ఈశతాబ్దంలో బలహీన పడింది. దీని ప్రభావంతో ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ, పారిశ్రామికీకరణ, హేతువాదం, లౌకిక వాదం ప్రాబల్యాన్ని పొందాయి. తత్ఫలితంగా ప్రజల మనస్సులపై మతం పట్టు సడలనారంభించింది. ఈ మార్పులు భారతీయ సమాజంలో ఒక్కసారిగా రాలేదు. ఆంగ్లేయుల రాజకీయాధిపత్యంతో పాటు, ఆర్థికపరమైన దోపిడి విశృంఖలంగా కొనసాగి, భారత దేశాన్ని వలస దేశంగా మార్చే పద్ధతికి సమాంతరంగా ఈ మార్పులొచ్చాయి. ఈ చారిత్రక పరిణామాన్ని 19వ శతాబ్దంలో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనంగా

చిత్రీకరించవచ్చు. ఇందులో భాగంగానే భారతీయ సాహిత్యం, కళలు తత్వశాస్త్రం నవ్యమార్గంలో వికసించడం ప్రారంభమైంది.

ఆధునిక ఆంధ్రదేశ చరిత్రను, ఆధునిక తెలుగు సాహిత్య వికాసాన్ని అందులో వచ్చిన నూతన రీతులను పై నేపథ్యంలో పరిశీలించాల్సి ఉంది. దేశంలో వస్తున్న మార్పులకనుగుణంగా, దేశంలో వివిధ ప్రాంతాల చరిత్రలు, సంస్కృతులు ఉంటాయనే విషయాన్ని మనం గుర్తించాలి. భారత దేశ సామాజిక పరిణామంలో భాగంగా ఆంధ్రదేశంలో కూడా 19వ శతాబ్ది మధ్యకాలానికి సాహిత్యంలోను, సమాజంలోను మార్పుకోసం అనేక ఉద్యమాలు తలెత్తాయి. ఈ అంశాలన్నింటిని గూర్చిన విశ్లేషణ ఆనాటి రాజకీయ, ఆర్థిక సామాజిక, పరిస్థితుల చిత్రణ విహంగ వీక్షణ మాత్రయా చేయడం ఈ విభాగంలో ఉద్దేశింపబడింది.

ఈ విశ్లేషణ ప్రధానంగా రాజకీయ పరిస్థితులు, పరిపాలన, ఆర్థిక స్థితిగతులు, విద్య, కులం, మతం మొదలైన విభాగాలుగా కొనసాగుతుంది.

**రాజకీయం**

2.1.1. రాజకీయ పరిస్థితులు: పందొమ్మిదవ శతాబ్దం ప్రారంభం అయ్యే

నాటికి ఆంధ్ర ప్రాంతం ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది. ఈ పరిణామం దాదాపు అర్థ శతాబ్దం పాటు జరిగిన యుద్ధాల, ఘర్షణల ఫలితంగా జరిగింది. ఆనాడు కోరమండల్ తీరంలో ఉన్న ముఖ్య రేవు పట్టణాలైన మద్రాసు, పుదుచ్చేరి, మచిలీపట్టణాలు ప్రముఖ వాణిజ్య కేంద్రాలు. అప్పటికే అక్కడ ఫ్యాక్టరీలు నెలకొల్పడం జరిగింది. వీటిని ఆక్రమించుకోవడం దక్షిణ భారతదేశంలో ఆంగ్లేయుల, ఫ్రెంచి వారి మనుగడకు కీలకమైన సమస్యగా తయారైంది. దీనికి తోడు ఈ రెండు దేశాల వారు దక్కనులో నైజాము నవాబుకు, మహారాష్ట్రులకు, కర్ణాటక నవాబుకు మధ్య జరుగుతున్న యుద్ధాల్లో తలదూర్చి, తద్వారా లబ్ధి పొందాలన్న కుతంత్రం పన్నుతూ ఉండేవారు.

ఈ విధంగా దక్కను ప్రాంత రాజకీయ సంక్షోభంలో ఆంగ్లేయులు, ఫ్రెంచివారు తలదూర్చి సైనిక రాజకీయ పరంగానే కాక వాణిజ్యపరంగా కూడా పలుకుబడి పెంచుకోవాలని ఆశించారు. ఈ పోటీ 1763వ సంవత్సరంలో ఒక కొలిక్కి వచ్చింది. దక్షిణ భారతదేశంలో ఫ్రెంచి వారి పలుకుబడి క్షీణించి, బ్రిటీషు

వారి ఆధిపత్యం నెలకొంది (ఇంపీరియల్ గజెటీర్ ఆఫ్ ఇండియా 1908 : 19). అప్పటికే ఆంధ్ర ప్రాంతం నైజాం పాలనలో ఉండేది. 1765 లో అప్పటి బెంగాల్ గవర్నర్‌గా ఉన్న రాబర్ట్ క్లైవ్ మొగల్ చక్రవర్తి షా ఆలం నుంచి ఒక ఫర్మానా పొందాడు. తద్వారా గంజాం, విశాఖపట్టణం, గోదావరి కృష్ణా జిల్లాలు అతనికి లభించాయి. దక్కను సుబేదారుగా ఉన్న నైజాం నవాబు ఈ ఫర్మానాను తప్పని సరి పరిస్థితుల్లో ఆమోదించాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆంగ్లేయులు కోస్తా జిల్లాలపై తిరుగులేని రాజకీయాధిపత్యాన్ని కలిగి ఉన్నారు. 'ఈ క్రమంలోనే 1788 లో వారికి గుంటూరు ప్రాంతం లభించింది. 1800 వ సంవత్సరంలో నైజాం నవాబు అప్పటి బ్రిటిష్ గవర్నరు జనరల్ లార్డ్ వెల్లస్లీతో చేసుకొన్న సైనిక సహకార ఒప్పందం ద్వారా, నవాబు బ్రిటిష్ వారికి దత్త మండలాన్ని దఖలు పరిచాడు (రావు. పి. ఆర్. 1978 : 17). ఈ ప్రాంతంలో బళ్లారి, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలున్నాయి. 'ఆంగ్లేయులు ఆంధ్ర ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించుకోవడం అనే ప్రక్రియ 1801 వ సంవత్సరానికి పూర్తైంది. ఈ సంవత్సరంలోనే కర్ణాటక ప్రాంతం వెల్లస్లీ ఆధీనంలోకి వచ్చింది. తద్వారా చిత్తూరు, నెల్లూరు

జిల్లాలు కూడా ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చాయి. దీనితో బ్రిటీషువారి పలుకుబడి ఆంధ్ర ప్రాంతంపై పూర్తిగా ఏర్పడింది (రామకృష్ణ. వి. 1983: 2).

ఆంగ్లేయుల కంటె పూర్వకాలంలో పాళెగాళ్ళు సర్కారు జిల్లాల్లోని జమీందార్లు స్థానిక పాలకులుగా ఉండేవారు. వారికి ప్రత్యేకమైన ప్రైవేటు సైన్యాలుండేవి. ముందుగా ఆంగ్లేయులు తమ సైనిక బలంతో వీరిని ఓడించి ఆంధ్ర ప్రాంతంపై సంపూర్ణమైన ఆధిపత్యాన్ని పొందారు. ఇది ఆనాటికి ఒక రాజకీయ సుస్థిరత అని అనిపించినా, మరో విధంగా విదేశీ దోపిడీ వ్యవస్థగా పరిణమించింది.

2.1.2 <u>పరిపాలన</u>: ఆంధ్ర ప్రాంతంపై కంపెనీ వారు రాజకీయాధికారాన్ని సంపాదించుకొన్న తర్వాత, వారు తమ పరిపాలనా పద్ధతుల్ని ప్రవేశపెట్టారు. దీనికి వ్యతిరేకంగా స్థానిక జమీందార్లు, పాళెగాళ్ళు తిరుగుబాట్లు చేశారు. వాటిని కంపెనీ వారు అణచివేశారు. అప్పటి కలెక్టరుగా ఉన్న మన్రో రాయలసీమ ప్రాంతంలో రాజకీయ అరాచకాన్ని తొలగించి, ఆర్థికంగా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి,

అప్పటి ప్రజల మన్ననలు పొందాడు. వారి వ్యాపార రాజకీయ ప్రయోజనాలను అభివృద్ధి చేసేందుకు కంపెనీవారు 'బోర్డ్ ఆఫ్ రెవిన్యూ' అనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాకు కలెక్టర్ను నియమించి, న్యాయపాలన కోసం జిల్లా జడ్జీలను ఏర్పాటు చేశారు (కోటిరెడ్డి. ఎ.వి. 1982 : 52-55). ఆంధ్ర ప్రాంతంలో కొత్త పరిపాలనా వ్యవస్థను రూపాదం చేశారు. క్రమంగా ఆంగ్లేయుల పాలన భారతీయులను ఆర్థికంగా దోపిడీ చేసే విధంగా మారింది. దీనితో ప్రజలు ఆంగ్లేయులను వ్యతిరేకించి వారి పరిపాలనను అంతమొందించాలన్న ధ్యేయంతో అనేక తిరుగుబాట్లు చేశారు. వీటిల్లో గిరిజనులు కూడా పాల్గొనడం చెప్పుకోదగ్గ విషయం (రావు. పి. ఆర్. 1978 : 17-19).

## 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

ఆంగ్ల పాలనను మొదటి వేళలో కదిలించిన సంఘటన. ఈ తిరుగుబాటు ఉత్తర భారతంలో ఆంగ్ల ప్రభుత్వాన్ని కుదిపి వేసింది. కాని దక్షిణ భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలో అంతగా ప్రభావాన్ని చూపలేదు. ఈ తిరుగుబాటు అణచివేత తర్వాత భారత దేశంలో పూర్తిగా కంపెనీ పాలన అంతమై బ్రిటీషు ప్రభుత్వ పాలన వచ్చింది. తత్ఫలితంగా

గవర్నర్ జనరల్ పదవి వైస్రాయిగా మారింది. 1858 లో విక్టోరియా మహారాణి ప్రకటనలో బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశ సాంఘిక, సాంస్కృతిక విషయాల్లో జోక్యం చేసుకోదని స్పష్టం చేసింది. ఇది భారత దేశంలో ఆంగ్లేయుల పరిపాలన స్వభావంలో వచ్చిన మార్పును సూచిస్తుంది. (రావు. పి. ఆర్. 1978 : 25-30). కొంత కాలంగా ఆంగ్లేయులు అనుసరిస్తున్న సంస్కరణ విధానం, భారతీయ సమాజాన్ని సాంఘికంగా మార్చాలన్న ఆశయం, దీంతో అంతమొందింది, కేవలం తమ స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా దేశాన్ని తమ ఏలుబడిలో శాశ్వతంగా ఉంచుకోవాలన్న నిర్ణయానికి బ్రిటిష్ ప్రభుత్వం రావడం జరిగింది.

2.1.3 <u>రాజకీయ చైతన్యం</u>: ఆంధ్ర దేశంలో కొందరు విద్యావంతులు సామాజిక సమస్యల వ్యక్తీకరణకు సంఘాలను ఏర్పాటు చేసుకోడం ప్రారంభించారు. వీటిలో 'కాకినాడ లిటరరీ సమాజం, 'మద్రాసు నేటివ్ అసోసియేషన్' చెప్పుకోదగ్గవి. ఇవి ప్రజల సమస్యలను ప్రభుత్వానికి మహజర్ల ద్వారా, సభల ద్వారా వెల్లడించేవి. ఈ సంఘటనలు (ఆంధ్ర) ప్రాంత ప్రజల్లో వెల్లడవుతున్న రాజకీయ చైతన్యానికి నిదర్శనంగా మనం గ్రహించాలి (సుందర్. కె. హెచ్. ఎస్. ఎస్. 1994 : 153-202). భారత

దేశం మొత్తం మీద వెల్లివిరిసిన ఈ చైతన్య ఫలితమే 1885 భారత జాతీయ కాంగ్రెస్ పుట్టుక. బొంబాయిలో జరిగిన ప్రథమ కాంగ్రెస్ సభలకు ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రతినిధులు హాజరు కావడం గమనార్హం. ఈ విధమైన రాజకీయ చైతన్యానికి ముఖ్యంగా తెలుగులో ప్రచురితమైన అనేక పత్రికలు దోహదం చేశాయి. వీటిలో 'పురుషార్థ ప్రదాయిని', 'వివేక వర్థిని', లోకరంజని, శశిరేఖ మొదలైన పత్రికలు ప్రముఖ పాత్ర వహించాయి. 1885 నుంచి 1947 వరకు ఆధునిక ఆంధ్ర దేశ చరిత్రను పరిశీలిస్తే అది బ్రిటిష్ వ్యతిరేక పోరాట కథగా చెప్పుకోవాల్సి ఉంటుంది. 2.2 ఆర్థిక పరిస్థితులు

ఆర్థిక పరిస్థితులు: 19వ శతాబ్ది పూర్వార్థానికే ఈ దేశంలో వలస ప్రభుత్వం తన అధికారాన్ని పటిష్టం చేసుకొని తదనుగుణంగా పరిపాలనా సంబంధమైన సంస్కరణలు, భూసంస్కరణలు, న్యాయ సంస్కరణలు చేపడుతూ వచ్చింది. తన వ్యాపారాల లాభాల కోసం ఈ దేశం నుంచి ముడి సరకులను తీసికొని పోయి తయారు చేసిన వస్తువులను మనదేశంలోకి ప్రవేశపెడుతూ వచ్చింది. దీని వలన మనదేశంలో చేతిపనులు, చిన్నతరహా కుటీర పరిశ్రమలు

ఘోరంగా దెబ్బతిన్నాయి. దేశీయమైన చేతివృత్తుల వ్యవస్థ నశించి వలస ప్రభుత్వానికనుగుణమైన నూతన వ్యవస్థ ఏర్పడింది. దీనికి ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానం పునాదిగా ఏర్పడింది. దాని అవసరాల కోసం ఉద్యోగాలు సృష్టింపబడ్డాయి. దేశీయమైన వృత్తులు వెనుకబడటంతో ఆ వృత్తులే జీవనాధారంగా బతుకుతున్న వారంతా ప్రభుత్వోద్యోగాల కోసం ప్రయత్నించ సాగారు. క్రమంగా భారతీయులు బ్రిటీషు ప్రభుత్వ యంత్రాంగానికి, పాలనా విధానానికి దాసోహం అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆనాటి యూరప్‌లోని పారిశ్రామిక విప్లవ ప్రభావం, వారి పెట్టుబడి విధానం మన దేశ జీవన విధానాన్ని ఛిన్నాభిన్నం చేసింది. వారి వస్తువుల పోటీకి దేశీయ సరకులు తట్టుకోలేక పోయాయి. దేశీయ పరిశ్రమలు దెబ్బ తినడంతో దేశంలో అనేకమందికి వ్యవసాయం ఏకైక జీవనోపాధిగా పరిణమించింది. దీనికి తోడు పదే పదే దేశంలో సంభవించిన కరువులు ప్రజల జీవన స్థితిని దిగజార్చాయి. క్షీణించిన పరిశ్రమలు, దెబ్బతిన్న వ్యవసాయం, ఆకలి మంటలు రేపిన కరువులు, ఈ మూడు కారణాలు గ్రామాల్ని పాడుపెట్టి ప్రజలను

తండోపతండాలుగా పట్టణాలు చేరే పరిస్థితిని కల్పించాయి(విజ్ఞాన సర్వస్వం 1959 : 610-611). మన దేశంలో క్రమంగా పారిశ్రామిక విధానం బాటు వేసుకొంది. అధిక పెట్టుబడులతో భారీయంత్రాలతో వస్తూత్పత్తి మొదలైంది. పరిశ్రమల స్థాపనతో కొత్త పట్టణాల ఆవిర్భావం జరిగింది. ఈపట్టణాలు జీవనోపాధి కోసం వెతుక్కుంటున్న గ్రామవాసుల్ని విపరీతంగా ఆకర్షించాయి. ఈ పట్టణాల ఆవిర్భావం దేశీయ జీవన విధానాన్ని పూర్తిగా మార్చివేసింది. దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ప్రజల నూతన జీవన విధానాలు సాంస్కృతిక రంగంలో కూడా అనేక రకాలైన మార్పులకు కారణమయ్యాయి.

బ్రిటీషు ప్రభుత్వం ఈ దేశంలో ప్రారంభించిన అనేక సంస్కరణల్లో భూసంస్కరణలు ప్రధానమైనవి. భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. బ్రిటీషు ప్రభుత్వం తమ అధికారాన్ని స్థిరం చేసుకుంటున్న కాలానికి జమిందారీ వ్యవస్థ పటిష్ఠంగా ఉంది. సాంస్కృతిక రంగాల్లో బ్రాహ్మణులదే పైచేయి. భూస్వామ్యంలో కమ్మ, వెలమ, వైశ్య వంటి ఇతర అగ్రకులాలదే పై చేయి. పంట భూముల మీద

రైతులు చెల్లించే పన్నుల ప్రభుత్వానికి ప్రధానాదాయంగా ఉండేవి. నూతన పన్ను విధానాలు రైతుల స్థితిని మరింత దిగజార్చాయి. దీని ఫలితంగా వ్యవసాయ స్థితిగతులు బాగా దెబ్బతిన్నాయి.

1823-1824 సంవత్సరాల్లో ఉత్తరాంధ్రను దాపురించిన నందన కరువు వల్ల రైతుల స్థితి దిగజారి పోయింది. ఆ ప్రాంతమంతా తీవ్రమైన దారిద్ర్యం ఏర్పడింది (రమణారావు. ఎ.వి. 1958:69). దీన్ని దృష్టిలో ఉంచుకొని కాటన్ దొరవల్ల 1852వ సంవత్సరంలో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించబడింది. ఇది ఆర్థికంగాను, రాజకీయంగానే గాక సాంస్కృతికంగా కూడా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. బ్రిటిష వాళ్ళ కొల్కత్తాలో వ్యాపార సంస్థలు ప్రారంభమైనా, వీటిలో పెట్టుబడి పోగవడం, ఆ క్రమంలో చిన్న చిన్న పరిశ్రమలు తలెత్తడం మొదలైంది.

దేశంలో కొత్తగా ఏర్పడ్డ రవాణా సౌకర్యాలు దేశ ప్రజల స్థితిగతుల్లో గణనీయమైన మార్పులు తెచ్చాయి. ఈ రవాణా సౌకర్యాల ద్వారా కొత్త వ్యాపార కేంద్రాలు వెలిశాయి. కొత్త పట్టణాలు (ఉదాహరణ కొలకత, మద్రాసు, బొంబాయి

చింది. ఈ విధానం అంతా నూతన విద్యా వ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థల ఏర్పడి బలీయమైన మధ్యతరగతి వర్గం రూపొందడానికి కారణం అయింది. వీరు సామాజిక చలనశీలతకి ప్రతినిధులయ్యారు. కొత్త భావాలకి వాహకులయ్యారు.

## 2.3 కుల వ్యవస్థ

కులం: 19వ శతాబ్ది నాటికి సంఘంలో కుల వ్యవస్థ విపరీతమైన అంతర్భేదాలతో సతమతమౌతోంది. సామాజిక వ్యవస్థకు మత వ్యవస్థ తోడు కాగా బ్రాహ్మణ కులం ప్రాధాన్యాన్ని వహించింది. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల మూలంగా ఇతర కులాలలో కూడా మార్పులు వచ్చాయి. మతాచారాల పేరిట ఏర్పడిన మూఢ విశ్వాసాలను మార్చాల్సిన అవసరాన్ని కొందరు గుర్తించడం మొదలైంది. అప్పటికే బ్రాహ్మణులలో అనేక శాఖలు ఏర్పడ్డాయి. ఈ శాఖల మధ్య వివాహ విషయంలోనే కాదు, చాలా సందర్భాల్లో సహపంక్తి భోజనాలు కూడా ఉండేవి కావు. ఇతర కులాలలో ఉపకులాలు పుట్టుకొచ్చాయి. నాటి సమాజంలో కులవ్యవస్థ ఎంత దుర్భర స్థితికి చేరిందంటే ఒక కులమునకు సంబంధించిన రెండు వర్గాలు కలిసి భోజనం చేయడం కూడా

నిషేధించబడింది. హిందువుల ప్రసిద్ధ వ్యక్తుల జీవిత చరిత్రలు బ్రాహ్మణాలుగా పేర్కొన్నాయి.(1) ఈ కాలంనాటి కులవ్యవస్థలో కింది స్థాయిని అంటరానివారిగా పరిగణించడం తీవ్రరూపం దాల్చింది. వీరి పరిస్థితి సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉండేది. అగ్రవర్ణాలు నడిచిన వీధుల్లో నడవడానికి కూడా వీరికి అర్హత ఉండేది కాదు. సాధారణంగా వీరి నివాసాలు ఊరికి వెలుపలే ఉండేవి. బావుల దగ్గరకు చెరువుల దగ్గరకు కూడా వీరికి ప్రవేశం ఉండేది కాదు. దేవాలయ ప్రవేశ అర్హత కూడా లేదు. ఈ విధమైన అసమానతలే హిందూ సంఘములలో అనేక రకాలైన విభేదాలకు కారణమయ్యాయి.

సంస్కరణావశ్యకత ముందుగా ఉన్నత కులాల్లోనే గుర్తించబడింది. వీరి నుంచే సంస్కర్తలు కూడా ఎక్కువగా రావడం గమనార్హం (రామకృష్ణ. వి. 1983: 3-4). ఈ కుల వ్యవస్థలోని

---

(1) కొండా వెంకటప్పయ్య తన స్వీయ చరిత్రలో ఇటువంటి సంఘటనలే పేర్కొన్నారు. "మద్రాసుకు చెందిన రఘునాథరావు అనే సంస్కర్త బ్రాహ్మణ కులంలోనే ఇంకొక తెగకు చెందిన వ్యక్తి తయారు చేసిన భోజనం చేయుటకు నిరాకరించాడు. వితంతు శరణాలయాల్లో వివిధ కుటుంబములకు చెందిన వారికి వేరువేరుగా భోజన శాలలు ఏర్పాటు చేశారు (రమాపతి రావు. అక్కిరాజు (సంపా) 1982: 249).

విపరీతమైన తరతమ భేదాల నాటి మనిషిని మనిషిగా చూడలేని స్థితిని సంస్కరణ భావాలు గలవారు సృష్టించారు.

నాటి సమాజంలో నిమ్న జాతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉండేది. వీరిని గురించి ఆలోచించే స్థాయికి ఆనాటి సమాజం ఎక్కువగా చేరుకోలేదనే చెప్పాలి. వీరేశలింగం వంటి సంస్కర్తలు సంఘంలోని సాంఘికాచారాలను గూర్చి [illegible] ఎంతో శ్రేష్ఠమైన కృషి సల్పినా, అంటరానితనం గురించిన సంస్కరణ భావాలు 20వ శతాబ్దంలోనే బలం పుంజుకొన్నాయి.

## 2.4 మత వ్యవస్థ.

2.4.1 మతం: 19వ శతాబ్దం నాటి ఆంధ్రదేశ జనాభా మొత్తంలో అత్యధిక శాతం హిందువులు. తర్వాత మహమ్మదీయులు, క్రైస్తవులు మొదలైన వారు అల్ప సంఖ్యాకులు. సామాన్య పౌర జీవనానికి సంబంధించి ఈ మతాల్లో పెద్దగా మార్పులేదు. 1881వ సంవత్సర గణాంక వివరాల ప్రకారం విధురుల శాతం కంటే వితంతువుల శాతం ఆరురెట్లు ఎక్కువ. (రామకృష్ణ. వి. (ఆంగ్లం) 1982:13). ఈ కాలంలో హిందూమతంలో అనేక వైరుధ్యాలు చోటు చేసుకొన్నాయి. నాటి హిందూమతం చాలా సంకుచితంగా

ఉండేది. 'మత సంప్రదాయాలకు ఏమాత్రం భిన్నంగా ప్రవర్తించినా, మత గురువుల నుంచి బహిష్కారాలుండేవి. ఇటువంటి బహిష్కారాన్ని మన సంఘ సంస్కర్తలందరూ వివిధ సమయాల్లో ఎదుర్కొన్నవారే' (వీరేశలింగం రచనలు స్వీయచరిత్ర, రెండవభాగం. 1984: 203). ఎందరో హిందువులు తమ మతంలో సరిపెట్టుకోలేక ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారడం వాడుకనిపిస్తుంది. 'సర్వ మానవ సమానత్వం' అని ప్రచారం చేసే క్రైస్తవ మతం ప్రతిష్ఠ ఎంతగానో ఆకర్షించింది. ఈ మార్పుకి కేవలం క్రైస్తవ మతంలోని సర్వమానవ సిద్ధాంతమే గాక, ఆర్థిక పరమైన కారణాలు కూడా ఉన్నాయి. హిందూ మతంలోని కింది కులాల వాళ్లు తరచు క్రైస్తవులుగా మారిపోతుండేవారు. మత విషయకంగా నాటికే క్రైస్తవ మిషనరీలు దేశం నలుమూలలా పాఠశాలలు స్థాపించి, మత వ్యాప్తికి కూడా కృషి చేస్తుండేవారు. మద్రాసు రాష్ట్రంలో ప్రధాన నగరమైన రాజమహేంద్ర వరంలో వీరేశలింగం గారు జన్మించడానికి పూర్వమే క్రైస్తవ మిషనరీలు పాఠశాలలను నెలకొల్పడం జరిగింది. ఆ పాఠశాలలలో హిందూ మతగ్రంథాలు, పురాణాలు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాల నిరసింపబడుతూ ఉండేవి (వెంకయ్య. దర్శి.

1953:184). దీని ఫలితంగా మత సంస్కరణల వైపు అనేకుల దృష్టి సారించారు. ఆర్య సమాజం, బ్రహ్మ సమాజం, దివ్యజ్ఞాన సమాజం వంటి నూతన ఆధ్యాత్మిక మార్గాలేర్పడ్డాయి. వీటిలో బ్రహ్మ సమాజానికి, ఆర్యసమాజానికి దేశ వ్యాప్తంగా శాఖలేర్పడి ప్రజల్లో చైతన్య వంతం చేశాయి.

4.2 <u>క్రైస్తవ మిషనరీలు</u> : 19వ శతాబ్దపు ఆంధ్ర దేశంలో పాశ్చాత్య విద్యా వ్యాప్తికి గణనీయమైన కృషి చేసిన వారిలో క్రైస్తవ మిషనరీల ప్రముఖ పాత్ర వహించాయి. వారి ధ్యేయం క్రైస్తవ మత వ్యాప్తి అయినా, దానిలో భాగంగా ఎన్నో విద్యాలయాలను, ఆసుపత్రులను నెలకొల్పారు. ఆంధ్ర దేశంలో పని చేసిన క్రైస్తవ మిషనరీలలో, 1805లో స్థాపించిన 'అమెరికా బాప్టిస్టు సంఘం', 1841లో స్థాపించిన చర్చి మిషనరీ సొసైటీ ప్రధానమైనవి. ముఖ్యంగా కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో చర్చి మిషనరీ సొసైటీ విశేషమైన కృషి చేసింది. ఈ మిషనరీలు గ్రామాల్లో విద్యాలయాలను నెలకొల్పి ముఖ్యంగా వెనుకబడిన వర్గాల్లో విద్యావ్యాప్తికి కృషి చేసి వారిని క్రైస్తవ మతంలోకి మార్చే ప్రయత్నం చేశాయి. మధ్య తరగతి కుటుంబాలనుండి కూడా విద్యార్థులు ఆకర్షింపబడ్డారు.

ఈ మిషనరీల విద్యలలో కొత్త పద్ధతులను, వృత్తి విద్యలను ప్రవేశపెట్టాయి. ఈ పరిణామం మొత్తం సమాజంలోను గొప్ప మార్పు తెచ్చింది. ఫలితంగా సంప్రదాయ భావాలు ఎక్కువగా ఉన్నత కులాలలోని విద్యావంతులైన వారిలో అంకురించాయి.

## 2.5 కుటుంబ వ్యవస్థ

5.1 **కుటుంబం:** ఆనాడు స్త్రీ ప్రతి చిన్న విషయానికి భర్త మీద ఆధార పడాల్సి వచ్చేది. ఇంగ్లీషు చదువు నేర్చిన భర్తకి మూఢనమ్మకాలుగా కని పించే అంశాలు భార్యకి ఇంకా విశ్వసనీయాలుగానే తోచేవి. సమా జంలో నూతనంగా ప్రాచుర్యం పొందుతున్న శాస్త్ర జ్ఞానాన్ని, హేతు వాదాన్ని కొంత వరకైనా స్త్రీలకు పరిచయం చేయాల్సిన అవసరం కలిగింది. మారిన ఆర్థిక స్థితి స్త్రీకి తెలియజేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి తక్కిన కులాలలో కంటే అగ్రవర్ణమైన బ్రాహ్మణ కుటుంబాల్లోనే ఎక్కువగా ఉండేది (హనుమంతరావు. జక్కేపల్లి. 1911: 16-17).

సమిష్టి కుటుంబ వ్యవస్థలో స్త్రీ అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చేది. ఈ పరిస్థితి సమాజంలో

ఎటువంటి ఉత్పత్తి వ్యవస్థతో సంబంధం లేకుండా ఉండే [illegible] స్త్రీల్లో ఎక్కువగా ఉండేది. ఒకసారి వివాహమై అత్తవారింట ప్రవేశించిన కోడలు ఆ కుటుంబానికి దాసీ. అత్తల లాంటి వేధింపులకు, సాధింపులకు పరాకాష్ఠగా ఉండే వాళ్ళు. అత్తలూ తాము కొత్తగా కోడలిగా వచ్చిన నాడు తామనుభవించిన శిక్ష తన కోడలు వచ్చేనాటికి మర్చిపోయేది. ఒక విధమైన అహంకార తృప్తి ఆమె చేత కోడల్ని బాధించేటట్లు చేసేది. తమ అసంతృప్తిని పురుషులతో పోరాడి సాధించుకోలేనప్పుడు కుటుంబంలోకి కొత్తగా వచ్చిన కోడలి మీద ప్రదర్శించేవారు. తమ అధికారానికి లోబడే స్త్రీ ఒకరైనా ఉన్నారనే భావం స్త్రీకి తాత్కాలికమైన తృప్తి నిచ్చేది. బావను మరుదుల్ని ఎదిరిస్తే, భర్తకు కోపం వస్తుందనే భయంతో, అత్తగార్ని కాదంటే ఇంట్లోనుంచి తరిమేస్తారేమోననే భయంతో స్త్రీ అనేక విధాలా నలిగిపోయేది.(1) సమాజంలో పెరుగుతూ వచ్చిన ఆంగ్ల విద్యావిధానం ఆర్థిక సంస్కరణలు కుటుంబ వ్యవస్థపై కూడా

---

(1) వెలకమర్తి లక్ష్మీనరసింహం తన చిన్నతనంలో వారి తల్లి అటు అత్తగారికి, ఇటు భర్తకు భయపడి కుటుంబంలో అనేక కష్టాలు పడుతుండేదని తన స్వీయ చరిత్రలో పేర్కొన్నారు (లక్ష్మీనరసింహం. వెలకమర్తి. 1944: 57-58).

ప్రభావం వేసింది. దీనివల్ల స్త్రీ పురుష సంబంధాల్లో ఎన్నో మార్పుల చోటు చేసుకొన్నాయి.

2.5.2 వివాహ వ్యవస్థ : ఇక వివాహ విషయంలోకి క్రమం పాటించే ఆచారాలకి అర్థం ఉండేది కాదు. ఏ వివాహం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్నకు సమాధానం లేదు. వివాహ లక్ష్యం ఏమిటనే విషయం పూర్తిగా మరుగున పడి వివాహం అర్థంలేని తంతుగా తయారైంది. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వివాహాలు జరుగుతుండేవి. నాటి వివాహ వ్యవస్థ సమగ్రంగా సంస్కరించాల్సిన దశలో ఉంది. కన్యాశుల్కానికి తోడు వరకట్నాలు మొదలయ్యాయి. వివాహం వ్యాపారంగాను, బొమ్మలాటగాను మారిపోయింది. తత్ఫలితంగా బాలవితంతువులు తయారయ్యారు. ఇటువంటి దురాచారాలలో నాటి సంఘం గాఢంగా కూరుకుపోయింది. అందుకే ప్రజల్లో శాస్త్రీయ పరిజ్ఞానం మచ్చుకైనా కన్పించదు.

2.5.3 **కన్యాశుల్కం - వరశుల్కం** : స్త్రీ పరంగా హృదయాలను కదిల్చివేసే ఇంకొక అంశం వివాహ వ్యవస్థ. ఇది ఆనాడు అనేక లోపాలకు ఆలవాలమై సంస్కరించడానికి వీల్లేని స్థితిలో ఉండేది. ఇలాంటి లోపభూయిష్టమైన వివాహ వ్యవస్థలో ఎక్కువగా నష్టపోయింది స్త్రీలే.

కన్యాశుల్క వరశుల్క సమస్య ఎక్కువగా ఉండేది. ఆడపిల్ల తండ్రికి కన్యాశుల్కం వల్ల, పేదరికం వల్ల తన పిల్లకి పెళ్ళి కాదేమోననే భయం ఈ దురాచారానికి దారి తీసింది. ముక్కుపచ్చలారని ఆడపిల్లలను అన్యాయంగా అమ్ముకోవడం పరిపాటయింది (సుబ్బారావు. బి.వి. 1986:5). కన్యాశుల్కం వివాహాల సంఖ్య పెంచితే, వరకట్నం పెళ్ళికాని ఆడపిల్లల సంఖ్యను పెంచింది. ఆంగ్ల విద్య మూలంగా, తద్వారా లభించే ఉద్యోగాల మూలంగా రూపొందిన జాడ్యం వరకట్నం (లక్ష్మీ కాంతమ్మ. పిల్లారిశెట్టి. 1914:48). ఈ దురాచారం ముఖ్యంగా ఆనాటి బ్రాహ్మణ సంఘంలో మాత్రమే ఉండేది. తక్కువ వర్ణాల్లో 'మారుమనువు' లుండేవి (రమణారెడ్డి కె.వి. 1969:383). కన్యాశుల్కం వరశుల్కం సమస్యలు వారినంతగా బాధించలేదు. తర్వాతి కాలంలో ఈ దురాచారాన్ని వీరేశలింగం గారు మొదలైన సంఘ సంస్కర్తలు, రచయితలు ఖండించారు.

## 2.6 స్త్రీ

.6.1 స్త్రీ: నాటి సమాజంలో స్త్రీలు సంఘంలోని అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆనాడు సమాజంలో నెలకొని ఉన్న అనేక దుస్థితులకు వారు బాధితులుగా మారారు. సమాజంలో వచ్చిన మార్పుల

వచ్చినా ఎందరి పరిస్థితులు మారినా స్త్రీ పరిస్థితి యథాతథంగానే ఉంది. సమాజంలోని అన్ని రంగాల్ని స్త్రీ పరంగా ఆలోచిస్తే ఆమెకు జరుగుతున్న అవమానం, అన్యాయం ద్యోతకమౌతాయి. సమాజం ఆమె పట్ల ప్రవర్తిస్తున్న తీరు సమాన స్థాయి కాదని (జియ్యరు సూరి. 1876 : 205). తన 'స్త్రీ కళా కల్లోలిని' లో ఇలా చెప్పారు. 'మన దేశము నందు స్త్రీలను బలిబాలికలవలెను, మృగముల వలెను ప్రవర్తింపజేయుట యోగుల పరిశీలింపదగిన విషయముగా నున్నది కదా, కులమును, సంపదయు నెంత యెక్కుడో యంత కంటె స్త్రీల కార్పణ్య మెక్కుడుగా నున్నది.'

ఇది నాటి స్త్రీల స్థితి. ఎక్కడో ఒకరిద్దరు తప్ప సాధారణంగా స్త్రీ లోకం ఇదే పరిస్థితిలో ఉంది. అన్ని మూఢాచారాలకి, మూర్ఖత్వానికి స్త్రీ పుట్టినిల్లుగా ఉండేది. వీరేశలింగం పంతులుగారు తన రచనల్లో నాటి స్త్రీ మౌఢ్యానికి పుట్టినిల్లుగా ఉండేదని రాశారు. అయితే ఈ మౌఢ్యానికి అజ్ఞానానికి విద్య లేకపోవడమే కారణమని కూడా వారు భావించారు. బయటి ప్రపంచంతో ఆమెకు ఏమాత్రం సంబంధం లేదు. ఈ స్థితికి కారణం విద్యావిహీనత అని వీరేశలింగంతో పాటు జియ్యరు సూరి వంటి సంస్కర్తలు గుర్తించారు.

నాటి స్త్రీకి ఆర్థికంగా ఎలాంటి హక్కులూ లేవు. సాంఘిక చైతన్యానికి ఆస్కారం లేదు. వివాహం, పిల్లల్ని కని పెంచడం, ఇంట్లో వెట్టి చాకిరి చేయడమే ఆమె జీవిత ధ్యేయంగా నాటి సమాజం చేసింది. ఆ కాలం నాటి ఒక రచయిత స్త్రీల స్థితిని గురించి చేసిన వ్యాఖ్యానం, నాటి స్త్రీ స్థితిగతులను తెలియ జేస్తుంది. 'విద్యకు దూరమై ఇంటి నాలుగు గోడల మధ్య బందీలై, ప్రపంచం చూడకుండా, ప్రపంచం గురించి ఏమీ తెలియకుండా, మూఢ విశ్వాసాలలో మునిగి, ఆచారాల చేత పీడింపబడే మన మహిళలు - చెప్పుకుంటే సిగ్గుచేటు - బానిసల కంటే ఏ విధంగానూ నయం కాదు' (వెంకట సుబ్బారావు. ఆర్. 1902 : 191).

ఇలాంటి సామాజిక పరిస్థితులలో ఉన్న స్త్రీ జాతి 19వ శతాబ్దంలో పెద్దగా మార్పుకు గురికావడం ప్రారంభమైంది.

**2.6.2 స్త్రీ విద్య:** సమాజంలో సగభాగమైన స్త్రీ నిరక్షరాస్యురాలై అంధకారంలో మునిగిపోయింది నాడు. స్త్రీ విద్య నార్జించడం అంటూ జరిగితే ఏదో ఒక కీడు జరుగుతుందనే నమ్మకం నాడు ప్రబలంగా ఉండేది (లిథప్

రావు .వై., 1979:135). ఆడపిల్ల చదువుకుంటే ఆ కుటుంబాలకు దురదృష్టం పట్టుకుంటుందని నమ్మే వాళ్ళు. అలా ఆమెను విద్యకు దూరం చేశారు. అందుకనే 19వ శతాబ్ది నాటి పురుషుడిలో కలిగినంత భావ స్పందన స్త్రీలలో కలగనీరు. ఆంగ్ల విద్యాభ్యాసంలో ప్రభావితుడైన పురుషుడికి, అదిలేని స్త్రీకి భావ వైరుధ్యం విపరీతంగా ఉండేది. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో సంస్కర్తలతో పాటు కొన్ని పత్రికలు కూడా స్త్రీలకు విద్య అత్యంత ఆవశ్యకమని గుర్తించి ప్రచారం చేశాయి.[1]

విద్య లేక ఎంత దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న జీవితాల్లో వెలుగును ప్రసాదించేందుకు స్త్రీ విద్యావశ్యకతను గుర్తించి చాలా మంది చాటి చెప్పారు.[2] స్త్రీలకు విద్యావకాశాలు లేక పోవడానికి

---

(1). ఉపాధ్యాయ మోహిని (మాసపత్రిక, 1893: 65-66) లో స్త్రీ విద్య అనే వ్యాసంలో వి. రామస్వామి అయ్యర్ స్త్రీ విద్యకు తగిన సాధనాలను గూర్చి చెప్తూ కొన్ని సూచనలు ప్రతిపాదించాడు. అవి.
(1) ఇంటి దగ్గర బాలిక విషయములో వలె, బాలికల చదువు గురించి శ్రద్ధ వహించాలి.
(2) విద్యాభ్యాసానికి తగిన పుస్తక సామగ్రి బాలికలకు కూడా తల్లిదండ్రులు సమకూర్చి పెట్టాలి.
(3) సాధ్యమైనంత వరకు చదువరులకు స్త్రీలే ఉపాధ్యాయులుగా ఉండాలి.

(2) నాల్గవ (ఆంధ్ర) మహిళా సభలో శ్రీమతి పోటుపల్లి. బాలమ్మ గారు 'స్త్రీల విద్యా స్వాతంత్ర్యమును నిర్బంధించుట మెటుక వింతగాదు. నాల్గైదేండ్ల కంటె ఎక్కువగా విద్యనభ్యసించుటకు అవకాశం లేదు. ఇంటను బాలికలకు... అని తన వాదాన్ని వ్యక్తపరచారు. (నాల్గవ (ఆంధ్ర) మహిళా సభ (ఉపన్యాసాలు), 1913: 7).

బాల్య వివాహాలే కారణమని, వాటిని వారించి స్త్రీలను విద్యావంతులను చేయాలని చెప్పి, సామినేని ముద్దు నరసింహం నాయుడు (1862:1) 'స్త్రీలకు విద్యలు సార్థకములగు చున్నవి' అని తన హితసూచని రచనను ప్రారంభించాడు. అలాగే వీరేశలింగం 'ఏ జాతి ప్రగతి అయినా ఆ జాతి స్త్రీల విద్యా సంస్కారాల మీద ఆధారపడి ఉంటుందని నమ్మి దాని కోసం ఎంతగానో కృషి చేశాడు.[1]

2.6.3 **బాల్య వివాహాలు** : ఆనాటి సమాజంలో ఉన్న మూఢాచారాలలో బాల్య వివాహాలు ప్రధానమైనవి. దీనికి సమాజంలో నెలకొని ఉన్న అజ్ఞానము ఆర్థిక పరమైన అసమానతలే కారణాలు. తరచుగా 'వంశ విడువని వంటి వాళ్ళకే పెళ్ళిళ్ళు చేసేవారు. పుట్టబోయే బిడ్డల మధ్య సంబంధాలు ఖాయం చేసుకోవడం కద్దు. బహిరంగ వేలంలా ఆడపిల్లలను కొనుక్కొని పెళ్ళాడ్డం సర్వ సామాన్యం. కాని స్త్రీ భర్తను కోల్పోతే ఇక ఏ పరిస్థితుల్లోనూ పునర్వివాహం చేసుకోకూడదు. నిర్బంధ వైధవ్యాన్ని అనుభవించి తీరాల్సిందే (వెంకటేశ్వరావు. నార్ల. 1948:12). వయస్సుతో నిమిత్తం లేకుండా కన్యాశుల్కానికి ఆశపడి అరవై, డెబ్బై ఏళ్ళ వృద్ధులకు, ఆరు,

---

(1) 'చదువెరుగని స్త్రీలు తమ బిడ్డలను చెరుపుదురు'. అని వీరేశలింగం పంతులుగారు స్త్రీవిద్యావశ్యకతను గూర్చి చెప్పారు (సతీహిత బోధిని, మాస పత్రిక. 1883).

ఏడు ఏళ్ళ ముక్కు పచ్చలారని పసి పిల్లలకు వివాహం చేసేవారు. బాల్య వివాహాల నాడు సర్వసాధారణం కావడం వల్ల బాల వితంతువుల సంఖ్య కూడా విపరీతంగా ఉండేది. ఈ రెండు దురాచారాలు బ్రాహ్మణుల్లో ఎక్కువగా ఉండేవి. ఇవి స్పష్టంగా అసమంజసమూ, అశాస్త్రీయమూ అయినప్పటికీ వీటిని మతం సమర్థించేది. అందువల్ల బాల్య వివాహాల చేయని తల్లిదండ్రులను మత ధర్మాలను ఉల్లంఘించిన వాళ్ళుగానూ, పాపుల గాను పరిగణించేవాళ్ళు. ఇలాంటి దురభిప్రాయాలు నాటి ప్రజల్లో బాగా ఉండేవి. మొత్తం బాల్య వివాహాల్లో సగం వరకు బ్రాహ్మణుల్లోనే జరిగేవి. (రామకృష్ణ. వి. 1983:67). ఈ విధమైన దురాచారాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని (ఆడపిల్లలకు పన్నెండేళ్ళు మగపిల్లలకు పదహారేళ్ళు తక్కువ కాకుండా వివాహం చేయకూడదని, బాల్య వివాహాలను నిషేధించాలని, స్త్రీలకు విద్య నేర్పడం ఎంతో అవసరమనీ ఎన్నో విషయాలను సంఘసంస్కర్తలు ప్రబోధించారు.

2.6.4 <u>వితంతువులు</u> : ఆనాటి సమాజంలో వితంతువుల స్థితి చాలా హీనంగా ఉండేది. బాల్య వివాహాల కారణంగానే అనేక మంది స్త్రీలు వితంతువులుగా మారి పోయేవారు. ఊహ తెలిసే నాటికి వితంతువుగా మారిన స్త్రీల

పరిస్థితి వర్ణనాతీతంగా ఉండేది. వీరి జీవన విధానం పట్ల విపరీతమైన ఆంక్షలు ఉండేవి. ఈ స్థితిని 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో చాలా మంది నిరసించి సంస్కరించడానికి పూనుకొన్నారు.

'మన దేశమునందలి వితంతువుల యొక్క స్థితులు నిర్భాగ్యముగాను పరితాపకరముగా నున్నయది. విధవ యను పదము దూష్యముగా నున్నయది.... ఆది పురుషుల యొక్కయే సకల సుఖములను పోగొట్టుకొనుచున్నారి. ఎర్రని చీర తెల్లచీరగాను, రెండు పూటల భోజనము ఒకపూటగాను, వెంట్రుకల తల బోడితలగాను, సుఖమంతయు దుఃఖముగాను మారుచున్నవి. దానికి హద్దును లేదు. పొద్దును లేదు. దానికలంకారమును లేదు. ఎదియును లేదు' (సూరి. అయ్యరి. 1876:239).

ఆనాటి పట్నాలు సంప్రదాయ గుర్తించారు. ఎక్కడ ఉన్నా వీరి పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వీరు సంతోష కార్యాల్లో పాల్గొనడానికి వీల్లేదు. వీరి దర్శనము అమంగళకరం. వైధవ్యం పూర్వ జన్మాల పాపమని ఆనాటి ప్రజలు నమ్మేవారు. ఆనాటి ఇండ్లల్లో ఇంట కొకరైనా వితంతువు ఉండేదనడంలో అతిశయోక్తి లేదు. ఈ సందర్భంలో వితంతువుల ప్రాయాల పట్టిక గమనింపదగింది[1]. 'నా బాల్యమున అనగా 1901–1902

సంవత్సరములలో సంపన్న కుటుంబములనదగిన పెనుబాటి వారి ఇండ్లలో స్త్రీల మీద చాలా కఠినమైన ఆనాటి నిబంధనలుండేవి. బయట ముఖము చూపుటకే మాకు అవకాశం ఉండేది కాదు. ఎంత సన్నిహిత బంధువైనను పురుషునితో మాట్లాడడం చాలా తప్పుగా భావించెడి వారు. అందునను బాలవితంతువునైన నాబోటి వాళ్ల విషయము నందు ఈ నిబంధనలు ఎంత కఠినముగ ఉండెడివో మీరే ఊహింపవచ్చును (లక్ష్మీ కాంతమ్మ, బత్తుల. 1948:69).

విధవా వివాహం మత గ్రంథాల ద్వారా నిషేధించబడిందనే నమ్మకం నాటి సమాజంలో ఉండేది. మరొక వైపు ఆర్థిక స్థితిగతులు కూడా అందుకు దోహదపడ్డాయి. వితంతువుల ద్వారా సంక్రమించినటువంటి ఆస్తిని అనుభవిస్తూ, వారి ద్వారా సేవలు చేయించుకోవడం ఉండేది (వెంకటప్ప. వద్ది, 1953:91). అందువల్ల ఆస్తి హక్కు లేక, విద్యకు నోచుకోక, సరైన రక్షణలేక బాల వితంతువులు సంఘంలో నికృష్ట జీవనాన్ని అనుభవించేవారు.

---

① 'శ్రీమతి బత్తుల లక్ష్మీ కాంతమ్మ' సుమారు పదిహేను సంవత్సరాల ప్రాయంలోనే వితంతువై అనేక బాధలు అనుభవించింది. వీరేశలింగం గారి సంఘ సంస్కరణ స్ఫూర్తితోను ఆయా భావాలతో కూడిన సంస్థలను స్థాపించి మహిళా సంఘోద్ధరణకు కృషి చేసింది.

2.6.5 <u>సతీసహగమనం</u> : సాంఘిక దురాచారాల్లో కెల్లా అతి క్రూర మైంది సతీసహగమనం. సతీసహగమనం ఆంధ్రదేశంలో అక్కడక్కడ జరిగినట్లు మనకు ఆధారాలు కనిపిస్తున్నాయి. దీనికి బొబ్బిలి, విజయనగరం, పెద్దాపురం, నూజివీడుకు చెందిన సంస్థానాలలో ఆచరించినట్లు తెలుస్తుంది (రామలక్ష్మి. 1994:127). 1770లో మచిలీపట్నానికి సమీపంగా ఉన్న గూడూరులో సతీసహగమనం జరిగింది (మద్రాసు గవర్నమెంటు రికార్డ్సు, 1854:22). కడప జిల్లాలో రెండు సహగమనాలు జరిగినట్లు, మరొకదాన్ని పోలీసుల సహాయంతో నివారించినట్లు, 1830లో కడపలో లండన్ మిషనరీ సొసైటీలో పని చేసిన రెవరెండ్ విలియం హోవెల్ రాశారు (రామకృష్ణ - వి. 1983:7). ఇలాంటి దురాచారాలు నెల్లూరు ప్రాంతాల్లో కూడా జరిగాయి[1]. ఇలాంటి దురాచారాలు నాటి సమాజంలో స్త్రీల పాలిట శాపాలుగా తయారయ్యాయి. 19వ శతాబ్ది పూర్వార్ధంలోనే సమాజంలో నెలకొన్న సంస్కార భావాల ఫలితంగా దురాచార

---

(1) 1820 ప్రాంతంలో నెల్లూరు జిల్లాకు చెందిన పాపిరెడ్డి భార్య బడదాల నారాయణమ్మ సతీసహగమనం చేసింది. ఆమె కథ ఈ నాటికీ ఆ ప్రాంతంలో వీరగాథలుగా పాడటం ఉంది (రామకృష్ణ. వి. 1983:7-8).

పూర్తిగా సమసిపోయింది.

## 2.7 ఇతర సామాజికాంశాలు

2.7.1 **విద్య**: నాటి విద్య ప్రధానంగా అరుగుల మీద నిర్వహింపబడే వీధి బడులకే పరిమితమై ఉండేది. ఉపాధ్యాయుడు ఇంటి అరుగు మీదనో, చెట్టు కిందగాని మొక్కని విద్యార్థులకు సంస్కృతమూ, గణితమూ, తెలుగూ బోధించేవాడు. అందుకు సహాయంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కొంత ప్రతిఫలాన్ని చెల్లించేవారు. ఆనాడు విద్య అంటే కంఠతా పాఠం చేయడమే. ఆంగ్ల పరిపాలన ప్రారంభానికి నాటికి దేశీయ విద్యా విధానం మారుతున్న సమకాలీన అవసరాలు తీర్చలేని స్థితిలో ఉంది.[1] ఈ విధమైన విద్యా విధానం పట్ల, ఆంగ్లేయ విద్యచేత ప్రభావితులైన వారు విముఖతను ప్రదర్శించారు. వారు దేశీయ విద్యా విధానంలో గణనీయమైన మార్పు రావాలని ఆశించారు.

---

(1) వెన్నెలకంటి సుబ్బారావు దేశీయ విద్యా విధానంలోని లోపాల్ని ఎత్తిచూపుతూ విద్యా విధానంలో మార్పు తేవాల్సిన అవసరం ఉందని మద్రాసు స్కూలు బుక్ సొసైటీకి 1820 నవంబరు 22 న ఒక లేఖ రాశారు. దానిలో "నా దేశీయులు, నా జాతి జనులు విద్యా విషయకంగా ఎంతో లోపభూయిష్టమైన, అసంతృప్తికరమైన పరిస్థితుల్లో ఉన్నారో ఆ విషయకంగా నాలోని సంవేదన నన్ను ఈ ఉత్తరం రాయడానికి ప్రేరేపించింది." అని ఆనాటి విద్యా వ్యవస్థను కళ్ళకు కట్టినట్లుగా చూపారు (రమాపతిరావు. అక్కిరాజు. 1976: 50-57).

19వ శతాబ్ది ప్రారంభంలో క్రైస్తవ మిషనరీల ప్రవేశంతోను మత వ్యాప్తికి తోడుగా విద్యావ్యాప్తి కూడా ప్రారంభమైంది. 1822-వ సంవత్సరంలో అప్పటి మద్రాసు రాష్ట్ర గవర్నరైన లార్డ్ మన్రో విద్యాపై సర్వే జరిపాడు. ఆ సర్వేలో ప్రతి వేయి మందికి ఏడుగురు విద్యార్థులున్నట్లు వెల్లడయింది. ఈ లోటును తీర్చేందుకు ప్రతి జిల్లాలో రెండు ప్రధాన పాఠశాలలు, ప్రతి తాలూకాలోను ఒక చిన్న పాఠశాల నెలకొల్పబడ్డాయి. ఉపాధ్యాయులను తర్ఫీదు చేసేందుకు 'పౌర విద్యా సమితి' ఒకటి నెలకొల్పబడింది. ఈ విధమైన చర్యల వల్ల ఆంధ్ర దేశంలో సాంఘికంగా మార్పు రావడానికి అవకాశం కలిగింది. 19వ శతాబ్దం మధ్య కాలంలో కట్టబడిన కృష్ణా, గోదావరి, ఆనకట్టల వలన ఆర్థిక సాంస్కృతిక రంగాలలో ప్రధానమైన మార్పు వచ్చింది. 1830 ప్రాంతాల్లోనే ఆంగ్ల విద్యావసరమైన పాఠశాలలు ఏర్పడ్డాయి. వీని ప్రధాన ఉద్దేశం ప్రభుత్వ యంత్రాంగానికి అవసరమైన ఉద్యోగుల్ని ఈ దేశంలో తయారు చేయడమే. రెండవది పాశ్చాత్య విజ్ఞానాన్ని ఈ దేశంలో వ్యాప్తి చేయడం.

1857 నాటికి మద్రాసులో ఒక విశ్వ

విద్యాలయం, మద్రాసు రాష్ట్ర విద్యాశాఖ ఏర్పడ్డాయి. దీంతో విద్యావ్యాప్తి బాగా ఊపందుకుంది. 1870-78లో గంజాం, విశాఖ గోదావరి జిల్లాల్లో దాదాపు 17 వందల పాఠశాలలు తెరవబడ్డాయి. ఈ విధమైన పరిణామాల వల్ల ఆయా వర్గాలలో అనేక నూతన భావాలు పుట్టుకొచ్చాయి. విద్య ద్వారా, వ్యాపారం ద్వారా బాటువేసుకొన్న ఆధునిక భావాలు ఉన్నత వర్గాలను, ముఖ్యంగా మధ్య తరగతిని జాగృతం చేశాయి. ఇంత మార్పు జరిగినా నాడు విద్య సంఘంలోని కొన్ని వర్గాల వారికే పరిమితమైంది. ప్రాథమిక స్థాయిలో విద్య నేర్చుకొనే వారిలో అన్ని వర్గాల వారు, కులాల వారు కనిపించినా ఉన్నత విద్యా స్థాయిలో బ్రాహ్మణులదే అగ్ర స్థానం.(1)

2.7.2 **మూఢ నమ్మకాలు :** ఆంగ్ల ప్రభుత్వం ఈ దేశంలో తమ అధికారాన్ని విస్తరించుకొనే నాటికి మన దేశం మూఢ నమ్మకాలకే, అర్థంకాని ఆచారాలకి నిలయం. భూత ప్రేత పిశాచాలు మొదలైన క్షుద్ర శక్తులుండేవని నాటి ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఏదైన సమస్య

(1) 1876 నుండి 1886 వరకు గల పదేళ్లలో విశ్వ విద్యాలయ పరీక్షలు వ్రాసిన మొత్తం హిందూ విద్యార్థులలో డెబ్బై మూడు శాతం బ్రాహ్మణులే (రామకృష్ణ. వి. 1983 : 17).

ఎదురైనప్పుడు వారు మామూలు వైద్యులకు బదులుగా భూత వైద్యులను సంప్రదించేవారు. 'పరలోకంలో పుణ్యం పురుషార్థాలనే భ్రమలతో కన్న బిడ్డల్ని మొసళ్లకి వేయడం, కాళికాదేవిని తృప్తిపరచడం కోసమని నరబలులివ్వడం, భక్తి పారవశ్యాలతో భగవంతుని పేరిట ఆత్మహత్యల చేసుకోడం వంటి ఆచారాలు దక్షిణ హిందూ దేశంలో కంటే ఉత్తర హిందూ దేశంలో ఎక్కువగా ప్రబలి ఉండేవి.(1) చనిపోయిన భర్తతో కలిసి మరణిస్తే పైలోకాల్లో కూడా ఆ భర్తతో కలిసి ఉండొచ్చనే మూఢ నమ్మకం అధికంగా ఉండేది. అందుచేత ఆనాడు సతీసహగమనం అనే దురాచారం స్త్రీల పాలిట శాపంగా తయారైంది.

ఆనాడు సముద్ర ప్రయాణం చేయడాన్ని, సమాజం అంగీకరించేదు. దాని కోసం శాస్త్రాలు కూడా పుట్టుకొచ్చాయి. ఎవరైతే సముద్రాన్ని దాటుతారో వారికి కుల బహిష్కరణ ఉండేది. ఇంటి నుంచి ఏదైనా పని మీద బయలుదేరినప్పుడు శకునాల్ని పాటించడం,

---

(1) పూరీలోని జగన్నాథ స్వామి ఉత్సవాలప్పుడు ఆ దేవుడి రథ చక్రాల కింద పడి మరణిస్తే ముక్తి లభిస్తుందని అనేకమంది ప్రాణాలు తీసుకునేవారు (రాజగోపాల రావు. చెకుముఖి, 1901 : 14-15).

(2) ఆర్థిక పరమైన కారణాలే, స్త్రీ శిశు హత్యలకు కారణమని చెకుముఖి రాజగోపాల రావు తమ హిందూ సంఘ సంస్కార చరిత్రలో ప్రస్తావించారు.

గర్భిణీ స్త్రీల ప్రవర్తన చూస్తే అంగవికలురైన బిడ్డలు పుడతారని నమ్మడం, చచ్చిపోయిన వాళ్ళు దెయ్యాలు భూతాలు అవుతాయని అవి కొంత మందితో మాట్లాడతాయని నమ్మడం ఆనాటి సమాజంలో పరిపాటి. ఆరోజుల్లో ప్రతి ఇంటా ఏమూల చూసినా ఓ దెయ్యం ఏ వీధిలోనై చూసినా ఓ భూత వైద్యుడూ ఉండేవారు (వేంకట కృష్ణశాస్త్రి. దేవులపల్లి, (సంపా) 1948:12). దీనిని బట్టి ఆరోజుల్లో ఎంత మూఢ నమ్మకాలు ప్రబలి ఉండేవని అర్థం అవుతుంది.

7.3 <u>దేవదాసీ</u> <u>వ్యవస్థ</u>: తరతరాలుగా దేవాలయాల్లో సంగీతం, నాట్యం మొదలైన లలిత కళల్లో ఆరితేరిన స్త్రీలుండేవారు. వీరు దేవాలయ ఉత్సవ సమయాల్లో సంగీత నాట్యాది వినోద కార్యక్రమాలు నిర్వహించేవారు. కాలక్రమంగా సాంఘిక పరిణామాల వలన వీరి జీవితాలు దుర్భర దశకు చేరుకొన్నాయి. 19వ శతాబ్దికి వీరిలో కొంతమంది వేశ్యావృత్తికి అలవాటు పడ్డారు. వీరినే భోగం కులంగా వ్యవహరించారు.[1]

"(1) దేవదాసీలు దేవుడి సొత్తు. దేవాలయాల్లో భగవంతుని సన్నిధిలో వీరు నృత్య సంగీత ప్రదర్శనలు చేస్తూ భగవంతుని సేవకులవడమే వీరి ధర్మమని గ్రంథాలు బోధించేవారు. వేశ్యలు భగవంతుని కామ దాహం తీర్చుకోడానికి ఏర్పాటు చేసుకొన్న కులం. వీరికి పెళ్ళి చేసుకొంటే ప్రవేశం లేదు. యవ్వనంలో తెచ్చినంత సంపాదించుకొని వృద్ధాప్యానికి నిలువ ఉంచుకోవాలి. వీరి జీవిత విధానం పురుషుల్ని ఆకర్షించుకోడానికి ప్రత్యేకంగా మలచబడేది (రామానుజాచార్యులు. ధర్మవర్మ, 1901:56). అని ఆనాటి వేశ్యా కులం గురించి పలువురు పేర్కొన్నారు.

వీళ్ళకు సొంత వారసత్వపు నియమాలూ, సొంత ప్రచారాలూ, సొంత ప్రవర్తనా సూత్రాలు ఉండేవి. వాళ్ళు ఏమైనా ఒక గుడిలో దేవుణ్ని 'పెండ్లి' చేసుకొని వేశ్యా వృత్తిలో జీవిస్తూ శుభకార్యాలలోనూ, వేడుక సమయాలలోనూ ధనికుల యిండ్లలో నృత్య ప్రదర్శనలు ఇచ్చేవాళ్ళు" (రామకృష్ణ.వి. 1983:9). అందు వేశ్యను ఉంచుకోవడం, వేశ్యల నృత్య ప్రదర్శనలు చూడడం సమాజంలో ఉన్నత స్థాయికి సంకేతాలైనాయి.

ఈ విధమైన దురభిప్రాయంలో మగ వాడి భోగలాలసలకు స్వార్థపరత్వానికి కామతృష్ణకు సృష్టించబడిన వేశ్యావృత్తి స్త్రీల పట్ల శాపంగా తయారయింది. క్రమంగా సమాజంలో బహిష్కరణకు వ్యతి రేకత ప్రబలింది. వీరి సంఘం నిరసించ సాగింది. ఈ వృత్తిని మానండని వొత్తిడి వచ్చింది. అయితే వేశ్యావృత్తిని విడిచిపెట్టిన స్త్రీ భవిష్యత్తు ఏమి టనేది ప్రశ్నగా తయారయింది. ఈ సమస్యనే గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర ద్వారా సూచిస్తారు. ఆమె తన మనుగడను, సమాజాన్ని ప్రశ్నిస్తుంది. వీరిపట్ల క్రమంగా సానుభూతి కూడా చూపింది.

"పాపం! వేశ్యలు నేటి సామాజిక వ్యవస్థలో మన్నా రివి
నీతి అక్రమాలకు బలియైన వారు కాబట్టి వాళ్ళను

నేటయినా చూడక జాతి బాగుపడదని వాదించే వాడిని' (వెంకటప్పయ్య. దర్శి. 1953:176) అన్నారు దర్శి వెంకటప్పయ్య గారు.

వీరి ఆధ్వర్యంలోనే ప్రారంభమయ్యాయి వేశ్యాస్త్రీల వివాహాలు. వీరిని ఉద్ధరించాలని ఎంతో శ్రమించారు, శ్రీమతి యామిని పూర్ణతిలకమ్మ గారితో కలిసి ఎంతో కృషి చేశారు.

1.7.4 <u>భాషా సాహిత్యాలు:</u> తెలుగు భాషా సాహిత్యాలు దాదాపు 19వ శతాబ్ది మధ్య భాగం వరకు ప్రాచీన పండిత సంప్రదాయంలోనే ఉండేవి. ఫ్యూడలిజం అనబడే మధ్య యుగాల సామాజిక వ్యవస్థలో దానినొక భాగంగా పరిగణించాలి. విజయనగర సామ్రాజ్యానంతరం, చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాల ఏర్పడినందు వల్ల రాజకీయ అనిశ్చితి, అరాచకం వ్యాపించాయి (నీలకంఠం. ఎ. 1964 : 36-38). సమాజంలో తిరిగి అవ్యవస్థతే రాజ్యమేలింది. ఈ సామాజిక పరిస్థితులు అప్పటి సాహిత్యంలో ప్రతిబింబించాయి (ఆరుద్ర. 1966: 156) ప్రబంధ సంప్రదాయం కొనసాగింది. రచనల సంఖ్య మాత్రం పెరిగినా వాటిలో కవితాగుణం, సాహిత్య శిల్పం లోపించాయి. చిత్ర, బంధ కవిత్వ రూపాలలో కవులు సాహిత్య గారడీలు చేశారు (రామశాస్త్రి. ఇదుగు. 1924: 278-281).

ఇదిలా ఉండగా, ఆనాటికి తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ వచన రచనలు నాటక ప్రక్రియలు లేవు. 17వ శతాబ్దంలో సముఖం వెంకట కృష్ణప్ప నాయకుడు రచించిన 'జైమిని భారతం' వచన ప్రక్రియకు ఒక ఉదాహరణ. ఈ సందర్భంలోనే చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798-1884). కల్నల్ మెకంజీ (1754-1821) అనే ఆంగ్లేయ అధికారులిద్దరు తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన కృషి గుర్తింపదగింది. ముఖ్యంగా బ్రౌన్ 19వ శతాబ్ది ప్రథమార్థంలో అద్వైత పరబ్రహ్మ శాస్త్రి లాంటి పండితుల సహాయ సహకారాలతో రచనలు చేయించాడు. వీటిలోని శైలి పూర్వశైలికి భిన్నమైంది. నాటి వ్యవహారిక భాషకు దగ్గరగా ఉండేది. మెకంజీ మహాశయుడు కావలి బొర్రయ్య, కావలి రామస్వామి అనే ఇద్దరి సోదరుల సహాయంతో సేకరించి తయారుచేసిన కైఫీయతులలో ఈ వచన శైలి కనిపిస్తుంది. భాషాపరంగా ఇదొక మహత్తర కృషి. తరవాత కాలంలో చిన్నయసూరి వ్యాకరణానికి లక్ష్యప్రాయమైన గ్రాంథిక భాషలో పండితుల అధికంగా రచనలు చేసేవారు. 1850 నాటికి చెదురు మదురుగా ఒకటి రెండు వచన గ్రంథాలు మినహా, పండితుల రచనలన్నీ ఈ శైలిలోనే సాగాయి. ఈ సంప్రదాయానికి భిన్నంగా వ్యవహారిక శైలిలో వెలువడ్డ గ్రంథాల్లో చెప్పుకోదగ్గవి

ఏనుగుల వీరాస్వామి రాసిన 'కాశీయాత్ర చరిత్ర', రావిపాటి గురుమూర్తి శాస్త్రి 1819లో రాసిన విక్రమార్క కథలు, 1834లో రాసిన పంచతంత్ర కథలు మొదలైనవి. ఈ పుస్తకాలు పాఠ్యగ్రంథాలుగా ఉండేవి. ఆగాథోల్క్స్ 'వృత్తాంతిని', వర్తమాన తరంగిణి' మొదలైన పత్రికలలో భాషకూడా స్వభావానికి దగ్గరగా ఉండేది (రంగనాథాచార్యులు. కె.కె. 1984 : xlii) నాటి రచనలలో సామినేని ముద్దు నరసింహం నాయుడు 1862 రాసిన హితసూచని, పరమానంద గురువుల కథలు. (1861) ధరికమళ్ళ వేంకట కృష్ణారావు రాసిన అరేబియన్ నైట్స్ కథలు (1862) ఎర్రమిల్లి మల్లికార్జునుడు రాసిన చారుమతీశ్రేష కథలు (1881) వెరులవాడ సీతారామశాస్త్రి దక్కను పూర్వకథలు ముఖ్యమైనవి.

ఇలా 19వ శతాబ్దంలో ప్రవర్ధిల్లిన సాహిత్యానికి సమకాలీన సమాజం వస్తువు అయింది. సామాన్య వ్యక్తులపుడే నాయికా నాయకులు. ఈ శతాబ్దంలో కలిగిన భావ విప్లవం ఈ విధమైన సాహిత్య ప్రవర్తనానికి కారణమైంది. ఈ భావ విప్లవానికి పాశ్చాత్య పద్ధతులననుసరించి సాగిన విద్యా విధానం ప్రధానంగా దోహదం చేసింది. ఈ పాశ్చాత్య విద్యా విధానం వల్ల కలిగిన భావచైతన్యం జీవనంలో భాషా పరంగా మార్పులు వాంఛించింది. పూర్వ సాహిత్య రీతులపై తిరుగుబాటు కొత్త

బాటల తొక్కాలనే ప్రీతి. ఈ లక్షణాలను ఒంటపట్టించుకున్న వాళ్లందరూ ఆధునిక రచయితలయ్యారు. ఛందోబద్ధమైన రీతిలో ఉండే సాహిత్యం ప్రజలందరికీ అందుబాటులో లేదని ఆధునిక ప్రచారానికి ప్రతులకర్త మధ్యస్థమైన రచన అవసరమని ఆనాడు పలువురు గుర్తించారు.

ఈ విధమైన స్థితిగతులున్న సమాజంలో ఆధునిక చైతన్యం వ్యాపించడానికి కారణాలను పరిశీలిస్తే పాశ్చాత్య దేశాలలోనూ, మనదేశంలోనూ కలిగిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలను చెప్పుకోవలసి ఉంటుంది. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలను అధ్యయనం చేయడం ద్వారా అవి శ్రీపాదవారి కాలానికి సమాజంపై చూపిన ప్రభావం తేటతెల్లం అవుతుంది. అందుచేత ఇక్కడ యూరపు దేశాలలోనూ, దాని తరువాత భారతదేశంలోనూ ముఖ్యంగా ఆంధ్రదేశంలోనూ వచ్చిన సాంస్కృతిక వికాసాన్ని పరిశీలించాలి. ఈ నేపథ్యంలోనే సమాజంలో రూపు దిద్దుకుంటున్న ఆధునిక భావాలను అర్థం చేసుకోగలుగుతాము.

3

# సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు

## 3.1 ఐరోపా దేశాలలో

3.1.1 పునరుజ్జీవనం (Renaissance) : పదిహేను, పదహారు శతాబ్దాల్లో యూరోపియన్ సమాజంలో వచ్చిన ప్రగతి ఆధునిక నాగరికతకు పునాది వేసింది. ఈ ప్రగతినే చరిత్రకారులు పునరుజ్జీవనం అని పేర్కొన్నారు. ఈ పునరుజ్జీవనాన్ని ఆంగ్లము లో 'రినైజాన్స్' (Renaissance) అంటారు. అంటే నూతన ఆవిర్భావం అని చెప్పుకోవచ్చు. ఇది ఇటలీలో ప్రారంభమైంది. ప్రాచీన గ్రీసు దేశం నుంచి ఉత్తేజాన్ని పొంది వెల్లివిరిసిన ఈ చైతన్యం, ముందుగా ఐరోపా ఖండాన్ని తర్వాత ప్రపంచాన్నంతనూ ప్రభావితం చేసింది. ఈ నూతనోత్తేజానికి ఫ్లోరెన్స్ నగరం నాంది పలికింది.

ఇది ఒక రకంగా మధ్యయుగం నుంచి ఆధునిక యుగానికి జరిగిన పరివర్తన. ఇది యూరప్‌లో కొత్త ఉద్యమాలను, కొత్త సమస్యలను సృష్టించింది. ఈ చైతన్యం అన్ని రంగాల్లోనూ వెల్లివిరిసి యూరప్‌ను దీర్ఘనిద్ర నుండి మేల్కొలిపి పునరుజ్జీవనోద్యమానికి కారణం అయింది. దీనిలో అప్పటి వరకు ఉన్న స్తబ్దత పోయి పురోగమనం

ప్రారంభమైంది. వెల్లువలా పొంగుకొచ్చిన శాస్త్రీయ విజ్ఞానం అధికారాన్ని ప్రశ్నించడానికి, జ్ఞానాన్వేషణా దృష్టికీ, మత సంస్కరణకీ దారి తీసింది.

3.1.2 సాహిత్య కళా రంగాలు: 15, 16 శతాబ్దాల యూరప్ దేశాల లో ప్రాచీన ఏథెన్స్ తర్వాత ఎన్నడు లేనంత ఉత్సాహంగా కళలు, సాహిత్యం వికసించాయి. ఆనాటి మానవ ప్రతిభకు ఉదాహరణగా 'లియోనార్డో' సృష్టించిన 'మొనాలిసా' 'చివరి భోజనం' లాంటి వర్ణ చిత్రాలు ఉదాహరణగా పేర్కొనవచ్చు. సాహిత్య కార్యక్రమాల గురించి ఆనాటి మాట 'గ్రీసు పతనం కానేదు ఇటలీకి వలస పోయింది' అనే జవహర్‌లాల్ నెహ్రూ వాక్యం ఎంతో సమంజసంగా ఉంది. హోమర్, ప్లేటో లాంటి ప్రముఖుల రచనలు ఇటలీ మొదలైన భాషల్లోకి అనువదించడం, పెట్రార్క్ కవిత్వం, బొకాషియో వచనం, మాకియావెల్లీ రచించిన 'ప్రిన్స్' అనే గ్రంథం సాహిత్యంలో నే కాక రాజకీయంగానూ, మత పరంగానూ, వచ్చిన మార్పులకు నిదర్శనలుగా పేర్కొనవచ్చు (జవహర్‌లాల్ నెహ్రూ. 1934: 277-280).

ఈ పరిణామం యూరప్ భాషలన్నింటిలో సాక్షాత్కరించింది. ఇంగ్లాండ్‌లో 'ఛాసర్' ఇటలీలోని 'డాంటే' మొదలైన వారి ప్రతిభను గుర్తించటం జరిగింది. యూరప్ దేశాలన్నింటిలోనూ భాషా విషయకంగా ఎంతో మార్పు వచ్చింది. లాటిన్ భాషను వదలి ప్రాంతీయ భాషల్లో రచనలు ప్రారంభించారు. ఈ విధంగా ప్రారంభమైన పునరుజ్జీవనం వల్ల నూతన ప్రతిభా శక్తులు వికసించాయి. నూతన విజ్ఞానం వ్యాపించింది.

3.1.3 **నూతన భూమార్గాల అన్వేషణ** : ఈ సాంస్కృతిక పునరుజ్జీవనం కళా సాహిత్య రంగాల్లోనే కాక విజ్ఞాన పరిశోధనలో నూతన భూభాగాల అన్వేషణ మొదలైన వాటికి దారి తీసింది. 1453లో కాన్‌స్టాంటినోపుల్ నగరాన్ని తురుష్కులు స్వాధీన పరచుకోవడంతో తూర్పుకు పోయే రహదారులన్నీ మూతపడ్డాయి. ఫలితంగా నూతన భూమార్గ అన్వేషణ ప్రారంభమై భౌగోళిక పరిశోధనలకు దారి తీసింది. ఈ రంగంలో పోర్చుగల్, స్పెయిన్ మొదలైన దేశాలు ముందున్నాయి. తత్ఫలితంగా 1498లో వాస్కోడగామా భారత దేశంలోని కళ్ళికోటను చేరడం,

మాజిలాన్ ఫిలిప్పైన్ దీవులను కనుగొనడం, భారత దేశానికి నూతన మార్గాన్ని అన్వేషించాలనే ఉద్దేశ్యంతో క్రిస్టోఫర్ కొలంబస్ అమెరికా ఖండాన్ని కనిపెట్టడం ప్రధానమైన పరిశోధనలుగా పేర్కొనవచ్చు (రామలింగం. ఓ., 1980: 24). నూతన భూమార్గాలను కనిపెట్టిన ఫలితంగా భూస్వామ్య విధానం క్రమంగా వెనుకబడి ఆధునిక పెట్టుబడి దారీ వ్యవస్థ ఆవిర్భవించింది.

3.1.4 <u>మత సంస్కరణలు</u> : సముద్రయానం వల్ల కలిగిన రాక పోకల మూలంగా మానవుల భావాలు యందు విశాలమైనాయి. దీనికి తోడు మత సంస్కరణోద్యమం యూరప్‌లోని మత, రాజకీయ, సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసింది. చర్చి వ్యవస్థలో సంస్కరణలు ప్రారంభమైనాయి. మార్టిన్ లూథర్ చర్చి అధికారం మీద, పోప్ సర్వాధిపత్యం మీద, చర్చి ఆర్థిక వ్యవస్థ మీద, పాపపరిహారాలమ్మే ఆచారం మీద బలమైన దాడులు చేశాడు. ఈ విధంగా సాగిన మత సంస్కరణోద్యమం సాంస్కృతిక పునరుజ్జీ

మానవాళికి ఎంతో దోహదం చేసింది.

ఈ ఉద్యమాల్లో అత్యంత ప్రధానాంశం నూతన రాష్ట్రాల పుట్టుక. ఈ పునరుజ్జీవన ఫలితంగా కళా సాహిత్య శాస్త్ర రంగాల్లో మానవుడు ఎంతో ప్రగతిని సాధించాడు. అంతే గాక మానవుని సృజనాత్మకత, విమర్శనా దృష్టి వికసించింది కూడా ఈ యుగంలోనే. అంతే ఈ యుగమే వలస వాద సామ్రాజ్య శక్తుల స్వైర విహారానికి నాంది పలికింది కూడా.

2.1.5 <u>ఫ్రెంచి విప్లవం</u> : ఆధునిక ప్రపంచ చరిత్రలో ఫ్రెంచి విప్లవం ఒక గొప్ప సంఘటన. అది ఒక్క ఫ్రాన్స్‌కే కాదు యావత్ప్రపంచానికి స్వేచ్ఛా, సమానత్వం, సోదరత్వం అనే భావాల్ని అందించింది. భూస్వామ్య విధాన క్షీణతకూ ప్రజాస్వామ్య భావానికీ, సామాజిక సమానత్వ భావానికీ ఈ విప్లవమే మూలం. ఈ విప్లవం ప్రధానంగా రాజరికం మీద పోరాటం. ఏ విప్లవానికైనా ఆర్థిక, సాంఘిక పరిస్థితులు ప్రధాన మైన కారణాలు. ఫ్రాన్స్ దేశంలో రాజుల విలాసాలలో అసమర్థతలు, లంచగొండి తనంలో పరిపాలన కొనసాగిస్తుంటే,

మరో వైపు కటిక దారిద్ర్యంలో తినడానికి తిండిలేక సామాన్య ప్రజలు అలమటించేవారు. ఇటువంటి అసమానతలలో ఆనాటి సమాజంలో మానవత్వమే కనుమరుగైంది. రాజకీయ తత్వవేత్తలయిన వాల్టేర్, రూసో మొదలైన వారి రచనలు ప్రపంచాన్నంతటిని ఆలోచింపచేసినాయి. ఫ్రెంచి విప్లవం ప్రపంచ చరిత్రనే తారుమారు చేసింది.

పై విధంగా యూరప్ దేశాల్లో వచ్చిన పరిణామాలు ఆ దేశాలను అన్ని రంగాల్లోనూ బాగు చేసుకున్నాయి. ఫలితంగా రాజకీయ, ఆర్థిక రంగాల్లోనే కాక, సాంస్కృతిక కళారంగాల్లో కూడా ఆధునిక భావాలు పుట్టుకొచ్చాయి. ఈ విధంగా కలిగిన నూతన పరిణామం భారత దేశంపై ఎంతో ప్రభావాన్ని చూపింది. వివేకానందుని మాటల్లో చెప్పాలంటే 'ఆ పురోగమన ప్రవాహం సముద్రముఖమై ప్రవహింపజొచ్చెను. యూరపులోని చదివిన బాబులు ఆ వెల్లువ నీటిని కొత్త కాలువల త్రవ్వుకొని ఉత్సాహశక్తులతో తమ దేశంలోకి మరలించుకొని తమ జీవిత

రక్తమును అందులో పోసి దాని పరిణామమును, వేగమును అధికపరచింది. ఆ వెల్లువ నీటి ప్రవాహము కాల పరిపాకమున హిందూ దేశ తీరములనెగదట్టినది" (రామలింగం. డి, 1980: 20).

యూరప్ దేశాల్లో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం భారత దేశంపై ఎంతో ప్రభావాన్ని చూపింది. ఈ నూతన జాగృతి సాంస్కృతికంగా, రాజకీయంగా ప్రారంభమైంది. అది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావాలతో విలసిల్లే ఒక మూల్యయుగాన్ని సృష్టించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ భావజాలాన్ని ఉజ్వలంగా మలచుకోడానికి భారత దేశంలో కూడా బలమైన పునాదులు ఏర్పడ్డాయి. అదే భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనం.

-, భారత దేశంలో

* *

1.2.1 భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం : 19వ శతాబ్దం భారత దేశ చరిత్రలో ఎంతో ప్రధానమైన దశ. యూరప్ దేశాల్లో జరిగిన నవ్య సాహిత్య వికాసం, మత సంస్కరణోద్యమాల భారత దేశ పరిణామ క్రమంలో ఈ శతాబ్దంలోనే చోటుచేసుకున్నాయి. అంటే మధ్య యుగ ఆచారాలకు, మత విధానాలకూ వ్యతి

చెప్పి సంస్కరణయుగం ప్రారంభమైంది. ఈ యుగంలో భూస్వామ్య వర్గం, అప్పుడప్పుడే పుట్టుకొస్తున్న పెట్టుబడి దారీ వర్గం, ఒక దానితో మరొకటి పోటీపడి నిలదొక్కుకొంటున్న తరుణంలో సాంస్కృతిక పునరుజ్జీవన దశ ప్రారంభమైంది. యూరప్ దేశాలలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనానికీ భారత దేశంలో తలెత్తిన పునరుజ్జీవనానికీ ఎంతో పోలిక ఉంది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలు, బ్రిటీష్ ప్రభుత్వ పరిపాలనా విధానాలు రెండూ మతసంస్కరణకూ, సాంఘిక సంస్కరణోద్యమాలకూ దారి తీసాయి. ఈ సంస్కరణోద్యమాలను మత సంస్కరణోద్యమాలుగా, సంఘ సంస్కరణోద్యమాలుగా విభజించవచ్చు. రాజారామ్మోహనరాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, వీరేశలింగం మొదలైన ప్రముఖులు సమాజ సంస్కరణకు పూనుకొన్నారు. అట్లే స్వామి దయానంద సరస్వతి, రామ కృష్ణ పరమహంస మొదలైన వారు మత సంస్కరణోద్యమానికి దోహదం చేశారు.

1.2.2 <u>సామాజిక పరిణామాలు</u>: మధ్య యుగం నుంచి ఆధునిక ఆవిర్భావానికి దోహదం చేసిన సామాజిక పరిణామాలను దృష్టిలో

పెట్టుకొని చరిత్రకారులు ఈ కాలాన్ని సంధియుగంగా పేర్కొన్నారు. భారత దేశంలో మధ్యయుగం నాటి ఫ్యూడల్ వ్యవస్థకు, యూరప్‌లోని ఫ్యూడల్ వ్యవస్థకు సామ్యం ఉన్నప్పటికీ, యూరప్‌లో తలెత్తిన విప్లవాల మూలంగా ఉత్పత్తి సాధనాల్లోనూ, ఉత్పత్తి సంబంధాల్లోనూ 'త్వరిత గతిన వచ్చిన మార్పు భారత దేశంలో రాలేదు. ఆర్థికంగా భారత దేశంలో మానికలలో కొంతవరకు సిరి సంపదలు ఒకవైపు తులతూగుతుంటే, మరోవైపు పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం విలయతాండవం చేస్తున్న రోజులవి. జాగీరుదార్లు, జమీందార్లు, పాలెగాళ్ళు నిరంకుశాధికారాన్ని చలాయిస్తూ నిరుపేద బడుగుల్ని అశాంతి కలిగించారు. సమాజంలో కులవ్యవస్థ, మత మౌఢ్యం, ఆర్థిక అసమానతలు దేశాన్ని విచ్ఛిన్నం చేసిన ప్రధాన శక్తులుగా పనిచేశాయి. బాల్య వివాహాలు, సతీసహగమనం, వితంతువుల దైన్యం, మూఢాచారాలు భారత సమాజాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. కె.ఎమ్. పణిక్కర్ 'భారత దేశంలో విశాల భూభాగాల్లో 18వ శతాబ్ది ద్వితీయార్థంలో నాగరికతయే నిలిచిపోయినట్లనిపించిందని అభిప్రాయపడ్డాడు (రామలింగం. డి. 1980: 14).

ఆ క్షీణ దశకు కారణాలు స్పష్టంగానే కనిపిస్తూనే ఉన్నాయని, సాంకేతిక పురోగమనంలో భారత దేశం వెనుకబడి పోయిందని భావించాడు. భారత దేశంలో ఈ పురోగమనం రాకపోవడానికి కారణం విజ్ఞాన శాస్త్రం పట్ల గాఢానురక్తి, జీవితమంటే ఉత్సాహం, బాధ్యత, ధైర్య సాహసాలు లోపించడమే"నని నెహ్రూ భావించాడు. (రామలింగం. ఓ. 1980:14). ఒకప్పుడు విజ్ఞాన ఖని అని కీర్తింపబడిన భారత దేశంలో క్షీణ దశ అనేది అనూహ్యమైన విషయం. అందుకే భారత దేశానికి పునర్జాగృతి అవసరమైంది. జేమ్సు కౌజిన్స్ 'రినైజాన్స్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో భారతీయ సంస్కృతికి నిర్జీవత్వం, వినాశనం అనేవి లేవని పేర్కొన్నాడు. ఈ పతనానికి కారణం ఆధ్యాత్మిక ప్రేరణాలోపమని అరవిందుడు అభిప్రాయపడ్డాడు (రామలింగం. ఓ. 1980:15). ఏది ఏమైనప్పటికీ భారత దేశ పునరుజ్జీవనాన్ని గురించి రెండు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఒక వైపున ఈ దురాచారాలను నిర్మూలించాల్సిన పరిస్థితి ఏర్పడగా, మరోవైపు భారతీయులను ప్రజాస్వామ్యగాల లోకి తీసుకురావడానికి అనువుగా ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాల్సిన

ఆవశ్యకత బ్రిటిష్ ప్రభుత్వానికి ఏర్పడింది.

ఈ భిన్నాభిప్రాయాల్లో ఒక వర్గం ఆంగ్ల విద్యను బోధించడం వల్లనూ, సాంఘిక మత సంస్కరణలను ప్రవేశపెట్టడం వల్లనూ, సాంస్కృతికంగా మార్పు ఏర్పడవచ్చని భావించారు. రెండో వర్గం ఈ అభిప్రాయాన్ని ఖండిస్తూ ఆంగ్లేయ ఉదార వాదానికి, ప్రజాస్వామ్య భావాలకు, పౌరవిద్యా బాధ్యతా యుత ప్రభుత్వ విధానాలకు, ప్రభావితమై తమకు కూడా కార్య నిర్వాహణలోనూ సముచిత స్థానాన్ని కల్పించమని బ్రిటిషు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

3.2.3 <u>రాజా రామ్మోహన్ రాయ్</u> : ఈ భారతీయ పునరుజ్జీవనోద్యమానికి మూలపురుషుడు రాజా రామ్మోహన్ రాయ్. బ్రిటిష్ ప్రభుత్వం వారి ఉదార వాదం, వారి విజ్ఞాన శాస్త్ర సాంకేతిక విధానాల ఆయనకు ఆకట్టుకొన్నాయి. హిందూ మతంలోని దురాచారాలను చూసి సహించలేక సంస్కరణకు పూనుకొన్నారు. ఆయనే లేకపోతే ప్రత్యేకంగా ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వంటి మహనీయులకు అవకాశముండేది కాదు. నవయుగ వైతాళికుడిగా, విశ్వజనీన

మత సాధకుడిగా మానవతావాదానికి పట్టుగొమ్మగా నిలిచిన మహనీయుడు రాజారామ్మోహన్ రాయ్. భారతీయ పునరుజ్జీవన క్రమానికి ఆది వైతాళికుడాయన. మధ్య యుగాల దురవస్థ నుంచి భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి నడిపించిన వేగు చుక్క రామ్మోహన్ రాయ్. అంతేగాక ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టడంలో ఆనాటి గవర్నర్ జనరల్ బెంటింగ్ తో సంప్రదించి తన ఆశయాన్ని సాధించగలిగాడు. ఆంగ్ల విద్య మూలంగా భారతీయుల ప్రజ్ఞను పదును పెట్టడమే కాక సమాజంలో పేరుకొన్న మూఢ విశ్వాసాలను ఛేదించి వేశాడు. సతీసహగమనం, మొక్కుబళ్ళు, శిశు హత్యలు, నరబలులు, కర్మకాండలు మొదలైన మూఢ విశ్వాసాలను రూపుమాపి భారతీయ సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించాడు. ఏకేశ్వరోపాసనను ఆచరణలో పెట్టి బ్రహ్మ సమాజ స్థాపనకు మూలపురుషుడైనాడు (రామకృష్ణ. వి. 1983: 41).

24 మహాదేవ గోవింద రనడే: రామ్మోహనరాయ్ ప్రభావంతో మహా గోవింద రనడే, ఆర్.జి. బండార్కర్ వంటి సంఘ సంస్కర్తల ప్రార్థనా సమాజాన్ని స్థాపించారు. రనడే కృషిలో మతం, సంఘ

సంస్కరణా రెండూ ఒక్కటే. అస్పృశ్యత, వితంతువుల పట్ల వివక్ష, స్త్రీ పురుషుల మధ్య అసమానత్వంలాంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి ఎన్నో ప్రబోధనలు చేశాడు (రామలింగం. డి. 1980: 42-43). సమాజంలో పేరుకుపోయిన మూఢాచారాలను విడనాడమని బోధించాడు. వ్యభిచారం, క్షుద్రపూజ, నరబలి, సతీ సహగమనం, జగన్నాథుని రథచక్రాల క్రింద పడి మోక్ష సాధన కోసం పాకులాడడాన్ని విడనాడమని ప్రబోధించాడు.

3.2.5 <u>స్వామి దయానంద సరస్వతి</u>: గుజరాతీయుడైన స్వామి దయానంద సరస్వతి వేదమతాన్ని నవ్య మార్గంలో పునః ప్రతిష్ఠ చేయడానికి ఉద్యమ రూపంలో కృషి చేశాడు. వితంతు వివాహాలను, స్త్రీ విద్యను సమర్థించాడు. ఆర్య సమాజాన్ని స్థాపించి అది ప్రజానీకంలో ప్రగాఢంగా నిలిచిపోవడానికి కృషి చేశాడు. పురాణాలు, మంత్రాలు మొదలైన వాటిపై ధ్వజమెత్తారు. అస్పృశ్యులనే వారు లేరన్నాడు. 'భారతీయులు తమ సాంఘిక వ్యవస్థలో మార్పులు చెయ్యలేక పోతే ఒక జాతిగా అగ్రశ్రేణిలో నిలబడలేరని హెచ్చరించాడు' (రామలింగం. డి. 1980: 43).

3.2.6 <u>రామకృష్ణ పరమహంస, వివేకానందుడు</u> : బెంగాల్లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన రామకృష్ణ పరమహంస హిందూ మతోద్ధరణకు, జాతి పునరుద్ధరణకు పూనుకొన్న మహనీయుడు. విశ్వ మానవ సేవాభిలాష ఆయనలో మూర్తీభవించింది. ఆధ్యాత్మికం అయిన జీవితం గడపడంలోనే మత సారాంశం నిమిడి ఉందని ఆయన ప్రబోధించాడు. వివేకానందుడు స్థాపించిన రామకృష్ణ మిషన్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్నే గాక సంఘ సేవా కార్యక్రమాల్ని కూడా చేపట్టింది. ఈయన ప్రబోధనలవల్లనే హిందూ మతం తిరిగి తలెత్తుకొని సగర్వంగా నిల్వగలిగింది (రామలింగం. ఇ. 1950 : 45). ఈయన భారతీయుల్లో ఆత్మ విశ్వాసాన్ని, దేశ భక్తిని పెంపొందించి భారతీయ సమాజంలో ఆధునికతను ప్రవేశపెట్టిన సంస్కర్తలలో ఒకరు.

3.2.7 <u>అనీబిసెంట్</u> : ఉత్తర హిందూస్థానంలో ఈ రకమైన ఉద్యమాలు తలెత్తగా దక్షిణ భారతంలో అల్కాట్, బ్లావట్స్కీ అనీబిసెంట్ మూల స్తంభాలుగా దివ్యజ్ఞాన సమాజం స్థాపించబడింది. అనీబిసెంట్ నాయకత్వం యిందులోనే ఉంది. పూర్వ

జిన్నాలో లేదూ ఈ దానవే' అని ప్రకటించింది (తారాచంద్. 1973: 454). విశేషమైనదైన భారత దేశాన్ని తనదిగా భావించి రాజకీయ, మత చైతన్యం కోసం కృషి సల్పిన ఆంగ్లవనిత అనిబిసెంట్. తన స్వీయ చరిత్రలో "భారత దేశంలో జరగవలసిన పనులలో మొదటిది ప్రాచీన మతముల పునరుద్ధరణ, వాటిని తిరిగా శక్తివంతము చేసి అభ్యున్నతికి తేవడం. ఇందువల్ల ఒక కొత్త ఆత్మగౌరవం, గతాన్ని సగర్వంగా చెప్పుకోగల ఆత్మ విశ్వాసం, భవిష్యత్తుపై నమ్మకం ఏర్పడగలదు" (రామలింగం. డి. 1980: 48) అని ప్రకటించారు. ఈ ఆదర్శంలో సెంట్రల్ హిందూ హైస్కూలును ప్రారంభించి విద్యాభివృద్ధికి తోడ్పడింది. ఇలా వీరు స్థాపించిన ఈ సమాజం నూతన ఆదర్శాలను, ఉత్తేజాన్ని నవ చైతన్యాన్ని కలిగించింది.

3.2.8 **మహమ్మదీయుల - సంస్కరణ:** ఈ కాలంలోనే మహమ్మదీయుల్లో కూడా సంప్రదాయ పునరుద్ధరణ కార్యక్రమం ప్రారంభమైంది. దీన్ని 'వహాబి' ఉద్యమమని వ్యవహరిస్తారు. షా అబ్దుల్ అజీజ్, సయ్యద్ అహమద్, షేక్ కరామత్ అలీ మొదలైన వారు ఈ పునరుద్ధరణా కార్యక్రమంలో కృషి చేశారు (రామ్ గోపాల్ 1947: 22-7).

ఈ ఉద్యమాలన్నీ పాశ్చాత్య నాగరికత లోని లోపాల్ని బయటపెట్టి, భారతీయుల చారిత్రక వైభవాన్ని స్మరణకు తెచ్చి స్వదేశీ ఉద్యమాన్ని పరిపుష్టం చేశాయి.

1.2.9 <u>జాతీయోద్యమం:</u> పాశ్చాత్య విజ్ఞానం భారతీయులు జాతీయోద్యమం వైపు నడిపించడానికి కూడా దోహదం చేసింది. రామ్మోహన్ రాయ్, దాదాభాయ్ నౌరోజీ, సురేంద్ర నాథ్ బెనర్జీ, ఫిరోజ్ షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే మొదలైన వారు ఆంగ్ల విద్యా పారంగతులై భారత దేశ నూతన రాజకీయ జీవితానికి గట్టి పునాదులు వేశారు. వీరు ప్రచారం చేసిన ఉదారవాదం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, స్వపరిపాలనా వంటి భావాలు జాతీయోద్యమానికి పరిపుష్టిని చేకూర్చాయి. అంతేగాక పాశ్చాత్య నాగరికత వల్ల ఏర్పడ్డ దుష్పరిణామాలను నివారించడానికే బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం మొదలైన వివిధ సమాజాలు బయలుదేరాయి. వీటికి తోడు ప్రజల్లో రాజకీయ చైతన్యం వెల్లివిరియడానికి ఆనాటి పత్రికలు కూడా ప్రముఖ పాత్ర వహించాయి. వాటిలో 'జేమ్స్ హిక్కీ' స్థాపించిన 'బెంగాల్ గజెట్' అనే ఆంగ్ల పత్రిక, రాజా రామ్మోహన్ రాయ్ స్థాపించిన 'సంవాద కౌముది'

ప్రధానమైనవి. ఈ పత్రికలు వ్యక్తుల అభిప్రాయాలకు ప్రాధాన్యాన్నిచ్చి, ప్రాంతీయ సారస్వతాన్ని ప్రోత్సహించి, సాంఘిక సంస్కరణలకు బలాన్ని చేకూర్చాయి. అవి ఎప్పటికప్పుడు జాతీయ, అంతర్జాతీయ సంఘటనలను ప్రజలకు తెలియజేయడం వల్ల భారతీయులందరూ ఏకాభిప్రాయానికి రాగలిగారు. పర్యవసానంగా భారతీయులు సంపూర్ణ స్వరాజ్యమే తమ జన్మహక్కని చాటుకోగలిగారు.

భారత దేశంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాన్ని చెప్పవలసి వస్తే రాజా రామ్మోహన్ రాయ్ మొదలుకొని భారతదేశం స్వాతంత్ర్యం పొందే వరకు జరిగిన సాంఘిక చరిత్రను సంపూర్ణంగా గ్రహించవలసి ఉంటుంది. పైన ప్రస్తావించిన సంఘ సంస్కర్తలు, సంఘ సంస్కరణ ఉద్యమాలు, ఆంగ్ల విద్య భారతీయులను నవ్య మార్గం వైపు దృష్టిని సారించేటట్లుగా చేశాయి. పాశ్చాత్య దేశాల్లో వచ్చిన రాజకీయ పరిణామాలు, బ్రిటిష్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు భారతీయుల్లో స్వాతంత్ర్య పిపాస కలుగునట్లుగా చేశాయి. ఈ రెండు కారణాల ప్రాతిపదికగా సాంస్కృతిక, రాజకీయ ప్రయోజనాల లక్ష్యంతో జాతీయోద్యమం వచ్చింది. ఇంత వరకు చెప్పుకొన్న

భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాల్లోనూ, జాతీయోద్యమం లోనూ ఆంధ్ర దేశం కూడా పాలుపంచుకొంది.

## 3.3 ఆంధ్ర దేశంలో

**3.3.1 ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు** : 19వ శతాబ్దంలో ఆంగ్లేయులు పరిపాలిస్తున్న రోజుల్లో భారతదేశంలో భాగంగా ఆంధ్రదేశంలో కూడా సాంఘిక, మత రంగాలలో సంస్కరణ భావాలు వ్యాపించాయి. మరో వైపు జాతీయోద్యమం కూడా వ్యాపించింది. ఆంధ్ర దేశంలో వచ్చిన సంస్కరణలను రెండు ప్రధాన భాగాలుగా గుర్తించవచ్చు. మొదటిది సంఘ పరమైనది. రెండవది భాషా సాహిత్య రంగాలకు చెందినది. ఈ రెండూ పరస్పరం ప్రభావితం చేసుకొంటూ ఆధునిక చైతన్యాన్ని వ్యాపింప చేశాయి. సాంఘిక, సాంస్కృతిక రంగాలకు చెందిన ఎందరో ప్రముఖులు సంప్రదాయం పేరుతో అటు సంఘంలోనూ, ఇటు సాహిత్యం లోనూ కొనసాగుతూ ఉన్న అశాస్త్రీయమైన అంశాలను సంస్కరించడానికి పూనుకొన్నారు. సంఘంలో కరుడు గట్టిన అవిద్య, కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వితంతువుల సమస్య, వేశ్యా సమస్య, అస్పృశ్యతా సమస్య మొదలైన దురాచారాల్ని రూపుమాపడానికి కంక

కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడు, గురజాడ అప్పారావు మొదలైన వారు ఎందరో కృషి చేశారు. ఇలాగే భాషా సాహిత్య రంగాల్లో క్షీణ దశలో ఉన్న విలువలను సంస్కరించి వస్తువులలోను, రూపంలోను, అభ్యుదయ భావాలలోనూ, నవ్య ప్రక్రియల్లోనూ రచనా వ్యాసంగాన్ని ఆరంభించిన ప్రముఖుల్లో కందుకూరి, గురజాడ మొదలైన వారిని పేర్కొనాలి. భాషా రంగంలో ఆధునిక భావాలను వ్యాపింప చేసిన వాడు గిడుగు రామమూర్తి పంతులు.

ఈ విధంగా సాంఘిక, భాషా సాహిత్య రంగాల్లో ఆంధ్ర దేశంలో వ్యాపించిన క్రొత్త భావాలు సమాజంలో వచ్చిన ఆధునిక చైతన్యానికి ప్రతీకలుగా గ్రహించవచ్చు. ఈ ఆధునిక చైతన్య వ్యాప్తికి పాశ్చాత్య విద్యావిధానం, క్రైస్తవ మిషనరీలు, పత్రికల ముద్రణ మొదలైనవి దోహదం చేశాయి. వీటి ఫలితంగా తెలుగునాట వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని వీరేశలింగం పూర్వయుగమని, వీరేశలింగం యుగం అని రెండుగా విభజించవచ్చు.

1.3.2 <u>వీరేశలింగ పూర్వయుగం</u> : 19వ శతాబ్దంలో ఆంధ్ర దేశంలో

అనేక పట్టణాల్లో ఆంగ్ల విద్యను బోధించే పాఠశాలలు వెలిశాయి దీనితో ఎక్కువ మంది ఆంగ్ల విద్యాభ్యాసం వైపు మొగ్గు చూపారు. తద్వారా పాశ్చాత్య భావాలనూ, అప్పటికే భారత దేశమంతటా వ్యాపిస్తున్న సంస్కరణ భావాలనూ ఆంధ్రులు ఆకళింపు చేసుకొన్నారు. దీని వల్ల ఎక్కువ మంది మూఢ విశ్వాసాల పట్ల, అశాస్త్రీయమైన భావాల పట్ల విముఖతను వ్యక్త పరిచారు. తత్ఫలితంగా శాస్త్రీయమైన ఆలోచనా విధానం, ఆధునిక భావాలైన మానవతా వాదం, హేతువాదం పట్ల ఆసక్తి పెరిగింది. దీనికి తోడు క్రైస్తవ మిషనరీల పాఠశాలలు, ఆసుపత్రులను పెట్టడం ద్వారా చదువుకున్న వారిలో మానవతా దృష్టి, సేవా భావం మొదలైనవి అలవడ్డాయి. మతపరంగా వచ్చిన బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం మొదలైనవి హిందూ మతంలో సంస్కరణ భావాలకు తద్వారా సంఘ సంస్కరణకు దోహదం చేశాయి. కుల మత భేదాల పట్ల, అస్పృశ్యత పట్ల మొదలైన సంఘదురాచారాల పట్ల నిరసన భావంతో సమాజంలో నవ్య దృక్పథం ఏర్పడింది. అలాగుల్లో పత్రికలు కూడా వ్యక్తులకి వ్యష్టి సంఘాన్ని ఎంతో ప్రభావితాన్ని చేశాయి. మానవతా వాదం, హేతు వాదం వంటి ఆధునిక

భావ చైతన్యానికి, జ్ఞానోదయానికి ఎంతో ప్రచారాన్ని కలిగించాయి.

ఈ కాలంలో సంఘ సంస్కరణ దృష్టితో కృషి చేసిన ప్రముఖుల్లో మద్రాసు సదర్ సుప్రీం కోర్టులో దుబాసీగా ఉన్న ఏనుగుల వీరాస్వామయ్య[1] మొదట పేర్కొనదగినవారు. రాజమండ్రి జిల్లాలో మునసబు ఉద్యోగం చేసిన సామినేని ముద్దు నరసింహం నాయుడు[2] తన హితసూచని గ్రంథంలో మహిళలకు సమానత్వ ముండాలని ప్రబోధించారు. శాస్త్రీయమైన విద్యావశ్యకతను వెల్లడి, వేశ్యా వృత్తి, అంతరానితనం మొదలైన సాంఘిక దురాచారాలను దుయ్య

---

(1) ఏనుగుల వీరాస్వామయ్య (1780-1836) పాశ్చాత్య విజ్ఞాన సంస్కృతులను అలవరచుకున్న ఆనాటి తెలుగు వారిలో ప్రముఖుడు. వీరి కాశీయాత్ర చరిత్ర అనే గ్రంథం నాటి భారత దేశ సామాజిక స్థితి గతులను తెలుసుకోడానికి ఎంతో ఉపకరిస్తుంది.

(2) సామినేని ముద్దు నరసింహం నాయుడు పాశ్చాత్య సంస్కృతీ ప్రభావితుడైన తెలుగువారు. వీరు రచించిన 'హితసూచని' గ్రంథాన్ని వీరి కుమారుడు సామినేని రఘుప్రసాద నాయుడు 1862 అచ్చువేశారు. నాడు దేశంలో దురాచారాలుగా పరిగణించబడుతున్న వాటిని ఈ గ్రంథంలో ముద్దు నరసింహం నాయుడు విమర్శించారు. తొలి దశలో వ్యాసరచనకు వీరి హితసూచని నాటి ఆంధ్రదేశ స్థితిని విశదీకరిస్తుంది.

ఒగ్గాళ్ళు. నెల్లూరులో 'అనంత రామయ్య' హరిజనోద్ధరణకు కృషి చేశారు. విశాఖపట్నంలో శాస్త్రివర్యులు 'పరవస్తు రంగాచార్యులు' స్త్రీ పునర్వివాహం శాస్త్ర సమ్మతమేనని చెప్పారు. గాజుల లక్ష్మీనరసు శెట్టి ఆనాటి సాంఘిక, ఆర్థిక వ్యవస్థలో వేళ్ళను లెక్క పెట్టి బాకీల రద్దుకు కృషి చేశారు (కోటిరెడ్డి. ఎ.వి. 1986 : 87).

3.3.3 **కందుకూరి వీరేశలింగం (1848-1919):** ఆంధ్ర దేశంలో ఆధునిక యుగాన్ని ఆవిష్కరించిన మహా పురుషుడు కందుకూరి వీరేశలింగం. ఈయన ఉదయించేసరికి ఆంధ్ర దేశం భూస్వామ్య సంస్కృతికి ఆటపట్టుగా ఉండేది. ముఖ్యంగా స్త్రీనాటి సమాజంలో బానిసగా ఉండేది. పురుషుని నిరంకుశత్వానికి, మూర్ఖత్వానికి బలి పశువు. విద్యకు స్త్రీ అర్హురాలు కాదు. పడుపు వృత్తి సంఘానికి అవసరమైన ఏర్పాట్లలో ఒకటి. భోగం మేళాల ప్రోత్సాహం, శకునాలు మొదలైనవి ఆనాటి సాంఘిక దురాచారాలు వీటిని రూపుమాపేందుకు జీవితాంతం కృషి చేశారాయన. ఈ సంస్కరణ భావాలతో స్త్రీల అభ్యుదయానికి పాటుపడ్డారు. 1881లో ఆంధ్రదేశంలో మొదటి వితంతు పునర్వివాహాన్ని జరిపించారు. స్త్రీ విద్య కోసం బాలికా పాఠశాలల

పెట్టి, స్త్రీల కోసం 'సతీహిత బోధిని' అనే పత్రిక స్థాపించారు. తన సంస్కరణ భావాలకు ప్రచార సాధనాలుగా 'వివేక వర్ధిని', 'సహాస్య సంజీవని' అన్న పత్రికలు స్థాపించారు.

వీరేశలింగం గారు తమ సంస్కరణ భావాలకి ఉద్యమ రూప ప్రవేశాన్ని కలిగించారు. అందువల్లనే ఆయన ఆధునికాంధ్ర సంస్కర్తలందరికీ పితామహుడైనాడు. వివాహ వ్యవస్థలో ఆచారాల పేరుతో సాగే తంతును ఎద్దేవా చేస్తూ మొట్ట మొదటి సాంఘిక నాటకం 'బ్రహ్మ వివాహం' రచించాడు. స్త్రీల చైతన్యవంతులై సంఘ సంస్కరణకు పూనుకొంటేనే ఆ సంఘం బాగుపడుతుందనేది ఆయన ప్రగాఢ విశ్వాసం. సంఘాన్ని పీడించేది అన్ని అంశాలను ఆయన నిరసించాడు. వాటిని సమూలంగా నిర్మూలించడానికి మహా ప్రభంజనంలా వీరేశలింగం ఉద్యమాన్ని నడిపారు. స్త్రీల ఉద్ధరణకు 'వితంతు యువతీ రక్షణ శాల' వంటి సంస్థలెన్నింటినో నిర్వహించాడు. సంఘ సంస్కరణ రంగంలో ఎంత పరిశ్రమ చేశాడో, ఆధునిక భావాలతో సాహిత్యరంగంలోనూ అంతే పరిశ్రమ చేశాడు. జీవితమంతా ఆంధ్ర జాతి కోసం సాగిన మహోద్యమం.

3.3.4 <u>రఘుపతి వేంకటరత్నం నాయుడు</u> (1862-1939): ఈయన చదువుకునే రోజుల్లోనే బ్రహ్మ సమాజం పట్ల ఆకర్షితులైనారు. మచిలీపట్నంలో నోబుల్ కాలేజీలో పని చేసే రోజుల్లో విద్యార్థులకి బ్రహ్మ సమాజం గురించి, సంఘ సంస్కరణను గురించి ఉపన్యసించారు. తర్వాత పిఠాపురం మహారాజావారి ఆర్థిక సహాయంతో ఒక అనాథ శరణాలయాన్ని స్థాపించారు. 'బ్రహ్మ ప్రకాశిక' 'ఫెలో వర్కరు' పత్రికలు నడిపారు. వీరేశలింగం స్థాపించిన 'హిత కారిణి' సమాజానికి కొంత కాలం అధ్యక్షులుగా పనిచేశారు. వీరు చేపట్టిన సంస్కరణల్లో ముఖ్యమైనవి. వేశ్యా వృత్తి నిర్మూలన, మహిళోద్ధరణ, విధవా వివాహాలు, మద్యపాన నిషేధం మొదలైనవి.

3.5 <u>ఇతరులు</u>: అయ్యదేవర కాళేశ్వరరావు, వట్టూరి సూర్యనారాయణ, దేశిరాజు పెద బాపయ్య మొదలైన వారు సంఘ సంస్కరణ కోసం పాటుపడిన ప్రముఖులలో కొందరు. ఈ ఉద్యమం తీవ్ర స్థాయినందుకొనే సరికి ఆంగ్ల విద్యలో పరిచయమున్న చాలామంది దీని పట్ల సానుభూతి కలిగి ఉండేవారు.

6 <u>సంస్కరణోద్యమానికి కృషిచేసిన స్త్రీలు</u>: అనాథ సంఘం కోసం

కృషి చేసిన స్త్రీలు కూడా లేక పోలేదు. వీరేశలింగం గారి భార్య రాజలక్ష్మి భర్త చేపట్టిన సంస్కరణలకి ప్రోత్సాహమివ్వడమే గాక, అవసరమైనప్పుడు తాను కూడా నడుంకట్టి కార్యరంగంలో దూకిన వీర వనిత ఆమె. వితంతు వివాహాల సందర్భాల్లో అనేక సూచనలిస్తూ ప్రోత్సహించేది.

ఉన్నవ లక్ష్మీనారాయణగారి భార్య కూడా భర్తతో సమానంగా సంస్కరణ కార్యకలాపాలని సమర్థించేది. స్త్రీ విద్య కోసం పాటుపడేది. ఈమె గుంటూరులో 'శారదా నికేతనం' స్థాపించి మరణించేవరకూ స్త్రీల అభివృద్ధికి పాటుపడింది.

బండారు అచ్చమాంబ గారు 'అబలా సచ్చరిత్ర రత్నమాల" రచించారు. ఈమె సంస్కరణ భావాలు అలవర్చుకొని స్త్రీ విద్యకోసం ప్రచారం చేశారు. 1902లో 'బృందావన స్త్రీసమాజమనే' సమాజాన్ని స్థాపించారు. ఇది ఆంధ్రదేశంలో మొదటి స్త్రీ సమాజం. ఈవిడ స్త్రీ విద్య, స్త్రీ స్వాతంత్ర్యం మొదలైన అంశాలపై ఎన్నో ఉపన్యాసాలిచ్చారు.

సంస్కరణోద్యమం విజృంభించిన స్త్రీ

విద్యా ఉద్యమరూపంగా తలెత్తడంలో వెలుబుపల్లి రాజుబాయమ్మ, కొటికలపూడి సీతమ్మ, పులుగుర్తి లక్ష్మీనరసమాంబ, గుండు అచ్చమాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ వంటి అనేక మంది స్త్రీలు సంస్కరణోద్యమం కోసం నడుంకట్టి రచయితలుగా పేరు పొందారు.

3.7 <u>సాహిత్యం - సంస్కరణోద్యమం</u> : సంస్కరణ భావాలు కలిగిన కొందరు ప్రముఖ సాహిత్యవేత్తలయ్యారు. వారిలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, గురజాడ అప్పారావు, వంటి రచయితలనేక మంది సాహిత్యం ద్వారా సంఘ సంస్కరణ భావాల్ని ప్రచారం చేశారు. అయితే వీరు వీరేశలింగంగారిలా కార్యవాదులైన సంస్కర్తలు కారు. చిలకమర్తికి స్త్రీవిద్యపట్ల అభిమానం ఎక్కువ. వీరేశలింగం గారి సంస్కరణలన్నింటిని వీరు సమర్థించారు. హరిజనోద్ధరణ కోసం పాటుపడ్డారు. పానుగంటి వారు తమ సాక్షి వ్యాసాల ద్వారా సంఘంలోని దురాచారాల్ని దుయ్యబట్టారు. స్త్రీ సమస్యల పట్ల ఎంతో సానుభూతి చూపారు. గురజాడ స్త్రీ సమస్యల్ని స్వైన పంథాలో ఆలోచించి అర్థం చేసుకొని 'కన్యాశుల్కం', పూర్ణమ్మ కథ మొదలైన రచనల ద్వారా ప్రచారం చేశారు.

వీరే కాక నాటి సంఘసంస్కరణ కోసం పాటుపడ్డవారు అనేక మంది ఉన్నారు. వేంకట పార్వతీశ కవులు, రేలవరపు వేంకట శాస్త్రి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి మొదలైన వారు ముఖ్యులు. వీరందరూ ఆనాడు తమ రచనల్లో సంస్కరణ భావాల్ని ప్రచారం చేశారు.

3.3.8 <u>పత్రికలు – సంస్కరణోద్యమం</u>: రాయసం వెంకట శివుడు, కొండా వెంకటప్పయ్య పంతులు, ముట్నూరి కృష్ణారావు, దేశోద్ధారకుని నాగేశ్వరరావు సంగీతం బాపిరాజువంటి వారు పత్రికలు స్థాపించి సంస్కరణ భావ ప్రచారానికి దోహదం చేశారు.

దేశీయుల్లో నూతన విద్యా వ్యాప్తి మారిన ఆర్థిక పరిస్థితులు, పత్రికా ప్రచురణ, గ్రంథాలయాల స్థాపన, విద్యాలయాల స్థాపన మొదలైన అనేక అంశాల సమ్మిళనంతో తలెత్తిన భావ సంచలనం ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమంగా రూపొందింది. అదే ఆధునిక చైతన్యంగా వ్యాపించింది.

3.9 <u>సంస్కరణోద్యమ కేంద్రాలు</u>: సంస్కరణోద్యమాలకు ఆంధ్ర దేశం

క్రితం నుంచి ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఈ ఉద్యమాలు కొన్ని ప్రాంతాలలో వ్యాపించినంత వేగంగా ఇతర ప్రాంతాల్లో ప్రాముఖ్యం పొందలేదు. కోస్తా జిల్లాల్లో గోదావరి కృష్ణానదుల ఆనకట్టల వల్ల, అక్కడి ప్రజల ఆర్థిక స్థితిలో మార్పు కలిగింది. ఆంగ్ల విద్యా ప్రభావం ఇతర ప్రాంతాల కంటే ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. అందువల్ల ఇక్కడ సంస్కరణోద్యమం ప్రాముఖ్యం పొందింది. దీని ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం. సమాజంలోని ఆర్థిక స్థితిగతులు జనజీవన విధానాన్ని మార్చుతాయనడానికి ఇదొక ఉదాహరణ. మారిన ఆర్థిక స్థితిగతులు అక్కడి ప్రజల జీవితంలో ఏర్పడిన మార్పులు సాంఘికోద్యమాలు తలెత్తడానికి కారణమయ్యాయి. కేవలం ఆనకట్టల నిర్మాణంతోనే పరిస్థితంతా మారిందని చెప్పలేం. అంతకు ముందు నుంచి ఆయా ప్రాంతాల్లో కలుగుతున్న సాంస్కృతిక పరిణామాలకు ఆర్థిక స్థితి తోడై ఉద్యమ రూపం పొందింది.

గోదావరి తీరంలోని రాజమహేంద్రవరం సంస్కరణోద్యమానికి కేంద్ర స్థానం అయింది. గోదావరిపై ఆనకట్టల ప్రభావంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాజమండ్రి వివిధ

వ్యాపారానికి కేంద్రంగా మారింది. వీరేశలింగం వంటి సంస్కర్తలు కవులు నివసించడం వల్ల కూడా ఈ ప్రాంతం సంస్కరణోద్యమ కేంద్రం అయింది. తర్వాత నెలకొన్న ముద్రణా సౌకర్యాల అభివృద్ధి మూలంగా కూడా రాజమండ్రి అన్ని రంగాలకు కేంద్ర స్థానంగా నిలిచింది. కాకినాడ తీర ప్రాంతం కావడం వల్లనూ, రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి బ్రహ్మసమాజికులు, సంస్కర్తలకి నిలయం కావడంతో సంఘ సంస్కరణ భావాలు బలం పుంజుకున్నాయి. క్రైస్తవ మిషనరీల ప్రచారం వలన ఈ పట్టణం సంస్కరణోద్యమ కేంద్రంగా తయారయింది.

మచిలీపట్నం కూడా తీర ప్రాంతం కావడంవల్ల ఇతర దేశాల సంస్కృతుల ప్రభావం ఆ ప్రాంతంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. ఈ పట్టణం వివిధ సంస్కృతీ భావజాల సమ్మేళనంగా పరిణమించి సంస్కరణోద్యమ కేంద్రంగా తయారయింది. ఇక్కడ అనేక విద్యాలయాలు స్థాపించబడ్డాయి. వీటి కంటే ముందు క్రైస్తవ మిషనరీలు తమ ప్రచారాన్ని సాగించాయి.

ఇవి కాక ఏలూరు, గుంటూరు, తణుకు,

చేశారు, విజయనగరం మొదలైన ప్రాంతాలు కూడా సంస్కరణోద్యమ కార్యకలాపాలకి నిలయాలుగా ఉండేవి. వీటి పరిమిత వనరుల వల్ల ఇవి ప్రధాన కేంద్రాలు కాకపోయినా సంస్కరణోద్యమ చరిత్రలో వీటి పాత్ర గణనీయమైనది.

3.3.10 <u>భాషా సాహిత్యాలు</u> : ఆధునిక యుగంలో భాషా సాహిత్యాలపై సంస్కరణోద్యమ ప్రభావం 19వ శతాబ్దం మొదట్లోనే పడింది. భారతీయ సంస్కృతి సంప్రదాయాల్ని ఆకళింపు చేసుకొని వాటిపై ఆధిపత్యం సాధించేందుకు ఆంగ్ల ప్రభుత్వోద్యోగులు దేశ భాషలు నేర్చుకోవడం ప్రారంభించారు. 1813 నాటికే మద్రాసు సెయింట్ జార్జి కోటలోని కాలేజీలో ఉదయగిరి వెంకటనారాయణయ్య, పట్టాభి రామశాస్త్రి, రావిపాటి గురుమూర్తి శాస్త్రి వంటి తెలుగు పండితులు ఆంగ్లేయాధికారులకు తెలుగు భాషను నేర్పటానికి పూనుకున్నారు. అదే కాలంలో బైబులు, తెలుగు అనువాదాల ముద్రణ ప్రారంభమైంది(రమణారెడ్డి. కె.వి. 1969: 20-23). మతాంతరీకరణ ప్రధాన ఉద్దేశ్యంగా సాగిన మిషనరీల ప్రచారాలన్నీ దాదాపు సామాన్యులకు అర్థమయ్యే భాషలోనే ఉండేవి. ఆ కాలం నాటికి తెలుగు సాహిత్యం కొత్త

పోకడలను తొక్కడం ప్రారంభించింది. సి పి బ్రౌన్ తెలుగు లిపిని సాంతం సంస్కరించి ముద్రణా వ్యాప్తికి దోహదపడ్డారు. సాహిత్య ప్రసంగంలో క్రమంగా వ్యావహారిక శైలి ప్రవేశించింది. సి పి బ్రౌన్ తెలుగు సాహిత్యంలో వ్యావహారిక భాషను, జానపదుల పాటలను, పలుకుబడులను, గాథలను, సామెతలను ఎక్కువ అభిమానించాడు. తెలుగు సాహిత్యంలో శాస్త్రీయ దృష్టిని ప్రవేశపెట్టి, పునర్వికాస, నవ్య భావా ద్వైతాన్ని నాంది వాచకం పలికాడు.

తెలుగు సాహిత్యంలో ఆధునిక భావజాలాన్ని నిశ్చయంగా ప్రవేశపెట్టిన వీరేశలింగం పంతులుగారు భాషా శైలిలో కూడా మార్పును ఆహ్వానించారు. భాషా ప్రయోజనం భావాలు వెల్లడించడం. కాబట్టి ఆ భాష సరళంగానే గాక స్పష్టంగా కూడా ఉండాలని ఆయన అనుకొన్నారు. ఇవే భావాలను తన స్వీయ చరిత్రలో ఇలా చెప్పుకొన్నారు.

"భాష వలని ప్రయోజనమేమి? జనులు తమ అభిప్రాయముల నొండొరులకు తెలుపుకొనుట. భాషలోని గ్రంథముల వలని ప్రయోజనమేమి? తమ భావములను చూచుచున్న వారికిని,

రాబోవు తరముల వారికిని సులభంగా తెలుపుట ....... అట్లైనచో గ్రంథము లెట్లుండ వలయును? అందరికి తెలియునట్లు సులభంగా నుండవలెను. గ్రంథములను సాధారణంగా సలక్షణమైన సులభశైలిని రచియింపవలెననియే నాయభిప్రాయమైనను విషయానుగుణంగా తత్తమునిత రీతిని గ్రామ్య భాషయందు సైతము గ్రంథములను వ్రాయవచ్చునని కూడా నా అభిప్రాయము" (వీరేశలింగం. కందుకూరి. 1984: 124-125).

పై విధంగా భాషా ప్రయోజనాన్ని హేతుబద్ధంగా విశ్లేషించి, వీరేశలింగం పంతులు గారు సులభతరం చేశారు. ఇది తెలుగు భాషా సాహిత్యాల్లో ఒక ప్రబలమైన మార్పుకు, కొత్త శకానికి నాంది. సంఘ సంస్కరణ కోసం పంతులుగారు సాహిత్యాన్ని బలమైన ఆయుధంగా వాడుకున్నారు. దీని కోసం తెలుగులో కొత్త సాహిత్య ప్రక్రియలైన నవల, ప్రహసనం, నాటకం, వ్యాసం మొదలైన వాటిని ప్రవేశపెట్టారు. ఈ సాహిత్య ప్రక్రియలను పెంపొందించి వాటిని తెలుగు సాహిత్యంలో బలపడేటట్టు చేసి వాటికొక స్థిరమైన స్థానం కల్పించారు.

పంతులుగారు శ్రీకారం చుట్టిన ఈ కొత్త ప్రక్రియ 1880 తర్వాత అంటే 19వ శతాబ్దాంతానికి ఉద్యమంగా రూపొంది తెలుగు సాహిత్య ప్రపంచంలో ఒక కొత్త శకానికి నాంది పలికారు. ఈ మార్గంలోనే ఆ తర్వాతి కవులు, రచయితలు తమ రచనలను కొనసాగించి ఆంధ్రదేశపు సాహిత్య సామాజిక పునర్వికాసానికి కృషి చేశారు.

సాహిత్య, సాంస్కృతిక పునర్వికాస వ్యాప్తికి కృషి చేసిన వైతాళికుల్లో ఎన్నదగిన వారు చిలకమర్తి, గురజాడ, గిడుగులు వీరి ముగ్గురూ కందుకూరికి సమకాలికులు అయినా యువ కూడాను. ఈ సందర్భంలో గురజాడ ఆధునిక మానవతావాదం, గిడుగు వ్యావహారిక భాషోద్యమం ప్రత్యేకంగా పేర్కొనదగినవి.

ఆధునిక ఆంధ్రదేశ వైతాళికులైన వీరు చేసిన కృషి సాహిత్య, భాషాపరంగా తెలుగు సాహిత్యంలోనే గాక జన జీవనంలో కూడా ఆధునిక భావాల వ్యాప్తికి దోహదం చేసింది. వీరి వారసత్వమే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారిని ఆధునికునిగా మలిచింది.

ఆధునిక సాహిత్య ప్రక్రియైన

నాటకం, నవల, కథానికల మీద, వీరేశలింగం, గురజాడ, గిడుగుల ప్రభావం చాలా దీర్ఘకాలికమైంది. వీరేశలింగం రచనల ప్రభావం ఎంతో మంది ఆధునిక రచయితల మీద ఉంది. సంస్కరణ భావాలను, సాహిత్య భావాలను 'మాలపల్లి' నవల, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యలకు చలం నవలలు వీరేశలింగం సంస్కరణ భావాల నేపథ్యంగా వచ్చినవే. తర్వాతి కాలంలో వచ్చిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ఆ.వి కృష్ణారావు, పాలగుమ్మి పద్మరాజుల నవలలు కూడా సంఘ సంస్కరణ భావాలకు దగ్గరగా ఉన్నవే (నవీన్ వాసిరెడ్డి (వ్యాసం), 1988 : 66). చలం, ముద్దుకృష్ణ కరుణకుమార, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చేకుమళ్ళ కామేశ్వరరావు మొదలైన వారందరూ సంస్కరణను కేంద్రంగా చేసుకొని కథారచన సాగించినవారే. ఈ మార్గంలో కులమతాల సంస్కరణను కూడా కథారచన ప్రతిబింబించింది. గురజాడ 'పెద్ద మసీదు' కథా ప్రభావంతో శ్రీపాదవారు 'ఇలాంటి తవ్వాయి వస్తే' కరుణకుమార 'పిలయ్య', 'అంటుబొక్కెం' కథలు రచించారు. స్త్రీ చైతన్యం, ఆర్థ స్వేచ్ఛ మొదలైన అంశాల మీద శ్రీపాద, చేకుమళ్ళ మొదలగు వారు కథలు రచించారు. వీటన్నింటిని పరిశీలిస్తే 19వ శతాబ్దంలో ప్రారంభ

మైన ఆధునిక సాహిత్యంపై సంస్కరణోద్యమాల ప్రభావం స్పష్టంగా కనపడుతుంది. ఎంతో మంది రచయితలు వీరేశలింగం, గురజాడల నుంచి స్ఫూర్తిని పొందారు. అదే విధంగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు వీరేశలింగం నుండే ఎక్కువ స్ఫూర్తిని పొందారు. కేవలం సంస్కరణ భావాలనే కాక, వచన రచనా విధానాన్ని కూడా వీరేశ లింగం నుండి స్వీకరించారు. 'పంతులుగారి రచనలు కొన్ని చదువటంతో నాకు అలవడ్డ సంస్కార దృష్టి లోకులకున్నా కలిగించాలంటే అందుకు తగ్గది వచనమే' అని నిశ్చయించుకొని కథలు రాయడం ప్రారంభించారు (సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీపాద. 1958: 138). శ్రీపాద రచనల్లో ప్రాపంచిక దృక్పథం ఎలా ఉన్నా, వాటికున్న సాంఘిక నేపథ్యం పరిధులు ఎలా ఉన్నా మొత్తం మీద ఆ రచనలు వీరేశలింగం ఊపిరులూదిన ఆధునిక భావాల ప్రభావం ఆయన మరణం తర్వాత కూడా దాదాపు రెండు దశాబ్దాల ఎంత తీవ్రంగా ఉండేదో చూపేవి. ఈ నేపథ్యంలోనే మనం శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి కథలను, నవలలను అవి ప్రచారం చేసిన ఆధునిక చైతన్యాన్ని పరిశీలించి విశ్లేషించాలి.

ఇలా ప్రారంభించబడిన నవలలకు కథలకు రానురాను ప్రచారం ఎక్కువైంది. దేశంలో నెలకొన్న సత్యాగ్రహోద్యమ ప్రచారానికి నవలలు, కథలు సాధనాలయ్యాయి. నాటి రచయితలంతా సంఘ సంస్కరణ విషయాన్ని కొందరు ప్రత్యక్ష పూర్వకంగాను, మరికొందరు అసంకల్పితంగాను తమ రచనల్లో పొందుపరచారు. ఆ నేపథ్యంలో వచ్చినవే శ్రీపాద వారి కథలు, నవలలు.

ఈ సందర్భంలో సాంస్కృతికోద్యమాలు, సంఘ సంస్కరణోద్యమాల వంటివి శ్రీపాద వారిపై ఎటువంటి ప్రభావాన్ని చూపాయి?, దాని వలన శ్రీపాద వారి రచనలలో దర్శించబోయే ఆధునికతకు ఉన్న శాస్త్రీయ నిర్వచనమేమిటి? అనే వాటిని పరిశీలించవలసి ఉంటుంది.

4

# శ్రీ పాదవారిపై
# సంస్కరణోద్యమాల ప్రభావం
# ఆధునికత

## 4.1 ప్రభావం

4.1.0 **పరిచయం:** శ్రీపాదవారి ఆధునిక దృష్టి, సాహిత్యాభివృద్ధికి వారు చేసిన కృషి చాలా విలువైనవి. వారి భాషలోనూ, భావనలోనూ, అంతకు ముందు ఉన్న సంప్రదాయాల్ని తిరస్కరించిన కొత్త శాస్త్రీయ దృక్పథం కనిపిస్తుంది. వారు సంప్రదాయాలను ఎదిరించటం కేవలం నవ్యత కోసమో, ప్రదర్శన కోసమో కాదు. శరీరంలోని అవయవాలన్నిటిలోనూ సమాజానికీ, సాహిత్యానికీ నూతన వికాసం కలిగించాలనే తలంపు కలవారాయన. ఆయన వేషంలోనూ, భాషలోనూ ఆధునికంగా ఉండడమే కాకుండా, ఆలోచనల్లో వెనక్కి మళ్ళకుండా తెలుగు జీవితాన్ని, సాహిత్యాన్ని అభివృద్ధి పంథాలో పెట్టారు.

వీరికి. ఈ భావాలు అలవడుతున్న కాలంలో కందుకూరి వీరేశలింగం ప్రభావంలోనూ, బంకించంద్రుడి ప్రభావంలోనూ, బ్రహ్మసమాజ ప్రభావంలోనూ ఉత్తేజితులై ఆధునిక భావాల్ని వృద్ధిపరుచుకున్నారు. మొత్తం మీద ఆయన జీవితంలోను, ఆలోచనా విధానంలోను ఉన్న ఆధునికత తెలుగువారి జీవితాలకు నూతన గవాక్షాలు తెరిచి ముందుకు నడిపించింది.

ఇటువంటి ఆలోచనా విధానం

శ్రీపాదవారిలో కలగడానికి ప్రధానంగా సంస్కరణోద్యమాలే కారణాలు. అందువల్ల ఆధునికతను చర్చించబోయే ముందు వీరిపై ఆ ఉద్యమాలు ఏవిధమైన ప్రభావాన్ని చూపాయో పరిశీలించాల్సి ఉంది.

4.1.1 **ఉద్యమాల ప్రభావం**: ముందు అధ్యాయంలో చెప్పుకున్న సాంస్కృతికోద్యమాలన్నీ శ్రీపాదవారిపై ఎంత తీవ్రంగా ప్రభావాన్ని చూపాయో, ఆయన అంతగాను ప్రతిస్పందించారు. సంఘ సంస్కరణ కార్యక్రమాన్ని తన రచనల్లో, ముఖ్యంగా కథలలో, నవలల్లో ప్రతిఫలింపచేశారు. వీటన్నింటిని మించి ఈయన వీరేశలింగంగారి సంస్కరణోద్యమాన్ని మనసారా అభిమానించి రచనల రూపంలో విస్తృత ప్రచారం చేశారు. కథలన్నింటికి రాజమహేంద్రవర ప్రాంతం కేంద్రం. 'కథలలోని ముఖ్యపాత్రలు వీరేశలింగంగారి సంస్కరణ భావాలలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రభావితులైనవారే.' (బలరామమూర్తి, ఏటుకూరి, 1992, ముందుమాట). ఇలా శ్రీపాదవారు వీరేశలింగంగారి

ప్రభావానికి సంపూర్ణంగా లోనైనారు. అదే విధంగా సాహిత్య పరంగా గురజాడ అప్పారావుగారు అందించిన ఆధునిక కథా ప్రక్రియ ప్రభావం కూడా శ్రీపాదవారిపై ఉండి ఉంటుంది.

శ్రీపాదవారు పుట్టింది పాత కాలపు విలువలకూ, ఆచారాలకూ, అలవాట్లకూ, ఆలోచనలకూ కట్టుబడి పోయి మార్పుకు ఒప్పుకోని ఒక పల్లెటూరి వైదిక కుటుంబం. పెరిగింది వికాసానికి అన్ని విధాలా ప్రతి కూలమైన వాతావరణం. అయినా ఆయన జీవిత లక్ష్యం చెదరు లేనిది. అందువల్ల ప్రతికూల పరిస్థితులన్నీ, వ్యక్తిత్వ ప్రతిఘటించి జీవితంలో ఒక నూతన దృక్పథాన్ని అలవరచుకున్నారు. ఆ దృక్పథమే సంస్కరణ వైపు మొగ్గుచూపింది. ఆ మొగ్గే వీరిపై ఎంతో ప్రభావాన్ని చూపింది కూడా.

(ఆంధ్ర) దేశంలో సంస్కరణోద్యమాలు అనగానే ముందు గుర్తుకొచ్చేది వీరేశలింగం, గురజాడలు. ఏ ఉద్యమమైనా ముందుకెళ్ళడానికి ఆ ఉద్యమ భావజాలం సమాజంలో సాహిత్యం ద్వారా ప్రచారం పొందటమనేది

ఎంతో అవసరం. ఆ అవసరాలను గుర్తించి సంస్కరణో ద్యమ భావాలను ప్రజల మధ్యకు తీసుకొని వెళ్ళడానికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నాడు గురజాడ. బాల్యవివాహాన్ని వ్యతిరేకిస్తూ వితంతు వివాహాన్ని ప్రోత్సహిస్తూ సంస్కరణ భావాలలో నేరుగా కార్య రంగంలో ఉన్నవారు కందుకూరి. వీళ్ళిద్దరు ప్రచారం చేసిన నూతన భావాలు, తెలుగు సాహిత్యంలోకి వ్యాపించి ఒక నూతన మార్గాన్ని చూపారు. ఆ లక్ష్యాన్ని మరింత స్పష్టంగా దర్శించుకుంటూ ముందుకెళ్ళారు శ్రీపాదవారు.

7.1.2 **వీరేశలింగం ప్రభావం :** శ్రీపాదవారు జన్మించేనాటికి వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణోద్యమం ఉచ్ఛ స్థితిలో ఉంది. వీరేశలింగంగారి అవసాన దశలో, వారి రచనలు చదివి ప్రభావితులయ్యారు శ్రీపాదవారు. 'నూతన సమాజ అవతరణకు స్వాగతం పలికిన వీరేశలింగం పంతులుగారిని శాస్త్రిగారు గురుతుల్యులుగా తలిచేరు. అందువలన తమ కథలలోకి సరాసరి పాత్రలుగా ప్రవేశపెట్టారు.' [రామమోహన

రావు. మహీధర, 1989]. సంఘ సంస్కరణాశయాలను తమ రచనల ద్వారా ప్రచారం చేసి సమాజంలో గొప్ప పరివర్తన తేవాలనే సంకల్పంతో శ్రీపాదవారు కలం పట్టారు. అందుకే ఆయన ఇలా అంటారు.

"పంతులుగారి రచనలు కొన్ని చదవడంతో నాకు అలవడ్డ సంస్కార దృష్టి లోకులకున్నా కలిగించాలంటే అందుకు తగ్గది వచనమే" [సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీపాద. 1958 : 138) అని వచన రచన అవశ్యకతను గుర్తించారు. వీరేశలింగంగారి అనంతరం వారి భావాలను ప్రచారం చేయడానికి 'చిన్నకథను' సాధనంగా ఎన్నుకున్నారు. పంతులుగారు అందించిన స్ఫూర్తితో జీవితానికి కొత్త విలువలు కట్టి జాతిని కొత్త మార్గంలో నడిపించడానికి పూనుకున్నారు.

వీరేశలింగం పంతులుగారు జీవించి ఉన్నట్లుగా వారిని తాను కల్పించిన కథలో ఒక పాత్రగా చేసి, వారి పర్యవేక్షణలో వితంతు వివాహాలు జరిగినట్టు

చెప్తారు. అంటే సంస్కరణోద్యమ ప్రభావం, వీరేశలింగం ప్రభావం శ్రీపాదవారిపై ఎంతగా ప్రభావం చూపిందో తేటతెల్ల మవుతుంది.

"వీరేశలింగంగారి ఉపన్యాసాలు ఒకటి, రెండు నాకళ్ళబడ్డాయి. 'కులము' - 'వేశ్యాకాంతలు' అనే రెండు ఉపన్యాసాలు'

'నేను బాగా చదివాను'

"దీంట్లో శుద్ధ ప్రచ్ఛన్న బ్రహ్మసమాజ కుఱ్ఱో అయిపో సాగాన్నేను" అని ఆయన చెప్పుకున్నారు. (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1955 : 225). దీన్ని బట్టి వీరేశలింగంగారి సంఘ సంస్కరణోద్యమంలో పాటు, బ్రహ్మ సమాజం కూడా శ్రీపాదవారిని ప్రభావితం చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

"సంఘం సంస్కరించాలన్న చూపు వీరేశలింగంగారిది". అని వారిపై ఉన్న అభిమానాన్ని తన స్వీయ చరిత్రలో తెలియ జేశారు. (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద.

1958 : 387). పై భావాలన్నింటిని మనసారా అభిమానించి, వీరేశలింగం, రఘుపతి వేంకటరత్నం నాయుడు మొదలైన సంఘసంస్కర్తలు చేపట్టిన ప్రక్రియలను శ్రీపాదవారు తన రచనలలో పొందుపరచి విస్తృత ప్రచారం చేశారు. ఇలా వీరేశలింగంగారు అందించిన ప్రభావంలో 'రచన ప్రధానం నాకు" "సాహిత్యం ఆధారం దానికి" అన్న శ్రీపాదవారు-

"జనులకు, స్త్రీవిషయం విడమర్చి చెప్పడం - ఆత్మగౌరవం అలవర్చడం - సహనం, కలిగించడం - సరికొత్త భావాలు మప్పడం - కొత్త ప్రశ్నలు లేవనెత్తించడం - గతంలో వుండుకున్న సత్యం - ఆవిష్కరించడం - భవిష్యత్తుకి కొత్త దారులు కల్పించడం - తన్మూలంగా దేశీయుల కందరికీ స్త్రీయం నిర్ణయ శక్తి కలిగించటం - ఇదే నా పూనిక' అని నిరాఘాటంగా చెప్తున్నారు. పైగా - "జాతికి, పరిపాలకులకూ భంగం చేసే గమ్యం కనుపరచడం నా పోస్యం" అన్న శ్రీపాద వారిపై వీరేశలింగం భావాలు ఎంతటి ముద్ర వేశాయో తెలుస్తుంది (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద, 1966 : 170).

వీరేశలింగంగారి సంఘ సంస్కరణ కృషిపట్ల, వారి రచనల పట్ల ఆదర గౌరవాలు కల తొలి తరం కథకులలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు గొప్ప సంస్కరణ వాదిగా కనబడతారు. అంతేగాక వీరేశ లింగం గారిని తమ కథలలో పాత్రగా చేసి వారి స్వరూ పాన్ని, సహజ స్వభావాన్ని చిత్రించారు. వీరు ప్రచరించిన ఆధునిక దృష్టిని పూర్తిగా అందుకొని, వారి భావాలకు ఎంతో సన్నిహితంగా కనిపిస్తారు. అందుకే వీరేశలింగం గారి సంస్కరణ భావాలకు శ్రీపాదవారు ఎంత సన్నిహిత మయ్యారో డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డిగారు ఇలా చెబుతారు.

"1. ఆయనది సరళమైన గ్రామీణ మనస్తత్వం. 2. ఆయనవి మాండలిక జీవితానుభవాలు. 3. ఆయనకు జాతీయోద్యమంలోని భాషా రాజకీయాలలో కుల రాజకీయాలలో ప్రేమ ఉంది. 4. "వైదిక విద్యలన్నీ విడిచిపెట్టి కొత్త దారి తొక్కగలిగిన ఆత్మశక్తి. 5. ఆయనకు "వారి స్త్రీ స్వాతంత్ర్యం సంపూర్ణంగా పరిరక్షించుకుంటూ

వృందాలకే ప్రతి ఉంది. 6. (తెలుగు భాష) - ప్రయోగ విజ్ఞానమంతా స్త్రీల వల్లనే 'అలవడింద'నే భాషా పరిశీలక దృష్టి ఉంది. ఈ మూలాల వల్ల భావాల్ని విశ్లేషించడానికి సన్నిహితులయ్యారు. భాష విషయంలో గురజాడకు చేరువయ్యారు" అని 'శ్రీపాద సుబ్రహ్మణ్యం శాస్త్రి కథలు' మూడవ సంపుటానికి రాసిన ముందు మాటలో పేర్కొన్నారు. (విశ్వనాథరెడ్డి. కేతు. 1992: V).

కనుకనే శ్రీపాదవారు ఆ ఉద్యమం లోని పరిమిత లక్ష్యాలను అలవరచుకొని, సంస్కరణ వాస్తవికతను దాటి ముందుకు వెళ్ళలేక పోయారు. కానీ వీరు తన కథా సాహిత్య రచనల ద్వారా సాధించిన వాస్తవికత, 'తెలుగులో వాస్తవికతా వాదం బలపడడానికి ఎంతో దోహదం చేసింది' (విశ్వనాథరెడ్డి. కేతు. 1992: VI).

పై భావాలన్నింటిని కలబోసుకున్న శ్రీపాదవారు వీరేశలింగంగారి వారసులు అనడంలో సందేహం లేదు.

4.1.3 **బంకించంద్రుడి ప్రభావం:** ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణకు ప్రధానంగా, బెంగాల్ సాహిత్యంలోనూ, సమాజంలోనూ రూపు దిద్దుకొన్న నూతన చైతన్యం ప్రధాన పాత్ర వహించింది. దీని వలన ఆనాటి తరం రచయితలు ప్రభావితులయ్యారు. ఆ నూత్న చైతన్యాన్ని అందుకొని దేశంలో నాటికి నెలకొని ఉన్న సాహిత్య సామాజిక స్థితిగతుల్ని అభ్యుదయ పంథాలో నడిపించ ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో నడిచిన వారే శ్రీపాదవారు. స్వయంగా బెంగాల్ సాహిత్యంతో, బంకించంద్రుడితో పరిచయం లేకపోయినా వారి తెలుగు అనువాదాలు చదివి సంస్కార భావాలను అలవరచుకున్నట్లు తన స్వీయ చరిత్రలో ఇలా చెప్పుకున్నారు.

"ఇంగ్లీషు పరిజ్ఞానం వల్ల కలగవలసిన సంస్కారం బంకించంద్రుడి బెంగాలీ నవలలు తెలుగు అనువాదాలు చదివేయడం వల్లనే సంస్కార ఆశయం సిద్ధించింది" (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1958 : 385) అంతే గాక బంకించంద్రుడిది పూర్తిగా సాహిత్య దృష్టి' అని కూడా

పేర్కొంటారు. అంటే శ్రీపాద వారిపై బంకిం చంద్రుడి బెంగాలీ సాహిత్య ప్రభావం ఉన్నట్లు వెల్లడి అవుతుంది.

అందుకే శ్రీపాదవారు సంఘ సంస్కరణ కృషికి సాహిత్యాన్ని సాధనంగా చేసుకొన్నారు. తత్ఫలితంగా సమాజోద్ధరణకు తన రచనలలో కొన్ని నూతన మార్గాలు కనబరచారు. ఈ దృష్టితోనే తాను సృష్టించే కొత్త వాఙ్మయం ఇలా ఉంటుందని పేర్కొన్నారు.

"కొత్త సంగతులు తెలిపి, కొత్త రుచులు మప్పి, కొత్త దృష్టి అలవర్చి, కొత్త దారులు కనపరచి, కొత్త శక్తి సంఘటించి, కొత్త ఆవేశం పురికొలిపి, కొత్త ప్రయత్నంలో ప్రోత్సహించే కొత్త వాఙ్మయం" ను సృష్టించి సంఘ సంస్కరణ వైపు సమాజం పయనించేలా ఆయన సాహిత్య కృషి చేశారు. (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1955:242)

బంకించంద్రుడి తెలుగు అనువాదాల ప్రభావంతో సంస్కరణ భావాల్ని, నూతన సాహిత్య సృష్టిని అందుకొన్న 'శ్రీపాదవారు, వీరేశలింగం చేపట్టిన కథా రచనను

చేపట్టి, గురజాడ కంటే భిన్నమైన మార్గాన్ని కథా రచనలో అనుసరించారు.' (విశ్వనాథరెడ్డి. కేతు. 1992 : v) ఇలా సరసతర బోధ్యమ భావాలను అలవరచుకొన్న శ్రీపాదవారు సామాజిక సమస్యల పట్లా, ముఖ్యంగా స్త్రీ సమస్యలపట్లా తనలో కలిగిన గాఢమైన స్పందనను రచనలలో ప్రకటించారు.

4.1.4 **వీరేశలింగం పాత్ర:** వీరేశలింగంగారి రచనలు చదివి ప్రభావితమైన శ్రీపాదవారు వారి తర్వాత సంస్కరణ భావాలను తన రచనల ద్వారా ప్రచారం చేశారు. వితంతు పునర్వివాహం ఇతి వృత్తంగా ఉన్న కథలు కల్పించారు. వీరిని ఒక పాత్రగా చేసి 1930 వరకు అన్ని పెళ్ళిళ్ళు వారి చేతి మీదుగా జరిపిస్తారు. శ్రీపాదవారిని వీరేశలింగంగారు ఎంతగా ప్రభావితం చేశారంటే, వితంతు ప్రధాన పాత్ర అయిన ప్రతి కథలోనూ వీరేశలింగంగారు ఒకపాత్రగా చిత్రించడం చేశారు. ఆయన ప్రతి పాల్గొన్న వితంతు వివాహాలకే కాదు, వితంతు పెళ్ళికే సాహిత్యంలో స్థానం కల్పించారు. చాలా కథలలో వారి ప్రస్తావన వచ్చి తీరుతుంది. వీరేశలింగంగారు ఒక్క వితంతు

వివాహమైనా జరిపించాలనే పట్టుదలను 'రామలక్ష్మి' కథలో చిత్రించారు. 'మేనరికం తప్పు కాదు'- అనే కథలో రామారావు తన సంస్కరణ వివాహానికి వీరేశలింగం పంతులుగారిని 'చెన్నపట్నం' తీసుకు వెళ్ళారు. తన కూతురికి మేనరికం కాదని, వేరే సంబంధంలో పెళ్ళి చేసిన 'ప్రకాశ రాయుడు' చనిపోతూ "వీరేశలింగం పంతులుగారు నా స్నేహితులు. వారి ఉపదేశం అనుసరించు" (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1925 : 110) అని కొడుకుతో చెబుతాడు. తన వితంతు కుమార్తెకు మళ్ళీ పెళ్ళి జరుపుకుంటూ 'క్రిందికా? పైకా?' అనే కథలో వీరేశలింగం పంతులుగారే 'మాధవరావు'కు, 'కృష్ణవేణమ్మ'కు స్వయంగా సంస్కరణ వివాహం జరిపించినట్లు చూపారు. 'ముందు వెలాపాలము- పిదప అమృతము' అనే మరో కథలో ప్లీడరుగారి కూతురు (బాల వితంతువు) అక్క- ప్రోత్సాహంతో 'పంతులుగారి ఇంటి'కు పారిపోయి 'శర్మ'ను పెళ్ళి చేసుకుంటుంది. ఆ పెళ్ళికి వీరేశలింగంగారే పురోహితుడు.

'బుచ్చి వెంకటసుబ్బమ్మ' అనే మరో

కథలో వీరేశలింగంగారి చేత యీరుగా రెండు పునర్వివాహాలు జరుగుతాయి. 'భూపతిరెడ్డికి', 'బుచ్చి వెంకయ్యమ్మ'(బాల వితంతువు)కి, 'పీసపాటి వెంకటరామయ్య'కు, వీరేశలింగంగారి రక్షణలో ఉన్న వేశ్యా వితంతువైన 'అన్నపూర్ణ'కు పెళ్ళి జరిపిస్తారు. ఆ పెళ్ళికి పురోహితుడు రానందే వీరేశలింగంగారే పురోహితుడుగా ఉండి నడిపిస్తారు.

ఇక 'తులసి మొక్కలు' కథ శ్రీపాద వారి సంఘ సంస్కరణ కథలలో ఎంతో ప్రాముఖ్యం పొందింది. వేశ్యలలో కూడా శీల నైశిత్యం గల స్త్రీలు ఉంటారని నిరూపిస్తారు. ఇందులో వీరేశలింగంగారు 'ప్రకాశం' అనే బ్రాహ్మణ యువకుడికి, 'రంగనాయకి' అనే వేశ్యా యువతితో వివాహం జరిపిస్తారు. వీరేశలింగంగారు తమ జీవితకాలంలో ఒక్క వేశ్యకి వివాహం జరిపినట్లు మనకు కనబడదు. అయితే వీరేశలింగంగారు వేశ్యా వృత్తినే గాని, ఆ కులంలో వారిని ద్వేషించలేదని నిరూపించడానికే నేమో వారి చేత ఆ వివాహం జరిపిస్తారు. శ్రీపాదవారు 'వనవాసం వచ్చింది' కథలో

వీరేశలింగంగారు నేపథ్యంగా ఉంటారే తప్ప ప్రత్యక్ష పాత్ర వారు. సంఘ సంస్కరణ కథలన్నింటిలోనూ వీరి పాత్ర ఎంతో కొంత కనిపిస్తూనే ఉంటుంది. వీరేశలింగం కాలంలో జరిపించిన కొన్ని వివాహాలకు పోలీసు రక్షణ అవసరమైనట్లుగా 'పెళ్ళిపెడితే అల్లుడైనాడు' కథలో వితంతు వివాహానికి పోలీసు సహాయం అవసరమవుతుంది.

పైన చెప్పినట్లుగా శ్రీపాద వారు వీరేశలింగం గారి ప్రభావాన్ని కాకుండా, స్వయంగా వారిని కూడా పాత్రగా చేసి అనేక మంది వితంతువులకు పునర్వివాహం జరిపిస్తారు. నిజ జీవితంలో వితంతువులను వివాహమాడేందుకు శ్రీపాద వారు కొందరిని ప్రోత్సహించినట్లు కూడా తెలుస్తుంది.(1) అయితే శ్రీపాద వారిపై వీరేశలింగం

---

(1) 'వీర బసవరాయ చౌదరి' అనే శీర్షికలో రెడ్డి రాణి 1930 మార్చి సంచికలో వీర బసవరాయ చౌదరి వితంతు వివాహం చేసుకున్నాడని చెప్తూ ఉంటూ "ఈ సంకల్పం పండిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మొదలగు హిత బంధువుల వలన వృథ పడి నేడు కార్య రూపమున పరిణమించినది". అని ఉంది (రెడ్డి రాణి, 1939,).

సంస్కరణ భావాలు ఎంతో ప్రభావాన్ని చూపాయి. అనడం లో సందేహం లేదు.

4.1.5 **వితంతు పునర్వివాహం**: సంఘ సంస్కరణ రంగంలో వితంతు పునర్వివాహం గొప్ప సంస్కరణగా పరిగణించబడేది. శ్రీపాద వారు తమ రచనలలో బాల్య వివాహాల వల్ల జరుగుతున్న అనర్థాలను వివరిస్తూ వాటికి పరిష్కర్తగా పంతులు గారిని చూపిస్తారు. 'అరికాళ్ళ కింద మంటలు' లాంటి కథల్లో బాల వితంతువులు హీనంగా చూడబడుతుంటారు. రుక్మిణి ఇటువంటి స్థితిలో ఒక అర్ధరాత్రి వేళ ఇల్లు విడిచి పారిపోతుంది. ఇంతలో ఒక గుర్రపు బండివాడు "బండి కావాలా" అని అడిగి "పంతులుగారి తోటకా?" అని అంటాడు. అంటే ఆ పంతులు గారు వీరేశలింగంగారే. 'పంతులుగారి తోటకైతే నాకేమి ఇవ్వ నక్కర లేదు!' అని అంటూ చివరకు బండి వాడి సహాయంతో గమ్య స్థానం చేరుకుంటుంది. ఆరోజుల్లో మళ్ళీ పెళ్ళి చేసుకొనే వితంతువులకు 'పంతులుగారి తోటే ఆశాకిరణం' వితంతువుకు వివాహం చేయటం గురించిన దీక్షతో పంతులు గారు వధూవరుల

ఇష్టం గురించి పట్టించుకున్నట్లు కనబడదు. కాని, శాస్త్రి గారు ప్రేమ భావాన్ని వధూవరుల మధ్య ప్రధానంగా భావించడం చేతనే వితంతువులకు వివాహాలను కథలలోకి ప్రవేశ పెట్టారనిపిస్తుంది. ప్రేమించ గల వయస్సు వచ్చే వరకూ తెలుగు నాట కన్యలను అవివాహితులుగా ఉంచడమే లేదు. ఈ శతాబ్ది ప్రథమ పాదం నాటి పరిస్థితి అది. అందుచేత స్త్రీ పురుష సంబంధాలలో ప్రేమకు ప్రాధాన్యం ఇచ్చిన శ్రీపాద వారు, కలం ఆ సామాజిక పరిస్థితికి చేరాక విధంగానూ రియాక్టు అయ్యారు. (రామమోహనరావు. వహీ నర. 1989).

1.6 <u>స్త్రీ విద్య</u>: స్త్రీ విద్యను గూర్చి గురజాడ తర్వాత, ఎక్కువ సంఖ్యలో కథలు రాసి ప్రకటించిన వారు శ్రీపాద వారు. స్త్రీలు చదువులతో పాటు ఆత్మ స్థైర్యాన్ని అలవరచుకోవాలని, తమ కాళ్ళ మీద తాము నిలబడడానికి విద్య ఎంతో అవసరమని రచనల ద్వారా ప్రచారం చేశారు. విద్య లేకుంటే పురుషుడి చేతిలో బానిస కాక తప్పదని వీరు సూత్రప్రాయంగా ఎన్నో విషయాలు తెలియ జేశారు. నూతన సమాజం స్త్రీ పురుష సంబంధాలలోకి ప్రవేశ పెట్టిన 'ప్రేమ'

కు శాస్త్రిగారు ప్రత్యేక స్థానం ఇచ్చారు. (ప్రేమ పాశం మొదట నైతవి). (ఆ విషయంలో శాస్త్రిగారు వీరేశలింగం గారి కన్నా ఒక అడుగు ముందుకే వేశారు (రామమోహనరావు. మహీధర. 1989)

4.1.7 **వేశ్యా సమస్య :** వ్యభిచార వృత్తిని నిరసిస్తూనే శ్రీపాద వారు వేశ్యా కులం వర్ధిల్ల వలసిన అవశ్యకతను సహేతుకంగా నిరూపించారు. "సంగీత నాట్యాది కళలు వర్ధిల్లడానికే ఆ వ్యవస్థ ఏర్పడిందని", వ్యభిచారానికి అంత మాత్రము కాదనీ, వ్యభిచారం కోసం ఒక కులం ఏర్పాటు చెయ్యవలసిన అగత్యం లేద'ని అన్నారు (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1959) అంతేగాక సంసారం చేసే వాళ్లు వ్యభిచరిస్తున్నప్పుడు వేశ్యలు వ్యభిచరించడంలో తప్పు లేదని తీవ్రంగా ఖండిస్తారు. ఆ కులం వ్యభిచారం కోసమే పుట్టిందనే వీరేశ లింగంగారి అభిప్రాయంతో విభేదిస్తూ ఆకులం కళల కోసం పుట్టిందని వాదించారు.

4.1.8 **కులాల నిరసన :** ఇప్పటికే దేశాన్ని కుల మత భేదాల పీడిస్తూనే ఉన్నాయి. వీటి ప్రమాదాన్ని సుమారుగా ఎవరైనా ఫలి

నాడే గురజాడ గుర్తించారు. ఇదే భావాన్ని పుణికి పుచ్చుకున్న శ్రీపాదవారు కుల భేదాల్ని నిరసిస్తూ అనేక కథలు కల్పించారు. తులసి మొక్కలు కథలో పేశ్వకు వివాహమైన తర్వాత పంతులుగారి ఆహ్వానంపై అభ్యంతరం లేని వాళ్ళు సర్వవర్గ భోజనంలో పాల్గొంటారు. అది వీరేశలింగం గారి చేత ప్రబోధించడంలో శ్రీపాద వారిలో ఉన్న సంస్కార భావాలకు గొప్ప సంకేతంగా చెప్పవచ్చు.

4.1.9 **సంఘం: మతం:** "సంఘ సంస్కారమంటే మత ధర్మాలను తిరస్కరించడమే అని సంఘ సంస్కర్తల సిద్ధాంతం ఇప్పటికీ, మొదట్నుంచీ వారు చేస్తున్న పెద్ద పొరపాటిది. సంఘం వేరూ, మతం వేరూ, మనం మతా ధర్మాలకే కాదు, సంఘం కట్టుబాట్లకున్నూ చాలా దూరం పోయి వున్నాం. ప్రవృత్తి మార్గంలో సంఘం కట్టుబాట్లకే విలువున్నాం. అది బాగుపడితేనే జాతికి కొత్త శక్తి, కొత్త వృక్షమున్నూ ఏర్పడడం" (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1966: 165) అని సంఘ సంస్కరణలో మతాన్ని ముడి పెట్టడాన్ని వారు అంగీకరించ లేరు.

దీని విషయంలో ఒక్కో బాబు వీరేశలింగం గారిని తీవ్రంగా విమర్శిస్తారు కూడా.

"కందుకూరి వీరేశలింగం పంతులు చేయబూనినది సంఘ సంస్కరణము, చేసినది మత సంస్కరణము. మతమునకు, సంఘమునకు చాలా భేదమున్నదని పంతులు గారికే కాదు అతఁడేతని యడుగులలో నడుగులు వేసిన ఆ శిష్య సాగరునకు కూడ తట్టలేదు! వీరేశలింగం, గురజాడ కంటే కూడా నిశితంగా సమాజ పురోహితుల్ని పరిశీలించిన సంఘ సంస్కరణాభిలాషి శ్రీపాద వారు.

4.1.10 <u>సంఘ సంస్కరణ — దేశ స్వాతంత్ర్యం</u> : సంఘాన్ని సంస్కరించి, వ్యవస్థను మార్చాలన్న ప్రబలమైన ప్రవృత్తాన్ని మనుష్యులలో కలిగించాలన్నదే శ్రీపాద వారి తపన, ప్రబోధన. "దేశ స్వాతంత్ర్యం కంటే సంఘ సంస్కారం ముఖ్యం ----- సంఘం ఇంత కుళ్లి పోతూ ఉంటే స్వరాజ్యం ఎక్కడిదీ ఉంది అంటే" ఎవరు నమ్ముతాడు అని విమర్శిస్తారు.

వీరేశలింగం పంతులుగారి శిష్యే

శ్రీపాద వారు కూడ దేశ స్వాతంత్ర్యం సంపాదించడం కంటే సంఘ సంస్కారానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

మొత్తంగా చూస్తే శ్రీపాద వారిది ముందు చూపేకాని వెనక చూపు కాదు. సమాజం లోని అన్ని వర్గాల, అన్ని రంగాల వాళ్ళూ సంపూర్ణ శక్తి సామర్థ్యాన్ని వినియోగించుకొని ప్రగతి సాధించాలన్నదే ఆయన ఆశయం. ఇది స్పష్టంగా మల్లాది గారు 'శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు' మొదటి సంపుటం ముందు మాటలో పేర్కొన్నారు. ఈ ఆశయ సాధనకు శ్రీపాద వారు సాహిత్యాన్ని సృష్టించడమే కాక తమ జీవితాన్నే అంకితం చేశారు.

సంస్కరణోద్యమ పరిధి భౌతిక పరంగా చూసినప్పుడు చిన్నదిగా కనిపించినా, దాని ప్రభావం మాత్రం ఎనలేనిది. ఆ ప్రభావం సామాజిక పరంగా పరిశీలించినా, లేక సాహిత్య పరంగా, ముఖ్యంగా, కథల్నీ నవలల్నీ పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టమౌతుంది.

ఈ ఉద్యమాల ప్రభావంతో వచ్చిన సాహిత్యం వల్ల ఛాందస భావాలు గల సంప్రదాయ కుటుంబాల్లో చెప్పుకో దగ్గ మార్పు వచ్చింది. సమాజాన్ని అర్థం చేసుకోడానికి అవసరమైన నూతన భావాల అంకురార్పణ జరిగింది. ఉన్నత మానవతా భావాలు వెలుగులోకి వచ్చాయి. నూతన ఆలోచనలను ఎక్కువ ప్రతి ఘటనలో ఆహ్వానించే వాతావరణం నెలకొంది. ఈ మార్పు ఆ తర్వాత కాలంలో వచ్చిన నవలలు, కథల్ని పరిశీలిస్తే అర్థమౌ తుంది.

## 4.2 ఆధునికత

4.2.0 **పరిచయం :** యూరప్ దేశాలలో వచ్చిన పునర్వికాసం మన దేశంలో 19వ శతాబ్దిలో కలిగిన భావ దాస్య విముక్తి, సాంఘిక జీవనంలో ఆధునిక భావాల ప్రాముఖ్యం పొందడా నికి దోహదం చేశాయి. ఇవి సామాజిక సాంస్కృతిక జీవ నంలోనూ, ఆలోచనా విధానంలోనూ మార్పును తెచ్చాయి. అంటే, 'పాత భూస్వామ్య వ్యవస్థను నిరసించే క్రమంలో

కొత్త పెట్టుబడిదారీ ఆర్థిక విధానం దేశంలో ప్రవేశించింది. ఈ మార్పే ఆధునికతకు మూల కారణం. (రామకోటిశాస్త్రి. వేటవరపు (సంపా), 1986: 78)

ఇలా ఆధునిక జీవనం విస్తరించే క్రమంలో పాత విశ్వాసాలు పోయి కొత్త విశ్వాసాలు చోటు చేసుకున్నాయి. ఉన్న వ్యవస్థను మార్చాలనీ, వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాలనీ, పాత కాలపు కట్టుబాట్లు ఆటంకాలైతే ఎదిరించాలనే దృక్పథంతో ఆధునిక సామాజిక జీవనం కొనసాగింది.

ఇటువంటి క్రమంలో సామాజిక జీవితంలో వచ్చిన మార్పులు సాహిత్య రంగంలోను చోటు చేసుకున్నాయి. దీంతో ఎన్నో నూతన సాహిత్య ప్రక్రియలు వెలిశాయి. కథ, నవల, నాటకం మొదలైన ప్రక్రియలు నూతన సాంఘిక వ్యవస్థను ఆవిష్కరింప చేశాయి.

ఈ నేపథ్యంలోనే శ్రీపాద వారిలో కలిగిన ఆధునిక భావాల్ని వారి కథల్లో, నవలల్లో ఎలా

పొందు పరచాలి విశ్లేషించాలి. ఈ విశ్లేషణ చేసే ముందు ఆధునికత అంటే ఏమిటో కొంత స్థూలంగా చర్చించాల్సి ఉంది.

### 4.2.1 ఆధునికం - నైఘంటుకార్థం

ఆధునికం అంటే అధునాతన మైనది. ఇప్పటిది, క్రొత్తది, కొత్త పద్ధతికి చెందింది. నవనవమై, నూతన మైనది అని నిఘంటువులు తెలుపు తున్నాయి. (1) (రెడ్డి బి.ఎన్, తెలుగు నిఘంటువు 1973).

పురాతనమైనది కాకుండా ఇప్పటిది అయి, క్రొత్త పద్ధతికి చెంది నవీనం, నూతనం అయిన దానిని ఆధునికం అనవచ్చు. కొత్త పద్ధతికి చెంద డం, కొత్తది కావడం, ఆధునికంలోని ప్రథమోద్దేశం. కాని, సమకాలికం అయినదంతా ఆధునికం కాదు. (2)

---

(1)(i) అధునాతనము, ఇప్పటిది, క్రొత్తది. (లక్ష్మీ నారాయణ శాస్త్రి. వేదం, 1969).
(ii) ఇప్పటిది, అర్వాచీనము, నవీనము (శ్రీ సూర్యారాయాంధ్ర నిఘంటువు 1979)

(2) ఇప్పటిది, కొత్తది. (తెలక. వి.వి. 1979)

(ii) A modern, New, Novel, Recent ([illegible] సర్వస్వం. తెలుగు, ఇంగ్లీషు డిక్షనరీ 1979)

ఆధునికం అనే భావం సాపేక్షకం. అందు వల్ల ఆధునికం అనే పదాన్ని నిర్వచించే మాటలు నిరంతరం మారుతుంటాయి. వాటి లక్ష్యాలు కూడా మారుతుంటాయి. కాబట్టి ఆధునికతను నిర్వచించేందుకు సర్వ కాలిక సార్వత్రిక సూత్రాలేవి లేవు. అందుకే ఆధునికతకు స్పష్టమైన నిర్దిష్టమైన సమాధానం లేదు. అయితే ఆధునిక సామాజిక అవసరాల కోసం భావాన్ని మలుపుకోడాన్ని ఆధునికీకరణ అంటున్నాం. ఈ సందర్భంలో ఆధునికత గురించి మరి కొందరి అభిప్రాయాలను పరిశీలించడం సముచితం కాగలదు.

---

(2) 'నవ్యత' అనేది తిథి వార నక్షత్రాల కట్టింపు వ్యవహారమేమీ కాదు. అది ప్రధానంగా భావ వైఖరికి సంబంధించిన మాట. ఒకడు ఒక కొమ్ము కట్టి పోయినా అది నవ్యమని పించుకుంటేనే ఏముంది? 'Modernity is a question not of date but of out look' — Sir Richard Livingston (రమణా రెడ్డి కె.వి. మహోదయం. 1969 : 447)

4.2.2 ఆధునికత - నిర్వచనాలు :

1. 'ఆధునికత అంటే ఆధునికం కావడమే'[1]

2. ఆధునికత అనేది పాశ్చాత్యీకరణకు, పారిశ్రామికీకరణకు, పట్టణీకరణకు సమానమైనదని కానీ, పర్యాయమైనదని కానీ నిర్ధారణ కాలేదు. కాకపోతే ఈ పదం విశ్వ వ్యాప్తంగా రూపొందుతున్న వైయక్తికత, తర్క బద్ధత, లౌకిక తత్వం అనే వాటికి చెందుతుంది.[2]

---

(1). "The word modernization means nothing else than to make modern" (Alisjabahana, 1976:16).

(2) "......... for example it (modernization) has not yet conclusively shown weather the term modernization is equivalent to or synonymous with westernization, industrialization, or urbanization or weather this term includes more universal process of individualization, rationalization or secularization" (Srivastava, R.N & Kelkar, Ashok, 1984:41)

3. "గతంలో ప్రచారంలో ప్రయోగించిన దానిని ఇటీవలి కాలంలో తొలగించి, దాని స్థానంలో మరొక దానిని ఎంతో కొంత ఉంచడాన్ని ఆధునికత అనే పదానికి అర్థంగా చెప్పుకోవచ్చు." (3)

"ఈ యుగంలో 'ఆధునికత' నిర్దిష్టమైన అవగాహనతో కూడిన పారిభాషిక పదం' (సుబ్రహ్మణ్యం, 1991 : 618) కనుకనే సాహిత్యంలో ఆధునికతను గూర్చి కొంత మంది వివిధ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అవి

(1) 'సాహిత్యం : ఆధునికత' అనే వ్యాసంలో శ్రీ ఆర్.ఎస్. సుదర్శనం గారు " ఆధునికత అంటే సమకాలీన జీవితం మూలాల ఎదురవుతున్న సవాలు (Challenge) ని ఎదుర్కొనే ప్రతిక్రియ Response " అని

"ఆధునికత అంటే పునరుజ్జీవన ప్రతిక్రియ (Response of Rejuvenation) అనీ, అది జాతి సంస్కృతి భూమికల్ని పునర్దర్శించడమనే (Rediscovery of the cultural bases) అవగాహన అవుతుంది". ( అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు

---

(3) చూడు పీఠికలో

1-14)

2. డా॥ కోవెల సుప్రసన్నాచార్య గారు 'ఆధునికత ఒక వివేచన' అనే వ్యాసంలో

"ఆధునికత అంటే ఒక మూల్యంగా భావించడం ఉంది. నిజానికి కొన్ని కొత్త మూల్యాల పట్ల మనం జాగరూకత కలిగ ఉండటం ఆధునికతా లక్షణం కావచ్చును. కాని, అదే స్వయంగా ఒక విలువ కాదు. అది కదలికను, మార్పును సూచిస్తుంది. మూల్యాల గత శీలాన్ని, వాటి అవసరాన్ని గూర్చి ప్రశ్నించడాన్ని ఆధునికత నేర్పుతుంది" (సమ్మతయు చక్రము - 208 - 214)

డా॥ సి. నారాయణరెడ్డి గారు "నవ్యతని శబ్దార్థంలోనే వాడుతూ వర్తమాన కాలానికి సంబంధించినది" అని చెప్పారు. (నారాయణరెడ్డి. సి, 1967 : 147)

---

③ "Taken literally, the word (modern) refers to any thing which has more or less recently re-placed something which in the past was the accepted way of doing things" (Inkel, Alex, 1974).

4. డాక్టర్ వెల్చేరు నారాయణరావు గారు

“ఆధునికత, సమకాలికత సమానార్థకాలు కావు.... సమకాలికత అక్షరాలా కాల వాచకం.... నేను ఈ వ్యాసంలో ఆధునికతను తాత్త్వికార్థంలోనూ నవ్యత అని శబ్దార్థంలోనూ వాడుతున్నాను. ఆధునికత యుగ ధర్మం నవ్యత వ్యక్తి నిష్ఠం. ఆధునికలో నవ్యత అంతర్భాగం. ఆధునికత ఒక్కటే అందులో అనేక విధాల నవ్యతలుండవచ్చు” అని ప్రకటించారు (నారాయణ రావు. వెల్చేరు, 71-72)

ఈ పై విధంగా ఆధునికతను నిర్వచించే క్రమంలో ఆధునికతకు నిర్దిష్టమైన నిర్వచనాలేవి లేవని 'ఆధునికత అనేది ఒక దృక్పథం అని, ఇది కొన్ని విలువల సముదాయమని' ఆర్వీయార్ గారు తమ సాహిత్య తత్త్వం అనే గ్రంథం లో పేర్కొన్నారు (ఆర్వీయార్, 1988 : 21)

4.2.3 <u>ఆధునికత - సాహిత్యం</u> : ఆధునికతను సాహిత్యపరంగాను, సాంఘిక పరంగాను చూసినప్పుడు ఆ పదం 20వ శతాబ్దం పూర్వార్ధం నుంచి ప్రయోగంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఆంగ్ల

దేశంలో కందుకూరి వీరేశలింగం మొదలుకొని ఇప్పటి వరకు ఉన్న యుగాన్ని ఆధునిక యుగం అంటాము. అలాగే కొత్త దృక్పథంతో వచ్చిన సాహిత్యాన్ని ఆధునికమైందని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యానికి సంబంధించి ఇంత వరకు ఆధునికతకు చెప్పే నిర్వచనాలు రెండు విధాలు. "ఒకటి సమకాలీనతను ఆధునికంగా నిర్వచించటం. ఇది ప్రధానంగా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన నిర్వచనం. రెండవది దృక్పథ పరంగా అయిన ఆధునికత. మారిన ఆర్థిక సామాజిక, రాజకీయ పరిస్థితుల పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథాలను ప్రతిఫలిస్తూ, కొత్త స్వరూపాన్ని సంతరించుకోవడమే సాహిత్యంలో ఆధునికత." (రంగనాథాచార్యులు కె.కె, 1990 : 84) సాహిత్యాన్ని కాల పరంగా చూస్తే ఆధునికతకు ఏవిధమైన పరిధులు స్థిరతా విలువా ఉండదు. దృక్పథ పరంగా చూసినప్పుడు ఆధునికతలో మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పునాదుల నుండి ఏర్పడిన ఒక జీవన విధానమూ, ఆలోచనా పద్ధతి ఉంటుంది. దీన్ని మారిన పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటి

కప్పుడు అన్వయించుకుంటూ కొందరు సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోతుంటారు వారినే ఆధునికులని నిర్ధారించవచ్చు.

ఈ భావాలతో వచ్చిన సాహిత్యం గత సాహిత్యంలోని విలువల కంటే కొత్త విలువలను కలిగి ఉంటుంది. ఈ దృష్టితో చూసినప్పుడు ఆధునికత నిరంతరం పరిణామానికి గురవుతూ ఉంటుందని తెలుస్తుంది.

4.2.4 **ఆధునికత – మార్పు:** 19వ శతాబ్దం చివరి పాదం నుంచి వివిధ రంగాల్లో జరిగినటువంటి విప్లవాత్మకమైన మార్పుల సమాజాన్ని సాహిత్యాన్ని ఆధునికం చేశాయి. శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందింది. సాంకేతికాభివృద్ధితో పట్టణాలు నాగరికం అయ్యాయి. రాజకీయ భావజాలంలో వచ్చిన మార్పుల ఆర్థిక రంగాల్లో కలిగిన పరిణామాలు ఆధునికతకు ఒక చక్కని రూపాన్ని ఇవ్వడంలో ఎంతో దోహదం చేశాయి. అందుకే ఏది ఆధునికత? అనే ప్రశ్న తలెత్తినప్పుడు నిర్దిష్టమైన నిర్వచనం ఇవ్వలేకపోవడానికి గల కారణం నిరంతరం వచ్చే మార్పులు వాటి ప్రభావ ఫలితాలే.

"పూర్వ వ్యవస్థలో సంఘర్షించడంగా ఆధునిక వ్యవస్థ రూపొందుతుంది. జీవన విధానాలలో, మానవ సంబంధాలలో, ఆలోచనల్లో మార్పులొస్తాయి. నియతం, పరిమితం, స్థిరం తనకు తానే సర్వ సమగ్రమైన సమాజం సంప్రదాయ సమాజం. ఆ సమాజంలో పుట్టిన సాహిత్యం సంప్రదాయ సాహిత్యం". "అనియతం, విస్తృతం, పరివర్తనా శీలం వైవిధ్య పూరితం అయిన సమాజం ఆధునిక సమాజం. ఆ సమాజానికి అనుగుణంగా వచ్చే సాహిత్యమే ఆధునిక సాహిత్యం" (రంగనాథాచార్యులు, కె.కె. 1990 : 184) ఇలా సమాజంలో సాహిత్యంలో మార్పులు వాస్తవ జీవితంలో ఎదురయ్యే సమస్యలనూ, ప్రశ్నలనూ భిన్నమైన సమాధానాలు చెప్తూ అందుకు అనుగుణమైన రాజకీయ, సైద్ధాంతిక పరమైన భిన్న దృక్పథాలుగా ఏర్పడ్డాయి. దీని ఫలితంగానే సాహిత్యంలో కూడా అటు వస్తువులోనూ, భావరూప ప్రయోజనాల విషయంలోనూ ప్రధానమైన మార్పులు వచ్చాయి.

ఈ విధమైన మార్పుల ఆధునికంలో

భాగమైన ఒక నూతన మానవతా దృష్టిని ఏర్పరిచాయి. మతానికీ, కులానికీ, భాషకు సంబంధం లేనివవి. వ్యక్తి వ్యక్తిగాను, చూడబడాలనే మానవతా వెలుగులోకి వచ్చింది.

హేతువాదం, శాస్త్రీయ దృక్పథం ఆధునికతలో భాగంగా వచ్చిన సంచలనాత్మక భావాలు, వీటితో పాటు నూతన సమాజాన్ని నిర్మించే భావాలు వ్యాపించాయి.

ఈ విధమైన ధోరణులన్ని శ్రీపాద వారి సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. కనుక వారి రచనలలో ఆ భావాలు ఏ విధంగా ప్రతిఫలిస్తున్నాయో పరిశీలించి, వివరించి చూపడం తర్వాతి అధ్యాయాలలో కొనసాగుతుంది.

5

# శ్రీపాదవారి జీవితం

# రచనల పరిచయం

## 5.1 జీవితం

5.1.0 <u>పరిచయం</u> : పందొమ్మిదవ శతాబ్ది చివర జన్మించిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఇరవయ్యో శతాబ్ది పూర్వార్థంలో విస్తృతంగా రచనలు చేసి సమాజంలో ఆధునిక భావాల్ని వ్యాపింప జేసిన విశిష్ట రచయిత. వీరు జీవించిన కాలం తెలుగు నాట ప్రాచీన సంప్రదాయం సన్నగిల్లుతూ నవ్య సంప్రదాయం అంకురించి వర్ధిల్లుతున్న సమయం. ఆ విధంగా శ్రీపాద వారు రచనలు చేసిన కాలాన్ని రమారమి ఒక సంధి యుగంగా పేర్కొనవచ్చు. ఆనాడు సమాజంలో రూపొందుతున్న నూతన భావజాలమే ఆధునికతగా భావింపబడింది. అది సమాజంలో ఒక రకమైన సంఘర్షణ నుంచి ఉద్భవించింది. అటువంటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఈయన రచనలు చేస్తూ ఆధునిక భావ సంపదను సృష్టించారు. అటువంటి శ్రీపాద వారి రచనలను పరిచయం చేయడానికి ముందుగా వారి జీవితాన్ని గురించి సంగ్రహంగా తెలుసుకోవడం సముచితంగా ఉంటుంది.

5.1.1 <u>బాల్యం</u> : శ్రీపాద వారు తూర్పు గోదావరి

జిల్లా రామచంద్రపురం తాలూకా పొలమూరు గ్రామంలో శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో శ్రీపాద లక్ష్మీపతి సోమయాజులు, మహాలక్ష్మీ సోదెమ్మ గారల మూడవ సంతానంగా 23-4-1891 నాడు జన్మించారు.

ఈయన మూడవ తరగతి చదువుతుండగా వీరికి కులవిద్యలు బాగా అబ్బాలని తల్లిదండ్రులు బడి చదువు మాన్పించి వైదిక విద్యలో ప్రవేశపెట్టారు. వారికి మాత్రం ఇంగ్లీషు విద్యలు చదువుకోవాలనే వాంఛ ప్రగాఢంగా ఉండేది. తండ్రి వత్తిడి వల్ల వైదిక విద్యలను నేర్వవలసి వచ్చింది. స్మార్తం, జ్యోతిషం, శ్రౌతం మొదలైన సంప్రదాయ విద్యలలో పాటు సంస్కృత కావ్యాలను కూడా వీరు క్షుణ్ణంగా నేర్చుకున్నారు. కాని వీరి మనస్సులో మాత్రం ఎప్పుడూ వైదిక విద్యల పట్ల నిరసన, తెలుగు చదువుకోవాలనే కోరికా, రోజు రోజుకీ పెరుగుతూ వచ్చేది. దీనికి తోడు తండ్రీ, గురువులు తెలుగులో కవిత్వం చేయకూడదని, అది అప్రతిష్ఠాకరమని భావించేవారు. వారి దృష్టిలో సంస్కృతమే భాష,

వైదిక విద్యే విద్య. అందుచేత వారు శ్రీపాద వారిని వైదిక విద్యలతో పాటు సంస్కృతాన్ని మాత్రమే అభ్యసించమనీ తెలుగును వద్దనీ చెప్పేవారు. ఈయన వారి మాటను లక్ష్యపెట్టక వీలు దొరికినప్పుడు తెలుగు చదువుతుండేవారు. వారి వైదిక జీవన విధానమూ మాట తీరూ అన్నీ వీరికి నచ్చేవి కావు. తెలుగు చదవ కూడదు, అనే నిషేధం ఎక్కువ అయిన కొద్దీ వీరిలో తెలుగే చదువుకోవాల, తెలుగులోనే రచనలు చేయాలి అనే పట్టుదల పెరిగింది. ఇంగ్లీషు చదువు రాలేక పోయానే అని తరచు బాధపడే వారు.

పైదాని ఫలితంగా శ్రీపాద వారిలో నా తెలుగు భాషను నేను తెలుసుకోవాలి, తెలుగులో గజమెత్తు పుస్తకాలు రచించాలి! అనే భావం బలపడి వారిని కొత్త పంథాలో రచనలు చేసేటట్లు చేసింది.

15.1.2 **జీవన విధానం** : శ్రీపాద వారికి పన్నెండవ యేటనే వివాహం జరిగింది. ఒక పద్ధతి ప్రకారం వీరి విద్యాభ్యాసం సాగలేదు. బాల్య దశలో చదువుకున్నా, కొంత వరకు సంప్ర

దాయ వైదిక విద్యలు, సంస్కృత కావ్య పాఠాలు తప్ప వేరుగా ఏ విధమైన విద్యాభ్యాసాన్ని చేసిన వారు కాదు. ఏవిధమైన ఆదాయం వచ్చే వృత్తి లేకపోవడం చేత వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు లోనైంది. గుంటూరు ఘటనలు ప్రారంభించిన తొలి రోజుల్లో శ్రీపాదవారు 1920లో రాయవరంలో 'కౌశిక' ప్రెస్‌ను ప్రారంభించి ప్రబుద్ధాంధ్ర పేరులో ఒక పక్ష పత్రికను నెలకొల్పారు. దీనిని సంస్కృతాంధ్ర భాషలలో వెలువరించారు. ఈ పత్రికను దాదాపు పది సంవత్సరాల పాటు నడిపారు. తర్వాత కాలంలో దీనినే మాస పత్రికగా మళ్ళీ రాజమండ్రి నుంచి ప్రకటించారు. 1939 తర్వాత దీని ప్రకటన నిలిచి పోయింది. తర్వాత రాయవరంలో 'మల్లిడి సత్తిరెడ్డి'కి 'రెడ్డిరాణి' పత్రిక ప్రచురించడంలో సాయం చేశారు. ప్రబుద్ధాంధ్ర నిలిచిపోయినప్పుడు మరొకరి పేర 'అభ్యుదయ' మాస పత్రికను ప్రారంభించి రెండు నెలలు తానే నడిపారు.

1917లో ఆయుర్వేదౌషధాలు తయారు చేసి 'గంధర్వ ఫార్మసీ' అనే పేరుతో కొంత కాలం, మందుల

వ్యాపారం చేశారు. రాజమండ్రిలో ఉంటూ మందుల వ్యాపారం తో పాటు ప్రబుద్ధాంధ్ర పత్రికను నడిపిస్తూనే 'కళాభివర్ధినీ పరిషత్' అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి, కళా సాహిత్య రంగాలకు చెందిన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రబుద్ధాంధ్ర పత్రిక ద్వారా 'హిందీ వల్ల తెనుగుకి జరుగుతూవున్న అపకారం' అనే శీర్షికలో హిందీ ప్రచారకుల అతివాద ధోరణిని అడ్డుకుని తెలుగు నాట మాతృ భాషాభిమానం వృద్ధి చెందడానికి ఎంతో కృషి చేశారు. వీరు ఇంకా కొన్ని వైద్య గ్రంథాలను, నాటకాలను రచించారు. సంగీతాభ్యాసంతో పాటు, నాటకాలలో కూడా నటించారు.

5.1.3 <u>సాహిత్య జీవితం</u>: శ్రీపాద వారు తనకు సమకాలీనంగా ఉన్న బ్రాహ్మణ కుటుంబాలలోని అన్యాయాలను స్త్రీలు పడే కష్టాలను చూసి తట్టుకోలేకపోయారు. కులాల మధ్య హెచ్చు తగ్గులు, హరిజనుల పట్ల అంటరానితనం, అనే వివక్షను కూడా మానవతా దృక్పథంతో చలించిపోయారు. దీనికి తోడు వీరు మొట్టమొదట సారిగా వీరేశలింగం గారి రచనలు చదవడం

పరిగింది. పర్యవసానంగా వైదిక సంప్రదాయాలను, వైదిక విద్యలను కాదని తెలుగులో వచన రచనలు చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని నిర్ణయించుకున్నారు. అందు చేతనే వీరు తాని న్యాళ్లు చేసిన అవధానాలను, పద్య కవిత్వాన్ని తనకు తాను నిషేధించుకొని తానను కున్న భావాల ప్రజా సామాన్యుల్లోకి వెళ్లడానికి కథలు, నవలలు సరియైన వాహికలని వాటని రచించడం మొదలు పెట్టారు.

ఈయన బాల్య దశలో ఒక దెబ్బై ఏళ్ళ స్త్రీ ఈయన చేత 'మదన కామరాజు కథలు' అనే పుస్తకాన్ని చదివించుకొంది. దాని వలన శ్రీపాద వారికి కథల మీద, కథారచన మీద మక్కువ కలిగినట్లుగా ఆయనే స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. కథలను చెప్పడమూ, వినడమూ తప్ప రాసిన పుస్తకాలుంటాయన్న సంగతి వాలికి అప్పటికి తెలియదు. తర వాత శ్రీపాద వారు 'అరేబియన్ నైట్స్ కథలూ', బాక్ దర్వేష్ కథలూ, శుక సప్తతి కథలూ, రేచుక్క పగటిచుక్క లాంటి కథలు చదివేవాడట. ఈ విధంగా వీరి బాల్యంలో కథాసాహి

త్యానికి సంబంధించిన గ్రంథాలు చదవడం చేత వీరిలో కథా నిర్మాణం పట్ల ఆసక్తి పెరిగింది. వీరిలో సహజంగా ఉన్న స్వతంత్రమైన భావాలను నవ్య ప్రక్రియ అయిన కథ ద్వారా పాఠకులకు అందియ్యాలని ఈయన పట్టుదల పట్టి ఉంటారు. ఈ ప్రేరణతో వీరు ఎక్కువగా కథలనే రచించారు.

ఈయన రచించిన తొలి కథ 'ఇరువురము ఒక్క బాటకే పోదము' ఇది 1915 నవంబరు 17వ తేది ఆంధ్ర వార పత్రికలో ప్రచురమయింది. శ్రీపాదవారు ఈ కథను పత్రికా రచయిత 'కోటం రాజు పున్నయ్య' గారి కోరికపై ఒక గంట వ్యవధిలో రాసి ఇచ్చారట (కనకయ్య. చామర్తి. 1986:24). సరళ గ్రాంథికంలో సాగిన ఈ మెట్టు మెరుకు కథ తూర్పు గోదావరి జిల్లా రాయవరం గ్రామ వాతావరణం నేపథ్యంగా ఆ శ్రౌతపు రెడ్ల కుటుంబంలోని యువతీ యువకుల ప్రణయ జీవితాన్ని చిత్రిస్తుంది.

శ్రీపాదవారు రచనలు చేపట్టడానికి

ఆయనపై వీరేశలింగం గారి ప్రభావమూ, ఆయన స్వతంత్ర వ్యక్తిత్వంతో పాటు, సమకాలీన సాహిత్య వాతావరణమూ కూడా ప్రభావాన్ని చూపి ఉంటుంది.

గురజాడ, చలం, చింతా దీక్షితులు, వెంకట పార్వతీశ కవులు మొదలైన వారి రచనలతో ఆనాటి సాహిత్య వాతావరణంలో ఒక కొత్తదనం వ్యాపించి ఉంది. ఇది కూడా శ్రీపాద వారి చేత కొత్త సామాజిక విలువలను ప్రతిపాదింప చేస్తూ కథలూ, నవలలూ వంటి ఆధునిక రచనలు చేపట్టడానికి దోహదం పడి ఉంటుంది.

5.1.4 సభలు, సత్కారాలు : స్వతంత్ర భావాలతో ఆధునిక రచనా ప్రక్రియలను చేపట్టిన శ్రీపాదవారు రాజమండ్రిలో కళాభివర్ధినీ పరిషత్ పేరుమీద నన్నయ, శ్రీనాథుడు మొదలైన కవుల జయంతులను, పండిత సన్మానాలు, సభలు నిర్వహించేవారు. 1951 లో రాజమండ్రిలో వీరికి షష్టి పూర్తి సన్మానం జరిగింది. 1956 లో విశాఖపట్టణంలో వీరికి కనకాభిషేక గౌరవం కలిగింది. ఈ విధంగా రచనలలో, జీవితంలో

కూడా విప్లవ భావాలు ప్రదర్శించిన శ్రీపాదవారు తన డెబ్బైయవ యేట 1961లో దివంగతులయ్యారు.

1.5 <u>సాహితీ మిత్రులు</u> : శ్రీపాదవారికి ఎంతో మంది సాహితీ మిత్రులతో పరిచయం ఉండేది. ఆరోజుల్లో రాజమండ్రిలో ఆంధ్ర సాహిత్యరంగంలోని గొప్ప గొప్ప వ్యక్తులతో మంచి సాహిత్య సభలు జరుగుతూ ఉండేవి. అందరూ ఆంధ్ర సాహిత్య వికాసం కోసం పాటుపడేవారు. శ్రీపాదవారు మద్రాసులో ఉన్నప్పుడు (శ్రీశ్రీ), ఓలేటి సూర్యనారాయణ శాస్త్రి, కరూ లక్ష్మీ నరసింహం, పీసుపాటి సత్యనారాయణ, పిఠాపురం మల్లయ్య శాస్త్రి, కాశీనాథుని నాగేశ్వరరావు, కామరాజు లక్ష్మణరావు, పాలపర్తి రామమూర్తి, అయ్యంకి వేంకట రమణయ్య, భానుమూర్తి పంతులు గారు మొదలైన సాహితీవేత్తలతో ఎన్నో పరిచయాలు పెంచుకొని సాహిత్య కృషి చేసారు. రాజమండ్రి ప్రాంతంలో కూడా అనేక మంది సాహితీ మిత్రులతో ఎంతో సన్నిహిత సంబంధాలుండేవి. వారిలో భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీమధునా పంతుల సత్యనారాయణ, పురిపండా

అప్పల స్వామి, మహీధర రామమోహనరావు, మొదలైన సాహితీ మిత్రులతో అత్యంత ఆత్మీయంగా ఉండేవారు. వీరే కాక వేదుల పల్లి కృష్ణశాస్త్రి, గడియారం వేంకట శేష శాస్త్రి, ఉషశ్రీ, చిలకమర్తి లక్ష్మీనరసింహం, అయ్యదేవర కాళేశ్వరరావు, పానుగంటి, జమీన్ రైతు సంపాదకుడు నెల్లూరి వేంకట రామానాయుడు, గునుగుపాటి యానాదిరెడ్డి, పట్టాభిరామిరెడ్డి మొదలైన ఎంతో మంది సాహిత్య వేత్తలతోను, చరిత్ర కారులతోను అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి. వీరే కాక శ్రీపాద వారికి "సత్తిభామిరెడ్డి, కర్రితాత అని ఇద్దరు రెడ్డి శిష్యులు వుండేవారు" (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద. 1956 : 115).

5.1.6 <u>వ్యక్తిత్వం</u> : శ్రీపాద వారు ఎన్ని రచనలు చేసినా తన జీవితాంతం స్వతంత్రంగానే బ్రతికారు. ఎక్కడ ఏ విధమైన ఉద్యోగం చేయలేదు. తమ రచనలను తామే అచ్చు వేయించుకొని అమ్మిన సంపాదనతోనే కుటుంబాన్ని నడిపేవారు. ఎన్నో ఇబ్బందులు పడుతూనే జీవనాన్ని సాగించారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం, తన విశ్వాసాలను,

జీవితాశయాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. అందుకే ఆయన అన్నింటా అతి నిర్లిప్త మనిషి. అతి స్వతంత్రులు కూడా. అందువల్లనేమో వీరికి ఏ సాహితీ సమితుల్లోగాని, ఏ రాజకీయ సంస్థలలోగానీ ఎటువంటి సంబంధాలు లేవు. తనకి నచ్చనివారు అధ్యక్షులైన సభకు వక్తగా వెళ్ళేందుకు నిరాకరించేవారు. కనీసం ఇద్దరు శాలువా కూడా కప్పించుకోవడానికి అంగీకరించేవారు కాదు. (కనకయ్య. బామూర్తి, 1986 : 2).

శ్రీపాదవారి వ్యక్తిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే సభలో ఒక విధంగానూ, వాస్తవ జీవితంలో మరో విధంగానూ మాట్లాడే మనిషి కాదు. "నిజాయితీ ఉన్న రచయితలలో ఆయనది అగ్రస్థానం". అని శ్రీ మధునాపంతుల వారు పేర్కొనడం ఎంతో సముచితంగా ఉంది (సత్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల- 1940 : 2).

## 5.2. కథలు - నవలలు

**5.2.1 చిన్న కథల పరిచయం:** శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఏ ఇతర

భాషలలో పరిచయం లేకుండా స్వయంగా తన చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యలనే కథావస్తువులుగా స్వీకరించారు. వీటి ద్వారా ఆంధ్ర జాతిలో గొప్ప పరివర్తన తేవాలనే సంకల్పంతో తన కథలను తీర్చి దిద్దారు.

వీరు రచించిన చిన్న కథలను చిన్న, పెద్ద అనే భేదం లేదు. 'చిన్న కథ అంటే మూర్తి మంతాన్ని బట్టి గాదు పరిగణ అర్థాన్ని బట్టి' అని శ్రీపాద వారే స్వయంగా చెప్పుకున్నారు (సుబ్రహ్మణ్య శాస్త్రి. శ్రీపాద: 1956). అందువల్ల వీరి కథలను చిన్న కథలనే వ్యవహరించారు గాని 'కథానికలని గాని, కథలని గాని వారు ప్రకటించుకోలేదు' (కనకయ్య. బామర్తి : 1979 : 16).

తన జీవిత కాలంలో మొత్తం డెబ్బై ఐదు కథలు ప్రచురించారు. వీటిల్లో మొట్ట మొదట పందొమ్మిది కథలను 'వెద్దరాణి' పత్రికలో ప్రచురించారు. తర్వాత 1925 లో 'పుల్లకందు' అనే పేరుతో ఈ పందొమ్మిది కథలను ఒక సంపుటంగా వెలువరించారు.

ఇవే కాక మిగిలిన ఆయుదు కథలను భారతి,

రెడ్డిరాణి, ప్రబుద్ధాంధ్ర, ఆంధ్ర పత్రిక (ఉగాది సంచిక), ప్రభామిత్ర మొదలైన పత్రికలలో ప్రచురించారు. తర్వాత ఈ ఇరవై అయిదు కథలను పన్నెండు సంపుటాలుగా అద్దేపల్లి అండ్ కో, రాజమండ్రి వారు ప్రచురించారు.

ఇంకా నేడు పుస్తక రూపంలో రాని కథలు ముప్పైకి పైగా ఉన్నాయి. ఇవి భారతి, ప్రబుద్ధాంధ్ర, సుభాషి (ఆంధ్ర పత్రిక), త్రిలింగ మొదలైన పత్రికల్లో ప్రకటితమయ్యాయి[1]

<u>కథల విభజన</u>: శ్రీపాద వారు రచించిన కథలను పూర్వ పరిశోధకులు రెండు తరగతులుగా విభజించారు. 1. సాంఘిక కథలు, 2. చారిత్రాత్మక కథలు. సాంఘిక కథలు ఏడు రకాలు. అవి 1. ప్రణయ కథలు, 2. మూఢ సంప్రదాయ కథలు, 3. ప్రబోధాత్మక కథలు, 4. కుటుంబ

---

[1] డా॥ [illegible] తన 'శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు - సమగ్ర పరిశీలన' అనే గ్రంథంలో ఈ '75' కథలను చెబుతూ 'అపరాజితవల్లీ[illegible]' అనే రూపకాన్ని, 'క్షీరసాగర మథనం' అనే నవలను కథలుగా స్వీకరించారు. ఈ రూపకాన్ని రూపకంగా, నవలను నవలగాను తీసుకుంటూ వీటిని కథలలో చేర్చలేదు.

జీవిత కథలు, 5. అపరాధ పరిశోధక కథలు, 6. అపహేళనాత్మక కథలు, 7. భాషా వివాదాత్మక కథ. చారిత్రాత్మక కథలు రెండు రకాలు. అవి 1. పూర్వ సంస్థాన కథలు, 2. ఆధునిక జమీందారీ కథలు (కనకదుర్గ. చామర్తి. 1986 : 7-8).

శ్రీపాద వారి కథారచనకు ప్రధానంగా సంఘ సంస్కార దృక్పథమే బలం. తన కాలం నాటి సామాజిక సమస్యలచుట్టూ వారి కథలన్నీ అల్లుకొని ఉంటాయి. సంస్కారాత్మక భావన లేకుండా ఏ కథనూ వీరు రచించలేదు. అందుచేత ప్రతి కథలోనూ రెండు మూడు సామాజిక సమస్యలకు సంబంధించిన సంస్కార భావాలతో కూడిన ఇతివృత్తం కన్పిస్తుంది. ఉదాహరణకు 'పెళ్ళాడు తన్నా మొగాడేడీ?' అనే కథ వితంతు పునర్వివాహం, అస్పృశ్యత, స్త్రీస్వేచ్ఛ మొదలైన ఆధునిక సంస్కార భావాల సమాహారంగా నిర్వహించబడింది. ఈ లక్షణం ఈ వీరి కథలన్నింటిలోనూ కన్పిస్తూ ఉంటుంది. అందుచేత కథలను వర్గీకరించేటప్పుడు కథలలోని సామాజిక దృక్పథాలను ప్రధానంగా తీసుకొని దాని కిందకు ఏఏ కథలు వస్తాయో గుర్తించవలసి ఉంటుంది. ఒకే కథలో

రెండు కూడా ఉంటాయన్నప్పుడు ఆ కథను ఆశీర్షికలన్నింటి కింద చూపవలసి ఉంటుంది. ఈ మార్గంలోనే కింది వర్గీకరణను చూపడం జరిగింది.

5.2.2 **కథల విభజన:** శ్రీ పాద వారి రచనా దృక్పథాన్ని బట్టి వారి కథలను కింది విధంగా విభజించి చూడవచ్చు. అవి-

1. సామాజిక దృక్పథం
2. సైద్ధాంతిక దృక్పథం
3. రాజకీయ దృక్పథం
4. స్త్రీ చైతన్య దృక్పథం
5. భాషా దృక్పథం

సామాజిక దృక్పథాన్ని ఐదు రకాలుగా విభజించవచ్చు. 1. కుల భేద నిరసన, 2. అస్పృశ్యతా నిరసన 3. అధికార యంత్రాంగం, 4. విద్యా విధానం, 5. నిరుద్యోగ సమస్య.

వీటిలో కులభేద నిరసనను తెలియజేసే కథలు 'పెళ్ళాడు ఆడ్గా మొగాడేడీ', 'కలుపు మొక్కలు', 'సాగర

సంగమం', 'వేలి పెడితే అల్లుడైనాడు'. 'భావియురు కాదు అల్లుడు', మొదలైన కథలు. అస్పృశ్యతా నిరసనను తెలియజేసే కథలు 'ఇలాంటి తప్పులు చేస్తే..?', 'బ్రహ్మణ్య గ్రహచారం', 'విమానం ఎక్క బోతున్నా', 'కలుపు మొక్కలు', 'వేలి పెడితే అల్లుడైనాడు', 'పుల్లం రాజు' మొదలయిన కథలు. అధికార యంత్రాంగాన్ని తెలియజేసే కథలు- 1. లంచగొండి తనాన్ని చూపే కథలు 'కలుపు మొక్కలు', 'తమా షెటు దారు కాదు- వర్తకుడు' 2. పబ్లిక్ సర్వీస్ కమీషన్ గురించి 'గుర్రప్పందాలు' మొదలైన కథలు. ఇవే కాక 'చీకటి వెలుగు', 'సముద్ర మండలి మంచు కొండలు', 'రాత దంపతులు', 'విలువ చెంబు', 'ఆశా భంగం'. నిరుద్యోగ సమస్యను తెలియజేసే కథలు 'గుర్రప్పందాలు', 'తాపీ మేస్త్రీ రామదీక్షితులు బి.ఎ.', 'మార్గదర్శి', 'తమాషెటు దారు కాదు- వర్తకుడు', 'అన్నానికల్లా ఒకటే మందు', 'కవేరింగిన వాత', 'చీకటి వెలుగు', 'తప్పి పరుగాం', 'రాఫులున్నా', 'సముద్రమండలి మంచు కొండలు', 'పోలీసు', 'నలుగుర్ని పోషిస్తున్నా నిపుణు' మొదలైన కథలు. విద్యా విధానాన్ని తెలియజేసే కథలు 'కవేరింగిన వాత', 'సముద్ర మండలి మంచుకొండలు', 'తనదాకా వచ్చింది' మొదలైనవి.

సైద్ధాంతిక దృక్పథాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. 1. మానవతా దృక్పథం, 2. హేతువాద దృక్పథం. మానవతా దృక్పథంలో రాసిన కథలు సాగర సంగమం, ఇలాంటి తవ్వాయి వస్తే...?, పెళ్లాడ తగ్గ మొగాడేడీ, పెళ్ళి పెడితే అబ్బాయినాడు, అరికాళ్ళ కింద మంటలు, సుభద్రమ్మ, రామలక్ష్మి, క్రిందికా! పైకా?, అన్నపూర్ణ, బూరియురు కారు అల్లుడు, జీవితం తప్పలేదు, తనదాకా వచ్చింది, బుల్లి వెంకయ్యమ్మ, కలుపు మొక్కలు, తులసి మొక్కలు మొదలైన కథలు. హేతువాద దృక్పథంలో రాసిన కథలు మార్గదర్శి, క్షంతవ్యమైన జవాబు ఇలాంటి తవ్వాయి వస్తే...?, తనదాకా వచ్చింది మొదలగునవి.

రాజకీయ దృక్పథంలో మూడు రకాలున్నాయి. 1. జాతీయ దృక్పథం, 2. రాజకీయ దృక్పథం, 3. ప్రతి ఘటనా దృక్పథం.

జాతీయ దృక్పథంలో రాసిన కథలు కొత్త చూపు, ఇలాంటి తవ్వాయి వస్తే...?, కుక్కకే శరణ్యమా మొదలైన కథలు. రాజకీయ దృక్పథాన్ని ఇలాంటి తవ్వాయి వస్తే...?, మొదల

వైనవి. ప్రతి ఘటనా వ్యక్తిత్వానికి బలిపీఠము, తనదాకా వస్తుంది, రావులమ్మ మొదలైనవి.

స్త్రీ చైతన్య కథానికలు ఆరు విభాగాలున్నాయి. 1. స్త్రీ విద్య, 2. కన్యాశుల్కం - వరకట్నం, 3. వితంతువులు, 4. వేశ్యా సమస్య, 5. స్త్రీ ఔన్నత్యం, 6. స్త్రీ స్వేచ్ఛ.

స్త్రీ విద్య తల్లి ప్రాణం, కొత్త చూపు, మొదట రాడు, అనంత పని జరిగింది, కేవెరిగిన వాత మొదలైనవి. కన్యాశుల్కం - వరకట్నాలలో కన్యాశుల్కం - వరశుల్కం, ఘటన, కొత్త చూపు, కేవెరిగిన వాత, పుట్టిబెట్టు కన్యాని ప్రశ్నను, పోలీసు, తాపాతు మారిన పరుగు, శుభ్ర కేశర ఆరావా, మొదటవాడి, తులసి మొక్కలు మొదలైన కథలు. వితంతు పున ర్వివాహం ప్రోత్సాహ్ని బాటి చెప్పే కథలు రామలక్ష్మి, బుచ్చి వెంకయ్యమ్మ, అరికాళ్ళ కింద మంటలు, ముందు పోలా పాలము- పిదప అమ్మతమల, మేనరికం తప్పుతేదు, తల్లి ప్రాణం, కన్యా కానీ యువతి క్షీరితా, క్షుద్రమైన జవాబు మొదలైన కథలు. బాల వితంతువుల సమస్యను తెలియ జెప్పే కథలు, కేపెరిగిన వాత,

ఇల్లు పట్టిన పెతనపాడు పక్షులు, వేశ్యా సమస్యను తెలియజేసే కథలు కలుపు మొక్కలు, తులసి మొక్కలు, అనంత పని జరిగింది, పుల్లంరాజు, పట్ట ఇంజను మొదలైన కథలు. స్త్రీల శీలవత్వం, షట్కర్మ యుక్తా, యావజ్జీవం హోమస్నాయి, నాటకం, గూడు మారిన కొత్తరికం మొదలైనవి. స్త్రీ స్వేచ్ఛకు, కలవరిత పాట, కొత్త చూపు, కట్టిలమైన జవాబు మొదటి పాఠం, పెళ్ళాడ తగ్గ మొగాడేడీ, మొదలైన కథలు.

భాషా దృక్పథంలో మూడు విధాలున్నాయి. 1. వ్యావహారిక భాషాభిమానం, 2. హిందీ భాషా వ్యతిరేకత, 3. ఆంధ్ర భాషాభిమానం.

వ్యావహారిక భాషాభిమానం, పట్టి పట్టుదల తప్ప ఏమీ లేదు. హిందీ భాషా వ్యతిరేకతను తెలియజేసే కథలు కుంకుమ రేఖ (ఆలోకం, ఏ-క్ష-డ) లంగరంపేడు - మొదలైనవి. ఆంధ్ర భాషాభిమానంలో, పై మూడు కథలు కూడా వస్తాయి.

2.3 **నవలలు :** శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు మొత్తం ఆరు నవలలు వ్రాశారు. ఈ ఆరు నవలల్నీ, ఆరు నవలల్నీ, చారిత్రకాంశాలు చోటు చేసుకున్నా ప్రధానంగా సాంఘిక సమస్యలనే

ప్రధానంగా స్వీకరించారు. వీటిల్లో అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించడం, నిరుద్యోగ సమస్యను వర్ణించడం, వితంతు వివాహాన్ని ఆదరించడం, స్త్రీల స్వాతంత్ర్యం గురించి ప్రశ్నించడం వంటివి కన్పిస్తాయి. 'నీలా సుందరి నవలలో మాత్రం సాంఘిక సమస్య లేకపోయినా చారిత్రక ఇతివృత్తం చక్కగా తీర్చిదిద్దబడింది.

రక్షా బంధనం నవలలో అధికార యంత్రాంగంలోని లోపాల్ని ఎత్తిచూపుతూ, పోలీసు వ్యవస్థలో ఉన్న దురాగతాలను కళ్ళకు కట్టారు. అల్లుడి నవలలో విద్యను, ఉద్యోగ సమస్యలను చిత్రించారు. వితంతు పునర్వివాహాన్ని తెలియజేస్తూ 'క్షీర సాగర మథనం', అనాథ బాలిక నవలలు రాశారు. స్త్రీల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ మధునాను రాగం విష భుజంగం, క్షీర సాగర మథనం నవలలు రచించారు.

3.0 <u>ఇతర రచనలు</u> : శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు కథలు నవలలే కాక మరి కొన్ని ఇతర రచనలు కూడా చేశారు. అవి నాటకాలు, రూపకాలు, చరిత్ర గ్రంథాలు, ఖండ కావ్యాలు, వ్యాసాలు సంస్కృత భారతానువాదాలు మొదలైన ప్రక్రియలకు సంబం

ధించినది. తెలుగు ప్రజలందరూ గర్వించదగ్గ మెచ్చుకోదగ్గ 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' అనే పేరుతో స్వీయ చరిత్ర ను ప్రకటించారు.

5.3.1 <u>నాటకాలు</u>: శ్రీపాద వారు గజమెత్తు పుస్తకాల రాయాలనే సంకల్పంతో చిన్నతనం లోనే రాసి ప్రకటించిన మొట్టమొదటి నాటకం 'వారకాంత' (1909). ఇది పద్య నాటకం. ఇది ఆనాటి వేశ్యా సమస్యకు అద్దం పడుతుంది. తరువాతి కాలంలో 'రామదేవ విజయం'(1913) లేక 'రెడ్ల చరిత్ర' అనే చారిత్రక నాటకాన్ని ప్రకటించారు. అదే కాలంలో 'సాహసిక రాజపుత్రము'(1913) అనే మరో చారిత్రక నాటకాన్ని కూడా రాసి ప్రకటించారు. ఇది ఆకాలపు ప్రసిద్ధ పద్య నాటకం గా పేరు తెచ్చుకుంది. వీరి 'నిగళబంధనం' అనే మరో చారిత్రక నాటకం ఎంతో ప్రఖ్యాతిని పొందింది.

1925 - 1933 సంవత్సరాల మధ్య కాలంలో శ్రీపాద వారు 'ప్రేమ పాశం' వంటి స్వతంత్ర, సాంఘిక నాటకాలు రాసి ప్రకటించారు.

5.3.2 **అనువాద నాటకాలు :** 'భాసుని స్వప్న వాసవదత్త'ను శ్రీపాద వారు వాడుక తెలుగులో కేవలం వచన నాటకంగా అనువదించారు. దీన్ని 1913లో 'స్వప్న వాసవదత్తం' పేరుతోనే అచ్చు వేశారు.

భవభూతి 'ఉత్తర రామ చరిత్ర' నాటకాన్ని కూడా శ్రీపాదవారు వాడుక భాషలోకి అనువదించ దానికి పూనుకొని దానిలో ప్రథమాంకం వరకు అనువదించినట్టు వారి రాత ప్రతులు చూడగా వెల్లడి అయినట్టు శ్రీ చామర్తి అన్నపూర్ణ గారు పేర్కొన్నారు (అన్నపూర్ణ. చామర్తి. 1993 : 37-38)

5.3.3 **రూపికలు :** శ్రీపాదవారు నాటకాలతో పాటు అనేక రూపికలు కూడా ప్రకటించారు. అవి 'కలం పోటు', 'పునాది రాయి', 'లక్ష్మీసిద్ధి', 'టీ పార్టీ', కర్ణవధ, 'అపి దళతి వజ్రస్య హృదయం', కొనుక్కొన్న మొగుడు మొదలైనవి. ఇవి సాంఘిక, చారిత్రక, పౌరాణిక ఇతివృత్తాలు గలవి.

5.3.4 **రేడియో రూపికలు :** గేహే గంగ 'వర్ష వైభవం' అపవాదు సాగులు' అనే రేడియో రూపికలను కూడా శ్రీపాద వారు

ప్రకటించారు. శ్రీపాద వారు రచించిన రూపికలన్నింటిలో కొత్త బాణి వ్యక్తమవుతుంది.

5.3.5 <u>చరిత్రలు</u> : శ్రీపాద వారు చరిత్ర గ్రంథాలు కూడా రాసి ప్రకటించారు. వీటిలో ప్రసిద్ధమైంది 'వీరఘాట్' అనే గ్రంథం. దీన్ని 1915లో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి సాయంతో ప్రకటించారు. ఈ చారిత్రక గ్రంథానికి ఎంతో ప్రాముఖ్యముంది. దీన్ని ముద్రించుకోవడంలో శ్రీపాద వారు ఎంతో కష్టపడ్డారు. ప్రధానంగా దీనిలో వివిధ చారిత్రక వ్యక్తుల గాథలు వారి పరాక్రమాలు తెలియజేశారు. 'చంద్రగుప్త చక్రవర్తి' అనే గ్రంథంతో పాటు ఇంకా ఎన్నో చారిత్రక గ్రంథాలు ప్రకటించారు.

5.3.6 <u>ఖండ కావ్యాలు:</u> 'గీతమంజరి', 'మోహనరేఖ', 'జలక్రీడ', 'అలంకృతి', 'అత్త-అల్లుడు', 'అభిసారిక', బాలిక, బాల అనే ఖండ కావ్యాలు ప్రకటించారు.

5.3.7 <u>విమర్శనా గ్రంథాలు</u> : పిఠాపురం సంస్థాన కవులైన వేంకట రామకృష్ణుల దగ్గర ఉంటున్న రోజుల్లో వేటూరి ప్రభా-

కర శాస్త్రి గారి పద్యాలకు సమాధానంగా 'ప్రభాకర పరామర్శము' అనే విమర్శను ప్రకటించారు. తరువాత 1913 తిరుపతి వేంకట కవులు రాసిన 'శ్రవణానందం', పాణిగృహీత ప్రబంధాలను విమర్శిస్తూ శ్రీపాదవారు 'పాణిగృహీత శ్రవణానంద ఖండనం' అనే విమర్శన గ్రంథాన్ని ప్రకటించారు. తరువాత 'విజయ విలాస', ప్రబంధంపై విమర్శ గ్రంథాన్ని కూడా రచించినట్లు అది ముద్రితం కాలేదని, రాత ప్రతి కూడా లభించడం లేదని డా॥ అన్నపూర్ణ గారు రాశారు. (1993: 20-21).

5.3.8 **పత్రికా రచన:** శ్రీపాదవారు రాయవరం నుంచి 1920లో ప్రబుద్ధాంధ్ర పత్రికను ప్రచురించడం ప్రారంభించారు. ఇది పక్ష పత్రిక. దీనిని సంస్కృతాంధ్ర భాషల్లో వెలువరించారు. తరువాత రాయవరంలో 'మల్లిడి సత్యారెడ్డి'కి 'రెడ్డిరాణి' పత్రికను ప్రచురించడంలో సాయం చేశారు. ప్రబుద్ధాంధ్ర నిలిచిపోయినప్పుడు మరొకరి పేర 'అభ్యుదయ' అనే పేరుతో మాస పత్రికను ప్రారంభించి రెండు నెలలు నడిపారు.

5.3.9 **రామాయణ భారత అనువాదాలు :** సంస్కృతంలోనూ, తెలుగులోనూ సమధికమైన పాండిత్యం గల శ్రీపాద వారు సంస్కృతం లోని భారత, రామాయణాలను వాడుక భాషలోకి అనువదించారు. మొట్టమొదట వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి వాడుక భాషలో యథాతథంగా అనువదించిన కీర్తి శ్రీపాద వారిదే. వీరి భారతానువాదం అసమగ్రంగా ఆగిపోయింది.

ఇవే కాక 'బాల రామాయణం' 'శతనీతి', 'పంచతంత్రం', 'చాణక్య సూత్రం', స్వప్నవాసవదత్త మొదలైన అనేక గ్రంథాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు. ఈ రచనలన్నింటినీ పిల్లలు చదువుకొనే విధంగా రాశారు.

తరువాత, 'భారతి' పత్రికలో ప్రకటితమైన 'దేవవాణీ సుభాషితాలు' అనే ప్రశ్నోత్తర మాలిక వంటి సంస్కృతానువాదాలు కూడా శ్రీపాద వారు చేశారు.

5.3.10 **వ్యాసాలు :** 1932-37 సంవత్సరాల మధ్య కాలంలో

శాస్త్రి అనే పేరుతో 'ఆగడ తారకలు' అనే శీర్షికతో ఎన్నో వ్యాసాలు పద్య ఖండికలు మొదలైనవి ప్రకటించారు.

'శాస్త్రి', 'వాచస్పతి', 'తార్కికుడు', 'వసంతుడు', 'కుమార కవి సింహుడు', 'భట్ట బాణుడు', 'కౌశికుడు' అనే మారు పేర్లతో అనేక విమర్శనా వ్యాసాలు ప్రకటించారు.

5.3.11 **వైద్య గ్రంథాలు :** శ్రీపాద వారు అంగర వేంకటాచార్యుల వద్ద వైద్య విద్యను నేర్చుకున్నారు. వీరు 1917లో ఆయా వైద్యౌషధాలు తయారుచేసి అమ్మడమే కాక, 'ఆయుర్వేద యోగ ముక్తావళి', 'వైద్యక పరిభాష' అనే రెండు ఆయుర్వేద శాస్త్ర గ్రంథాన్ని కూడా ప్రకటించారు.

5.3.12 **వ్యాకరణ రచన :** శ్రీ మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, శ్రీ బాదూరు రామానుజులరెడ్డి గార్లతో కలిసి 'వసంతరాయ వ్యాకరణం' అనే తెలుగు వ్యాకరణాన్ని కూడా శ్రీపాద వారు రచించి ప్రకటించారు.

3.13 **స్వీయ చరిత్ర :** ఈ రచన ఒక రకంగా వారి ఆత్మకథ.

దీనిలో సమకాలీన జీవన చిత్రణ, దేశ చరిత్ర మొదలైన అంశాల సమాహారం. దీనిని మూడు భాగాలుగా వెలువరించారు.

'అనుభవాలూ- జ్ఞాపకాలూను' అన్న గ్రంథం మొదట సంపుటాన్ని 1955 జూన్‌లో ప్రచురించారు. ఈ సంపుటంలోనే ఈ క్రింది సూచన ముద్రితం అయి వుంది.

"ఈ గ్రంథం ఇప్పటికి నాలుగు సంపుటాల రచన పూర్తి అయి వుంది. వీటిలో ఇది మొదటి సంపుటం. తక్కిన మూడు సంపుటాలు ఈ 1955లో అచ్చు అవుతాయి అని వేసి ఉంది"

'అనుభవాలూ- జ్ఞాపకాలూను' రెండవ సంపుటం ముద్రణ గురించి సన్మాన సభలో ప్రకటన చేశారు. దీన్ని 1958 జనవరిలో కళాభివర్ధిని పరిషత్ వారు ముద్రించారు.

దీని చివరిలో ఈ గ్రంథం మొత్తం 'ఎనిమిది సంపుటాలు అవ్వుతుందని అంచనా'- అని ఉంది.

మూడవ సంపుటం సెప్టెంబర్ 1966లో అద్దేపల్లి అండ్ కో వారు ప్రకటించారు. మొదటి రెండు

సంపుటాలలో చేర్చి దీనికి 'ఆటో బయోగ్రఫీ' అని టైటిల్ ఉంది. దీని చివర శ్రీ శాస్త్రి గారి అకాల మరణం వల్ల మూడవ సంపుటంలో ఆఖరు అని ఉంది.

శ్రీపాద వారు ఎనిమిది సంపుటాలు అవుతాయని అంచనా వేశారు. కాని 'అనుభవాలూ-జ్ఞాపకాలూను మూడే మూడు సంపుటాలలో ఆగిపోయింది.

ఇలా శ్రీపాద వారు ఎన్నో రచనలు చేశారు. పండితుడిగా పద్యకావ్య రచయితగా, విమర్శకుడిగా, శ్రవ్య నాటక కర్తగా, చారిత్రక నాట్య కర్తగా, సాంఘిక నాటక రచయితగా, నవలా రచయితగా, కథారచయితగా, అనువాదకుడిగా, వైద్య గ్రంథకర్తగా, వాచక పత్రిక సంపాదకుడుగా, స్వీయ చరిత్రకారుడుగా శ్రీపాద వారు తమ బహుముఖ సాహిత్య వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.

రెండవ ప్రాకారం

6

# సైద్ధాంతిక చైతన్యం

## 6.1 మానవతా వాదం.

మానవుని గౌరవమూ, వ్యక్తిగతమైన విలువ, అతని సంక్షేమం, అతని సంపూర్ణ వికాసమూ సామాజిక జీవనానికి అనుకూలమైన పరిస్థితులు అను వాటిపై ఆధారపడిన ఆలోచనా విధానము మానవతావాదం.(1) మానవుడు చేసే ప్రతి ఆలోచన మానవుల అభ్యుదయాన్ని కాంక్షించేదిగా ఉండాలి. ప్రతి పనికి మానవుడే లక్ష్యంగా ఉండాలి. ప్రతిప్రయోజనాన్ని మానవుడే పొందాలి. మానవుడు మానవుణ్ని గురించే ఆలోచించాలి. మొదలైన భావాల సంపుటిని మానవతావాదం అని స్థూలంగా పేర్కొవచ్చు. మానవునికి అధిక ప్రయోజనాన్నిచ్చే ఆలోచనా విధానం మానవతా వాదం అని ఒక్క మాటలో చెప్పుకోవచ్చు.

---

(1) Humanism, a system of views based on respect for the dignity and rights of man, his value as a personality, concern for his welfare, his all-round development and creation of -

ఇటువంటి మానవతావాదం అనే ఆలోచనా విధానం ఒక తాత్విక సిద్ధాంతంగా యేర్పడి రాజకీయ రంగంలోనూ, సాహిత్యరంగంలోనూ ఇరవయ్యో శతాబ్దానికి పూర్వమే పాశ్చాత్య దేశాల్లో విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం చేత ఇటు వంటి ఆలోచనా విధానం పందొమ్మిదో శతాబ్దం లో మన దేశంలో కూడా ప్రాచుర్యాన్ని పొందింది. పందొమ్మిదో శతాబ్దిలో మన సమాజం ఆంగ్లేయుల పాలనలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల్ని కోల్పోవడంతో పాటు మతపరమైన మూఢ విశ్వాసాలకు పూర్తిగా లోనై ఉంది. మానవత్వపు విలువలు నశించి ఆర్థికంగానూ, సాంఘికంగానూ చిన్నాభిన్నమై ఉంది. దీనిలో ప్రధానంగా మానవత్వాన్ని అపహాస్యం చేసిన సమస్యలు రెండు. అవి. ఒకటి అస్పృశ్యత, రెండు స్త్రీల అధోగతి.

సంఘ సంస్కరణోద్యమాల్లో

---

favourable Conditions for Social life. (Frolov ; Dictionary of Philosophy, 1986 :178)

భాగంగా కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైన వారు సాంఘిక, సాహిత్య రంగాల్లో రెండింటిలోనూ మానవతా దృక్పథాన్ని ప్రవేశపెట్టారు. సాహిత్య రంగంలో మానవతా వాదం ప్రబోధం కావించిన గురజాడ వారి "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అనే సూక్తి మొట్టమొదట పేర్కొబడింది. కథా సాహిత్యంలో కూడా మానవతా వాద నేపథ్యంతో రచనలు చేసిన తొలి రచయితలుగా గురజాడ వారిని పేర్కొంటున్నాము. తరువాత మానవతా వాద దృక్పథంతో విస్తృతంగా రచనలు చేసి సాహిత్య రంగాన్ని సుసంపన్నం చేసిన వారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

ఈయన రచనలన్నింటిలోనూ మానవతా వాద స్పర్శ లేని రచన లేదని చెప్పవచ్చు. ఇది కొన్ని కథలలో అస్పృశ్యతా సమస్య పరిష్కారంగానూ, మరి కొన్ని కథలలో స్త్రీ సమానత్వ దృక్పథంతోనూ, మరి కొన్ని కథలలో మానవుల సర్వాభ్యుదయాన్ని కాంక్షించే విధంగానూ కనిపిస్తుంది.

'పెళ్ళాడదగ్గ మొగాడేడీ', కథలో

హరిజన క్రైస్తవ దంపతులు రోడ్డు ప్రక్కన మూలుగుతూ పడివున్న బ్రాహ్మణ బాల వితంతువును చూస్తారు. ఆమెను ఆదరించి సపర్యలు చేస్తారు. ఈ సందర్భంలోగా ఆ బాల వితంతువు తండ్రి, అన్నల చేత కొట్టబడి గెంటి వేయబడింది. పడివుండగా ఆమెను చూసిన బ్రాహ్మణులు "పులిని చూచినట్లు" పారి పోయారు. ఆమె స్థితిని చూడలేక జాలితో ఆదరించి సేవలు చేస్తూ హరిజన దంపతులు "ఇది మా జాతి లక్షణం" అంటారు. ఆమె తనవారిని యమదూతల్లాగ తననాదరించిన వారిని దేవదూతల్లాగ భావిస్తుంది. బాలవితంతువైన ఆమె -

"నన్ను కన్నవాళ్ళకి నేను తొమ్మిదో యేటనే గర్భ-శత్రువునయి పోయాను...... మాతృప్రేమని, పితృ వాత్సల్యాన్ని రుచైనా చూసి ఎరుగను. నా మొగం కనబడితే మానాన్నకి కళ్ళు చిమచిమ లాడి పోతాయి. మా అమ్మ చేతులారా చంపలేక తప్పించుకు తిరుగుతోంది. నా మొగుడన్న పిల్లాడు చచ్చిపోయినందుకు కొంచెడ దుఃఖిస్తూనే వుంది...............
.........."

అని ఆమె తనను గురించి వివరిస్తుంది. వారు ఆమె పట్ల చూపిన ఆదరణకి, సేవా భావానికి తన్మయత్వం పొందుతుంది. "నాకిప్పుడు నన్ను కడుపులో పెట్టుకునే తల్లిదండ్రులు కావాలి? యెవరు నన్ను కూతురుగా ప్రేమిస్తారా?" అని అడుగుతుంది. అప్పుడు ఆ హరిజన క్రైస్తవ మహిళ-

"తల్లి నువ్వు నా కూతురువు, నేను నీకు తల్లిని" అని అంటుంది. ఈ సందర్భంలో రచయిత వాళ్ళిద్దరి మధ్యనున్న అనుబంధాన్ని మానవతా దృష్టిలో అత్యంత సహజంగా వర్ణించారు.

ఈ కథ ద్వారా రచయిత అస్పృశ్యతా భావాన్ని నిరసించడంతోపాటు మానవుల మధ్య ప్రేమకూ, ఆదరణకూ మాత్రమే విలువ కాని ఇతర సామాజిక కారణాలకు కాదని ప్రబోధించారు. బ్రాహ్మణ బాల వితంతువును అమానుషంగా ఇంటి నుండి గెంటివేసినప్పుడు హరిజన దంపతులు ఆదరించడం, వారిలో ఆమె తల్లిదండ్రుల ప్రేమని చూడగానడం, రచయిత మానవతా వాద దృక్పథాన్ని ప్రబలంగా

చూపుతోంది.

'సాగర సంగమం', 'ఇలాంటి తప్పోయి యస్తే'....?, 'వేలుపెడితే అల్లుడైనాడు.' మొదలైన కథలలో అస్పృశ్యతా సమస్య నేపథ్యంలో మానవతావాద దృక్పథం కనిపిస్తుంది.

'క్షీరసాగర మథనం', నవలలో 'రాజ గోపాలశాస్త్రి', 'శ్రీ రాజా బహద్దరు' గారితో మాట్లాడుతున్న సందర్భంలో -

"కులాల సంగతి మరచి పోమనీ, ఎక్కువ తక్కువ చూసుకోవద్దనీ, ఒకరి నొకరు గౌరవించు కుంటూ వృత్తి చేసుకుందామనీ చాలా దూరం చెబుతూ వచ్చాను, చాలా మార్లు కాని యాక పద్ధతి యొద్ద ఉండలేక పోతూ వచ్చారు వారు." అని పలుకుతాడు.

ఈ వ్యాఖ్యలు శ్రీపాద వారి మనస్తత్వ నిరూపణకు ఆధారాలు. సంస్కార దృక్పథంతోనూ, మానవతా దృక్పథంలోనూ అన్నింటా ఆధునికత మూర్తీభవించిన

శ్రీపాదవారు అస్పృశ్యతను నిరసించడంతో పాటు, కుల విభజనను కూడా తిరస్కరించారు. ఈ నేపథ్యంతో మానవతా విలువలకే ప్రాధాన్యమని సూచించారు.

శ్రీపాదవారు సంస్కార దృక్పథంతో తాను రచనలను గ్రహించిన విషయాలలో ముఖ్యమైనది. స్త్రీ సమస్యా చిత్రణ. ఉమ్మడి కుటుంబాలలో ఆర్థిక స్వాతంత్ర్యం లేక బానిస బ్రతుకు వెళ్ళదీస్తున్న స్త్రీని మానవతా వాద దృక్పథంతో వాస్తవంగా చిత్రించిన కథలు ఆయన రచనల్లో ఎక్కువ భాగం ఆక్రమిస్తాయి. ఈయన స్త్రీ పాత్రలు చాలా వరకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోరినవి, స్వేచ్ఛా భావాల్ని ప్రకటించినవి, పురుషాధిక్యతను ప్రశ్నించినవి, విద్యను సమానత్వాన్ని ఆకాంక్షించినవి.

నాటి సమాజంలో స్త్రీని పట్టి పీడించిన సమస్యలలో ముఖ్యమైనవి వితంతువుల జీవనం, కన్యాశుల్క వివాహం, అవిద్య, బాల వితంతువు మానవ సంబంధమైన కోరికలను, సామాజిక పరమైన

వాక్కులను కోల్పోయి కుటుంబంలోని వారిచేతనే చులకనగా పరిగణించ బడేది. ఆమె పట్ల ఇతరుల ప్రవర్తన అమానుషంగా ఉండేది. ఆమె నేడు దయనీయమైన జీవితాన్ని అనుభవిస్తూ చాకిరి తోనే జీవితాన్ని కొనసాగించేది.

'అరికాళ్ళ క్రింద మంటలు' అనే కథలో "తల పెద్ద వాళ్ళింట్లో ఉండగా పునిస్త్రీ పడుచు ముడికట్టుకోడం యేమిటి షాయ్"?. "తల అంటుకోనా, దువ్వుకోనా, జడ వేసుకోనా యింకెదుకోయ్ దానికా దిక్కుమాలిన జుట్టు? .......", "అది చేసిన వంట నన్ను తిననంటావా యేమి షాయ్‌ని". "యెల్లుండి దశమి నాడు మంచిదన్నారు. కోటిలింగాలకి వెడితే ఒక్క నిమిషం పని".

"మొగుడు చచ్చిన పడుచు పిల్లకి మంచి రోజులు కావివి. మొన్ననే వీరేశలింగం తోటలో ఒక వెధవ పెళ్ళి అయిందట. ఇంకా నలుగురు వెధవ కొడుకుల కోసం వెతుకుతున్నారట. ముండలు తోటలో వాళ్ళు..... తరువాత

ఏమనుకున్నా ఇక కలిసి రాదు సుమా."

"రేపు తేదెల్లుండి దశమి బుధవారం తప్పదు. నీకిదే చెప్పడం ఏమనుకున్నావో" అని బాల వితంతువైన రుక్కమ్మకు జుట్టు తీయించమని సోమి అమ్మమ్మ అంటుంది. ఇలా ఆమె బ్రతకడానికి వీలు లేని పరిస్థితులు కల్పించినప్పుడు జట్కావాడు ఆమెను వీరేశలింగం గారి తోటకు తీసుకొని వెళతాడు.

బాల వితంతువు 'రుక్కమ్మ' పడిన కష్టాలను చూసి చలించి పోయిన జట్కా వాడు -

"పంతులు గారి తోటకైతే నాకేమీ ఇవ్వనక్కర లేదు తల్లీ." అని అనడంలో రచయిత మానవతా దృక్పథం వెల్లడి అవుతుంది.

ఈ విధంగా రచయిత వితంతు సమస్యలను పునర్వివాహ వస్తువుగా తీసుకొని చేసిన రచనల్లో సంస్కార దృష్టితో పాటు ఎక్కువగా మానవతా దృక్పథం కనిపిస్తుంది. 'సుభద్రమ్మ', 'రామలక్ష్మి', క్రిందికా?

పైకా?', 'అన్నపూర్ణ', 'జూనియరు కాదు అల్లుడూ?', 'వేలపెడితే అల్లుడైనాడు', 'మేనరికం తప్పలేదు', 'తనదాకా వచ్చింది', 'తల్లి ప్రాణం', 'బుడ్డి వెంకయ్య మాష్టారి', అనే మొదలైన కథలలో బాల వితంతువుల దయనీయ గాథలు వాస్తవంగా చిత్రిస్తూ మానవతా దృక్పథంతో పరిష్కారాన్ని సూచించారు.

'కలుపు మొక్కలు' కథలో సంఘంలో గౌరవానికి నోచుకోని వేశ్యను కూడా ఒక వ్యక్తిత్వవంతమైన పాత్రగా రచయిత తీర్చి దిద్దారు. ఈ కథలో వేదపండితుడైన ఒక బ్రాహ్మణుడు తన కొడుకుకి మేష్టరీ ఉద్యోగం వేయించుకోవాలని ప్రయత్నం చేస్తూ దానికి సిఫార్సు కోసం ఒక వేశ్య ఇంటికి వెడతాడు. ఆమె ఆ పండితుణ్ని చూసి -

"తమ వంటి వారిని సత్కరించడానికి శక్తి లేదు. యోగ్యత కూడా లేదు . . . . . . . . ." అని అన్నప్పుడు ఆ బ్రాహ్మణుడు —

"అమ్మా! ఆనంద పారవశ్యం కలుగుతోంది. మాటలు రావడం లేదు. నీ యోగ్యత విన్నాను. విన్నంత నిదర్శనం కానబడుతోంది."

"...... నీ యోగ్యత చూడగా సిగ్గు పడవలసిన ఆవశ్యకం ఇంత మాత్రమూ కానబడదు." అని కూడా అంటాడు. ఆమె శీలవైచిత్ర్యానికి, ఔదార్యానికి, ఆ బ్రాహ్మణుడు ఆమె యెడల అపారమైన గౌరవాన్ని ప్రదర్శించి వేశ్యలలో ఇంతటి మానవతా మూర్తులున్నారా అని ఆశ్చర్య పడతాడు.

శ్రీపాదవారి మానవతా దృక్పథానికి వేశ్యలు ఆలంబనగా కనిపించే లక్షణం 'తులసి మొక్కలు' అనే కథలలో ఎక్కువగా కనిపిస్తుంది. వీరు ఈ కథలో నైతిక ధర్మాలు వ్యక్తిని బట్టి, పరిస్థితులను బట్టి మాత్రమే ఉంటాయి కాని, జాతిని బట్టి ఉండవని నిరూపించారు. ఈ కథలో వేశ్యాంగన పుంటులు నారు తన ఇష్టుడైన బ్రాహ్మణ యువకుడికి పెండ్లి చేయించడం ముఖ్యమైన కథ.

ఒక పాత్ర అయిన యోగేశలింగం పంతులు గారు "అమ్మాయి నీకు చెప్పవలసింది ఏమీ లేదూ నీ మూలంగా మా జాతి బాగుపడుతుంది." అని అన్న సందర్భంలో ఆమె –

"అగ్రజాతుల వారెవరైనా పెళ్ళాడడానికి సిద్ధపడితేనూ పిల్లల్లో అనేక మంది కుల స్త్రీలు అవుతారు" అని అంటుంది. తన శిష్యుడైన బ్రాహ్మణ యువకునికి ఆ వేశ్యా కుమార్తెతో వివాహం చేయించ దలచానని యోగేశలింగం పంతులు వారితో చెబుతాడు. వేశ్యలు తన ఇంటికి వచ్చినప్పుడు ఆయన –

"లోకంలో జరిగే సంగతులు నాకు బాగా తెలుసు. ఎటువంటి వాళ్ళూ గూడా మిమ్మల్ని కూర్చోమనడం తమకు అగౌరవం అని భావిస్తారు. కాని నా ఉద్దేశ్యం అది కాదు. నా ఎదుట మీరు ఆ కుర్చీల మీద కూర్చోడం నాకు అమర్యాద కాదు. ప్రస్తుతం హిందూ సంఘం స్త్రీల గౌరవాన్ని మరచి పోయివుంది . . . . . ." అని

వారి పట్ల ఎంతో సాదర భావాన్ని ప్రకటిస్తాడు.

ఈ విధంగా రచయిత వేశ్యావ్యవస్థ పట్ల మానవతావాద దృక్పథాన్ని ప్రకటించి వారిని ఇతర జాతులతో సమంగా చూడవలసిన ఆవశ్యకతను తమ రచనల ద్వారా నిరూపించారు.

* *

## 6.2 హేతువాదం

తెలుగునాట హేతువాద భావాలు

కందుకూరి వీరేశలింగం గారితో ప్రారంభమై సాంఘిక, సాహిత్య ఉద్యమాల ద్వారా వ్యాప్తిలోకి వచ్చాయి. ప్రాచీన కాలం నుంచే మన దేశంలో హేతువాద దృక్పథం ఒక ప్రత్యేక శాఖగా కొనసాగుతూ ఉన్నా, దాని ఫలితాలను సమాజం ఆధునిక యుగంలోనే ఎక్కువగా పొందింది. 19వ శతాబ్దిలో ఆంధ్ర సమాజం అంధవిశ్వాసాలకూ, సామాజిక అసమానతలకూ లోనై ఉంది. అప్పుడు ఆంగ్ల విద్యా మూలంగా చదువుకున్న వారిలో హేతువాద భావాలు అంకురించాయి. ఒక విషయాన్ని, కార్య కారణ భావంతో పరిశీలించడమే హేతువాద భావన. భౌతిక దృక్పథమూ, శాస్త్రీయతా అనేవి రెండూ హేతువాదానికి మౌలిక లక్షణాలు. హేతువాదం ప్రాతిపదికగానే ఆధునిక భావాలు వ్యాపించాయి. సామాజికంగానూ మత విషయకంగానూ ఈనాడు మనం చూస్తున్న కొత్త పద్ధతులన్నీ హేతువాద దృక్పథంలోనే

పుట్టి అభివృద్ధి లోనికి వచ్చాయి.

ఈ దృష్టితో చూసినపుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఆధునిక దృక్పథాలైన అస్పృశ్యతా నిరసన, కులభేద నిరసన, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ పునర్వివాహం మొదలైన వన్నీ హేతువాదం ప్రాతిపదికగానే పుట్టినటువంటివే. వీరి ప్రతి రచన లోనూ ఏదో ఒక విధమైన సామాజికాంశం హేతువాద పురస్సరంగా చిత్రించడం కనిపిస్తుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు సనాతన వైదిక కుటుంబంలో ఉద్భవించిన విలక్షణమైన హేతువాది. వీరి ఉద్దేశంలో "ఐహిక జీవితంలో వడుదుడు లెక్కువ అయితే మనిషి బుద్ధి వాటిని అధిగమించ గలదే. ఇక్కడ నియమ నిబంధనలన్నీ మనిషి బుద్ధి విభవాలే. దేవుడు సాయించినవి కావు".

"వాటి పరమప్రయోజనం ఇది స్వర్గం కావడమే. ఇది స్వర్గం చేసుకోలేని వాడు, అక్కడ స్వర్గం

అంటూ ఉంటే అది మాత్రం యెలా సాధించుకో గలుగుతాడు?" అని 'మార్గదర్శి' కథలో ఆయన తెలుగు వారికి గొప్ప సందేశాన్ని ఇచ్చారు. తమ అభిరుచుల ప్రకారం, విశయాల ప్రకారం విశ్వ విశ్వాసంతో విశ్వసించిన సిద్ధాంతాన్ని హేతు వాద ధోరణిలో తన రచనల్లో వెల్లడించారు.

తన రచనల ద్వారా ఆధునిక చైతన్యాన్ని అందించిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు అందరకూ ఆమోద యోగ్యమైన హేతువాదాన్ని ప్రకటించారు. 'మార్గదర్శి' కథలో 'శంభుశాస్త్రి' పాత్ర ద్వారా తాన్ని నమ్మకాల పేరుతో విశ్వాసంతో ఉన్న సమాజానికి హేతువాద దృష్టితో అభ్యుదయ మార్గాన్ని సూచిస్తారు.

"మన సనాతన వాఙ్మయం పరిశీలించు మన జాతికి ఇప్పుడు పాశ్చాత్య జాతులకు కంటే యెక్కువ భౌతిక దృష్టి వుండింది; కాని, కాలక్రమాన. అన్య జాతుల భౌతిక సాధన యెదుట మన భౌతిక సాధన అగాడయి పోయింది. దాంతో మనకి స్వరాజ్యం పోయి పరతంత్రభుత్వం యేర్పడి పోయింది."

"మనకి దాస్యం బలపడిన కొద్దీ ఆధ్యాత్మిక చింత పెరిగి పోయింది. దాంతో జనులకు అజ్ఞానం అలుముకుంది. వ్యక్తిత్వం నశించిపోయింది. చివరికి, అంతర్వేది అవతల వూళ్ళు లేవన్న స్థితి వచ్చేసింది. ఇది జాతికి అస్థిగతం అయిపోయింది. దీని దుష్ఫలితమే తృప్తి. మన వాళ్ళకి అర్థం కాదు గాని మనదాస్యం స్థిరపడి పోడానికి ఈ తృప్తే కారణం."

-ఈ వాక్యాలను రచయిత 'మార్గదర్శి' కథలో శంభుశాస్త్రి పాత్ర ద్వారా చెప్పించారు. దీనిని బట్టి రచయిత ఆధ్యాత్మిక దృక్పథమూ, దానికి వెన్నుముక గా నిలిచిన హేతువాద దృక్పథమూ తెలుస్తాయి.

"ఇంతకీ:- ఎవరెవరెన్నెన్ని ధర్మోపన్యాసాలు చెప్పినా ఐహికాలకి డబ్బే ప్రధానం. ఈ లోకంలో పుట్టి, యిది అస్థిరం అనీ, డబ్బు క్షుద్రం అనీ, జీవితం నీటిబుడగ అనీ నిరసించడం తెలివి మాలిన పని. ఈ లోకంలోకి వచ్చే దాకా దీనితో లేశమూ సంబంధం లేని జీవికి, యిక్కడ వుండినంత కాలమూ ఇది తప్ప మరొకటి లేదు. ఇక్కడ పుట్టి,

ఇక్కడి సర్వమూ క్షుద్రం అనుకుంటే గాని ఆ లోకం సిద్ధించక పోతే, అసలిక్కడికి రావడం యెందుకూ? ఇక్కడి సృష్టి అంతా యెందుకోసం? జగత్తంతా మిథ్య అయితే, మరి అలా బోధించే వాడి మాటు?"

రచయిత చాలా కథల్లో పాత్రల చేత హేతువాద పురస్సరంగా సంప్రదాయం పేరుతో కొనసాగుతున్న అశాస్త్రీయమైన అంశాల్ని ప్రశ్నించడం కనిపిస్తుంది. 'కచ్చితమైన జవాబు' అనే కథలో 'పూర్ణ' పాత్ర ద్వారా ఇలా పలికిస్తారు.

"........ ఆడాళ్ల బతుకింత తేలిక యెందుకయి పోయిందీ? దేవుడు మొగాళ్ళని మడి చేత్తోటి, ఆడాళ్ళని యెడం చేత్తోటి చేశాడా?" అంది.

ఇప్పటిదాకా హిందూ స్త్రీకి ఇలాంటి ఆవేశం కలగలేదు. ఆమె పురుషుడంటే దేవుడ నుకుంది. అతడు రాజనీ, సౌతరనీ నమ్మింది. మొగాడు ఏం చేసినా ఒప్పుకుంది. అన్నం తిన మంటే తింది. నిప్పు

పోయింది. నువ్వు మనిషివి కాదంటే వొప్పుకుంది. ఈకార ణాల చేత మొగాడికి కళ్లు మూసుకు పోతాయి."

"...... మొగాళ్ల కంటే రాక్షసులు నయం. అందులోనూ వేదాలూ, శాస్త్రాలూ చదువుకున్న వాళ్లు నల్లరాళ్ల కంటేనూ కఠినులు. కన్న కూతుళ్ల గొంతుకులు కూడా వాళ్లు, నదురూ, బెదురూ లేకుండా పరపరా కోచేస్తారు ........ నా మూలాన సాటి వాళ్లలో తనకి తలవొంపులుగా ఉందట. ఏమీ ఎరుగందే నేను ముండ మోశాననడం నా సాటి వాళ్లలో నాకు తలవొంపులుగా లేదూ? నా పెళ్లి నేనెరగను : నా మొగుణ్ణెరుగను; ముండా మొయ్యడం ఒక్కటే నాకు కనబడుతోంది. నా పెళ్లి నా కోసమా? ఇతర్ల కోసమా? నే నెరగని - నా కోసం కాని - పెళ్లి వల్ల నాకు వెధవరికం ఏమిటోయి?"

ఈ మాటల ద్వారా బాలవితంతువు తన దుస్థితికి గల కారణాలను సహేతుకంగా ప్రశ్నిస్తుంది. వాస్తవదృష్టితో చూసినప్పుడు పురుషునితో స్త్రీ

సమానంగా తేక పోవడమూ, స్త్రీల నిర్బంధ వైధవ్యమూ సహేతుకాలు కావు అని చెప్పగలం. ఇది శ్రీపాద వారి హేతువాద దృక్పథాన్ని తెలియ జేస్తుంది. ఈ విధంగా సాంఘిక సమస్యలను హేతువాద దృష్టిలో ఆయన కథల్లో చిత్రించారు.

'బుచ్చి వెంకయమ్మ' అనే కథలో ఉత్తమ పురుషలో పాత్ర చేత కథను చెప్పించడం ఉంటుంది. రెడ్డి కులంలో జరిగిన బాల వితంతు పునర్వివాహం దీనిలోని కథావస్తువు. దీనిలో

"మంచిదైనా సరే కొత్త ఆచారం అంటే ఇప్పటి వారు అంగీకరించరు".

లోకంలో అన్ని దేశాలలోనూ, అన్ని మతాలలోనూ వితంతు వివాహాచారం వుంది. బలాత్కార వైధవ్యం ఒక్క మన దేశంలో మాత్రమే వుంది. ఇది ఇయిలా ఉండి పోవాలంటే వుండిపోదు. అంతర్వేది అవతల వూళ్ళ లేవంటే నమ్మే కాలం పోయి చాలా రోజు

లయింది. తెల్లదొరల యేలుబడి వచ్చేక కూడా సంఘం మునుపటి లాగే వుండి పోవాలంటే వుండి పోదు."

"బ్రాహ్మల్లోనే ఈ ప్రచారం ముందు బయల్దేరింది."

"ఇప్పుడు బ్రాహ్మలకి ఇతర జాతి స్త్రీలని పెళ్ళాడేటంత ఉన్నత భావాలు కూడా పుడుతున్నాయి."

ఈ విధంగా బాలవితంతువు అయిన రెడ్డి యువతి తన జీవితం గురించి చెబుతూ పలు విధాలైన అత్యంత ఆధునిక భావాలను ప్రకటిస్తుంది. ఇది రచయిత హేతువాద దృక్పథానికి, ఆధునిక దృష్టికి ప్రతీక.

ఇలా శ్రీపాద వారు తమ రచనలలో హేతువాద దృక్పథంతో కూడిన ప్రజాస్వామ్య దృక్పథాన్ని కూడా కనబరచారు. కుటుంబంలో పురుషునితో స్త్రీని కూడా సమాన స్థాయిలో నిలిపారు. సమాజంలో వర్ణధర్మం కంటే మానవతా ధర్మం విలువైనదనీ, దాని ముందు అందరూ

సమానులేనని నిరూపించారు.

7

# సామాజిక చైతన్యం

# 7.1 కులం

## 7.1.1 కులభేద నిరసన

సమాజంలో ఒక్కొక్క కులానికి ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు బలంగా కనిపిస్తాయి. కులాల మధ్య సంబంధాలు ఉండవు, ఎవరికి వారికే తమ కులం గొప్పది అనే పట్టింపు ఎక్కువగా ఉంటుంది. కులాల మధ్య పెళ్ళిళ్లు విందు భోజనాలు వంటివి అంగీకారం కాదు. ఇటువంటి కులాల విభజన సమాజాభివృద్ధికి ఆటంకం అనే భావన కొందరిలో ఉంది. వీరు కులాతీతమైన వ్యవస్థను కోరుకుంటారు. ఇది అత్యంత ఆధునికమైన భావనగా ఈనాడు వ్యవహరింపబడుతోంది. ఈ దృక్పథానికి చెందిన రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. వీరు రచించిన చాలా కథల్లో ఈ భావన స్పష్టంగా కనిపిస్తుంది.

'పెళ్ళాడ తగ్గా మొగాడేడీ' అనే కథలో హరిజన క్రైస్తవులు ప్రధాన పాత్రలు. 'సుభద్ర' బాలవితంతువు. వాళ్ళది అగ్రహారంలో పేరు పొందిన బ్రాహ్మణ కుటుంబం.

ఆమెను తండ్రి సోదరులు కొట్టి ఒక రాత్రి వేళ ఊరి చివర పుంతలోకి నెట్టివేస్తారు. ఆమె ఆదెబ్బలకు తాళలేక స్పృహ తప్పి పడిపోతుంది. రాత్రంతా ఆమె ఆపుంతల్లోనే ఉంటుంది. తెల్లవారు ఝామున ఈతతోపుల్లో మూలుగుతూన్న సుభద్రను ఆదారిన వెళ్ళే 'ఎలిజబెత్తు', 'జకరయ్య' అనే హరిజన క్రైస్తవ దంపతులు చూస్తారు. వెంటనే ఆమెను ఒడిలోకి తీసుకొని సేవ చేస్తారు. సుభద్ర వారి దగ్గర అంతకు ముందు పొందని తల్లిదండ్రుల ప్రేమను ఆప్యాయతను పొందుతుంది. ఈ సన్నివేశంలో రచయిత హరిజన దంపతులు చూపిన వాత్సల్యం, వారి దగ్గర బ్రాహ్మణ బాలవితంతువు పొందిన అనుభవం ఎంతో సహజంగా వర్ణించారు.

హరిజన దంపతులు "నువ్వు ఇక్కడ ఇలాగ ఎందుకు పడి ఉన్నావు" అని అడిగినప్పుడు సుభద్ర 'కొట్టి ఈడ్చి పారేశారు' అని సమాధానం చెబుతుంది.

"నిన్నెవరూ చూడలేదా?"

"మహేంద్రవాడ బ్రాహ్మలిద్దరు చూశారు"

"చూసి - నిన్ను యిక్కడే అడ్డిపెట్టేశారేం?"

"అయ్యా ................"

"పలకరించారా?"

"పులిని చూసినట్లు పారిపోయారు"

"ఏం?"

"అది మా జాతి లక్షణం"

"అయితే ఇది మా జాతి లక్షణం"

- - - - - - - - - - -

"మీ వాళ్ళు యమదూతలా

"అంతకంటే అన్యాయం"

- - - - - - - - - - -

"అయితే మేమెలా కనపడుతున్నామో నీకు"

"దేవదూతల్లాగా"

- - - - - - - - - - -

"నేను యేకేవర్నే?"

"ప్రాణి కోటిలో మాకు సాటి దానవు.
దేవుని రాజ్యంలో మాతో సమానంగా హక్కులు గల దానవు
ఇప్పుడు నువ్వు కష్టంలో ఉన్నావు కనుక నీకు సేవ
చేస్తే దేవుడు మా పాపాలు మన్నించి మాకు మోక్షం ఇస్తాడు.
ఇదే యేసు ప్రభువు మాకు అందరికీ చేసిన మహోపదేశం"

"యువతికి వ్యధిత హృదయం మీద అమృతం చిలికినట్లయింది. ఆమె రెండు చేతులూ అప్రయత్నంగా అంజలి ముద్ర వహించాయి. కళ్ళ నీళ్ళు వచ్చాయి. పెదవులు రావి రేకల్లాగ కదల పోయాయి"

పై సంభాషణల మూలంగాను రచయిత సుభద్రను వర్ణించిన తీరును బట్టి సమాజంలో కులం కంటే మానవత్వం గొప్పదని తెలుస్తుంది. బ్రాహ్మణ స్త్రీ మాదిగన దంపతుల మధ్య అనూహ్యమైన వాతావరణాన్ని రచయిత ఈ కథలో సృష్టించారు. వాళ్ళ మధ్య కులం అనే అడ్డు తెరని తొలగించి మానవత్వానికి విలువ నిచ్చి సమాజం అంతా ఒకటేనని భావనాన్ని రచయిత

ప్రకటించారు.

ఒక కులం లోని అంతర్భేదాలు కూడా తగవు అనే భావాన్ని 'సాగర సంగమం', 'జూనియరు కామా అల్లుడు' వంటి కథలలో ప్రదర్శించారు.

'సాగర సంగమం' కథలో నరసిమ్ములు పాత్ర ద్వారా "కులం అయితే యెలాంటి పిల్లయినా సమాధాన పడవచ్చు. పెద్ద కులం అయితే దెబ్బలు వచ్చినా కులం చెడదు. ఇదేమిటి యిది? ఎటు చూచినా సర్వ సమానమే. కూడు లేకపోయినా బతకవచ్చు; గాని కులం లేకపోతే యెలాగా?" అని కరడు గట్టిన కుల స్వభావాన్ని చూపించారు. నరసిమ్ములు కొడుకు మరో కులానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకోబోయినపుడు,

"ఇటు మాలలకీ, అటు మాదిగలకీ కూడా దూరమై పోతాం"

"అందుకోసం వాళ్ళ యిద్దరినీ విడదీస్తే పాపం కదా?" అని నరసిమ్ములు, పోలమ్మ

మాట్లాడుకోవడం ద్వారా కులం కంటే మానవత్వం గొప్పది అనే అభిప్రాయాన్ని నిరూపించారు. మాల మాదిగల మధ్య ఉన్న కుల భేదాల స్థితిని పరిచయం చేశారు.

'కొత్త చూపు' కథలో అగ్రహారికుల్లో సంపన్నుడైన రామశాస్త్రి జీవన విధానం అంటూ నవ్య మార్గంలో కొనసాగుతుంది. అగ్రహారంలో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, మాల మాదిగలకు జన్మం చేత భేద భావం చూపవని సాముగారడీ విద్యలో అందరికీ ప్రవేశం కల్పిస్తాడు. తన కుమార్తెకు అదే భావం కలగాలని భావిస్తాడు.

ఈ కథలోనే, శ్రోతా, శాస్త్రుల సంభాషణలో "బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు, మాల మాదిగలకు జన్మలో నేనూ భేద భావం చూపించను" అని పలికిన వాక్యం ద్వారా జన్మ చేత కలిగే కుల విభజనకు విలువ లేదనే భావాన్ని రచయిత ప్రకటించాడు.

'సాగర సంగమం' కథలోనే "కులం కూడు పెడుతుందా?

" . . . . కోరుకున్న పెనిమిటి దొరికితే కులమెందుకూ? కూడెందుకూ?" అన్న ఇటువంటి వాక్యాల ద్వారా రచయిత కుల నిరసన భావాన్ని, మాల, మాదిగల మధ్య అంతరం ఉండకూడదనే సందేశాన్ని ప్రకటించారు.

శ్రీపాద వారికి కులాల గుర్తింపు వలన మానవ సంబంధాలు దెబ్బ తింటాయనే భావ మున్నట్లుగా తెలుస్తుంది. కులాచారాలు కరుడు గట్టిన అంధ విశ్వాసాలుగా మారడం వలన మానవులు సహజంగా పొందవలసిన ప్రేమను ఆదరణని పొందలేక పోతున్నారు. అందువల్ల కులాల కట్టుబాట్లు ఉండకూడదు, అనే దృక్పథాన్ని శ్రీపాదవారు తమ రచనల ద్వారా ప్రకటించారు.

* *

## 7.1.2 అస్పృశ్యతా నిరసన

అంటరానితనం అమానుషం. దానిని రూపు మాపినపుడే మన సమాజానికి అసలైన స్వాతంత్ర్యం, అనే భావనలో శ్రీపాద వారు సమాజంలో వేళ్ళూనుకొని ఉన్న అస్పృశ్యతను ఎంతో సహజంగా 'ఇలాంటి తవ్వాయి వస్తే...' అనే కథలో చిత్రించారు. సమాజంలో అంటరాని వారుగా పరిగణించబడే వారి జీవన స్థితిగతులు, వారిపై మతం ప్రభావం, అగ్రవర్ణాల వారి దృక్పథం ఈ కథలో సవివరంగా చిత్రించారు.

ఒక బ్రాహ్మణ అగ్రహారంలో అగ్ర వర్ణాల వారి చెరువులో నీటిని తీసుకోడానికి అస్పృశ్యులకు అవకాశం లేదు. కాని ముస్లిం మతం పుచ్చుకొన్న వారికి ప్రవేశం ఉంది. ఒకనాడు 'సోమయాజులు' అనే బ్రాహ్మణుడు చెరువులో స్నానం చేస్తూ ఉన్నప్పుడు, కొందరు మాదిగ స్త్రీలు మంచి నీళ్ళు తీసుకొని వెళ్ళడానికి వస్తారు. దానికి ఆ బ్రాహ్మణుడు "నిప్పులు తొక్కుతున్నట్టు అయిపోయాడు" వాళ్ళను పొమ్మని "ఒకట పొలికేక పెట్టాడు" వాళ్ళు దాన్ని లెక్క చేయకుండా ముందుకు

వచ్చారు. మా చెరువు కెందుకొచ్చారూ?" అని అతడు ప్రశ్నించినపుడు –

"మీదేమిటి మాదేమిటి"

"వొక్కటే చెరువు చేశాడండి దేవుడు, మనందరికీ."

దానికి సమాధానంగా గట్టు మీద ఉన్న అతని కూతురు –

"స్వరాజ్యమూ లేదు, వల్లకాడూ లేదు, దేశం అంతా మాల కూడయి పోతుంది" అంటూ పళ్ళు నూరుకుం-టుంది.

---

"............ చాకళ్ళు దిగడం లేదండి మీ చెరువులో?"

"తురకలు దిగుతున్నారు గదా, యేమి చేస్తున్నారండి మీరు"

అని ఒక మాదిగ స్త్రీ గుచ్చి, గుచ్చి అడిగింది. దానికి అతడు తీవ్రమైన కోపాన్ని ప్రదర్శించాడు.

పై సన్నివేశం మన సమాజంలో ఉన్న అస్పృశ్యతా భావనకు వాస్తవ చిత్రణ. అగ్రవర్ణా లకు కేటాయించిన చెరువులో చాకళ్ళ నీళ్ళు తోడుకు

వెళ్ళవచ్చు, తురకలూ నీళ్ళు తోడుకెళ్ళవొచ్చు. కాని మాల, మాదిగలకు అవకాశం లేదు. వాళ్ళు చెరువు లోకి దిగకూడదు కూడాను. ఇటువంటి కట్టుబాటు ఒకప్పుడు మన సమాజం లో ఒక రుగ్మతగా వ్యాపించింది. దీన్ని కానసాగనివ్వరాదనే భావాన్ని రచయిత పై సన్నివేశంలో మాదిగ స్త్రీ ప్రశ్నించడం ద్వారా నిరూపించారు.

స్నానం చేస్తున్న బ్రాహ్మణుడు, నీళ్ళ కోసం వచ్చిన మాదిగ స్త్రీలలో ఒకామె మాట్లాడుకుంటున్నప్పుడు స్నానం చేద్దామని వస్తున్న బ్రాహ్మణులు ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోతారు. ఒక కమ్మ స్త్రీ "రోజులు మారిపోయాయి" అని బిందెలో నీళ్ళు తోసికొని వెళ్ళిపోతుంది. ఒక వైశ్యుడు వచ్చి రేవులో కాళ్ళు కడుక్కొని వెళ్ళిపోతాడు. అదే సమయంలో కంగారుగా అతని కూతురు -

"అదిగో, రామినీడు గారి అబ్బాయి కామోస వాళ్ళ కుండల్లో నీళ్ళు పొయ్యడానికి బిందె పట్టుకు వస్తున్నాడు. అతను వాళ్ళ కుండల్లో పోసేటప్పుడు కొన్ని

యినా కిందపడి చెరువులోకి దారితీస్తాయి నీళ్ళు. తెమల్చుకో తెమల్చుకో" అంటూ అతన్ని కంగారు పెట్టిందామె.

"ఈ మాట చెవిని పడేటప్పటికి, పాము యాజులకి, కరిగిన సీసం కాళ్ళ కిందికి పాకి వస్తున్నట్లయింది."

ఈ సన్నివేశాన్ని బట్టి అగ్రవర్ణాల వారు మాల మాదిగలను అంటరాని వారుగా చూడడం అనే సమస్య ఎంత తీవ్రంగా ఉండేదో తెలుస్తుంది.

ఆ ఊరి మాదిగ పల్లెలో మిషనరీల ప్రభావం చేత, కొందరు క్రైస్తవ మతం స్వీకరించారు. అయినా వాళ్ళ జీవన విధానంలో గాని, అంటరానితనంలో గాని, ఏ విధమైన మార్పు రాలేదని రచయిత సూచించారు.

ఆ ఊరికి కొత్తగా ఒక కిరస్తానీ పంతులు వచ్చాడు. అగ్రవర్ణాల వారికి చెరువులో మాదిగలను దిగనివ్వక పోవడానికి అతడెంతగానో వ్యథ చెందుతాడు. ఆ చెరువులో ఊరకుక్కలు దిగగా లేనిది మాల మాదిగలను దిగనివ్వక పోవడం అతన్ని ఆలోచింపజేసింది. ఊరకుక్కలకున్న గౌరవం

క్రైస్తవ మతం స్వీకరించిన వారికి లేకపోవడానికి మిషనరీల ప్రవృత్తే కారణమని కిరస్తానీ పంతులు ద్వారా రచయిత చెప్పించారు. దురకల మతం పుచ్చుకొన్న అన్ని కులాల వారు ఒక్కటే అయి పోయారు. అగ్రవర్ణాల వారితో వారికి రాకపోకలు ఉన్నాయి. క్రైస్తవం పుచ్చుకున్న మాల మాదిగలకు అటువంటి అవకాశం లేక పోగా అంటరానితనం కొనసాగుతూ వచ్చిందని, దీనికేదో పరిష్కారం ఆలోచించాలని కిరస్తానీ పంతులు భావిస్తాడు.

ఒకసారి వేసవి కాలంలో మాల, మాదిగలకు కేటాయించిన చెరువులో పాతనీరు ఎండిపోయి కొత్త నీరు ఇంకా ప్రవేశించలేదు. అప్పుడు వారికి నీటి సమస్య ఎదురవుతుంది. ఆ కారణంగా మాల మాదిగలు అగ్రవర్ణాల వారికి కేటాయించిన చెరువు నుంచి నీళ్ళు తోడుకుంటామని అడగడంతో వారికి అగ్రవర్ణాల వారికి వివాదం ప్రారంభమవుతుంది. అంటరానితనం అనే సాంఘిక దురాచార మూలంగా, మాల మాదిగలకు నీళ్ళివడాన్ని అగ్రవర్ణాల వాళ్ళు తిరస్కరిస్తారు. ఈ సందర్భంలో క్రైస్తవ మతం పుచ్చు

కున్నా వారి సాంఘిక సమస్య తీర లేదనే సత్యాన్ని రచయిత వెల్లడిస్తున్నారు. ఈ సందర్భంలో అగ్రవర్ణాల వారికి చెందిన పలువురు మాల మాదిగలు క్రైస్తవ మతం పుచ్చుకోవడాన్ని ఎద్దేవా చేస్తారు.

తాగడానికి నీళ్ళు లేక బాధ పడుతున్న మాల మాదిగలు. వాళ్ళ పక్షాన సాయపడమని కిరస్తానీ పంతులు తాయాకా కాంగ్రెసు అధ్యక్షుణ్ణి కలుస్తాడు. అతడు హరిజనులంతా కాంగ్రెస్ పార్టీలో చేరితే ఈ సమస్యని దేశ సమస్యగా మార్చి మీకు సహకరిస్తానని చెపుతాడు. ఇది తమ పని జరిగే పద్ధతి కాదని కిరస్తానీ పంతులు విచారి-స్తాడు. దీనిని నాటి కాంగ్రెసు పార్టీ హరిజన సమస్యల పరిష్కారం కంటే పార్టీ ప్రచారానికే ఎక్కువగా ఉపయోగించుకోవడానికి నిదర్శనగా రచయిత మన ముందు ఉంచారు.

తనని కలుసుకున్న హరిజన సంఘాధ్యక్షుడు ఖద్దరు కట్టి, హిందీ నేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్సు పార్టీకి అనుకూలురు కావడమే కొంతవరకు

పరిష్కారమని కిరస్తాని పండులతో అంటాడు. ఇలా అంట
రాని తనం కారణంగా తాగే నీరు దొరకక పోవడమనే సమస్య
తీరలేదు. ఈ సన్నివేశాల ద్వారా రచయిత అస్పృశ్యతా
నిర్మూలనను సమాజంలో అటు క్రైస్తవ మతం గానీ, ఇటు కాంగ్రె
స్ పార్టీ గానీ, హరిజన నాయకులుగాని ఉపయోగపడడం
లేదనే సత్యాన్ని వెల్లడి చేశారు. ఇస్లాం మతం పుచ్చుకోవడం
ద్వారా కొంత వరకు ఈ సమస్య పరిష్కారానికి మాల
మాదిగలకు కొంత సహకరించిందనే వాస్తవాన్ని తర్వాత
కథలో చిత్రించారు. మాదిగ 'పిస్సన్న' అనే గ్రామ నౌకరు
'కరీం' అనే తురకవాడి ప్రోత్సాహంలో ఆ మతం పుచ్చు
కుంటాడు. ఒకరోజున బ్రాహ్మణులు స్నానం చేస్తున్న
చెరువులో కరీం అతనితో పాటు తురక మతం
పుచ్చుకున్న పిస్సన్న దూకుతారు. వారిని మాల
మాదిగలందరూ. అనుసరించి చెరువులోకి దిగుతారు
బ్రాహ్మణులు ఈ దృశ్యాన్ని చూసి ఏమీ చేయలేకపోతారు.
అంటరాని తనం వల్ల మాల

మాదిగలు అగ్రవర్ణాల వారి చెరువులో దిగక పోవడానికి ఏ హేతువు లేదని యెరుకవంతం పుచ్చుకున్న విసున్న చెరువులో దిగడం ద్వారానూ, అతన్ని ఇతరుల అనుకరించడం ద్వారానూ అగ్రవర్ణాల వారు ప్రధానంగా బ్రాహ్మణులు గుర్తించి నట్లు రచయిత కథను ముగించారు అస్పృశ్యతా సమస్య సమసి పోవాలి అనే దిక్కులో హేతుబద్ధంగా ప్రతిపాదిస్తూ రచయిత ఈ కథను రచించారు.

మాల మాదిగల పట్ల చూపుతున్న వివక్షను నిరశిస్తూ రచయిత 'బ్రాహ్మణాగ్రహారం', 'కలుపు మొక్కలు' 'విమానం ఎక్కబోతూనూ', 'వెలపెడితే అల్లుడైనాడు'; మొదలైన కథలను రచించారు. ఈ కథలలో అస్పృశ్యతా సమస్యను పాత్రచిత్రణ, సన్నివేశ కల్పనల ద్వారా వాస్తవంగా చూపి రచయిత తన దృక్పథాన్ని వెల్లడించారు.

'పుల్లంరాజు' కథలో చక్రవర్తి పాత్రలో రచయిత కనిపిస్తారు. చక్రవర్తి బాంబాయిలో

తాను వెళ్ళిన సభలన్నింటి లోనూ "అతనికి నచ్చినది మనస్సుని కరిగించినది అస్పృశ్యతా నివారణ సభ" అని ప్రకటించడం ద్వారా రచయిత దృక్పథం తెలుస్తోంది. ఈ కథలో -

"మేమూ మనుష్యులమే: మీ వాళ్ళు కోస్తే యెలాంటి రక్త, మాంసాలు వున్నాయో మా వాళ్ళు కోసినా అలాంటివే వున్నాయి. మీరు కుక్కల్ని ముట్టుకుంటారు. పందుల్ని తింటారు. మేము ఆ జంతువుల కన్నా హీనులమా?"

"మేమేమీ అక్రమపు కోరికలు కోరడం లేదు. మాకంటె మీ యెక్కువ యెలాగో చెప్పండి? మీరెలాంటి హిందువులో మేమూ అలాంటి హిందువులమే. మీకు రాముడు, కృష్ణుడూ యెలాంటి దేవుళ్ళో మాకూ అలాంటి దేవుళ్ళే"

- - - - - - - - - -

"మేము మీ మధ్య యెందుకు కాపురం వుండకూడదూ? మీ నూతుల్లోనూ, మీ చెరువుల్లోనూ యెందుకు నీళ్ళు తోడుకోరాదూ?"..... అని ఒక పాత్ర ద్వారా

అస్పృశ్యత అర్థం లేని ఒక మూఢాచారం అనే విషయాన్ని వాచ్యంగా చెప్పించారు. సంఘంలో పరిణామం వచ్చిందని ఇక ఎంత మాత్రమూ అస్పృశ్యుల కొనసాగ కూడదని అగ్ర వర్ణాల పాత్రల చేత చెప్పించారు.

"మనం గొప్ప వాళ్ళమే మన జ్ఞానం అనంతమే. మన నిర్మాణం కూడా చక్కనిదే. అయితే కాల క్రమేణా అది శిథిలమై పోయింది. ఇప్పుడు మనలాగా బ్రాహ్మణ్యం చాలదు"

"బ్రాహ్మణుల కృత్యాలు బ్రాహ్మణులకే నచ్చడం లేదు. అస్పృశ్యుల స్థితి అయోమయంగా వుంది. మన ఔదాసీన్యం వల్ల వాళ్ళు మతాంతరులై పోతున్నారు. మన సంఘం ఒక మూల కుళ్ళి పోతూ వుండగా ఒక మూల తగ్గి పోతూ వుంది. ఇది చాలా అపాయకరమైన సంగతి. మనమై పూనుకుని పని చెయ్యడం మంచిది. లేకపోతే అస్పృశ్యు లెదురు కుంటే యేం చెయ్యగలమూ? ......" అని అగ్రవర్ణాల చేత పలికించడం ద్వారా అస్పృశ్యతా నివా

రచనకు సంఘం ఎంతో సుముఖంగా ఉందని, దానిని ఎవరూ అడ్డుకోలేరని రచయిత భావించారు. ఈ కథలో రామచంద్రయ్య పాత్ర ద్వారా అంటరానితనం తొలగి పోయేలా రాజాజ్ఞాపత్రం ఘబడినట్లుగా స్పష్టం చేశారు. మాల మాదిగల మధ్యగల అంతర్విభేదం చాలా జటిలంగా ఉందనే విషయాన్ని కూడా ఈ కథలో రచయిత చూపించాడు.

* *

## 7.2 విద్య

### 7.2.1 విద్యా విధానం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ రచనల ద్వారా పాఠకుల కందించిన సామాజికాంశాలలో విద్యా విధానం ఒకటి. వీరు ఒక వ్యవస్థ స్వరూపాన్ని విశదీకరిస్తూనే దానిలోని లోపాలను వ్యాఖ్యానించడం ప్రముఖంగా కనిపిస్తుంది. గురువుల బాధ్యత, విద్యార్థుల దీక్ష, విద్యావిధానానికి ప్రాణభూతమైనవి. దేశీయ విద్యా విధానం వ్యాపించక పోవడానికి మనమే కారణం. విద్య అనేది ఒక శాస్త్రం అనీ, విద్యగురించి నిశ్చయమైన అభిప్రాయాల్ని ప్రకటించారు.

### 7.2.2 విద్యావకాశాలు :

'కీలెరిగిన వాత' అనే కథలో కృష్ణవేణి బి.ఏ పట్టం పుచ్చుకున్న తర్వాత అక్కడే ఉండి ఎం.ఏ చదవమని ప్రోత్సహించిన ప్రిన్సిపాలుతో.

"నేను ఎం.ఏ. లో చేరితే నాకేం వస్తుంది? నేను కాలేజీలో వుండే నా వాళ్ళకి నేనెంత

మందికి విద్యా విధానం చెప్పగలుగుతాను? మీకు కోపం వద్దు. ఇప్పటి విద్యా విధానం ఏమీ బాగా లేదు. మనం డబ్బున్న వాళ్ళం అనుకునే వాళ్ళకి తప్ప చదువుకుందాం అనుకునే వాళ్ళకిది అందుబాట్లో లేదు. ఇతరుల ప్రవేశించ గలిగిన వాళ్ళయినా అందరూ ఉద్యోగాలాసించి వచ్చే వాళ్ళే. ఇది నాకు నచ్చలేదు .....”

“మా ఊళ్ళో నేనొక పాఠశాల నడుపుతాను. ప్రారంభోత్సవం మీ చేతి మీదగానే జరిపిస్తాను. నా పద్ధతి మీకప్పుడు తెలుస్తుంది .....” అని నిర్మొహమాటంగా అంటుంది. ఈ సంభాషణ ద్వారా రచయిత నాటి విద్యా విధానం స్వరూపాన్ని వివరిస్తూ విద్య డబ్బున్న వాళ్ళకే గానీ, చదువుకుందామనుకునే వాళ్ళకు కాదని దానిలోని లోపాల్ని ఎత్తి చూపారు. దానితోపాటు విద్యావంతులు స్వస్థలాలకు వెళ్ళి తోటి వారిని విద్యావంతులుగా చేయాలి అనే సామాజిక బాధ్యతను సందేశ రూపంగా చెప్పారు.

7.2.3 ఆంగ్లవిద్యా ప్రభావం :

'సముద్రము నందలి మంచు కొండలు', అనే కథలో -

"అయితే బి.ఏ. గారు ఇలాంటి చిన పని కోసం ఎనిమిది మైళ్ళు నడిచి వెళ్ళడం నామర్దాకేమోనని"

"అతను కొడుకును ఇంగ్లీషులో దింపక వైదికంలా తయారు చేస్తున్నాడు"

అనే వాక్యాల ద్వారా ఆధునిక విద్యా విధానం నాటి సమాజంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిందో తెలుసుకోవచ్చు.

సమాజంలోని వివిధ విషయాలను వ్యాఖ్యానిస్తూనే రచయిత విద్యా విధానాన్ని గురించి తనదైన నిర్ణయాలను ప్రకటించారు.

'తన దాకా వచ్చింది' అన్న కథలో సంప్రదాయపరుడైన 'రాజులు' తన పెద్ద కూతురు చంద్రమ్మని వెంకట్రావుకిచ్చి పెండ్లి చేస్తాడు. వెంకట్రావు ఇంగ్లీషు చదువు

చదువుకోవడం చేత ఉద్యోగం చేస్తాడని ఆరాజులు ఆశ పడతాడు కాని వెంకట్రావు సంస్కరణ భావాలకు లోనై వీరేశలింగం పంతులు గారి మార్గాన్ననుసరించి వారు ప్రారంభించిన వితంతు వివాహాలను చేయిస్తూ వుంటాడు. వెంకట్రావు ప్రభావంతో ఆరాజులు రెండో కూతురుకు వితంతు పునర్వివాహం జరుగుతుంది. ఈ సందర్భంలో ఆరాజులు "దిక్కుమాలిన ఇంగ్లీషు కొంప ముంచుతుందని మొదట్నించి భయపడుతూనే ఉన్నాను" "అసలింగ్లీషే మాయలు నేర్పుతుంది"

"ఇంగ్లీషు చదువులు వచ్చాక దేశంలో అకాలమరణాలు, వక్రబుద్ధులూ రాకపోతే మరేం వస్తాయి?" అని అంటాడు.

ఈ వాక్యాలను బట్టి ఇంగ్లీషు విద్యా విధానం కారణంగా ఆనాటి సమాజంలో కలిగిన పరిణామాన్ని, దాని పట్ల ఉన్న అనుకూల, ప్రతికూల భావాలను తెలుసుకోవచ్చు.

* *

## 7.3 నిరుద్యోగ సమస్య

నిరుద్యోగ సమస్య: ఈ శతాబ్ది తొలి రోజుల నుంచే విద్యావ్యవస్థలో ఎంతో మార్పు వచ్చింది. ఇంగ్లీషు విద్యా విధానం బాగా వ్యాప్తి లోకి వచ్చింది. పాఠశాలలు పెరిగాయి. విద్యార్థులు పెరిగారు. అందరకూ చదువుకునే అవకాశాలు ఎక్కువయ్యాయి. దీని ఫలితంగా వృత్తులు వెనుకబడి ఉద్యోగాల కోసం చదువుకున్న యువకులు ఎగబడడం ఎక్కువైంది. విద్యావకాశాలు పెరిగినంత అధికంగా, ఉద్యోగాలు పెరగక పోవడం చేత నిరుద్యోగ సమస్య పుట్టుకొచ్చింది. చదువుకున్న వాళ్ళు ఉద్యోగమే చేసి సంపాదించుకోవాలి అనే అభిప్రాయం వ్యాపించడం చేత నిరుద్యోగులకు సంపాదనా మార్గాలు కరువయ్యాయి. రచయిత తన కాలం నాటికి ఎదుగుతూ పైకొస్తున్న ఈ నిరుద్యోగ సమస్యను చాలా కథలలో చిత్రించారు. 'గుర్రప్పందాలు' అనే కథలో

"మొన్నటి విఘ్నేశ్వర చవితికి సరిగా పాతిక రోజులు నిండాయి. నాలుగేళ్ళయి బి.ఏ. పాసు కూడా అయ్యి

పుట్టింట గుప్పెడు మెతుకుల కాసారం లేక పండుగ పబ్బాల కూడా కదలకుండా కణాయించు కూర్చుంది. బి.ఎ ప్యాసయినాక నూట పాతిక దక్కలేదే అయినా కొత్తు నా చేతిలో పెట్టకపోతే యింకెన్నాళ్ళు మేపమంటావే కూతుర్ని పెట్టి మరీ? ...... అని తన సవతి కొడుకు బి.ఎ చదివి కూడా ఉద్యోగం లేక ఏమీ సంపాదించలేక పోయున్నాడని సుబ్బమ్మ తన కూతురుతో అంటుంది. ఇది రూపు దిద్దుకుంటున్న నిరుద్యోగ సమస్యకు ఉదాహరణ. ఈ కథలో సుందరి అన్నగారు గోపాలశాస్త్రి, భర్త చలపతిరావు ఒకే చోటు ఉద్యోగానికి దరఖాస్తు చేస్తారు. సుందరి తల్లి ఆ ఉద్యోగం అల్లుడుకే రావాలని అనుకుంటుంది. ఈ సందర్భంలో సుందరి తల్లి సుబ్బమ్మ, చలపతిరావు పాత్రల సంభాషణలు ప్రవర్తించిన తీరు మధ్యతరగతి కుటుంబాలలో తీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్యకు అద్దం పడుతున్నాయి.

చలపతిరావు భార్యతో "ఆ పాతిక గుమస్తాగిరి కోసం రెండువందల పాతిక దరఖాస్తులు

వచ్చి వున్నాయిప్పటికి" అని అన్నప్పుడు

"ఆకాశం అంతా నిండి, తన లాగే నూట యిరవై నలుగురు యువతులు, ఇంత అన్నం కోసం అంగలార్చుతూ కనిపెట్టుకుని వుండినట్టనిపించిందామెకి"

"వారి పురుషులందరూ మిడి యెండలో చెమటలు వోడ్చుకుంటూ కంపెనీ ఆవరణలోగ పడిగాపులు పడి వుండినట్టున్నా కనబడిందామెకి" - ఈ వర్ణన ఉద్యోగార్థులైన నిరుద్యోగుల దుస్థితిని వెల్లడి చేస్తుంది.

ఒక ఉద్యోగానికి వచ్చిన వారిని ఉద్దేశించి మేనేజరు దీనికి నూర్లు పైనే వారు సరిపోతారు వచ్చిన వారిలో డబుల్ ఎం.ఏ.ల దాకా చదివిన వారున్నారు. యూనివర్సిటీలు అనేక వేల మంది పట్టభద్రులను తయారు చేస్తున్నాయి, అని ఇంకా అనేక విషయాలు మాట్లాడతాడు. అతని మాటల్లో విద్యార్హతలు ఎక్కువ ఉన్నవాళ్ళు చిన్న ఉద్యోగాలకు ఎగబడుతున్నారని, ఉద్యోగావకాశాలను పట్టించుకోకుండా యూనివర్సిటీలు అసంఖ్యాకంగా

పట్టభద్రులను తయారు చేస్తున్నాయనే విషయాన్ని విమర్శించడం కనిపిస్తుంది.

ఈ కథలో ఉద్యోగం కోసం వచ్చిన వారిని కంపెనీ వారు అంచెలంచెలుగా పరీక్షలను నిర్వహించాలనుకున్న విధానం, దానికి పోటీ పడిన అభ్యర్థులు మొత్తం మీద ఈ సన్నివేశానంతను రచయిత వర్ణించిన తీరు సమాజంలో అప్పటికే నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో వెల్లడి చేస్తోంది. మానవుడు సహజంగా ఏదైనా చేయడానికి సామర్థ్యం కలిగి ఉన్నా -

"మన యూనివర్శిటీల ద్వారాల్లో అడుగు పెట్టాడా నౌకరీ చెయ్యడానికి తప్ప మరెందుకూ పనికి రాడు" అని వ్యవస్థని వ్యాఖ్యానించడం, చివరి పరీక్షగా గోపాల శాస్త్రికి, చలపతి రావుకి పరుగు పందెం పెట్టడం కథకు ప్రతీకాత్మకంగా సర్పస్పందాల శీర్షిక ఉంచడమనే పాట ద్వారా నిరుద్యోగ సమస్యను రచయిత చక్కని కథా శిల్పం ద్వారా మన ముందుంచారు.

మధ్య తరగతి యువకులు డిగ్రీలు చదివి చిన్న ఉద్యోగాలు చేయడానికి నామోషీ పడుతూ, పెద్ద ఉద్యోగాలు దొరకక ఆర్థికంగా ఎలా ఇబ్బందుల పాలవుతారో అనే విషయాన్ని సందేశాత్మకంగా 'టాప్ మేస్త్రి రామదీక్షితులు బి.ఎ', అనే కథ ద్వారా అందించారు.

ఉద్యోగాల కోసం వెంపర్లాడే వారికి అవి దొరకక చిన్న వృత్తులు చేసుకోలేక జీవితాన్ని భారమయంగా బతుకునే వారికి వ్యాపారం ద్వారా తమ కాళ్ళ మీద తాము నిలబడాలని ఆరాటపడే నిరుద్యోగ సమస్యకు పరిష్కార సూత్రమని 'మార్గదర్శి' కథ ద్వారా రచయిత ప్రబోధించారు.

"కష్టపడు, బాగుపడు. అంతే కాని నౌకరీ ఇప్పించమని నన్ను వేధించకు, నీ మొగం కళకళ్లాడుతోంది, నీకు నౌకరీ కర్మేమిటి? ఈ వ్యర్థపు దూళా దూసరితనం చేసుకోకు. కాలం గడిచి పోతోంది, లే. త్వరపడు"

"ఇంత చెప్పినా నీకింకా నౌకరీ వ్యామోహం పోదూ

ఫో- నా యెదట నుంచి పోకు, వెళ్ళిపో"

అని 'మార్గదర్శి' కథలో స్వయం కృషి చేత అభివృద్ధి సాధించిన 'శంభుశాస్త్రి' పాత్ర ద్వారా రచయిత ప్రభుత్వోద్యోగం కోసం పాకులాడకుండా స్వతంత్ర వృత్తులు, వ్యాపారాల ద్వారా అభివృద్ధిని సాధించాలని యువకులకు బోధించాడు. ఈ కథలో బ్రాహ్మణ జాతిని దృష్టిలో పెట్టుకొని చెప్పినా, ఉద్యోగాల కోసం ఎగబడటం కంటే, వ్యాపారం ద్వారానూ, పరిశ్రమ ద్వారానూ ఈ జాతిని అభివృద్ధి ముడిపడి ఉందనే రచయిత దృక్పథం ఈనాటికీ మన దేశానికంతకూ వర్తిస్తుంది.

ఒకప్పుడు ఆంధ్ర దేశంలో ఇంగ్లీషు చదువుల ప్రభావం వైదిక బ్రాహ్మణ కుటుంబాల ఆలో చనా ధోరణిలో కలిగించిన మార్పును ప్రతిబింబిస్తుంది.

"ప్రజలకు ప్రభుత్వోద్యోగాల పై మోజు కలగడానికి రెండు కారణాలు కనబడలాయి. అధికార దర్పం చూపుతూ ప్రజల చేత అడుగు మడుగు లొత్తించుకుంటూ

దర్జాలు సాగించుకొన వచ్చునన్నది మొదటిది. పై సంపాదనలో మేడలూ, భూములు కొనుక్కోని కులుక వచ్చుననేది రెండోది. రెవిన్యూ, పోలీసు శాఖల్లో ఉద్యోగాలయితే రెండూ సమకూరు తాయనే నమ్మకం ప్రజల్లో బాగా స్థిరపడి పోయింది.'' (కనకయ్య, బావండ్ల. 1986: 152-153).

'పోలీసు' కథలో లక్ష్మీ నారాయణ కొడుకు భవిష్యత్తులో చేయబోయే ఉద్యోగం గురించి అతని కుటుంబం లోని వారు చర్చ చేసుకుంటూ ఉంటారు. గుమస్తా పని హీనమైనదని, ప్లీడరు ఉద్యోగం బాగుంటుందని పోలీసు ఉద్యోగంలో అభివృద్ధిలోకి వస్తాడని ఇలా ఉద్యోగాల గురించి ఊహాలోకంలో విహరిస్తూ ఉంటారు. ఇది ఇంగ్లీషు విద్యా విధానం కారణంగా నాటి సమాజంలో పుట్టుకొచ్చిన ఉద్యోగాల మోజును వ్యక్తం చేస్తోంది.

శ్రీపాదవారు యువకులుగా ఉండి రచనలు చేపట్టే నాటికి ప్రజలలో చాలా మందికి ఇంగ్లీషు చదువుల మీద మోజు పెరగ జొచ్చింది. దాని ఫలితంగా

వ్యవసాయం పట్ల ఇతర కుల విద్యలు, వృత్తి విద్యల పట్ల నిరాదరణ ప్రబలింది. చదువుకున్నవారు ప్రభుత్వోద్యోగాల కోసం ఎగబడుతూ ఉండేవారు. ఈ పరిస్థితులు క్రమేపి నిరుద్యోగ సమస్యకు దారి తీశాయి. చేతి వృత్తులు మాని ఇంగ్లీషు చదువు పేరుతో ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారి సంఖ్య పెరగడం, ఉద్యోగావకాశాలు తగినన్ని లేకపోవడం దీనికి ప్రధాన కారణం. దీనిని గమనించిన శ్రీపాద వారు ఉద్యోగాల కోసం పోటీ పడే కంటే స్వతంత్రమైన వృత్తి, వ్యాపారాలలో భృతిని సంపాదించుకోవడంలో గౌరవం ఉంటుందని తమ రచనల ద్వారా యువతను ప్రబోధించారు.

బ్రాహ్మణులకు వైదిక విద్య వలన భృతి లేకపోవడమూ, ఆంగ్ల విద్య వలన ప్రభుత్వోద్యోగులుగా మారడమూ సాంఘికంగా కలిగిన ఒక పరిణామం. ఆ కాలంలో దీనికి సమాంతరంగా ఇతర కులాల వారు కూడా తమ తమ కులవిద్యలను వదలి ఇంగ్లీషు చదువులు చదువు కాని ప్రభుత్వోద్యోగ రంగంలోకి రావడం చేత

బ్రాహ్మణులకు పోటీ ఎక్కువైంది. అందుచేత బ్రాహ్మణ యువకులను వృత్తి వ్యాపారాలు చేసుకోవలసిందిగా శ్రీపాద వారు ప్రోత్సహించడం ఆయన కథల్లో కన్పిస్తుంది. ఆయన కథలలో విద్యావంతులైన బ్రాహ్మణ యువకులు వృత్తి వ్యాపారాలు చేపట్టి సఖ్యంగా ఉండడానికి ఇదే కారణం. రచయిత చేసిన ప్రబోధం కులభేదం లేకుండా అందరికీ ఈనాటికీ వర్తిస్తుందనే చెప్పాలి. దీనిని ఒక విధంగా శ్రీపాద వారి ఆర్థిక దృక్పథంగా కూడా పేర్కొనవచ్చు.

ఇటువంటి విషయాల్లో శ్రీపాద వారిది ముందు చూపే కాని వెనుక చూపు కాదు. తరతరాల ఆచారాలవల్లా - ఆలోచనాలవల్లా సమాజం పురోభివృద్ధి చెందక, బిగుసుకు పోయిన సంకెళ్ళను తెంచుకోవాలన్నదే ఆయన ప్రబోధం. సమాజంలో అన్ని వర్గాల వాళ్ళు, అన్ని రంగాల వాళ్ళు సంపూర్ణ శక్తి సామర్థ్యాల్ని వినియోగించుకొని ప్రగతి సాధించాలన్నదే ఆయన ఆశయం. బానిస బ్రతుకు దిగజార్చే నౌకరీ కోసం ఎగబాకడం కంటే స్వతంత్ర జీవనానికి ఉపకరించే

చేతి వృత్తులు చేపట్టండనే ఆయన ఉద్బోధించారు ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు కళ్ళకు కట్టినట్లు తక్షణమే స్వతంత్ర వృత్తులకి కార్యోన్ముఖులు కమ్మని హెచ్చరించారు.

* *

## 7.4 అధికార యంత్రాంగం

### 7.4.1 లంచగొండితనం :

సంఘ ప్రయోజనమే ధ్యేయంగా తన కథా రచనను కొనసాగించిన శ్రీపాద వారు అధికార యంత్రాంగంలోని లోటుపాట్లను నిర్భీతిగా ఎత్తి చూపారు. ప్రభుత్వాధికారుల, ప్రజాప్రతినిధుల అవినీతికర ప్రవర్తనను తన రచనల్లో దుయ్యబట్టారు. 'కలుపు మొక్కలు' అనే కథలో అధికార దుర్వినియోగం, లంచగొండితనం, సామాన్యులను పీడించే లక్షణం ఎంతో వాస్తవంగా చిత్రించారు. అవధాని కొడుకు ఉద్యోగానికి ప్రెసిడెంటుకు సిఫార్సు చేయడానికి తాను లంచం పుచ్చుకోనని చెబుతూ 'ఆవును' తోలుపెడితే చాలునని తెలివిగా సబ్ కలెక్టర్ అంటాడు. ప్రెసిడెంటుని కలయడానికి అవధాని వెళ్ళినప్పుడు అతని దగ్గర నుంచి గుమస్తా లంచం పుచ్చుకుంటాడు. పైగా సబ్ కలెక్టర్ సిఫార్సు పని చేయదని "మెరక వీధిలో ఉండే 'దుగ్గిరాల శేషాచలం' అనే వేశ్యని ప్రెసిడెంటుగారితో సరసానికి ఒప్పిస్తే, చాలు"నని

చెబుతాడు. ఈ సంభాషణలు అధికార యంత్రాంగంలో కరడు గట్టిన అవినీతికి, లంచగొండి తనానికి వాస్తవ చిత్రీకరణ.

విద్యావంతులను ఉద్యోగాల కోసం కంటే స్వతంత్రంగా జీవనోపాధికి ప్రయత్నించమని ప్రబోధిస్తూ రచయిత 'తహసీలు దారు కాదు- వర్తకుడు' అనే కథ రచించారు. ఈ కథలో నాటి ప్రభుత్వయంత్రాగాన్ని ఈ విధంగా విశ్లేషించి చూపారు. "కాలేజీలో మేష్టరీ చేస్తే లాభం వుంది. బదలా యింపుల భయం వుండదు. ఝంఝాటం లేదు. కష్టం లేదు. నెలకి నూరు రూపాయలకు తక్కువ ఉండదు."

"మేస్త్రేటు అయితే దర్జా సాగుతుంది కాల మీద కాలు వేసుకొని కడుపులో చల్ల కదలకుండా కూచోవచ్చు. డబ్బుకి డబ్బూ, గొప్పకి గొప్పా కూడాను."

"తాసిల్దారు అయితే మంచిది. తాలూకా అంతా సవారీ మీద తిరగవచ్చు. కరణాలూ, మునసబులూ, నౌకర్లూ అంతా చేతులలో వుంటారు. పైగా కూడా సంపాదించవచ్చు."

ప్రభుత్వ యంత్రాంగం కాని మూడు శాఖల పైన, ఆ శాఖలలోని ఉద్యోగాల పైనా ఒక కోణంలో ప్రజలకున్న దుఃఖాన్ని ప్రవాక్యాలు వెల్లడి చేస్తున్నాయి.

ఈ కథలో కలెక్టరుగా ముందు ఆంగ్లేయుడు, తర్వాత అరవపిళ్లై, అతని తర్వాత సాహేబు, తర్వాత క్రిష్టియన్ మారుతూ వచ్చారు. ఆయా అధికారుల కాలంలో వారి వారి కులాలు మతాలు ప్రభుత్వ యంత్రాంగంలో ఎటువంటి ప్రభావాన్ని చూపాయో అద్దంలో చూపినట్లు ప్రదర్శించారు.

దీనిలో కూడా రచయిత ప్రభుత్వాధికారుల్లో పాతుకుపోయిన లంచగొండి దృక్పథాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు. చెబినస్సా ఇన్‌స్పెక్టరు లంచం పుచ్చుకుంటున్నాడని, తన కందిన ఫిర్యాదును కలెక్టరు అతని ముందు ఉంచినప్పటి దృశ్యాన్ని రచయిత ఈ కింది విధంగా వర్ణించారు.

ఆయన లంచం పుచ్చుకున్న దాఖ

లాలు కూడా వున్నాయండి నేను రుజువు చెయ్యగలను. కోడి గుడ్ల దగ్గర నుంచీ, తాసెడు పొగాకు దగ్గర నుంచీ, చింత పిల్లకి కుమ్మరిటూ ముదం దగ్గర నుంచీ, పచ్చగడ్డి దగ్గర నుంచీ తహసీల్దారు గారు లంచం పడు తున్నారని తెలుస్తోందండి దేవరవారు తనిఖీ చేయించాలి" అని అతడు కలెక్టరు తో చెప్పెను.

"ముందు నీకు రెవిన్యూ ఇనస్పెక్టరీ తగ్గిస్తున్నాను. మళ్ళీ గుమస్తాగా పని చెయ్యి. నమ్మకంగా వుండే తరువాత మళ్ళీ నీకు ఉద్యోగం ఇప్పిస్తాను. తహ సీలుదారు లంచగొండి తనాన్ని గురించి కూడా అర్జీలు వచ్చి రుజువయితే శిక్షిస్తాను." అని దొర ఖచ్చితముగా చెప్పి వెంటనే కాకినాడ వెళ్ళి కచేరీలో చేరుటకు ఉత్తరువు ఇచ్చెను

పై దానిని బట్టి లంచగొండితనం ఏ ఏ రూపాలలో వ్యాపించిందో దానికి పై అధికారి ఏటు వంటి శిక్షను అమలు చేశారో స్పష్టంగా తెలుస్తోంది.

7.4.2 పబ్లిక్ సర్వీసు కమీషను :

'గుర్రప్పందాలు' కథలో పట్టభద్రులు ఉద్యోగాల కోసం ఎగబడటాన్ని కంపెనీల ఇంటర్వ్యూలు నిర్వహించిన తీరునూ. ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు ఏర్పాటు చేసిన పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహణానూ ఎంతో సహజంగా వర్ణించారు. అయినా నిరుద్యోగ సమస్య కొనసాగుతూ ఉండటం చేత ఈ విషయంలో అధికార యంత్రాంగం ఏమీ సాధించలేకపోవడం చేత ప్రభుత్వ విధానాన్ని ఇలా వర్ణించారు.

"ఘనత వహించిన మన దొరతనం వారు హేమా హేమీలలో కూర్చి 'పబ్లిక్ సర్వీస కమీషన్' అంటూ ఒక సంస్థను నెలకొల్పి వున్నారు. అది మిక్కిలి ప్రతిభావంతులైన అనేక మంది గొప్ప ఆఫీసర్ల మేధస్సునిగ్గు, అది చాలా చాలా గొప్ప సంస్థ, ఎంత గొప్ప సంస్థ అంటే ఖండాంతరాల్లో కూడా మన ఆధ్యాత్మిక దృక్పథానికి పేరు తెస్తున్న మహా సంస్థ. దేశానికి జాతికి దాని వల్ల కలుగుతున్న మేళ్ళ

అసంఖ్యాకాలూ అసాధారణాలూనూ, దాని అనుగ్రహం సంపాదించుకోగలిగిన వారి జీవితాలు జిగేల జిగేల్మని వెలిసి పోతున్నాయి."

పై వాక్యాలలో రచయిత సమకాలీన అధికార యంత్రాంగాన్ని పరిపాలన ధోరణిలో నిశితంగా విమర్శించారు.

7.4.3 <u>పోలీసు వ్యవస్థ :</u>

'రక్షా బంధనం' అనే నవలలో పోలీసు వ్యవస్థలో ఉన్న లోపాల్ని ఎత్తి చూపుతూ సామాన్య ప్రజలను ఆ అధికారులు ఏ విధంగా పీడించుకు తింటారో దర్భా ఘుర్ణయ్య శాస్త్రి పాత్ర ద్వారా రచయిత పలికిస్తాడు

ఒక రోజు జగ్గారాయుడు గారి ఇంట్లో మాల్యు జరగ్గా దొంగల్ని పట్టుకునే ప్రయత్నంలో భరసా రెడ్డి, నరసింహం అనే కానిస్టేబుళ్ళు మారు వేషంలో దొంగకుణ్ణి పట్టుకొని దొర వద్దకు తీసుకొస్తారు. చివరకు ఆ నేరస్తుడు అన్నపూర్ణ మరిది ఘుర్ణయ్య శాస్త్రి అని గుర్తిస్తారు.

దానితో అతన్ని అందరూ నిందింపసాగారు. చివరకు దొరగారు "నీవు ఏం చెబుతావు"? అని అడగ్గా ఛర్మయ్య

"ఇంతవరకూ వచ్చాక, శిక్ష పడ్డాక పోకటే, తప్పిపోయినా పోకటే కనుక నిజం చెబుతాను. నాకావడి పెట్టె తోటి చూస్తే సర్వమూ మీకే తెలిసిపోతుంది. నేను చెప్పకుండానే కనుక నాకు శిక్ష తప్పదు ......." అని

"నాకు స్వేచ్ఛ కావాలి. అన్నింటా స్వేచ్ఛ కావాలి. అంచేత నావాళ్ళకందరికీ నేను కొంత దూరం అయి నాను. వాళ్ళూ నన్ను వదిలి పెట్టేశారు. సుఖపడాలని నాకెంతో వుంది ......." అని అంటూ

"నిజంగా నేనిప్పుడు దొంగనే. కొంత కున్నా: కాని అయిదారు మాసాల కిందట నాకే వుద్దేశాలులేవు నాటకాల్లో వేషాలు వేసేవాణ్ణి, పేరూ, డబ్బూ సుఖమూ అన్నీ లభించేవి. కాలం నిర్విచారంగా గడిచిపోయేది. వాకళ్ళకి పెట్టేవాణ్ణి. లక్షణంగా నేనున్నా అనుభవించే వాణ్ణి. అలాంటి నాకు హఠాత్తుగా బుద్ధి యిలా మారడం నాకూ వింతగానే వుంది.

కాని మారిపోయింది. దీనికి కారణం, వాక పోలీసు ఇనస్పెక్టరు దౌర్జన్యం" అని చెప్తుతాడు. ఒక రోజున పూర్ణయ్య శాస్త్రి తెనాలి వెళ్ళడానికి రైల్లో కూర్చోని ఉండగా పోలీసు ఇనస్పెక్టరు వచ్చి చేసిన దౌర్జన్యాన్ని ఇలా వివరిస్తాడు.

"....... ఆ సమయాన గార్డు వాక పోలీసు ఇనస్పెక్టరుని అతని భార్యనూ వెంట బెట్టుకొని వచ్చి వారికోసం మమ్మల్ని ఆ కంపార్టుమెంటు ఖాళీ చెయ్యమన్నాడు, తొందర పెట్టాడు. సామాన్యంగా నేను కారణం అడగ్గా, కటువుగా ఇనస్పెక్టరు మాటలు ఆడాడు. మరో కంపార్టుమెంటులోకి వెళ్ళక తప్పింది కాదు. రైతులు కిక్కురు మనకుండానే వెళ్ళిపోయారు; కాని నాకు అవమానం అనిపించింది. పోలీసుకు తగిన శాస్తి చెయ్యాలనుకున్నాను. తగపట్టాను. బహిరంగంగా ఆపని చేస్తే, న్యాయం నాదయినా, సర్కారు పోలీసు పక్షమే వహిస్తుంది. ఈ దేశంలో యిప్పటికీ జరుగుతున్నదే యిది. అయినా ఆ ప్లాటుఫారం మీదే, ఆ క్షణంలోనే ఇనస్పెక్టరు పళ్ళూడగొట్టి వుందును. అయితే, కేసు మాట ఏమయినా

నా ప్రయాణం ఆగిపోతుంది. ఆగిపోతే. నష్టం నాకొక్కడికే కాదు, మా సమాజానికంతటికీని. అంచేత అప్పుడు వస్తాయింటాను." అని తను ఆవిధంగా మారడానికి గల కారణం ఆ ఇనస్పెక్టరు ప్రవర్తనే అని చెబుతూ చేసిన నేరాలన్ని ఒప్పుకుంటాడు.

అయ్యా దొరగారు! నాదొకటి కోరతాను మిమ్మల్ని. నా కోసం కాదు. ప్రజల క్షేమం కోసమూ ప్రభుత్వ క్షేమమునూ. ఏ ప్రభుత్వంలోనైనా పోలీసులకు అసాధారణ అధికారాలుండాలి. ఒప్పుకుంటాను; కానీ ఈదేశంలో అమాయకులైన ప్రజలను పోలీసులు పెట్టే హింసను మీరు గమనించాలి. ముఖ్యంగా నన్నవమానించిన పోలీసు ఇనస్పెక్టరును దారుణంగా శిక్షించకపోతే మీరు మీ విధి తప్పినవారవుతారు. ఆ మనిషి అప్పుడలా చెయ్యడం వల్లనే ఇలా మారి నేనిది చేశాను. కనక, వీటికన్నింటికీ విప్రకృష్ట కారణం ఆ యినస్పెక్టరు" అని పూర్ణయ్య శాస్త్రి మాటల ద్వారా రచయిత పోలీసులు ప్రజల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో అది ప్రజలపై ఎటువంటి దుష్ఫలితాల్ని

ఇస్తుందో వాస్తవంగా చిత్రించారు. శాంతి భద్రతలను కాపాడ వలసిన వారే వారి ప్రవర్తన ద్వారా శాంతి భద్రతలకు భంగ కరంగా సామాజికులను తయారు చేస్తున్నట్లుగా మనకు విదిత మౌతోంది. అధికార యంత్రాంగంలోని ప్రధానంగా పోలీసు వ్యవస్థలోని కథా కథనంలో వాస్తవంగా చిత్రించిన సన్నివేశాల్లో ఇదొకటి.

'క్షీరసాగర మథనం' నవలలో యండులు చేత ఇలా అనిపిస్తారు.

"జమిందార్ల గుమస్తాలు, వుంటారు చూడండి వాళ్ళూ జిల్లా బోర్డుల గుమస్తాలూ, డి.య్యోవో ఆఫీసుల గుమస్తాలూ, హుర్లు కంపెనీల గుమస్తాలూ, వాళ్ళదే రకం - అచ్చంగా తెలుసు వాళ్ళు, తమకిష్టం తప్పిన వాళ్ళ మీద మాట్లు కూడా చెప్పగలరు వాళ్ళు"

అధికారయంత్రాంగంలో ఉన్నవాళ్ళు విధి నిర్వహణలో పక్షపాత ధోరణిలో అనుచిత ధోరణిలో ప్రవర్తించడం సమాజానికి చేసే కీడును పై వాక్యాల ద్వారా రచయిత

తెలియజేశారు.

ఈ విధంగా రచయిత అధికారయంత్రాంగం లోని లోపాల్ని కథన శిల్పం ద్వారా ఎండగడుతూ, తన సంస్కార దృష్టిని 'చీకటి - వెలుగు', 'సముద్రమందలి మంచుకొండలు', మొదలైన కథలలో చూపారు. 'రాచ దంపతులు', 'నిలువు చెంబు', 'ఆశాభంగం', అనే మూడు అపరాధ పరిశోధక కథలలో పోలీసులు ప్రముఖ స్థానాన్ని వహిస్తారు.

మొత్తం మీద అధికారయంత్రాంగంలో ఉన్న లంచగొండితనం, అక్రమపద్ధతులు నిరుద్యోగులను తయారుచేసే విద్యావిధానం, ప్రజలను హింసించే పోలీసుల ప్రవర్తన తమ రచనల ద్వారా శ్రీపాదవారు సమాజానికి ఎరుక పరచారు.

8

# రాజకీయ చైతన్యం

## 8.1 రాజకీయ దృక్పథం

శ్రీపాదవారు సమకాలీన సమాజంలోని అన్ని విషయాల పట్ల తన ప్రతిస్పందనని రచనల రూపంలో ప్రకటించారు. వారి ఆత్మకథయైన 'అనుభవాలూ - జ్ఞాపకాలునూ' లో వివిధ సమస్యలపై స్పందిస్తూ తమ దృక్పథాన్ని వెల్లడించారు. వీరు ప్రకటించిన అభిప్రాయాల్లో రాజకీయ దృక్పథం ముఖ్యంగా గుర్తింపదగింది. సమకాలీన రాజకీయాలలో జాతీయోద్యమం, కాంగ్రెస్సుపార్టీ, మొదలైన పేర్లతో కొనసాగుతున్న ప్రజా ఉద్యమాలలో ఉన్న అవినీతిని అశాస్త్రీయ ధోరణులను చూసి సహించలేకపోయారు. దాని పర్యవసానంగానే రాజకీయాల గురించి ఈ కింది విధమైన అభిప్రాయాల్ని ప్రకటించారు.

"రాజకీయాలకు సత్యం లేదు, ధర్మమూ లేదు."

"స్వార్థం తప్ప మరేమీ కూడా లేదు"

విలువలకు పట్టం కడుతూ స్త్రీ-సమానత్వం, అస్పృశ్యతా నిరసనం వంటి గుణాలతో ఉన్నప్పుడే స్వాతంత్ర్యం వల్ల ప్రయోజనం ఉంటుంది అని అభిప్రాయ పడ్డారు. అంతేకాని స్వాతంత్ర్యాన్ని నిరసించిన వారు కారు. అందు చేతనే —

"నాకు దేశ స్వాతంత్ర్యం కావాలి, దాపరికం లేదందులో. అయితే లౌకిక పనులన్నీ మానుకుని, తాదాత్మ్యంతో పని చెయ్య వలసినంత ప్రధానం మాత్రం కాదిది.

— అవి సాధించడానికి ముందు చెయ్య వలసింది చాలావుంది. మూకతో జరిగే పని కాదు కదా అది" (సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీపాద. 1966: 168).

అని వాస్తవంగా సమాజానికి ఏది ఎప్పుడు కావాలో అనే అభిప్రాయాన్ని ప్రకటించారు.

శ్రీపాద వారు తన కాలం నాటి రాజకీయ నాయకుల ప్రవర్తనను ఉన్నది ఉన్నట్లుగా

"అధికారమే వాటికి ప్రాప్తం"

"ఆ సుడిగుండంలో పడిపోయిన వారికి చెవులు వినలేవు, కళ్ళు చూడాలేవు."

"వారి మనస్సుకి నిగ్రహశక్తి వుండదు, బుద్ధికి ప్రమాణ పరాయణతా వుండదు."

"గుండె బండనే వుండవు వారికి. వారి అడుగులకు మడుగులొత్తే వారి సంగతి యిక చెప్పడానికేముంది? లక్ష్యం పరిశీలించుకోగలిగితే రాజకీయాలు, కలిసివున్న కలిసి వుండదగిన వారిని విడదీస్తాయి.

రాజకీయాల్లో దిగితే అతీతులయిన వారు గాని ఈ అపాయం తప్పించుకోలేరు."

ఈ వాక్యాలు రాజకీయాల్లో తిరిగే వ్యక్తులు ఎటువంటి మార్గంలో ఉండేవారో అనే విషయం వ్యక్తమవుతోంది (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1955: 5).

శ్రీపాద వారి దృష్టిలో సంఘంలో జనులంతా సంస్కార భావాలు అలవర్చుకొని మానవతా

'ఇలాంటి తప్పాయి వస్తే...?' అనే కథలో చిత్రించారు. నాటి కాంగ్రెస్సు నాయకులు అస్పృశ్యతను నివారించాలని చేసే ప్రచారంలో చిత్తశుద్ధి లోపించిందని, ఓట్ల కోసమూ, కీర్తి కోసమూ వారు తాపత్రయ పడుతున్నారని ఈ కథలో నిరూపించారు. దానితో పాటు క్రైస్తవ మతం హరిజనులలో సాంప్రదాయకంగా ఎటువంటి మార్పును తేసుకు రాలేదని చెప్పారు.

ఈ కథలో కాంగ్రెస్సు సంఘం అధ్యక్షుడు హరిజన వాడలోకి వచ్చి వాళ్ళ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ చెప్పిన ఉపన్యాసం లోని కింది వాక్యాలు గమనించదగినవి.

"నిజంగా యిలాంటి సంఘటనలే మాకు పరపతి హెచ్చించేవి. బ్రాహ్మణ ప్రాబల్యంలో మగ్గిపోతున్న కుగ్రామాల్లో యిలాంటి క్లిష్ట సమస్య లెప్పుడు తలచూపుతాయా అని యెదురు చూస్తున్నా నేను. రెండు మాసాల నుంచి నాకీ పదవి రావడం

నా అదృష్టం. ఏ గ్రామం ఆంధ్రదేశానికంతటికీ నడిగడ్డ అయిపోయుండిక చూసుకోండి. ఆ పోటుగడ్డ మీద ఈ విషయం పరిష్కారం అయిందంటే ఆంధ్ర హరిజనులకు స్వారాజ్యం సిద్ధించిందన్నమాటే దీంతో, తక్కిన ప్రాంతాల్లో వున్న హరిజనులకు గొప్ప బలం చేకూరుతుంది. తక్కిన ప్రాంతాల సవర్ణులకున్నూ గొప్ప కనువిప్పున్నూ కలుగుతుంది ............ ............ ఇది పరిష్కారం అయ్యేదాకా నేను భోజనం చేస్తానా? నిద్రపోతానా."

ఈ విధంగా గ్రామాల్లోని హరిజన సమస్య పరిష్కారానికి నాయకుల ఉపన్యాసాలు, అతిశయోక్తులతో, కపటంతో సాగుతాయి. అందుకు శ్రీపాదవారు నాటి రాజకీయాల్లో ఉన్న కుళ్ళను బయటపెట్టి దానిపట్ల వారికున్న నిజాయితీ దృక్పథాన్ని వెల్లడించారు.

* *

## 8.2 జాతీయ దృక్పథం

భారత దేశ స్వాతంత్ర్యోద్యమానికి అనుగుణంగా పుట్టిన భావ జాలాన్ని జాతీయతా వాదంగా పరిగణిస్తాము. ఆనాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రకటించిన భావం ఏదైనా జాతీయతా భావం కిందే పరిగణించబడేది. భారతీయులలో ఐక్యత కోసం, ఏక జాతి అనే స్ఫురణ కోసం స్వదేశీ వస్తు వినియోగమూ, దేశీయుల పరిపాలనతో పాటుగా అందరికీ ఒకటే భాష ఉండాలనడం, ఖద్దరు ధరించాలనడం కూడా జాతీయ వాదం కిందికి వచ్చేవే. ఈ అభిప్రాయాలతో సంపూర్ణంగా ఏకీభవించలేని వారిలో శ్రీపాద వారు ఒకరు.

శ్రీపాద వారి జాతీయతా దృక్పథం అచ్చంగా దేశీయమైంది. బ్రిటిష్ వారిని పారద్రోలడమనే ఆవేశపూరితమైన ఏకైక నినాదం మాత్రమే జాతీయవాదం అనే దృక్పథానికి వీరు వ్యతిరేకులు. సంఘంలో ఉన్న అసమానతలూ, మూఢవిశ్వాసాలూ తొలగిపోయి-

సామాజిక, ఆర్థిక సమానత్వం నెలకొన్నప్పుడే స్వాతంత్ర్యానికి అర్థం ఉంటుందని విశ్వసించిన తరగతికి చెందిన వారు ఈయన. దీనికి, అతిగా హిందీ భాషను ఇతరులపై రుద్దడం, చిత్తశుద్ధి లేకుండా వేలం వెర్రిగా కాంగ్రెసు పేరుతో ఖద్దరును ధరించడం తగవు అని ఈయన భావించారు. ఇదే ఈయన జాతీయతా దృక్పథంగా చెప్పుకోవచ్చు. అన్య సిద్ధాంతాల ప్రభావం లేకుండా స్వాతంత్ర్యమైన తనదైన జాతీయతా దృక్పథాన్ని ప్రకటిస్తూ ఈయన పలు రచనలు చేశారు.

"కొత్తచూపు కథలో మనకి స్వాతంత్ర్యం వచ్చింది, ఇది ఎలా వచ్చిందనే కాదు ఎలా నిలుస్తుందో అని ప్రశ్న" అని భట్టాచార్యుని చేత రచయిత పలికిస్తారు.

"మనకున్నది వర్ణవ్యవస్థ కాని జాతీయత కాదు ఆది కాలంలో మన దేశం **విజాతీయుల** పాలన బడడానికి కారణం అదే, ఈ వర్ణవ్యవస్థకి తోడు అప్పటి మన వాళ్ళకి 'నా రాజు' అనే కాని 'నా దేశం' అనే

భావన లేక పోయింది. ఇంగ్లీషు ప్రభుత్వం వచ్చాకే మనకా భావం పుట్టింది, బలపడింది." అని సీతాపతి పాత్ర చేత పలికించడం ద్వారా, మన సమాజంలో ఉన్న జాతీయత గురించి స్పష్టమైన విశ్లేషణ చేసి చూపారు. స్థూలంగా చెప్పాలంటే ఇంగ్లీషు వాళ్ళ ప్రభావం చేతనే భారతీయులకందరకూ ఒకే జాతీయతా భావన పుట్టుకొచ్చింది.

అని — "............ నాదేశం అన్న భావం కొత్తగా అనుభూతం అయి, ఎడమొగం పెడమొగంగా ఉన్న వాళ్ళనందరినీ ఒక తాటి మీదకి తెచ్చింది. యుగ యుగాలుగా బానిసతనంలో మగ్గిపోతూ వెలుగు మొగం ఎరుగకుండా ఉండిన అస్పృశ్యుడూ, పాలక జాతి వాణ్ణి అనుకునే క్షత్రధర్మావలంబీ, బ్రహ్మముఖం నుంచి ఊడిపడ్డానను కునే బ్రాహ్మడూ భుజమూ, భుజమూ రాసుకుంటూ స్వాతంత్ర్య సమరం సాగించడానికి కొత్త భావమే కారణం. నాదేశం అనుకోగల వాళ్ళకి వర్ణవ్యవస్థ నచ్చదు. వాళ్ళకు నచ్చేదీ, నిజంగా కావలసిందీ

జాతీయత. ఈ భావమే మనకి నూతన జవసత్వాలు కలిగించింది. ఇది నేర్చుకోవడం వల్లనే మనం తరతమ భేదాలెరగని విదేశీయులను ఎదిరించ గలిగాం". అని పలికిన శ్రౌతీ వాక్యాల ద్వారా శ్రీపాదవారి జాతీయతా దృక్పథం అంటే ఏమిటో విస్పష్టమౌతోంది. ఇంగ్లీషు ప్రభుత్వం ప్రభావం చేత 'నాదేశం' అనే భావన పుట్టింది. ఇది మన దేశస్థులందరినీ ఐక్యపరచింది. కులభేదాలు మరచి అందరూ కలిసి స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేటట్లు చేసింది. నాదేశం అనే భావనే నిజమైన జాతీయత, ఇది జాతికి నూతన శక్తిని అందించింది. ఈ జాతీయతా భావనే మనకు స్వాతంత్ర్యం లభించేటట్లు చేసింది.

"గ్రామంలో శవం వుంటే పొయ్యిలో నిప్పు వేసుకోని సంప్రదాయం మనది; కాని యిప్పుడు వచ్చినా మనిషిని చంపి, ఆ శవం మీద కూచునే రొట్టె తినే జాతులతోనే వచ్చింది మనకి సంఘర్షణ. మన జగన్మిథ్యాత్వ సిద్ధాంతం మనకు సకాలమూ అశాశ్వతమే చేసేసింది". అనే

'కౌండు శ్రౌత' వాక్యాలను బట్టి రచయిత దృష్టిలో మన దేశ సంస్కృతి ఎంత విలువైనదో అనే అంశం తెలుస్తూనే, అటువంటి సంస్కృతి గల జాతి, మత విశ్వాసాల మూలంగా ఎంత వెనుక బడి పోయిందో అనే రచయిత ఆవేదన తెలుస్తుంది.

"ఆంధ్ర భాషలో చెత్త వాఙ్మయం వస్తోందిప్పుడు. దానివల్ల జాతీయత దెబ్బ తింటూంది. అలాంటి దిక ముందయినా రాకుండా దేశీయులు ప్రతిఘటించాలంటే వారి రోషాగ్నినికి సాయా రచన కూడా ఒక సమిధ అవుతుంది" (సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీపాద, 1955: 13).

శ్రీపాద వారు తాఃముగా చెప్పుకొన్న పై అభిప్రాయాన్ని బట్టి వారి జాతీయతా దృక్పథం ఎంత దృఢమైనదో తెలుస్తుంది. ఒక సమాజానికి జాతీయత సాహిత్య రచనలపై కూడా ఆధారపడి వుంటుందని గుర్తించి ఆ విషయంలో ఆంధ్రులు వెనుక బడి వున్నారనే అంశాన్ని ఎంతో బాధతో వ్యక్తపరచారు.

శ్రీపాద వారికి భారత జాతీయత

అనేది ఒక్కటి కాదని అది పలు ఉప జాతీయతల సమిష్టి రూపమనే అభిప్రాయం ఉంది. దానినే వారు ఎక్కువగా ప్రచారం చేసేవారు. ఇదే అభిప్రాయాన్ని వారు–

“అటు బంకించంద్రుడి లాగే, యిటు నేను కూడా నా తెనుగు జాతీయతను భారత ఖండానికంతటకూ చెయ్యెత్తి చూపించుకోవలసి వచ్చింది నాకు.

కనీసం నా తెనుగు వాడికి "నేను తెనుగు వాణ్ణి" అన్న ఆత్మ ప్రత్యయం కలిగించవలసిన బాధ్యత మీద పడింది నాకు" (సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీపాద. 1958: 393).

– అని స్పష్టంగా ప్రకటించారు.

“నా దృష్టిలో తెలుగు దేశమే దేశం తెలుగు భాషే భాష. తెనుగు మనుష్యులే మనుష్యులు, తెనుగు వేషమే వేషం. ఇంతేకాదు, –

ఏ జాతి యెదటా – ఏ సందర్భంలోనూ – ఎందుకున్నా నా తెనుగు జాతి తీసిపోదు. అంచేత, ప్రపంచానికిది ఉద్ఘాటించి చెప్పడానికి, నా సేవలు తెనుగు జాతికే యీడు కట్టు

కావాలి నేను" (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద, 1958: 394).

ఇది వారి జాతీయతలోని నిజాయితీ. నిజం చెప్పాలంటే దీనికి మించిన జాతీయతా దృక్పథం మరేది ఉండదు. తెలుగువాడో, బెంగాలీయో, తమిళుడో, మహారాష్ట్రుడో మరేదో భాషీయుడో కాకుండా భారతీయుడనేవాడు ఉండడు. ముందుగా తెలుగుతనం ఉండి, దాని తరువాత భారతీయత అనే దృక్పథం ఉండాలి. అప్పుడే భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమవుతుంది. ఇంత సుస్పష్టంగా జాతీయతా దృక్పథాన్ని శ్రీపాద వారి వలె ప్రకటించిన ఇతరులు చాలా తక్కువగా ఉంటారు. అందుకే ఆయన

"ఆంధ్ర జాతీయత యెలాంటిదో మనకు, భారత జాతీయత అలాంటిదే," అని ప్రకటించారు (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద, 1958: 394).

శ్రీపాదవారి దృష్టిలో జాతీయతకు రెండు కేంద్రాలు వున్నాయి. ఒకటి ఆంధ్ర జాతీయత, రెండవది భారత జాతీయత. అసలు భారతదేశం కాదు యిది 'భరతఖండం'

అంటారు. అంగ, వంగ కళింగాది ఛప్పన్నదేశాలు (సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీపాద. 1958:400). ఇవన్నీ అంతర్గత దేశాలు. ఈ భిన్న దేశాలకు ప్రత్యేక భాషలున్నాయి. భరత ఖండానికే కాదు, దేశ భాషల ప్రాముఖ్యానికి ఇంతకంటే నిదర్శనం అక్కరలేదంటారు శ్రీపాద వారు.

'ఛప్పన్న దేశాల వారిని యేదో విధంగానైనా పాలించని ఏకత వుందంటే దానికీలకం యిదిగో యిక్కడుంది. మన ధర్మమూ - సంస్కృత భాషా అవినాభావనాలు. అది సంస్కృతం మనకు జాతీయ భాష కావడం' అంటారు. జాతీయ భాష అన్నది 'ఉద్దండ బద్ధ శబ్దాల వంటిది కాదు. జాతి జీవనానికి అది ప్రవర్తకం' అని కూడా అంటారు. భాషైక దేశ వ్యవస్థ ఈశ్వర నిర్మాణం అనీ ఇప్పుడే కాదు యెప్పుడో భరత ఖండంలో యేవొక్కదేశానాచార వ్యవహారం వుండిన భాష కాదు సంస్కృతం అని కూడా అంటారు. 'మొదట మనం ఆంధ్రులం. తరువాత భారతీయులం. ఆంధ్రదేశం భరత ఖండంలో ఒక భాగం గనుక, భారతీయత మనకు సహజంగానే సిద్ధిస్తుంది' అని సిద్ధాంతీకరిస్తారు (సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీపాద, 1958:423).

ఆయనకు భారత జాతీయులను గూర్చిన ప్రత్యేక అభిప్రాయం ఉన్నట్లు, తెలుగు జాతి, తెలుగు భాష పట్ల స్పష్టమైన అభిప్రాయంతో పాటు విపరీతమైన అభిమానం కూడా ఉండేది. అందుకే వారి రాతల్లో తరుచుగా తెలుగు వాళ్ళు అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, భాషాభిమానం లేదని, సాటి తెలుగు వారిని గౌరవించే లక్షణము లేదని మథన పడుతూ ఉండేవారు.

“తెలుగు వాళ్ళం మనం అలా ముందంజ వేయాలి. ప్రతిదానిల్లోనూ మనమును” (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద, 1966:105). అని —

“తెనుగు వాళ్ళు కలిసి పనిచేసే స్థితికి రాలేదింక” (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1966:118). వంటి వాక్యాలు వీరి ‘అనుభవాలూ - జ్ఞాపకాలూను’ గ్రంథంలో తరుచుగా కనిపిస్తాయి.

“జాతికి నవ్య దృక్పథం అలవర్చి దేశానికి - తెలుగు దేశానికి భారతదేశంలో మహోన్నత ప్రతిపత్తి

కలగింపడం నా సంకల్పం" (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద, 1966: 158).

అని, జాతికి మనుష్య సంపద, వారి సంస్కారమూ ఎంతో విలువైన వనే అభిప్రాయం కల వారు ఈయన. జాతి నిర్మాణం పై కవికి ఎంతో బాధ్యత ఉంది. అని కూడా ఈయన అభిప్రాయపడతారు. దీన్ని ఈ కింది వాక్యాలు రుజువు చేస్తున్నాయి.

"జాతి సంపద మనిషి, అటు బంగారమూ కాదు, ఇటు పాడవ సిర్కెలూ కావు

మనుష్య సంఖ్య యెంత ముమ్మరంగా వుంటే అంత బలం జాతికి.

ఆ మనుష్య సంఖ్యయెంత సంస్కృతం అయివుంటే అంత వికాసం జాతికి.

జాతీయ నిర్మాతలైన వారు బూసు తోవాలందంటా

మరి జాతీయ నిర్మాత?

కవి

జాతికి సంస్కారం కలిగించ గల వాడు - తద్వారా, జాతికి ఉన్నలో అవనతిని కలిగించ - గల వాడు కవి" ( సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద, 1966 : 148).

పై వాక్యాలు జాతీయత అంటే ను సంస్కృతపైన ఆ జాతి జనులే అనే అభిప్రాయాన్ని శ్రీపాద వారి దృక్పథంగా తెలుసుకోవచ్చు.

శ్రీపాద వారి దృష్టిలో సంఘం నైతికంగానూ, ఆర్థికంగానూ, బలపడినప్పుడే జాతీయతకు అర్థం ఉంటుందనీ, మారిన కాలానికి అనుగుణంగా సంఘం కూడా మారాలి. అప్పుడే ఆ జాతికి స్వాతంత్ర్యం వలన ప్రయోజనం సిద్ధిస్తుందని గట్టిగా నమ్మి ప్రచారం చేశారు. అందు చేతనే ఆయన -

"మనకు స్వపరిపాలనాధికారం వచ్చింది అయినా కష్టాల లెక్కడగానే ఉంది పరిపాలన నాటికంటే ఇప్పటికి."

దానికి జరగవలసిన సంస్కారమూ

ప్రమాదమూ జరగలేదు మరి.

జాతీయతకు కూకటి వేరే పురుగు పట్టింది కూడా" అని తన కాలం నాటికి స్వాతంత్ర్యం లభించినా, రాజకీయాలు అధోగతిలో ఉండడం గురించి స్పష్టంగా ప్రకటించారు (సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద. 1966 : 166).

ఈ విధంగా శ్రీపాద వారి జాతీయతా దృక్పథంలోని విశిష్టతలను వివరించి చెప్పుకోవచ్చు.

*  *

## 8.3 ప్రతిఘటనా దృక్పథం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు అన్ని రంగాలలోనూ సంస్కార భావాలతో కూడిన ఆధునికత ఉండాలని అభిప్రాయ పడ్డారు. దీనిని మానవతావాదం, హేతువాదం వంటి సైద్ధాంతిక నేపథ్యంతో ప్రతిపాదించారు. ఇటువంటి భావ జాలం వ్యాపించాలంటే ఉన్న వ్యవస్థపై తిరుగుబాటు ధోరణులు ఉండక తప్పదు. ఆ విధంగా వీరి రచనలలోని కొన్ని పాత్రలు అప్పటికి ఉన్న కొన్ని పరిస్థితులను ప్రతిఘటించి మార్పులు కోరుకుంటాయి. వీటినే ప్రతిఘటనా దృక్పథంగా పేర్కొనవచ్చు.

'చలిచీమలు' కథలో దివాంజీ "ఎవడ్రా అక్కడ" అని ప్రశ్నించినప్పుడు 'కొంకర పత్తి గడ్డన్న' "నేను" అని చెప్పడంలో నిర్లక్ష్యం ప్రతిధ్వనించింది. సేవకుడైన గడ్డన్న సమాధానం "దిక్కున్న చోట చెప్పుకో అన్నట్టుంది" అని, చెప్పటం దివాంజీ "నిలువునా మండి పోయాడు" అని వర్ణించబడింది. దివాంజీ "ఏం కొండడా

దెబ్బలు కావాలా?" అన్నప్పుడు దానికి సమాధానంగా పనివాడు వికటాట్టహాసం చేసినట్లు గాను "ఆ రోజులు వెళ్ళిపోయాయి" అని జవాబు చెప్పినట్లుగాను వర్ణించ బడింది.

ఇది పనివారిలో కలిగిన ప్రతిఘటనా స్వభావాన్ని తెలియజేస్తుంది. దివాంజీ అయినా, పనివాడు అయినా, హోదాలలో హెచ్చు తగ్గులున్నా విధి నిర్వహణ లోనూ, మానవులుగానూ సమానులే అన్న రచయిత ఆధునిక దృష్టినీ, ప్రతిఘటనా దృక్పథాన్నీ తెలియజేస్తుంది.

'తనదాకా వచ్చింది' అనే కథలో "శాస్త్రమా? మొగుడా అంటే? మొగుణ్ణి వద్దనే శాస్త్రం యెందుకూ? నన్ను వీళ్ళంతా వెలపెట్టినా నాభర్తను కొలుచుకుంటూ నేను సుఖంగానే ఉంటాను. వీళ్ళంతా వివాహాలలో వారి కొక్కరికే సంబంధం ఉందా యేమిటి? వెళ్ళకపోతే మేమూ ఆ పేటలోనే వుంటాము." అని 'చంద్రమ్మ' పాత్ర ద్వారా రచయిత అనిపిస్తారు.

"తన ఇంట్లో ఆడాళ్ళలా ఎదురు కుంటారని రాజులు ఎప్పుడూ అనుకో లేదు."

"గావుకేక వేస్తావెందుకురా? నువ్వెంత అరిచినా లాభం లేదు. చెల్లాయి కిప్పుడు వపనం చేయించక పోతే ప్రపంచకం మునిగి పోదు; నీ బ్రాహ్మణ్యానికి భంగమూ రాదూ. ఆ చచ్చినవాడు పుణ్యాత్ముడే అయితే అతని ఉత్తర లోకాలేవీ చెడిపోవు. నీ మనస్సు రాయా, ఇనుమా?" అని రామచంద్రం రాజులను ధిక్కరిస్తూ అంటాడు.

వితంతు సంస్కారాలను తిరస్కరించే సన్నివేశంలోని పై వాక్యాలు రచయిత హేతువాద దృక్పథంతో కూడిన ప్రశ్నఘటనా చైతన్యానికి ప్రతీక. 'రావులయ్య' అనే కథలో 'తిరపారెడ్డి' కమతంలో పని చేసే 'రావులయ్య' నిజాయితీపరుడు. కష్టపడి పని చేసే స్వభావమూ, ఆత్మవిశ్వాసమూ కలవాడు. శ్రామిక జీవనంలో అభివృద్ధిలోకి వచ్చిన ఆదర్శవంత-

మైన కూలివాడు. ఇతడు ఒక రోజున యజమానిని

“ఎల్లకాలమూ కట్టుబాట్లల్లో ఉండమంటే ఇక కూలాడికి స్వేచ్ఛ ఎప్పుడూ?” అని ఎదురిస్తాడు. కాయకష్టం చేసుకొని బ్రతికే వాళ్ళకు కూడా స్వేఛ్ఛా జీవనం ఉండాలనే తన అభిప్రాయాన్ని రావులయ్య నిర్మొహమాటంగా ప్రకటిస్తాడు. ఈ సంఘటన శ్రీపాద వారిలోనున్న ప్రతిఘటనా దృక్పథానికి సంకేతం. శ్రామికులు తిరగబడినప్పుడే స్వేఛ్ఛ లభిస్తుందనీ, లేకపోతే బానిస సంకెళ్ళల్లో మగ్గవలసిందేనని రచయిత ఉద్దేశించడంలో వారిలోవి-ఇతర ప్రభావాలు లేకుండా సహజంగా ఉన్న వారి స్పష్ట దృక్పథాన్ని తెలియజేస్తుంది.

ఈ విధంగా వారి రచనలలో చాలా సన్నివేశాలలో ఉన్న పాత్రలన్నీ పరిస్థితులకు తిరగబడి తామనుకొన్న లక్ష్యాలను సాధించడం కనిపిస్తుంది.

* *

## 8.4 ఆర్థిక దృక్పథం

మానవ సంబంధాలూ, సమాజ స్వరూపమూ

ఆర్థిక వ్యవస్థపై రూపొందుతాయి అనేది ఆధునికంగా సమాజ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ఒక సిద్ధాంతం. ఈ దృక్పథం శ్రీపాద వారి కథలలో కొన్ని పాత్రల ద్వారా వెల్లడి అయినట్లు కనిపిస్తుంది. అణగారిన స్త్రీ బ్రతుకులూ, వేశ్యల స్థితిగతులూ, వెనుకబడిన జన జీవితాలూ, సంస్కరింపబడడానికి ఆర్థిక సూత్రాలను అనుశీలించాలనీ శ్రీపాదవారు రచనల ద్వారా ప్రతిపాదించినట్లుగా కింది పరిశీలన ద్వారా తెలుసుకోగలము.

'మొదటి దాడి' కథలో కన్యాశుల్క వివాహానికి సిద్ధపడిన ముసలివాడైన తండ్రిని కూతురు 'రామలక్ష్మి' వారిస్తుంది. అతడు ఆమె మాటలను వినడు. పెళ్ళి మానేసి పిల్లల్ని పెంచుకోమని అంటుంది. అయినా తండ్రి తన మాట వినలేదని రామలక్ష్మి అన్నప్పుడు 'జానకి' స్త్రీలలో చైతన్యం రావాలని, సమాజంలో తమ స్థానాన్ని గుర్తెరిగి అధికారాన్ని సంపాదించాలని పురుషులకు తమ

విలువ తెలిసేటట్లు చెప్పాలని ఉపన్యసిస్తుంది. ఈ సందర్భంలో

".......... సీమలో కొడుకులు లేని తండ్రి చచ్చిపోతే ఆస్తి అంతా మా ఆళ్ళకి పెడుతుంది. యాజు ల తాత లక్ష రూపాయల సంసారి అతని తరువాత యెక్క ళ్లాంచో వచ్చిన వాడా సొమ్ము అనుభవించడమా, కడు పున పుట్టిన రామలక్ష్మి వాళ్ళ ఆశ్రయించి వాడి పెళ్ళాం యీసడింపులు పడుతూ శవం లాగ బతకడమా నా?....."

అని అంటుంది.

తండ్రి ఆస్తి ఆడ బిడ్డలకు కూడా చెందుతుందని, ఆస్తి కోసం ఎవరినో దత్తత తీసుకోవల సిన అవసరం లేదని చెప్పడం, నిజంగా కథ వచ్చిన కాలం నాటికి (1934) మన సమాజంలో ఒక విప్లవాత్మకమైన ఆలోచన. స్త్రీ స్వేచ్ఛను, మహిళాభ్యుదయాన్ని పూర్తిగా కోరు కున్న శ్రీపాద వారు స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని భావించడమే పై రచనకు హేతువు. ఇది వారి ఆర్థిక దృక్ప థానికి తార్కాణం.

పురుషులతో స్త్రీలు ఏ విధంగానూ తక్కువ కాదు. అనే దృక్పథంతో కథలు రాసిన శ్రీపాద వారు స్త్రీకి పురుషుడుతో సహా ఆర్థిక సమానత్వం కావాలని పలు పాత్రల ద్వారా చెప్పించారు. 'తల్లిప్రాణం' అనే కథలో కూతురు చదువుకొని ఉద్యోగం చెయ్యాలని తల్లి అనుకొంటుంది. తండ్రి పాత్రం మగవాళ్ళకే ఉద్యోగాలు లేవు దానికి ఉద్యోగం దొరకడం కష్టం, చేయవలసిన అవసరమూ లేదు. అందుచేత ఉద్యోగ దృష్టితో చదువు చెప్పించడం యెందుకని అంటూ యిలా అంటాడు.-

“అది తప్పు, మనకిప్పటికి కింకెవరూ లేరు గదా, వున్నదంతా సుఖంగా అనుభవించక నౌకరీ కర్మం యేమిటీ అమ్మాయికి?”

“ఆదీనం తప్పితే అత్తవారు విడిచి కొట్టే మహావర్తి డబ్బులకు తప్ప యెంత వుండినా పుట్టింటి వారి ఆస్తిలో అధికారం యేదీ ఆడపిల్లకి?”

“.......................”

పుట్టింటి ఆస్తిలో ఆడపిల్లకి కూడా సమానమైన హక్కు ఉన్నప్పుడు పురుషుడితో సమానమైన స్థానాన్ని సమాజంలో పొందగలుగుతుంది. అటువంటిది లేకపోవడం చేతనే తరతరాలుగా మన సమాజంలో స్త్రీ జాతి కష్టాలు అనుభవించవలసివచ్చింది. దీనిని గుర్తించిన శ్రీపాద వారు తల్లి పాత్ర ద్వారా పైమాటలు పలికించి తమ ఆర్థిక దృక్పథాన్ని వెల్లడించారు.

శ్రీపాద వారు భావించినట్లుగా, తండ్రి ఆస్తిలో ఆడపిల్లకి కూడా మగపిల్లవాడితో సమానమైన హక్కు ఉండి ఉన్నట్లైతే కన్యాశుల్కం, వరకట్నం, వితంతువుల సమస్య, స్త్రీకి విద్యావకాశాలు లేకపోవడం, పురుషుడికి స్త్రీ బానిసలా ఉండవలసి రావడం మొదలైన సమస్యలు ఉత్పన్నం అయ్యేవి కావు. అని వారికున్న ఆర్థిక దృక్పథాన్ని స్పష్టంగా వెల్లడించారు.

శ్రీపాద వారి ఆధునిక దృష్టి, వారి ఆర్థిక దృక్పథం ఇరవయ్యొకటవ శతాబ్దానికి కూడా వర్తిస్తుంది

అనడంలో ఈ కింది వాక్యాలే నిదర్శనాలు.

'మార్గదర్శి' కథలో "అడుక్కు తింటూ
చెట్టు కింద కాలం గడిపే వాళ్ళని దరిద్రులంటుంది మన
సంఘం. ఇది అర్థం లేని మాట. వాళ్ళకి కావలసినంత
శక్తి వుంది; కాని దానికి వినియోగం లేదు అంతే. అలా లేక
పోవడానికి సన్ని.కృష్ట కారణం, వాళ్ళకి సిగ్గూ బిడియం
లేకపోవడం; విప్రకృష్ట కారణం. మన ఆధ్యాత్మిక దృష్టి....
............" అని

"ఆధ్యాత్మిక దృష్టి ఎప్పుడేర్పడిందో అప్పుడే
మన పతనం ప్రారంభం అయింది." అంటూ

"మనిషి వల్ల వర్తకం పాడవుతోంది;
గాని వర్తకం వల్ల మనిషి యెన్నడూ పాడయిపోడు" - అన్న
కీలక వాక్యం 'నేటి ప్రపంచ దేశాల ధోరణి నుండి భారతదేశం
లోని బ్యాంకుల - స్టాక్ విపణుల భాగోతాల దాక వున్న
అర్థం చెప్పుకోవచ్చు.' అని వాకాటి పాండురంగారావు 'శ్రీపాద
సుబ్రహ్మణ్య శాస్త్రి కథలు', రెండవ సంపుటానికి రాసిన ముందు

మాటలో చెప్తున్నారు. (పాండురంగారావు. వాకాటి, 1992: V).

పై వాక్యాలు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఆర్థిక దృక్పథానికి వ్యాఖ్యాన ప్రాయంగా ఉన్నాయి. యువశక్తిని యెలా వినియోగించుకొంటే ఆర్థిక ఉత్పన్నం కావాలా అనే అంశంపై వారికొక స్పష్టమైన అభిప్రాయం ఉంది. వాణిజ్య వ్యవహారాలలో మనిషి పాత్రను బట్టి సమాజాభ్యుదయం ఆధారపడి ఉంటుందని అటు సమాజానికీ, ఇటు యువశక్తికీ ప్రబోధాత్మకంగా వారికున్న ముందుచూపును సాహిత్య రూపంలో ప్రకటించారు.

౧

# శ్రీ చైతన్యం

సామాజికాభివృద్ధిలో స్త్రీల అభివృద్ధి అనేది ప్రత్యేక విభాగం. అది అనాది కాలం నుంచి సమస్యల వలయంలో చిక్కుకొని ఉంది. స్త్రీ అభ్యుదయం ఏ విధంగా కొనసాగాలి? అనేది లింగ వివక్ష, వివాహ వ్యవస్థ, సమాజంలో ఆమె నిర్వహించే పాత్ర మొదలైన వాటిపై ఆధారపడి ఆయా కాలాలను బట్టి నిర్ణీత మవుతుంది. ఈనాటి సమాజంలో స్త్రీ ఒక ప్రధానమైన భూమికను నిర్వహిస్తున్నది. సమాజంలో సగభాగమైన ఆమె ఉద్యమించి తన స్వేచ్ఛను, సమానత్వాన్ని చాటుకోవాలని, తన నాయకత్వానికి వివిధ రంగాల్లో తాను ప్రదర్శించే నైపుణ్యానికి విలువ చేకూర్చుకోవాలని కాంక్షిస్తున్నది. ఏ స్త్రీ కూడా వెనుకంజ వేయాలని కాని, పురుషాధిక్య సమాజంలో తన అస్తిత్వాన్ని కోల్పోవాలని గాని అనుకోవడం లేదు. పుట్టుకతో సమానమైన తాను ఎందులోనూ పురుషుని కన్నా తక్కువని భావించడం లేదు. స్త్రీలు ఈనాడు ఎంతో ధైర్య సాహ

సాలలో తమ స్వేచ్ఛా సమానత్వాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఎన్నో సమస్యలను నిర్భయంగా ఎదుర్కొంటున్నారు. వీరిలో కలిగిన ఈ భావ చైతన్యం సాహిత్యంలో వివిధ రచనల రూపంలో వ్యక్తమవుతూనే ఉంది. ఈ దృష్టితో పరిశీలిస్తే తమ రచనల ద్వారా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ఆధునిక స్త్రీ వాదుల కంటే ఏ మాత్రం తీసిపోరని తెలుసుకోగలం.

## 9.1 స్త్రీ విద్య

వీరేశలింగం పంతులు గారు చేపట్టిన ఉద్యమాలలో స్త్రీ విద్య ఒకటి. వీరేశలింగం పంతులు గారికి అన్ని విధాలా అనుయాయి అనదగిన శ్రీపాద వారు స్త్రీ విద్యకున్న ప్రాముఖ్యతను ప్రబోధిస్తూ రచనలు చేశారు.

స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఎంత అవసరమో విద్య కూడా అంతే అవసరం. స్త్రీ విద్యకున్న విలువకు ప్రాధాన్యం ఇస్తూ రచించిన కథలలో 'తల్లి ప్రాణం' కథ విశిష్టమైంది. పురుషులకు చదువు వల్ల ఎంత ప్రయోజనమో, స్త్రీలకు

కూడా అంత ప్రయోజనమని తండ్రిని ఒప్పించేటట్లు హేతుబద్ధంగా తల్లి పాత్రచేత ప్రతిపాదింప చేస్తూ కథను ఎత్తుకోవడమే దానికి కారణం.

"చదువుకుంటే లాభం లేదనీ మీరు కనక అనగలిగినారు, వూరుకోండి పాటికి"

"శిరోమణి పరీక్ష యిచ్చిన మొగరాజులకే దిక్కూ దివాణమూ లేకుండా వున్న దినాలివి. అమ్మాయి విద్వానయితే"

"అయితే, అంటూ సందేహం కూడానా?

"లేదు, అప్పుడుందే అను, నీ మాట యెందుకు కాదనాలి? అయితే, అది వుద్యోగం చేస్తుందా? వూళ్ళేలుతుందా?"

"తెలియకపోడానికి యేలకపోడానికి తెలివి తక్కువదా, చేతకానిదా, చెప్పే తల్లి"

శ్రీపాద వారి సమకాలీన సమాజంలో స్త్రీ అభ్యసించే విద్యకు పురుషుడు అభ్యసించే

విద్యకు ఎంతో తేడా ఉండాలనుకునే వారు. స్త్రీలకు పురుషులకన్నా మేధాశక్తి లేదనియు, వారికి మాత్రమే ఉన్నత విద్య అవసరమని పలువురు అభిప్రాయం పడే వారు. అయితే స్త్రీ మేధాశక్తి నివురుగప్పిన నిప్పు వలె మాటువడి ప్రకాశింపక పోయినా సమాన అవకాశాలు ఉత్పన్నమైనపుడు ఆమె మేధాశక్తి వికసించినదనటానికి ఎన్నో తార్కాణాలున్నాయి. సీతా, సావిత్రి, గార్గి, మైత్రేయి మొదలగు వారి బుద్ధి వైభవము పురుషుల కన్నా మిన్న అయినది. రుద్రమదేవి, చాంద్‌బిబి, అహల్యాబాయి మొదలైన యువతీమణులు శౌర్య సాహసాలు వారి పరాక్రమాన్ని చాటి చెప్పుచున్నవి కదా! కాబట్టి స్త్రీ విద్యావంతురాలైతే సమాజం ఎంతో అభివృద్ధి చెంది, పురుషునితో పాటు సమానత్వం కూడా ఆమెకు లభిస్తుందని శ్రీపాదవారు స్త్రీ విద్య వల్ల కలిగిన ప్రాధాన్యాన్ని, విలువను వివరించడం ఎంతో సమంజసంగా ఉందనడంలో సందేహం లేదు.

అంటూ

"మీరేకాదు బి.యేలూ ఎం.యేలూ కూడా చదివి లక్ష మంది మొగపిల్లలు దేవుళ్ళాడుతున్నారు. ఉద్యోగాలు దొరకక, మరి చదువులు మానుకున్నారా వారిని చూసి తరువాత వాళ్ళు?

. . . . . . . . . . . . . . .

"నేనెందుకు చూస్తానో కాస్త పరకాయించుకోండి. చదువు సంధ్యలబ్బాయి కనకనే ఈ మంచితనమిచ్చింది దానికి. చదువే లేకపోతే మీ ఇంటి ఆడపడుచది- మీ అక్కలాగ కష్టాల కోరయి పోయి ఉండును. గుర్తుంచుకోండి."

చదువు విలువను చెబుతూనే చదువు నేర్చుకోడానికి స్త్రీ పురుషుల మధ్య భేదం లేదని చదువుకీ ఉద్యోగానికి సంబంధం లేదని, చదువు వల్ల జ్ఞానంతో పాటు చక్కని సంస్కారం అబ్బుతుందని పై సంభాషణల ద్వారా రచయిత ప్రబోధించారు. చదువు లేకపోవడం చేతనే

స్త్రీలలో కష్టాకోరుతనం, అజ్ఞానం, వెనుకబాటుతనం మొదలైనవి ఉన్నాయని అందుచేత కూతురికి చదువు చెప్పించాలని తల్లి పట్టుపట్టడం పై సంభాషణల్లో కనిపిస్తుంది.

'మొదటిదాడి' కథలో రచయిత ఆంగ్లవిద్య ద్వారా కలుగుతున్న పరిణామాన్ని స్త్రీలకు గల విద్యావశ్యకతను 'జానకి' పాత్ర ద్వారా నిరూపించారు. వృద్ధుడికి చిన్నపిల్లకి వివాహం జరగడం అక్కడున్న స్త్రీలకెవ్వరికీ నచ్చకపోయినా వారు ఎదురు తిరగలేక పోతారు. ఆ పెళ్ళికి జానకి అడ్డురాగానే అందరూ సంతోషిస్తారు. వారిలో చైతన్యం కలిగించి సంస్కార దృక్పథం కలిగేటట్లుగా జానకి ఉపన్యసిస్తుంది. ఆ సందర్భంలో వాళ్ళని సంఘటిత పరుస్తూ -

" మీకందరికి నేను చదువు కూడా చెబుతాను. మధ్యాహ్నం రెండు మొదలు అయిదింటిదాకా యెవళ్ళకీ పనులుండవు. మొగాళ్ళు అడ్డుపెట్టినా మీరంతా మా ఇంటికి రావాలి"

అని జానకి వాళ్ళందరికీ విద్యను చెబుతుంది. ఇక్కడ రచయిత స్త్రీకి గల విద్యావశ్యకతని చెప్పడంలో పాటు ఆచరణావశ్యకతగా ఒక పాత్ర ద్వారా నిరూపించారు.

'అన్నంతపని జరిగింది' అనే కథలో జానకమ్మ చిన్నప్పుడు

"………… మిషనరీల బాలికా పాఠశాలలో ఏడో తరగతి చదివింది. తద్వారా. ఒక దారీ ఒక తెన్నూ లేని కుళ్ళు సంఘం మీద తిరుగుబాటు చేసే ధైర్యమూ, సాహసమూ అలవర్చుకుని వుంది"

అని చెప్పటం ద్వారా రచయిత సంఘ సంస్కారానికి స్త్రీవిద్య ప్రధాన ఆధారం అనే రచయిత దృక్పథాన్ని వెల్లడి చేసినట్లు అవుతుంది. సంఘంలోని మూఢాచారాలు అనే కుళ్ళులో స్త్రీ కూరుకుపోయి ఉందని తనను తాను సంస్కరించుకోవడం కోసం చదువు ఎంతగానో ఉపకరిస్తుందని స్త్రీ జాతికి రచయిత చేసిన ప్రబోధం ఇది.

'కోలెరిగిన వాత' అనే కథలో కృష్ణవేణి స్త్రీ చైతన్యానికి ప్రతీక. ఆమె "స్త్రీలలో కొత్త దృక్పథం ప్రవేశపెట్టాలనీ, వారి జీవితాలకు కొత్త విలువలు కట్టాలనీ నా ప్రయత్నము - నా జీవిత లక్ష్యాలివి" అని ప్రకటిస్తుంది.

రచయిత స్త్రీ విద్యకున్న ప్రాధాన్యాన్ని కథలలో నిరూపించడానికి కృష్ణవేణి పాత్ర ఉత్కృష్టమైనది. ఆనాడే రూపొందవారు సామాజిక చైతన్యానికి స్త్రీవర్గంలో విలక్షణమైన వ్యక్తి అని, ఆమెకు కొన్ని ఆశలూ, ఆశయాలూ, జీవిత లక్ష్యాలు ఉండాలని వాంఛించడానికి కృష్ణవేణి పాత్ర ఒక మైలురాయి.

*  *

## 9.2. కన్యాశుల్కం - వరకట్నం

'కొత్తచూపు' కథలో కొత్తపద్ధతుల్లో వీరనారిగా పెరిగిన 'అన్నపూర్ణ' పెళ్ళిచూపులకు వచ్చి ఎక్కువ కట్న కానుకలు కోరే వారిని హేతుబద్ధంగా ప్రశ్నిస్తుంది. సంఘాభ్యుదయమే ప్రధాన ధ్యేయంగా కథలను రచించిన శాస్త్రి గారు సుమారుగా అన్ని కథలలో సంస్కార భావాల్ని ప్రకటిస్తూ ఉంటారు. 'కొత్తచూపుకథ' లో కులభేదాన్ని తిరస్కరించి అన్ని కులాల వారికి సమంగా మల్ల విద్యను నేర్పించి ఆ యువకుల చేత వరకట్నాలు తీసుకోమని ప్రమాణాలు చేయిస్తారు.

కన్యాశుల్కం ఎంత గర్హనీయమో వరకట్నం కూడా అంతే. కన్యాశుల్క సమస్య వెనుక బడుతూ, వరకట్న సమస్య సమాజంలో రూపుదిద్దుకుంటున్న సంధి కాలంలో రచయిత 'రెంటినీ' నిరసిస్తూ 'కన్యాశుల్కము - వరశుల్కం' అనే కథను రచించారు.

'అవధాని' కన్యాశుల్కం ఇచ్చి 'గున్నమ్మను

సున్నమ్మ సోదరుడు చలపతికి వరకట్నం తీసుకొని తండ్రి వివాహం చేస్తాడు. మామ గారు కన్యాశుల్కంగా ఇచ్చిన డబ్బును అవధాని తిరిగి జానకమ్మని అడుగుతాడు. ఈ సందర్భంలో పెద్ద పోలీసు అధికారిని కూడా తీసుకొని వచ్చి చలపతి తన తండ్రి కన్యాశుల్కంగా పుచ్చుకున్న సొమ్మును అవధానికి తిరిగి ఇచ్చివేస్తూ ఇలా అంటాడు.

" నీ దగ్గర పుచ్చుకున్న అయిదు వందల రూపాయలు శేషు పెళ్ళిలో ఇచ్చివేశాను. ఇవి నీకు కట్నం. అంటే ఏమిటో తెలిసిందా? ఇదివరలో నువ్వు మా చెల్లిని కొనుక్కున్నావు. ఇప్పుడు నిన్ను మా చెల్లెలు కొనుక్కుంది. ఇకనోరెత్తేవంటే బాగా జరగదు. ఈ క్షణం మొదలుకొని నువ్వు మా చెల్లాయికి నౌకరవన్నమాట. అది చెప్పినట్లు వినకపోతే ఇదుగో ఇన్స్పెక్టరు గారు అరదండాలు తగిలిస్తారు నీకు ............ "

" నువ్వు దాన్ని పెట్టిన బాధలు జ్ఞాపకం వున్నాయా? జాగ్రత్త. కుంయ్ మన్నావంటే ఏ గుంటల్లో నిద్ర పోతావు."

ఎంతో అభ్యుదయాన్ని సాధించామన్న ఈ నాటి సమాజంలోనే వరకట్నపు చావులు స్త్రీని అధోగతి పాలు చేస్తున్నాయి. వరశుల్కం, కన్యాశుల్కం రెండింటిలో నష్టపోయింది స్త్రీయే. డబ్బు పెట్టి వధువును, వరుణ్ణి కొనుక్కోవడమంటే బానిసత్వానికి మారుపేరుగా పేర్కొనాలి. పురుషుడు అనుక్షణం హింసించడమనేది ఏ సమాజంలోనైనా సహించరానిదే. అందుకే - ఈ సన్నివేశం కన్యాశుల్కం, వరకట్నం రెండూ దురాచారాలే అని, రెండింటివల్ల బాధలకు గురైంది స్త్రీయే అని వాటిని నిరసించిన రచయిత దృక్పథాన్ని వెల్లడి చేస్తోంది.

"గున్నమ్మకు అవధాని మునుపు యముడు. ఇప్పుడు హృదయేశ్వరుడు. అవధానికి గున్నమ్మ మునుపు బానిస. ఇప్పుడు జీవేశ్వరి."

ఈ ముగింపు వాక్యం ద్వారా కుటుంబంలో

భార్యాభర్త అన్యోన్యంగా బ్రతకడానికి కన్యాశుల్కం, వర
కట్నాలు తీవ్రమైన అవరోధాలు సృష్టించిపెట్టి సమాజాన్ని
సంక్షుభితం చేస్తున్నాయి. ఈ అవరోధాలు తొలగినప్పుడు
కుటుంబంలోనూ, మొత్తం సమాజంలోను స్త్రీ పురుషుల
మధ్య ప్రేమాభిమానాలతో కూడిన సంబంధాలు ఏర్ప
డతాయి. అనే సత్యాన్ని రచయిత సూచించారు.

'ఘటన' అనే కథలో పదివేల
రూపాయలు వరకట్నం పుచ్చుకొని సుభద్రకు ఇష్టం
లేకపోయినా ఆమె తండ్రి పెళ్ళి నిశ్చయం చేస్తాడు.
పెళ్ళి సందర్భంలో కన్యావరణాలు, సభాకట్నాలు విషయంలో
పెళ్ళి వారి మధ్య మాటా మాటా పట్టింపు వస్తుంది. అప్పుడు
సంస్కరణ భావాలు గల జానకీదేవి- "వరకట్నం' లాకు
విరుద్ధం అది శిక్షార్హమైన నేరం" అని గద్దిస్తుంది.
ఇంకా వివాహ సందర్భంలోనే కట్నకానుకలు, పెండ్లి
కొడుకు, పెండ్లికూతురు మధ్య ఉండవలసిన సంబంధాలు
మొదలైన వాటిని సహేతుకంగా వివరిస్తూ వరకట్నం

తగదు అని ఖండితంగా చెబుతుంది. ఇచ్చిన కట్నం పుట్టువు తిరిగి ఇచ్చేయమని చెబుతుంది. వరకట్న వివాహం చట్టవిరుద్ధం కావడం చేత అక్కడున్నవారిని కోర్టులో సాక్ష్యానికి రమ్మనమని అంటుంది. తర్వాత ముహూర్తానికి సుభద్ర వివాహం ఆమె కోరుకున్న కిరీట రావుతో జానకీదేవి జరిపిస్తుంది.

ఈ విధంగా ఈ కథలో వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ రచయిత చక్కని కల్పన చేశారు. తన మనోభావాలకు ఆకృతిగా 'జానకి' పాత్రను సృష్టించి వరకట్న సమస్యకు పరిష్కారాన్ని సూచించి సమాజానికి చక్కని ప్రబోధం చేశారు.

'కీలెరిగినవాత' కథలో రచయిత వరకట్నం నింద్యమని, కన్యాశుల్కం ఎలా తగదో వరకట్నం కూడా అలాగే అర్థంలేని విధానమని కృష్ణవేణి పాత్ర ద్వారా చెప్పించారు. కృష్ణవేణి –

"కట్నం కావాలిట వాడికి"

"వాడి తలకాయంతలు. ఎంతయితే మాత్రం, ఇవ్వడానికివతల సిద్ధంగా కూచున్నారా?"

. . . . . . . . . . . . . . .

"కలెక్టర్లు కాదు, గవర్నర్లే వచ్చినా పుచ్చిచ్చి నేను పెలుసుక్కి కొనుక్కోను సరా?"

కృష్ణవేణి చేత పలికించిన పై మాటల ద్వారా వరకట్న దురాచార తిరస్కార భావం ప్రకటితమవుతోంది. నిజంగా చెప్పవలసి వస్తే రచయిత తన సంస్కార భావాలకు 'ఘటన' కథలో సిస్టర్ జానకమ్మ పాత్ర ద్వారానూ, 'కోవెలకెగసినవాత' కథలో కృష్ణవేణి పాత్ర ద్వారానూ ప్రాణప్రతిష్ఠ చేశారు.

ఇటువంటి కన్యాశుల్కం, వరకట్నం దురాచారాలను నిరశిస్తూ ఆ సమస్యను కథా వస్తువులో ఇమిడించి 'ముళ్ళచెట్టు కమ్మని పువ్వు'ను, 'పోలీసు', 'నీ నీడ చూసుకునే నేను జంకను', 'తోహాయు మారిన పరుగు'

'శుభికే శిర ఆరోహ', 'తులసి మొక్కలు', 'మొదటి దాడి', మొదలైన కథలను రచించారు.

*   *

## 9.3 వితంతువులు

ఆంధ్రదేశాన్ని ఒకనాడు ఎక్కువగా పట్టి పీడించిన సాంఘిక దురాచారాలలో బాలవితంతువుల సమస్య ఒకటి. శ్రీపాద వారు స్త్రీజాతి సముద్ధరణకు నడుం కట్టి అనేక కార్యక్రమాలను చేపట్టిన వీరేశలింగం పంతులు గారికి శిష్యులు. అందుచేత వీరు అదే మార్గానుయాయి అయి బాలవితంతువులు పడిన కష్టాలను కళ్ళకు కట్టినట్లు పలు రచనల ద్వారా ప్రకటించారు. పొద్దున్న లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇంటిల్లిపాదికి చాకిరీ చేస్తూ చావ లేక బతుకుతూ నిర్జీవంగా కాలం వెళ్ళబుచ్చే బాలవితంతువుల దయనీయ స్థితిని 'అరికాళ్ళ కింద మంటలు' మొదలైన కథలలో వాస్తవంగా చిత్రించారు.

'అరికాళ్ళకింద మంటలు' అనే కథలో పుట్టింటిలోనే బానిసలా బతుకుతున్న బాలవితంతువు రుక్రవర్తను ఇంట్లోని వారంతా మాటలతోనూ, చేతలతోనూ బాధలు పెట్టి ఆమెకు బతుకు మీదే విరక్తి కలిగేలా ప్రవర్తిస్తారు.

"ఈ జన్మలో నీకెలాగూ ప్రయోగం లేదు. ముందు జన్మలోనయినా సుఖపడాలంటే యిప్పటిలాగ ముత్తయిదువులకి గంధం రాసి యివ్వడమూ, మల్లెమొగ్గలు దండలు గుచ్చి పెట్టడమూ – అందులోనూ కన్యవాళ్ళకి ఇంతకంటే పుణ్యం యేమిటే?"

"......... ఇంతకంటే పశువు జన్మో, పిట్టల జన్మో కాస్తనయం ........."

ఇటువంటి మాటలలో ఆమె దయనీయ స్థితి వెల్లడి అవుతుంది.

"వెనుక జన్మలో యెంవళ్ళని చూసి యేడ్చావో, యెవళ్ళ సుఖం పడగొట్టావో? యెవళ్ళకి యెడ బంధాలు

కల్పం చూవా? లేకపోతే నీకిప్పుడీ రాత యెందుకు వస్తుందే? కనక ముందు జన్మ కోసం జాగ్రత్త పడవే అంటే - నీకోసమే గాని నా కోసమా ఏమయినా?" ఇటువంటి కుటుంబ సభ్యుల మాటల ద్వారా బాలవితంతువులకు తల్లిదండ్రులు, అన్నదమ్ములు అక్క చెల్లెండ్ర వంటి వాళ్ళే సూటి పోటి మాటలతో అరి కాళ్ళ కింద మంటలు పెట్టినట్లుగా ఎలా బాధించేవారో విదిత మవుతోంది. ఈ కథ సంపూర్ణంగా పుట్టింటికి చేరిన బాల వితంతువులు బానిసల కంటే, చివరకు పశువుల కంటే యింత హీనంగా చూడబడే వారో వాస్తవ సంభాషణలతో సజీవంగా చిత్రీకరింపబడింది. ఇంట్లో బతకలేక బయటపడిన బాలవితంతువుకు ఎదురుపడిన జట్కావాడు

"పంతులుగారి తోటకైతే నాకేమీ యివ్వ నక్కరలేదు తల్లి"

"......... ఏమీ భయపడకండమ్మాయి గారు ఇక మీకు సుఖమే గాని కష్టం లేదండి అమ్మాయిగారు......"

అని బాలవితంతు సమస్యను మానవతా దృక్పథంతో చూసిన పరిష్కారా

నికి చక్కని మార్గాన్ని సూచించారు.

సంఘ సంస్కార భావాలుగల రచయిత ప్రధాన పాత్ర అయిన బాలవితంతువు, జటావల్లో వీరేశలింగం పంతులు గారి తోటకి వెళ్ళిపోయినట్లుగా కథ ముగింపు చేయబడింది. ఈ సన్నివేశ కల్పన రచయితకు గల సంస్కార ప్రియత్వంతో పాటు వారిపై ఉన్న వీరేశలింగం గారి ప్రభావాన్ని కూడా తెలుపుతుంది. ఇది కథాకథన శిల్పానికి మెరుగులు దిద్దుతుంది.

భార్య చనిపోతే భర్త ఎలాగ వివాహం చేసుకుంటాడో అలాగే భర్త చనిపోతే భార్యకూడా మరో వివాహం చేసుకోవచ్చు - అని హేతుబద్ధంగా నిరూపిస్తూ ఆచరణాత్మకంగా కళ్ళకు కట్టినట్లు వితంతు పునర్వివాహాన్ని చిత్రించిన కథ 'కష్టాలపైన జవాబు' వీరేశలింగం ప్రభావంతో తీవ్రమైన సంస్కార భావాలను అలవరచుకొన్న శ్రీపాద వారు ఎక్కువగా వితంతు పునర్వివాహ విషయాలే కథావస్తువులుగా స్వీకరించడానికీ ప్రేమ వివాహ కథలను స్వీకరించడానికి ఆనాటి బ్రాహ్మణ సంఘంలో నెలకొని ఉన్న యథార్థ పరిస్థితులే కారణం" అని చామర్తి

కనకయ్యగారు (1986: 92) పేర్కొన్నారు. దీనిని 'కష్టాల పైన జవాబు' కథ ద్వారా నిరూపించవచ్చు.

ఈ కథలో 'సీతారామయ్య' పాత్ర సంఘ సంస్కార ద్వేషానికి ప్రతీక. మన సమాజం అందునా బ్రాహ్మణులు ఆచారవ్యవహారాలు అనే ముసుగులో అమానుషంగా ప్రవర్తిస్తున్నారని దాని పర్యవసానమే వితంతువుల దయనీయ స్థితి అని ఇతడు పేర్కొంటాడు. ఇంగ్లీషు చదువు మన సమాజానికి కనువిప్పు కలిగించిందని వితంతువులు పురుషుల్లా మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చునని ప్రబోధిస్తాడు. తన ఆదర్శాలను బాల వితంతువులైన భార్యకు ప్రబోధిస్తూ

"ఎన్ని మాట్లాడినా పెళ్ళాడే మొగాడికి పుణ్యమే వస్తే మళ్ళీ పెళ్ళాడే ఆడదానికీ వస్తుంది. గార్హస్థ్యం అందే పురుషుడు వొక్కని సొమ్మే కాదు" అని వివరిస్తాడు.

"బ్రాహ్మల్లో ప్రేమించడం యెలాగో తెలుసుకోడానికి వితంతువులకు మాత్రమే అవకాశాలున్నాయి. కన్యలకు ప్రేమ యిలాంటిదని తెలవని స్థితిలోనే పెళ్ళి అయి

పోయింది. తరవాత ఆ పిల్లకి ఆ పిల్లవాడికే కలిస్తే కలుస్తుంది, లేకపోతే లేదు. వితంతు వివాహాల వల్ల ఈ చిక్కులు కలగవు. వయస్సుకు సంబంధించిన హెచ్చు తక్కువల బాధ వుండదు.”

అన్న సీతారామయ్య మాటలలో బ్రాహ్మణ కుటుంబాలలోని వాస్తవ పరిస్థితులు, వితంతు పునర్వివాహానికి గల మానవతా దృక్పథంతో కూడిన సహేతుకత తెలుస్తున్నాయి.

సీతారామయ్య తల్లి బుచ్చెమ్మ సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా అత్యంత ఆధునికమైన భావాలు గల మహిళ. బాలవితంతువు అయిన మేనకోడలు పూర్ణ తన కొడుకును సీతారామయ్యను పెండ్లి చేసుకునేలా చేయడంలో ఆమె నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది. ఈ కథలో పూర్ణ మనోభావాలను పునర్వివాహ వాంఛను - పునర్వివాహం జరగడంలో సీతారామయ్య బుచ్చెమ్మ నిర్వహించిన పాత్రలను రచయిత వర్ణించిన నేర్పు ఎంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. పాత్రల మనోభావాల వర్ణన సమకాలీన పరిస్థితులను హృదయ విదారకంగా మన ముందుంచుతుంది.

నాటి సమాజంలో మాటలతోనూ, చేతలతోనూ, చిత్రహింసలకు గురి అవుతున్న బాలవితంతువుల ఆవేదనకు ప్రతిరూపం 'క్రిందికా? పైకా?' అనేకథ

ఈ కథలో ముక్కుపచ్చలారని ఆడపిల్లలు బాలవితంతువులైనప్పుడు సంఘంలో వారి స్థితిగతులు ఎలా ఉండేవో 'కృష్ణవేణి' అనే అల్లితో మాట్లాడిన సందర్భాల ద్వారా రచయిత ఈ క్రింది విధంగా చిత్రీకరించారు.

ఎనిమిదో సంవత్సరంలో నాకు పెళ్ళయిందిట. తొమ్మిదో యేట భర్త చనిపోయేడట. పదో సంవత్సరంలో గాని నాకిది బోధపడలేదు. మొగుళ్ళున్న అందరి పిల్లల్లానే పరికిణీ కట్టుకునే దాన్ని. జాకెట్టు తొడుక్కునే దాన్ని. మా అమ్మ నాకు తలదువ్వేది. కాని బొట్టూ కాటుకా పెట్టేదికాదు. పెట్టమంటే పాపం అని మందలించేది. కాసులూ, కంటె, నానూ దాపురుగళ్ళు – అన్నీ పెట్టేదిగాని మంగళసూత్రాలు వుండేవి కావు. అడిగితే "పోతాయమ్మా" అనేది"

"ఇవన్నీ వుండగా ప్రత్యేకంగా అవి మాత్రమే

మొగా పోతా" వాంటే తరువాత చెబుతానులే" అనేది. ఒకనాడు చెబితేగాని వల్లకాదు అన్నాను."

నీ కర్మ కాలి పోయింది. నీ పాపం బద్దలై పోయింది. నువ్వు బతికి ఉండే చచ్చిన వాళ్ళ లో లెక్క. నువ్వు మంగళ సూత్రాలు వేసుకో గూడ దంది". తోటి పిల్లల్లాగే నేనూ ఉన్నాను. ఏమీ తేడా కనబడ లేదు. అన్న మాటలకు పాపం ఆ బాలవితంతువుకు దుఃఖం పొంగొచ్చినట్లుంది. అందుకు ఆ బాలవితంతువు తల్లితో ఇలా అంటుంది.

"నేనేం చేశానే? అందరిలాగే నేనూ వున్నాను కదూ" అన్నాను. అందుకు ఇరుగు పొరుగు పిల్లలు ఇలా అన్నారు. "నీ మొగుడు చచ్చి పోయాడు. నువ్వు వెధవ ముండవయి పోయావు" అన్న మాటలకు

నా మొగుడెవరూ? నేనెందుకు వెధవ ముండ నయి పోతానూ? కావలిస్తే నువ్వాయి పో" అన్నది.

"అలా చచ్చి పోయే వాడికి నన్నెందుకు పెళ్ళి చెయ్యాలి? మంచి వాణ్ణి తెచ్చి మళ్ళీ పెళ్ళి చెయ్యండి"

అని ఏడుస్తూ తల్లితో అంటుంది.

తోటి పిల్లలంతా పసుపు పూసుకుని కాటుకా బొట్టూ పెట్టుకునే వారు. నోములు పట్టేవారు కాళ్ళకి పసుపూ పారాణీ పెట్టుకునే వారు. వాయినాలు యిచ్చి పుచ్చుకునే వారు. నన్ను దూరంగా వుండమనే వారు. నేను యేడ్చే దాన్ని. ఇది చూసి మా అమ్మ ఒక్కొక్కరకంగా నన్ను తీసికెళ్ళేది కాదు. వెనకాలే వెతుక్కుంటూ వెళ్ళే దాన్ని. నన్ను చూసి మా అమ్మ...... వెళ్ళిపో నువ్వు వచ్చి అందం అంతా చెడగొడుతున్నావు" ......... నాలాగే మీరూ అయి పోవాలని నేను తిట్టేసే దాన్ని"

. . . . . . . . . . . . . . . . . . .

"పెళ్ళాం చచ్చిపోతే మొగాళ్ళు మళ్ళీ పెళ్ళాడే టప్పుడు మొగుడు చచ్చిపోతే ఆడాళ్ళు మళ్ళీ లేదెందుకు పెళ్ళాడ కూడదూ?"

. . . . . . . . . . . . . . . . . . .

"మొగుడు చచ్చిపోతే ముండా మొయ్యాలా?"

అని సాగిన సంభాషణల ద్వారా బాలవితంతువుల అమాయకత్వమూ, అంధవిశ్వాసాల వలన మోడు బారిన మొగ్గ వంటి జీవితాలు మానసికంగా హింసకు గురయ్యిన స్థితిగతులు వాస్తవ రూపంలో తెలుపుతున్నారు.

సమస్యల వలయంలో చిక్కుకున్న బాలవితంతువుల వేల హృదయాలను అద్దంలో చూపినట్లు చిత్రించిన రచయిత. స్త్రీ పునర్వివాహానికున్న హేతుబద్ధతను మానవతా దృక్పథంతో నిరూపించారు.

వీరేశలింగం పంతులు గారిని స్ఫూర్తిగా అనుసరించిన శ్రీపాదవారు వితంతు పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ స్త్రీ జాతిని సముద్ధరించడమే ప్రధాన ధ్యేయంగా అనేక కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. బాలవితంతువుల దయనీయ గాథను వాస్తవంగాను, కరుణరస భరితంగానూ చిత్రిస్తూ వీరు 'రామలక్ష్మి', బుచ్చి వెంకయమ్మ, తల్లిప్రాణం, మేనరికం తప్పులేదు, వేలపెడితే అల్లుడైనాడు, అన్నంతపని జరిగింది పెళ్ళాడదగ్గ మగాడేడీ, ముందు హాలాహలము – పిదప అమృతం

తన దాకా వచ్చింది, కన్యాకాలే యత్నా ద్వారితా, అన్నపూర్ణ, ముదితైన కథలనూ, క్షీరసాగర మథనం నవలనూ రచించారు.

బాల వితంతువుల కష్టాలను చూచి పునర్వివాహం ఒక్కటే పరిష్కారమని తన రచనల ద్వారా ప్రబోధించిన శ్రీపాద వారు కుటుంబంలో వారు అనుభవించిన కష్టాలను చిత్రించడంతో పాటు వారి వలన కుటుంబాల్లో ఉత్పన్నమైన సమస్యలను చిత్రిస్తూ 'ఇల్లుపట్టిన వెధవాడపడుచు' అనే కథను రచించారు.

బాల్యంలోనే భర్తని కోల్పోయి నిర్బంధ వైధవ్యంతో పుట్టిళ్లల్లో ఉన్న బాల వితంతువుల మానసిక సంఘర్షణ ఇందులో వర్ణితమైంది. తమకు లేని సౌభాగ్యాన్ని పొందుతున్న, కొత్తగా ఇంటికి వచ్చిన కోడళ్లను చూచి ఓర్వలేక తన ఆధిపత్యాన్ని చూపుతూ వారిని బాధించిన తీరు అత్యంత సహజంగా వర్ణించబడింది. వెధవాడపడుచులు తల్లిదండ్రుల బలంతో అన్నదమ్ములను తన గుప్పిట్లో పెట్టుకుని వదినలను, మరదళ్లను, కాంచి రంపాన పెట్టడం కళ్లకు కట్టి

నట్లుగా ఈ కథలో చూపారు. తమ బ్రతుకుల్లో బలవంతంగా అసహజమైన పరిస్థితులు కలగడం చేత ఉమ్మడి కుటుంబాలలో వారి పాత్ర భయంకరంగా ఉండడం సంభవించేది. దీనికి కారణంగా నిర్బంధ వైధవ్య వాంఛ సాంఘికంగా అసారవమూ, సహజమైన వాంఛలకు దూరం కావడమూ, తన జీవనోపాధికి రక్షణ లేక పోవడమూ అనేవాటిని కారణంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి నేపథ్యంలో పెదవాడపడుచులతో కుటుంబంలో కలిగిన కలతల పైనాలను రచయిత ఎంతో వాస్తవంగా చిత్రీకరించారు.

* *

## 9.4 వేశ్యా సమస్య

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు తమ రచనల్లో వస్తువుగా చూపిన సామాజిక సమస్యలలో వేశ్యావ్యవస్థ ఒకటి. కళారంగంలో తమదైన స్థానాన్ని నిలుపుకుంటూ పురుషుని కామ వాంఛకు బలి అవుతూ సమాజంలో ఒక అవలక్షణంగా పుట్టుకొచ్చిన వేశ్యావ్యవస్థ వలన స్త్రీల బాధలకు అంతులేకుండా పోయింది. సమాజంలో పురుషునితో సమానంగా స్త్రీకి అవకాశం కల్పించాలని విశిష్టమైన స్త్రీ పాత్రల్ని సృష్టించారు. అటువంటి పాత్రలలో 'కలుపు మొక్కలు' అనే కథలో 'శేషాచలం' అనే వేశ్య పాత్ర నారీలోకానికి శిరోరత్నం వంటిది.

బ్రాహ్మడు సమయం కోరి శేషాచలం అనే వేశ్యను సంకోచిస్తూనే కలుస్తాడు. ఆమె అతని పట్ల గౌరవాన్ని ప్రదర్శించి కొంత డబ్బిచ్చి సత్కరిస్తుంది. ఆ బ్రాహ్మడు డబ్బుకోసం రాలేదని తన దగ్గరే ఉంచమని తిరిగి ఇచ్చివేయబోతాడు. అప్పుడు ఆ వేశ్య " తమ దగ్గరే వుంచి తమరే వినియోగించండి. ఇచ్చేసింది మరి నేను పుచ్చుకోను.

ఇక నావల్ల తీరవలసిన ప్రయోజనం ఏమిటో సెలవిపించండి" అన్న మాటల్లో నిజాయితీతో కూడిన మనస్తత్వం వెల్లడి అవుతుంది.

మరొక సందర్భంలో బ్రాహ్మణుడితో వేశ్య "ఏదేముంది? దేవుడు లేడు, దెయ్యాలు మాత్రం ఉన్నాయి. ధర్మం లేదు. అధర్మం అంతటా నిండి పోయింది. మంచి మందులో కయినా లేదు. దౌర్జన్యం మాత్రం పెరిగి పోతుంది. నీతి మాలోనే కాదు. మన దేశంలో నే లేదు. ఎవరేం చెప్పినా శుద్ధ అబద్ధం తప్ప సత్యం లేనే లేదు. ఎటు చూసినా హింస. ఎక్కడ పట్టినా రక్తం. దేవుడు లేనే లేడండీ" అని పలికిన మాటల ద్వారా వేశ్యలో ఉన్న లోక పరిశీలనా దృష్టి, మేధావి లక్షణం వెల్లడి అవుతున్నాయి.

"నేనెప్పుడూ, ఎక్కడా, ఎవరి బసకి వెళ్ళను పైగా మేళం వెళ్ళన చోట బ్రహ్మచర్యం పాటిస్తాను. ......." అన్న మాటలను బట్టి వేశ్య నిష్ఠతో కూడిన జీవితానికి ప్రతీక.

"అగ్రజాతుల్లో పుట్టవలసిన దానవమ్మా నువ్వు"

"అదేమన్న మాట బాబయ్యా? ఇప్పుడగ్ర జాతుల విశేషం ఏమిటట? అగ్రజాతుల్లో మాత్రం స్త్రీలకి ఆదర గౌరవా లున్నాయా? అగ్రజాతుల్లో కూడా స్త్రీ అంటే బానిసే కాదా? ఆట బొమ్మే కాదా?" అని అంటుంది.

"........ ఎంత యోగ్యురాలవమ్మా నువ్వు? ....... వేశ్యాకులంలో నువ్వు తప్పు పుట్టావమ్మా" అని శ్రీబ్రాహ్మణుడు అన్నప్పుడు -

"ఏం, వేశ్యాకులం అంత చెడిపోయిందా బాబయ్యా? అగ్రజాతి గృహిణులందరూ మచ్చలేని వారేనా నాయనగారూ? మాలో నన్ను తలదన్నే ఇల్లాళ్ళు సానులయి ఉండినన్ని ప్రాతివత్యానికి వరవడి పెట్టేవారు వేలున్నారు. కాని లోకం గుడ్డిది, పురుషులు మత్తులు ........" అని అంటుంది.

"........ నువ్వెంత యోగ్యురాలవని ఎరగనే ఎరుగను ........ వేశ్యవయినా కులాంగన లాగ అభిజాత్యం కలవాక కళావతిని తాకడానికి నేను సాహసించ లేను. కనక తల్లీ నన్ను క్షమించు నా కోరిక మరచిపో. నాకు

నెలవిచ్చి" అని బ్రాహ్మడు అన్నప్పుడు –" ....నావయాలంగా వొక వేద మూర్తి కుటుంబానికి జీవనాధారం ఏర్పడడం నా అదృష్టం నా జీవితంలో మళ్ళీ లభించదు. ఇంతకీ నేను పతివ్రతనెలాగా కాదు. మగనాలనంతకంటే గాను. కనక దీనివల్ల నాకిప్పుడు కొత్తగా సంభవించే పాతివ్రత్యం కూడా ఏమీ లేదు. నాకు విచారం లేదు. అమరా విచారించవద్దు." అని సమాధానంగా చెబుతుంది.

ఈ పై సన్నివేశాలన్నింటి ద్వారా ఒక్క పాత్రకే కాకుండా మొత్తం వేశ్యా కులానికి గల ఔన్నత్యం వ్యక్తమవు తుంది. వేశ్యలలో కూడా మానవత్వము, నైతిక విలువలు, ధర్మ చింతన, మొదలైన విశిష్ట గుణాలు కలవారు ఉన్నారని చాటుతు న్నాయి. వేశ్యకులం అంతా చెడిపోయింది కాదని వేశ్యలలో కూడా పతివ్రతలు ఉన్నారని ఇతర కులాలలో కూడా వేశ్యల వంటి స్త్రీలు ఉన్నారనే సత్యాన్ని 'కలుపు మొక్కలు' కథలో శేషాచలం పాత్ర నిరూపిస్తుంది. స్త్రీ భోగ వస్తువు కాదని పురుషు డితో అన్ని విధాల సమానమైనదని పురుషుల చూపులలోనే ఈ భేదం ఉందని లోకం గుడ్డిదవడం చేత అదే కొనసాగుతూ

ఉందని ఈ పాత్రద్వారా రచయిత సమాజాన్ని విప్పిచూపిస్తు
న్నాడు.

శ్రీపాద వారు కథా పాత్రలలో
విశేషించి స్త్రీపాత్రలలో - శేషాచలం (వేశ్య) పాత్ర విలక్షణ
లక్ష్యం గల ఒక తిరుగుబాటు పాత్ర. వృత్తికీ ప్రవృత్తికీ సంబం
ధం లేదని చెప్పడమే గాక తన జీవితాన్ని నిదర్శనంగా చూపిన
పరోపకార పరాయణ. వృత్తిచే వేశ్య అయినా, ప్రవృత్తిచే
దయాదాక్షిణ్యాలు కలది శేషాచలం. గడ్డిపరకంత ప్రయోజనం
లేకపోయినా తన శరీర వ్యాపారం వల్ల ఒక వేదమూర్తి కుటుంబానికి
జీవనాధారం ఏర్పడడం తన అదృష్టంగా భావించుకుంటుంది.
అని రచయిత కథలలో 'కలుపు మొక్కలు' అనే కథకు దానిలో
వేశ్య పాత్రకు గల వైశిష్ట్యాన్ని కనకయ్యగారు (1986: 115) వ్యాఖ్యా
నించారు.

వేశ్యావృత్తిని సంస్కరించాలనే దృక్పథం
లో రచయిత 'తులసి మొక్కలు' అనే కథలో ఒక వేశ్యను
బ్రాహ్మణ యువకునితో వివాహం జరిపించారు. ఈ కథలో

వీరేశలింగం పంతులు గారు ప్రధాన పాత్ర. వేశ్యలలో కూడా పతివ్రతలు ఉంటారని రంగనాయికి పాత్ర ద్వారా రచయిత నిరూపించదలచుకొన్నారు. వీరేశలింగం పంతులు గారి ఆధ్వర్యంలో ప్రకాశమనే బ్రాహ్మణ యువకునికి వేశ్యా బాలికను ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఆ సందర్భంగా వేశ్యలతో పాటు సర్వ వర్ణ సంభోజనం కూడా ఏర్పాటు చేస్తారు.

"భోగం దాన్నయితే మాత్రం చెయ్యిపట్టుకోవడమే?"

"సానయితే యింత లోకువా? నాకక్కర లేదు సానరికం".

"నేను చెయ్యలేనమ్మా సానరికం, నాకు పెళ్ళి చేసెయ్యి".

అని పలికిన రంగనాయికి మాటలలో వేశ్యలలో కూడా శీలసౌశీల్యం గల స్త్రీలు ఉంటారనడానికి ఆధారం కనిపిస్తుంది. సంస్కార భావాలతో పాటుగా వీరేశలింగం పంతులు గారి పట్ల గురుభావం గల రచయిత తన కథలలో వితంతు వివాహాలను వస్తువుగా తీసుకోవడంతో పాటు వేశ్యా యువతికి బ్రాహ్మణ యువకుడితో పెళ్ళి జరిపించడమనే ఉన్నతమైన సంస్కార భావాన్ని కూడా తన కథకు వస్తువుగా ఎన్నుకున్నారు.

వేశ్యకులంలో కూడా మానవత్వమూ, నైతిక ప్రవర్తన ఉన్నాయని ప్రబోధిస్తూ, ఆ కులం పట్ల నిరసన భావం తగదనే సంస్కార దృక్పథంలో రచయిత 'అన్నంత పనీ జరిగిందీ', 'పుల్లంరాజు', 'వడ్లగింజలు' మొదలైన కథలలో నిరూపించారు.

'రక్షాబంధనం' నవలలో ఒక సందర్భంలో కృష్ణారావు లీలావతుల (వేశ్య) సంభాషణ ఇలా నడిచింది.

"........ జీవితం చాలించుకుందామన్నంత వరకూ వెళ్ళిపోయాను; కాని వొక స్త్రీ నా జీవితం నిలపింది. మీ జాతిదే వొక స్త్రీ ప్రణయ రసం చిలికి నాకు నవ జీవితం అనుగ్రహించింది."

"వేశ్యలను ఎలాంటి వాళ్ళో కూడా అర్థం చేసుకోలేరు. కొందరు వేశ్యలు పురుషులను పాడు చేస్తారు. వొప్పుకుంటాను. కాని కొందరు వేశ్యలు పురుషులను ఉద్ధరిస్తారు."

".......... ఒక వేశ్య నన్ను బతికించింది నన్నుద్ధరించింది కూడా.........."

ఈ సంభాషణను బట్టి వేశ్యలల్లో ఉన్న, మూర్తీభవించిన స్త్రీ హృదయాన్ని పతివ్రతా ధర్మాలను, ఔదార్యాన్ని రచయిత తేటతెల్లం చేశారు.

".......... మాకూ ఆకలి వుంది. మాకూ దప్పిక వుంది. మాకూ కొంపా గూడు కావాలి. జీవితానికి ధన తృష్ణా, కళకి రూప తృష్ణా — ఇంతే మాకు తప్పవు, అప్పటికప్పుడు పశువులయి వచ్చిపోతారు కొందరు మాదగ్గరికి. అంతరాత్మని చంపుకొని, కళ్ళుమూసుకొని, చెయ్యి చూపుతాము మేము. సానులు నీతిగా వుండాలనుకుంటారు వీరు. నీతిగా వున్న పురుషులే మమ్మల్ని చేపట్టాలనుకుంటాము మేము; కానీ ద్వంద్వ భూయిష్ఠమైన యీ ప్రపంచాన" అని పలికిన నీలా చలం అనే వేశ్య మాటలలో వేశ్యావ్యవస్థలో ఉన్నటువంటి చెడ్డల ఔచిత్యం, అనౌచిత్యం కనిపిస్తాయి. సమాజంలో అణగారిన ఆర్థిక స్థితివలన పురుషుల అవినీతికరమైన ప్రవర్తన వలన వేశ్యావ్యవస్థ రూపు దిద్దుకున్న వైనం స్పష్టంగా ప్రతిపాదించబడింది.

నరసింహం పలికిన –

“ ..........జీవితం వొకవైపే చూస్తున్నాము మేము. రెండో వైపు చూపించావు నువ్విప్పుడు నాడులు కుంగి పోతున్నాయి నాకు” అన్న మాటలలో సమాజంలో వేశ్యల పట్ల ఉన్న అమానుషమైన ప్రవర్తన వారిని సంస్కరించలేక పోవడంలోని బాధ్యతా రాహిత్యము వెల్లడి అవుతున్నాయి.

నీలాచలం భయంతో నరసింహాన్ని సాయంగా తన ఇంట పడుకోమని కోరినప్పుడు నరసింహం ఆమె వేశ్య కావడం చేత సంకోచిస్తాడు. ‘నువ్వు ఇలాంటి కోరిక కోర వచ్చునా’ – అని ప్రశ్నిస్తాడు. అప్పుడు నీలాచలం ఇలా అంటుంది.

“ఆపదలో వున్నాను. ప్రాణాలు నిలవడానికిన్ని కులం చూడాలా? నేనెలాంటి కోరిక కోరుతున్నానో నాకు తెలుసు. మీరు తెలుసుకోండి. తన మీద పడి తేనే శలభాన్ని మాడ్చేస్తుంది మంట. మేమూ అంతే. మాది పాపిష్టి జన్మ. ఆ మహా పాపంలో కళ వొకటే మాకు ఆలంబం”

ఈ మాటలలో కులం కంటే మానవత్వా నికే విలువ ఎక్కువ అని, వేశ్యలు కూడా మానవత్వం మూర్తీభవించిన వారేనని, కళారాధన ఒక్కటే వారి జీవితాలకు వెలుగు అని రచయిత దృక్పథం ప్రకటితమవుతోంది. సమాజంలో వేశ్యల పట్ల మనం ఎంతో అసభ్యతను ప్రదర్శిస్తూ వారిని అవమానానికి, గురి చేస్తున్నామని బాధపడతారు శ్రీపాద వారు. ప్రేమ ఒక మనస్సున్న మనిషే అనీ, నీతి నియమాలు ఉన్నాయనీ, ఎవరూ గుర్తించరు. పైగా సమాజంలో స్త్రీ పట్ల చూపే చిన్న చూపుకు తోడు వేశ్య అనగానే హేయమైన దృష్టిలో చూడడం జరుగుతోంది. ఈ విధంగా దేవాలయాల్లో పైభాగం పేరుతో ప్రారంభమైన వీరి జీవితం ప్రజలందరికి చెందినదనే భావం ప్రబలిపోయింది. పరిస్థితుల ప్రభావం వల్ల సాని అయినంత మాత్రాన లోకానికి లోకువ కానక్కరలేదు. అంతేగాక 'ఈ వృత్తిలో స్త్రీ యెంత ప్రధానమో, పురుషుడూ అంత ప్రధానుడే.' (మాధుర్. వి.ఎస్. 1965: 7) అయినా లోపాల్ని కప్పిపుచ్చి ఈమెకు మాత్రమే పవిత్రతను పాటించాలనుకోవడం పొరపాటు. నీతి నియమాలనేవి స్త్రీ పురుషులిరువురికి అన్వయిస్తాయి. ఈ భావాన్ని

శ్రీ పాద వారు కథల ద్వారా తెలియ చేయడం ఒకయెత్తు. వాళ్ళకూడా అవకాశం ఉంటే వివాహం చేసుకొని గృహిణులు కావాలని చూపడం ఇంకోయెత్తు. అంతేకాక 'సర్వకళాపారంగతులైన' వీరు (విజయలక్ష్మి, సి. 1881: 85) ముదితల్ నేర్వగరాని విద్యకలదే అన్నట్లు సర్వ విద్యలలో ఆరితేరిన వారు, అని వారికి కొన్ని పద్ధతులు ఉంటాయని, నిష్టలు నియమాలు ఉంటాయి అని, అగ్రజాతుల్లో పుట్టిన స్త్రీలకు వీళ్ళకు భేదం లేదని అంటారు. ఆయన దృష్టిలో ఏ స్త్రీకైనా వ్యక్తిత్వం ఉండాలి. ఆమె బానిస కాకూడదు. పురుషుని చేతిలో ఆటబొమ్మ కాకూడదు. ఈ విధంగా వేశ్యలలోని మానవత్వ విలువలను వెలిబుచ్చారు. అంతేకాక వేశ్యాకులంలో పుట్టిన ఒక యువతికి, అగ్రజాతికి చెందిన బ్రాహ్మణ యువకునితో వివాహం జరిపిస్తాడు. అంటే వేశ్యావృత్తిలో ఉన్నస్త్రీలు ఆజన్మాంతం వేశ్యలుగా ఉండాలనే నియమం లేదని సమాజం వారి పట్ల చూసే దృష్టిని బట్టి వారి జీవితం ఉంటుందని శ్రీపాద వారు భావించడం అత్యున్నతం.

* *

## 9.5 స్త్రీ స్వేచ్ఛ

'కొత్త చూపు' కథలో 'అన్నపూర్ణ', వీరముష్టి 'సుబ్బయ్య' దగ్గర సాముగరడీలు నేర్చుకుంటుంది. అగ్రహారం లో అందరూ ఎన్ని అడ్డంకులు, ఎంత విడ్డూరంగా చెప్పుకున్నా ఆమె తల్లిదండ్రుల పట్టుదలతో మల్లయుద్ధంలో ప్రవీణురాలు కాగలుగుతుంది. ఒకరోజున 'సూరిశాస్త్రి'కి 'శ్రౌతి'కి జరిగిన కుస్తీపోటీలో శ్రౌతి ఓడిపోతాడు. తనకు అనుమతి లేకపోయినా అన్నపూర్ణ, సూరిశాస్త్రితో కుస్తీకి తలపడి ఓడిపోతుంది. పెళ్ళి చూపులకు వచ్చిన పెళ్ళికొడుకుని, పెళ్ళిపెద్దలని ప్రశ్నలు వేసి నిలదీస్తుంది-

"ఇప్పుడు వరయోగ్యత నిర్ణయించవలసిన వారు ......... మీ వంటి తలపండిపోయిన వృద్ధులు కాదు."

"......... తెలుగు కన్నెలం మేమిప్పుడు చూసుకోవలసిన వరయోగ్యత చక్కదనం కాదు. చదువూ కాదు. ఐశ్వర్యం కానే కాదు. ఇవన్నీ తెలుగు యువతని బానిసను చేశాయి. ఈ లక్షణాలున్న తెలుగు యువకులంతవరకూ చక్రవర్తులుగా చలామణీ అయ్యారు. కానీ అలాంటి వారిక వివాహానికి అర్హులు కారు."

అని అన్నపూర్ణ పలికిన మాటలలో స్త్రీ చైతన్య దృక్పథం కొట్టవచ్చి నట్లు కనిపిస్తుంది. స్త్రీ అభ్యున్నతికి ఏది ఆవశ్యకమో తెలియజేస్తుంది. పురుషుడితో సమానంగా స్త్రీ అన్ని రంగాలలోను ఎదగాలి అనే దృక్పథం స్త్రీ పాత్ర ద్వారానే రచయిత చెప్పించారు. ఈ కథలో పై దానికి ఉదాహరణగా అగ్రహారాల్లోని సంపన్నుడైన వేదపండితుని కూతురు చేత కసరత్తు చేయించడం అనేదాన్ని రచయిత చూపారు.

మన స్త్రీలందరికీ ఈ విద్య పురుషుల కంటే స్త్రీలకి ఎక్కువ అగత్యం. వివాహం కంటేనూ అగత్యం అనే 'భట్టాచార్యుని' మాటల ద్వారా స్త్రీ రక్షణకు తనకు తానుగా సన్నద్ధురాలు కావాలి అనే సందేశాన్ని రచయిత ఇచ్చారు.

"వ్యక్తిపరమైన దౌర్బల్యం యేస్థితిలోనూ బయట పడుతూనే ఉంటుంది. కనక స్త్రీపురుషులు కలిసి విద్య నేర్పిస్తే వచ్చే కొత్త అపాయం యేమీ లేదు. పురుషులంటే స్త్రీలకు బెరుకు భావం పోవాలంటే యీ పద్ధతి అవలంబించక తప్పదు. స్త్రీలకి అన్నం వండిపెట్టడం వొకటే కాదు, శాలలో కొత్త చిత్తవృత్తి ప్రవేశపెట్టాలి" అనే శ్రీపాద మాటలలో స్త్రీ సమానత్వ భావం

స్వేచ్ఛా భావం వెల్లడి అవుతున్నాయి.

'కీలెరిగిన వాత' అనే కథలో పెళ్ళివారి లో 'కృష్ణవేణి' ఇలా అంటుంది.

"నేనొక పాఠశాల నడుపుతున్నాను. స్త్రీలలో కొత్త దృక్పథం ప్రవేశపెట్టాలనీ, వారి జీవితాలకు కొత్త విలువలు కట్టాలనీ నా ప్రయత్నం. నా జీవిత లక్ష్యాలవి."

. . . . . . . . . . . . . . . . . . . . . .

"భార్య అంటే బానిస కాదు. సమాన భాగ స్వామిని. నా మాటల్ని నేను పూర్తిగా అమలు పరుచుకుంటాను"

. . . . . . . . . . . . . . . . . . . . . .

"భర్తవైపు వారిని నేను భక్తితో పూజిస్తాను అయితే, వారు నన్ను ప్రేమిస్తేనే జరుగుతుందిది."

. . . . . . . . . . . . . . . . . . . . . .

"అవసరం వచ్చినప్పుడు గృహిణి చలాయించుకోవలసిన అధికారాలన్నీ నేను దఖలు పరుచుకుంటాను"

"సభలకు వెళ్ళడమూ పురుషులతో కలసి కూర్చోడమూ నాకలవాటు, ముందున్నా అది అలా జరుగుతూనే వుంటుంది."

. . . . . . . . . . . . . . . . . . . . . . . . .

"నేనొంటరిగా పొరుగూళ్ళు వెళ్ళడం వుంది. ముందు ముందున్నా అలా వెడుతూనే వుంటాను".

ఈ వాక్యాలలో రచయిత స్త్రీ దృక్పథంలో ఆనకూ పురుషునితో సమానంగా ఉండవలసిన స్థానాన్ని వాచ్యంగా చెప్పారు. ఈ నాటికీ సమాజంలో స్త్రీకి సమానత్వం లేక పోవడాన్ని ఆనాడే రచయిత గుర్తించి కృష్ణవేణి పాత్ర ద్వారా ప్రకటించారు.

ఈ కథ స్త్రీకి సంబంధించిన సంపూర్ణ స్వేచ్ఛను దర్శించడానికి చక్కని ఉదాహరణ. రచయిత దృష్టిలో స్త్రీ రూపానికి కృష్ణవేణి సమగ్రమైన ప్రతిరూపం. స్త్రీ జాతిలో నెలకొని ఉన్న వివక్షను కృష్ణవేణి తిరస్కరించి పురుషునితో సమానత్వం కావాలని ప్రకటిస్తుంది. విద్యలో, వివాహంలో కుటుంబంలో చివరకు సాముగరిడీలలో కూడా పురుషునితో సమానత్వాన్ని కోరుకుంటుంది.

కట్నం తీసుకు రమ్మని తమ్ముళ్ణి భార్య కృష్ణవేణి మీదకు పంపుతుంది. ఇది గమనించిన కృష్ణవేణి భర్త అసమర్థుడు, అస్వతంత్రుడని తెలిపి ఈ విధంగా అంటుంది.

“నువ్వింత అనాథవనుకో లేదు మేమెవరమూ. సాటి ఆడదాన్ని పెళ్ళి చేసుకున్నందుకు నేను చాలా సిగ్గు పడుతున్నాను. చిక్కులు పెడితే కాపురం బదులు కుంటుందా అని, ఉబ్బు పట్టుకు రాకుండా పోతుందా అని, యిత్తు వేశావు కదూ. మీ అక్క మాటలు విని? నీవంటి వాజమ్మలతోనా నాకాపురం? బి.ఏ అయివుండినీ ఉన్న తాకయాలు లేక ఆత్మగౌరవం యెరగక, ఆత్మవిశ్వాసం లేక గుడ్డిగవ్వకు మారని నీకాడబ్బెందుకు? ఛీ పురుగా” అంటూ భర్తనే ఎదురించిన స్త్రీ రత్నం కృష్ణవేణి.

స్త్రీ ఆత్మ విశ్వాసం లేని పురుషుణ్ణి భర్తగా ప్రేమించ లేదు. అవసరమైతే పురుషుణ్ణి చీదరించుకొని బయటికి కూడా రాగలదు. అందే పురుషాధిక్యతలను ధిక్కరించడానికి వెనుదియ్యరాని శ్రీపాదవారు స్త్రీ స్వేచ్ఛను వెల్లడిపరిచారు. అందువల్లనే ఆత్మగౌరవం గల స్త్రీలు ఈనాడు వివాహ బంధాన్ని వ్యతిరేకించి తమ

వ్యక్తిగత జీవితాలను తామే నిర్ణయించుకోగలుగుతున్నారు. ఈ వ్యక్తిత్వానికి ఆనాడే శ్రీపాద వారు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ఆయనలోని కొత్త చూపుకు నిదర్శనం.

ఈ విధంగా అనేక కథలలో స్త్రీ పాత్రల ద్వారా రచయిత తన మనోగతాన్ని వెల్లడించారు. ఈయన స్త్రీపాత్రలన్నీ చైతన్యమూర్తులే.

'కళ్ళుతెప్పిన జవాబు' అనే కథలో 'జుల్ణా' అనే బాలవితంతువు పాత్ర ద్వారా రచయిత స్త్రీ స్వేఛ్ఛను స్పష్టంగా ప్రకటింప జేశారు.

"ఇప్పటిదాకా హిందూస్త్రీకి ఇలాంటి ఆవేశం కలగలేదు. ఆమె పురుషుడంటే దేవుడనుకుంది. అతను రాజనీ, తాను నౌకరనీ నమ్మింది. మొగాడు ఏం చేసినా ఒప్పుకుంది. అన్నం తిననంటే తింది. నిద్రపొమ్మంటే పోయింది. నువ్వు మనిషివి కాదంటే ఒప్పుకుంది. ఈ కారణాల చేత మొగాడికి కళ్ళు మూసుకుపోయాయి"

ఈ మాటల ద్వారా స్త్రీ పురుషాధిక్యతను ధిక్కరించడం కనిపిస్తుంది. సమాజంలో పురుషుల ప్రవర్తనలోని

అవివీతని వెల్లడి చేసింది.

"........ నా మామూలాన సాటి వాళ్ళలో తనకి తలవంపులుగా వుందిట. ఏమీ తెలియగందే నేను ముండ మోశాననడం నా సాటి వాళ్ళలో నాకు తలవంపులుగా లేదూ? నా పెళ్ళి నే నెరగను; నా పెనిమిటి నెరగను; ముండ మొయ్యడం వొకటే నాకు కనబడుతోంది. నా పెళ్ళి నాకోసమా? ఇతర్ల కోసమా? నే నెరగని - నా కోసం కాని - పెళ్ళి వల్ల నాకు వెధవరికం యేమిటోయి?"

ఈ మాటలు స్త్రీ స్వేచ్ఛాయుత దృక్పథాన్ని వెల్లడి చేస్తున్నాయి. శ్రీపాద వారికి సమకాలీన సమాజంలో బ్రాహ్మణ కుటుంబాలలో బాలవితంతువుల సమస్య తీవ్రతరంగా ఉండేది. స్త్రీ విద్య లేకపోవటం, అటు కుటుంబంలోనూ, ఇటు సంఘంలోనూ అన్ని విధాలైన కార్యకలాపాల్లోనూ ఏవిధమైన పాత్రనూ కలిగి ఉండేది కాదు. కేవలం ఇంటికి పరిమితమై చాకిరీ చేస్తూ జీవితాన్ని గడిపేది. అటువంటి కాలంలో అనూచానంగా వస్తున్న ఆచారాలను ప్రశ్నించి తన స్థానం ఏమిటో తెలుసుకొని దానికోసం ప్రయత్నించడం నిజంగా విప్లవాత్మకమైన దృక్పథం.

స్త్రీకి ఇటువంటి స్వేచ్ఛ ఉండాలని రచయిత భావించినట్లుగా పై వాక్యాల ద్వారా తెలుస్తోంది.

శ్రీపాద వారు సమకాలీన సమాజం లోని వివిధ వ్యవస్థలలోని అవినీతిని ఎండగడుతూ సంఘాభ్యుదయాన్ని కాంక్షిస్తూ చేసిన రచనలలో 'మొదటి దాడి' అనే కథను విశిష్టమైందిగా చెప్పుకోవచ్చు. దీనిలో స్త్రీకి వితంతు పునర్వివాహాన్ని జరిపించారు. బాల్య వివాహం జరగకుండా అడ్డుకున్నారు. కన్యాశుల్క వివాహాన్ని నిరసించారు. ఆంగ్ల విద్య ద్వారా సమాజంలో కలుగుతూ ఉన్న భావవిప్లవాన్ని వివరించారు. ఈ అన్ని కార్యక్రమాలను స్త్రీ ద్వారా నిర్వహింపజేసి సమాజంలో స్త్రీ స్థానాన్ని ఎంతో ఉన్నతంగా చూపారు.

"పెళ్ళికాని మా మూడో చెల్లికీ నాకూ భేదం ఏమిటట?"

"........ ఏం లోకువగా ఉంది ఆడాళ్ళ బతుకూ? ఈ రోజుల్లో కూడా వివాహం నర మాంస విక్రయమేనా? అందులోనూ షష్టిపూర్తి అయిన వాడికా? ........"

"జలసిక్తమైన క్షీణలత లాగ సుందరి ఆశాభరితురాలై తల ఎత్తి చూసింది. స్త్రీలంతా స్త్రీశక్తి అంటే ఏమిటో మొదటి సారిగా చూడగలిగారు. అరవచ్చి పడి ఉన్న వాడిలాగ దబ్బన్న మాట్లాడలేక పోయాడు"

పైన పేర్కొన్నటువంటి సంభాషణల్లోనూ, వర్ణనల్లోనూ స్త్రీ చైతన్య దృక్పథం కనిపిస్తుంది. ఈ కథలో జానకమ్మ స్త్రీ సమాజానికంతకూ ఉండదగిన స్వేచ్ఛాయుత ఆధునిక భావాలకు ప్రతీక. బాలవితంతువైన పునర్వివాహం చేసుకోకుండా స్త్రీ జనాభ్యుదయానికి కృషి చేసిన వీరవనిత. ముసలి పెళ్ళికొడుకుతో సుందరమ్మ పెళ్ళి జరగకుండా 'మొదటి దాడి' చేసి ఆమె చేత పెళ్ళిని తిరస్కరింప చేసి 'ముసలి పీనుగా' అని పెండ్లికొడుకుని తిట్టించింది. స్త్రీలందరకూ సంఘటిత భావాన్ని, అన్యాయాన్ని ఎదుర్కొనే భావాన్ని నేర్పింది. పెండ్లిని అడ్డుకొని జరగకుండా చేయడంలోనూ, బాల్య వివాహాన్ని ఆపు చెయ్యడంలోనూ, స్త్రీలను చైతన్యపరచడంలోనూ ఆమె నిర్వహించిన పాత్ర అందరినీ అచేతనులుగా చేసింది. ఆ సమయంలో పెండ్లి

వారికి ప్రేమ.

“......... ఒక చేత్తో మార్కేండేయుణ్ణి బుజ్జగిస్తూ వొక చేత్తో శూలం యెత్తి యముడు మీద విసరబోతూవున్న కాలాగ్ని రుద్రుడులాగ భయంకరంగా నిప్పులు కక్కుతూ చూస్తూ.. ..........” ఉన్నట్లుగా కనిపించింది. కన్యాశుల్క వివాహమనే దురాచారాన్ని ఎదుర్కోడంలో స్త్రీలు ప్రతిశక్తులు కావాలని ఇక్కడ రచయిత ప్రబోధిస్తున్నాడు.

“నీ మూలాన పందరికే గండం తప్పిందే జానకీ”.

“మనం ఈలా ఎదుర్కొంటుంటే ఈ మొగాళ్ళేం చేయగలరే”

“కాకపోయినా మన వూరు మరీ చెడిపోయిందే.. ......”

“....... ఛీ! ఈయన కిప్పుడు పెళ్ళేమి షర్రా. విపరీతపు బుద్ధి కాకపోతేనూ? .........”

ఈ విధంగా అక్కడి స్త్రీలు జానకిని

ప్రోత్సహిస్తూ ప్రశంసిస్తారు. స్త్రీల సమస్యలను స్త్రీలే సంఘటితంగా పరిష్కరించుకోవాలనే దృక్పథం కలిగించడం ఇక్కడ రచయిత ఉద్దేశించారు.

“........ మన శక్తి మనం మరచి పోయాం. మన అధికారం మనం వదులుకున్నాం. మనకి మనమే చేతులారా బానిసలైపోయాం ఆడదాని బతుకు మగాడి కాలికింద వుంది యిప్పుడు. ఇతర దేశాల్లో ఆడది మొగాడితో సమంగా బతుకుతోంది!”

అన్న స్త్రీల మాటల్లో స్త్రీ చైతన్య శక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. స్త్రీలు అబలలు కారు అని, అజ్ఞానం చేత పురుషులకు లోబడి బతుకుతున్నామని, ఇతర దేశాల ఆదర్శంతో పురుషులతో సమానమైన స్వేచ్ఛను పొందాలని రచయిత ప్రబోధిస్తున్నారు.

జానకితో పాటు స్త్రీలు —

“మేమంతా రేపు మీ ఇంటికి వస్తాం”

“........మాకు సంగతులన్నీ చెప్తూ ఉండవే.”

అంటూ మాట్లాడడం ద్వారా స్త్రీలలో సంఘటితం కావాలనే భావన సంస్కార దృక్పథంతో సామాజిక సమస్యలను పరిష్కరించుకో

వాలనే దృక్పథం వెల్లడి అవుతున్నాయి.

ఈ విధంగా రమారమి 'మొదటి దాడి' కథ అంతా స్త్రీలలో చైతన్య భావాలను కలిగించడమే కాక్క సాంఘిక సమస్యలకు పరిష్కారంగా శ్రీపాద వారు ప్రకటించారు.

'పెళ్ళాడ తగ్గా మొగాడేడీ' అనే కథలో బాలవితంతువైన 'సుభద్ర' తండ్రి, అన్నల చేత బయటకు వెళ్ళగొట్టబడుతుంది. మళ్ళీ పెళ్ళి చేసుకుంటానన్న విధురుడైన 'రామశర్మ' పిరికివాడిలా పారిపోతాడు. ఆమెను హరిజన క్రైస్తవ దంపతులు ఆదుకుంటారు. 'జకరయ్య' ఆమెకు యోగ్యుడైన వరుణ్ని చూసి పెళ్ళి చేయండి - అని చెప్పినప్పుడు సుభద్ర ఇలా అంటుంది.

"......... స్త్రీల మానం కాపాడ లేని జాతిది. స్త్రీల జీవిత లక్ష్యాల్ని అర్థం చేసుకో లేని మతం ఇది. స్త్రీకి యుక్తవయసు రాకుండానే పెళ్ళి చెయ్యాలనే నిర్బంధాన్ని సృష్టించడానికి ముఖ్య కారణం యేమిటో నాకిప్పుడు స్పష్టంగా బోధపడింది. జాతికనుగుణమైన విద్య నేర్చిన బాలిక

నిజంగా స్త్రీరత్నం అవుతుంది. అలాంటి రత్నాన్ని సంపాదించాలంటే పురుషుడు పురుషకారాన్ని చూపించాలి. అది చూపించలేని వాడు శాశ్వత బ్రహ్మచారిగా వుండిపోవలసిందేగాని మరిదారి లేదు. అప్పుడు స్త్రీ ప్రాణికోటికి సహజమైన సౌఖ్యమూ, ఆనందమూ అనుభవించడానికి జాత్యంతరుణ్ణి కూడా కోరితే కోరవచ్చు. ఇదే తటస్థిస్తే దేశానికి ఒకవిధమైన దౌర్భాగ్యం కలుగుతుందంటే నిజమే; 'ఇలాంటివేవీ తటస్థించకుండా వుండాలనే మన పూర్వులు స్త్రీని పశువుగా తయారు చేసే సన్నివేశాలు కల్పించారు. అయితే వారు స్త్రీ పశువయిపోతే ఆ స్త్రీల చేతుల్లో పెరిగే మొగపిల్లలు పశుపతులయిపోతారని గ్రహించలేక పోయారు. ఇలాంటి ఆవిచారిత ధర్మాల నేర్పరచడం వల్ల తామే పశువులయిపోవడం కూడా వారు గమనించలేక పోయారు. త్రికాలజ్ఞాని సంపన్నులని పొగడబడే మునులు ఇలాంటి అపసిద్ధాంతాలు ఏర్పరిస్తే జాతి నిర్వీర్యం అయిపోతుందని గ్రహించలేక పోయారు.......".

ఈ రకంగా శ్రీపాద వారు స్త్రీ చైతన్యాన్ని

